

ఈనాడు

విజయవాడ 27-12-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 137

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru








ఈనాడు

విజయవాడ 27-12-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 137

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



వారంలో రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు

జనవరి 2 నుంచి 9 వరకు గ్రామసభల ద్వారా అందజేత

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పంపిణీ

ఈకేవైసీ ద్వారా ధ్రువీకరణ

ఈనాడు, అమరావతి: కొత్త సంవత్సరంలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందనున్నాయి. 2026 జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు ఊరూరా గ్రామసభలు నిర్వహించి పంపిణీ చేసేందుకు రెవెన్యూశాఖ చర్యలు ప్రారంభించింది. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో వైకాపా ప్రభుత్వం (మిగతా 2లో)

భారతీయతే మన బలం

విశ్వవిజ్ఞానానికి మనమే మూలం

- స్పైడర్‌మ్యాన్, బ్యాట్‌మ్యాన్‌ల కంటే.. హనుమంతుడు, అర్జునుడే గొప్ప
- మన పురాణేతిహాసాలే యువతకు స్ఫూర్తి కావాలి
- అమరావతిలో ఆరు నెలల్లో తొలి క్వాంటమ్ కంప్యూటర్
- 'భారతీయ విజ్ఞాన సమ్మేళనం'లో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన



భారతీయ విజ్ఞాన సమ్మేళనం వేదికపై ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్‌కు శ్రీవారి ప్రతిమను బహూకరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

ఈనాడు డిజిటల్, తిరుపతి: 'భారత దేశం కేవలం ఒక భూభాగం కాదు.. అపారమైన జ్ఞానానికి నిలయం. 4,500 ఏళ్ల క్రితమే హరప్పా నాగరికతతో పట్టణ ప్రణాళికను ప్రపంచానికి నేర్పిన ఘనత మనది. సున్నాను కనిపెట్టి నేటి సమాచార సాంకేతికతకు (ఐటీ) పునాది వేసింది భారతీయులే. భారతీయతే మన బలం. మారుతున్న కాలంతో పాటు సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, మన సంప్రదాయ విలువలను కాపాడుకుంటే 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా అవతరించడం ఖాయం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 7వ భారతీయ విజ్ఞాన సమ్మేళనాన్ని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భాగవత్, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌లతో కలిసి సీఎం చంద్రబాబు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 'తల్లిదండ్రులు పిల్లలకు స్పైడర్ మ్యాన్, బ్యాట్‌మ్యాన్ లాంటి హాలీవుడ్ సూపర్ హీరోలను చూపించడం కాదు.. హనుమంతుడి బలం గురించి, అర్జునుడి యుద్ధ ప్రావీణ్యం గురించి చెప్పాలి. అవతార్ సినిమా కంటే మన మహాభారత, (మిగతా 2లో)

> మెదడుకు పదును పెట్టే చదరంగ క్రీడను కనిపెట్టిన ఘనత మన భారతీయులదే. ఖగోళశాస్త్రంలో ఆర్యభట్ట, గణితంలో భాస్కరాచార్య, వైద్యంలో చరకుడు, ధన్వంతరి, ఆర్థిక శాస్త్రంలో కౌటిల్యుడు వంటి మహామహులు మనవారే.
> - సీఎం చంద్రబాబు

మాతృభాషలో విద్యాభ్యాసమే ప్రభావవంతం

శాస్త్రీయ విజ్ఞానాన్ని సామాన్యులకు చేర్చాలి 2లో

భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్

వార్తా పత్రికల పఠనం యూపీ పాఠశాలల్లో తప్పనిసరి



లఖ్‌నవూ: విద్యార్థుల రోజువారీ కార్యకలాపాల్లో వార్తాపత్రికల పఠనాన్ని తప్పనిసరి చేయాలని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు మార్గదర్శకాలు జారీచేసింది. ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను చూసే సమయాన్ని తగ్గించి, పుస్తక పఠన సంస్కృతిని బలోపేతం చేయడానికి ఈ నిర్ణయం తీసుకుంది. పాఠశాల గ్రంథాలయాల్లో ఆంగ్ల, హిందీ వార్తాపత్రికలను అందుబాటులో ఉంచాలని ఈ నెల 23న జారీ చేసిన (మిగతా 2లో)



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి రాష్ట్రీయ బాలపురస్కార్‌ను అందుకుంటున్న శివాని

సాహసికి సత్కారం.. ఒంటిచేతి చేవకు పట్టం!

రాష్ట్రీయ బాల పురస్కార్ అందుకున్న తెలుగు తేజాలు లోపలి పేజీలో

కిలో ₹19,000 పెరిగిన వెండి వివరాలు వాణిజ్యం లో

ఆర్టీసీ ఉద్యోగులకు భారీ ఊరట

వైద్యపరంగా అనర్హులైనవారికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు

అవి కాదనుకుంటే పరిహారం పొందేందుకు అవకాశం ● ఉత్తర్వు జారీచేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ప్రజా రవాణాశాఖ (ఆర్టీసీ)లో వైద్యపరమైన పరీక్షల్లో అనర్హులు (మెడికల్ అన్‌ఫిట్)గా గుర్తించినవారికి ప్రత్యామ్నాయ ఉద్యోగం పొందే అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వు జారీచేసింది. అది వద్దనుకుంటే పరిహారం పొందేందుకు వీలు కల్పించింది. ఇది ఆర్టీసీ ఉద్యోగులకు పెద్ద ఊరట కల్పిస్తోంది. గతంలో ఆర్టీసీ డ్రైవర్లకే ఈ అవకాశం ఉండేది. 2020 జనవరి నుంచి ఆర్టీసీ ఉద్యోగులు.. ప్రభుత్వంలోని ప్రజా రవాణాశాఖ (పీటీడీ) ఉద్యోగులుగా మారారు. అప్పటినుంచి వారికి ఈ సదుపాయాలు దూరమయ్యాయి. ఇతర శాఖల్లో ప్రభుత్వోద్యోగులకు ఇలాంటివి లేకపోవడంతో, పీటీడీ ఉద్యోగులకూ ఐదేళ్లుగా వీటిని అమలుచేయట్లేదు. తాజాగా ప్రభుత్వం ఆర్టీసీలోని డ్రైవర్లు, ఇతర ఉద్యోగులకూ గతంలో ఉన్న ప్రయోజనాలు వర్తించేలా ఉత్తర్వు జారీచేసింది.

- 21 రకాల వ్యాధుల కారణంగా వైద్యపరంగా అనర్హులని తేలిన డ్రైవర్లు, ఇతర ఉద్యోగులకు వారి అర్హతను బట్టి ప్రత్యామ్నాయంగా కండక్టర్, రికార్డ్ ట్రేసర్, అసిస్టెంట్ మెకానిక్/శ్రామిక్ వంటి పోస్టుల్లో అవకాశాలు కల్పిస్తారు.
- ఆ పోస్టులు ఖాళీ లేకపోతే.. జిల్లా కలెక్టర్లకు వివరాలు పంపించి, ఇతర శాఖల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారు.
- ఆర్టీసీలో, ఇతర శాఖల్లో (మిగతా 2లో)

పరకామణి కేసులో ప్రత్యేక ఎఫ్ఐఆర్

నమోదు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఐడీకి హైకోర్టు సూచన 2లో

రవికుమార్, కుటుంబసభ్యుల ఆస్తులపై హైకోర్టుకు ఏసీబీ నివేదిక

కెనడాలో కాల్పులు.. భారత విద్యార్థి మృతి



శివాంక్ అవస్థి

టొరంటో: కెనడాలో భారత విద్యార్థిని కొందరు దుండగులు కాల్చి చంపారు. టొరంటో విశ్వవిద్యాలయ స్కార్బరో క్యాంపస్‌లో పరిశోధక విద్యార్థిగా ఉన్న శివాంక్ అవస్థి (20)పై వర్సిటీ సమీపంలోనే కాల్పులు జరపడంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. మంగళవారం మధ్యాహ్నం శివాంక్ హత్య జరిగిందని, నిందితులు పరారీలో ఉన్నారని (మిగతా 2లో)

జంతుబలితో భయభ్రాంతులకు గురిచేస్తారా?


రౌడీలు, రాజకీయ నేరస్తులను ఉపేక్షించం

రాష్ట్ర బహిష్కరణ చేశానని గుర్తుంచుకోండి

తిరుపతి డీపీవో ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 3లో

ఒకరోజు ముందుగానే పింఛను

డిసెంబరు 31నే అందించాలని ప్రభుత్వం నిర్ణయం 2లో



వార్తా పత్రికల పఠనం యూపీ పాఠశాలల్లో తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రతిరోజూ ఉదయం విద్యార్థుల్ని సమావేశపరిచే సమయంలో కనీసం పది నిమిషాల సమయాన్ని వార్తాపత్రికల పఠనానికి కేటాయించాలని స్పష్టంచేసింది. ఈ సమయంలో వంతులవారీగా విద్యార్థులు వార్తాపత్రికల్లోని ప్రధాన వార్తలను, సంపాదకీయాల్లో ముఖ్యాంశాలను, జాతీయ/ అంతర్జాతీయ/ క్రీడా వార్తలను చదివి వినిపిస్తారు. 'నేటి పదం' రూపంలో వార్తాపత్రికల నుంచి అయిదు క్లిష్టమైన పదాలను గుర్తించి, నోటీసు బోర్డుపై రాయాల్సి ఉంటుంది. దీనివల్ల విద్యార్థుల పదజాలం మెరుగవుతుంది. వార్తాపత్రికలను చదవడం వల్ల విజ్ఞానం పెరిగి, కొత్తకొత్త పదాలు తెలియడంతోపాటు సామాజిక అవగాహన, ఆలోచనాతీరు మెరుగుపడి.. పోటీ పరీక్షలకు బాగా సిద్ధపడటానికి వీలుంటుందని, తప్పుడు వార్తలపై చైతన్యం పెరుగుతుందని యూపీ ప్రభుత్వం భావిస్తోంది. పత్రికలు చదవడమే కాకుండా సొంతంగా పత్రికలు, పుస్తకాలు తయారుచేయడం, సంపాదకీయాల తరహాలో రచించడం వంటివీ ప్రోత్సహించాలని ప్రభుత్వం సూచించింది. 9 నుంచి 12వ తరగతి విద్యార్థులతో బృంద చర్చలు నిర్వహించాలని, వార్తల క్లిప్పింగులతో ఆల్బం తయారీని ప్రోత్సహించాలని కూడా పేర్కొంది.

పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికల బదులు పుస్తకాలు

ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు సాధ్యమైనంత దూరంగా ఉంటూ పుస్తకాలు చదివేలా ప్రోత్సహించడానికి నవంబరు 2న కూడా ప్రభుత్వం ఒక ఉత్తర్వు ఇచ్చింది. విద్యార్థులు ప్రభుత్వ గ్రంథాలయాలకు వెళ్లి, ప్రతి వారం తమ పాఠ్యాంశాలతో సంబంధం లేని కనీసం ఒక పుస్తకాన్ని అయినా చదవడాన్ని తప్పనిసరి చేసింది. బాగా చదివినవారికి ప్రశంసా పత్రాలు ఇస్తోంది. పాఠశాలల్లో జరిగే కార్యక్రమాల్లో పుష్పగుచ్ఛాలు, ట్రోఫీలకు బదులు పుస్తకాలనే ఇవ్వాలనే ప్రచారాన్ని పెద్దఎత్తున చేపట్టింది. ఈ రెండు ఉత్తర్వుల్ని రాష్ట్రమంతటా కచ్చితంగా అమలుచేయాలని విద్యాశాఖ ఆదేశించింది.

ఆర్టీసీ ఉద్యోగులకు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యామ్నాయ ఉద్యోగం చేసేందుకు సమ్మతించకపోయినా, అందుకు తగిన అర్హత లేకపోయినా.. ఆ ఉద్యోగికి నిబంధనల ప్రకారం పరిహారం ఇస్తారు.

- 2020 జనవరి నుంచి వైద్యపరంగా అనర్హులైన ఉద్యోగులకు ఇది వర్తించనుంది.
- ఈ ఉత్తర్వు వల్ల ఇప్పటికే అనర్హులుగా గుర్తించిన 600మంది ఆర్టీసీ ఉద్యోగులకు మేలు కలగనుంది.

ఉద్యోగులకు జీవన భద్రత: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఉద్యోగుల విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ సానుకూలంగా ఉంటుందని, వారి జీవన భద్రత, ఆయా కుటుంబాల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నామని రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఏ ఉద్యోగి నష్టపోకూడదనేది ప్రభుత్వ ఉద్దేశమని, అందుకే మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగం గానీ, పరిహారం గానీ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు.

- ఈ ఆదేశాలపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. సీఎం చంద్రబాబు, రవాణా మంత్రి, ఆర్టీసీ ఎండీ, ఛైర్మన్, ఈ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఎన్ఎంయూఏ, ఎంప్లాయీస్ యూనియన్, కార్మిక పరిషత్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి.

మాతృభాషలో విద్యాభ్యాసమే ప్రభావవంతం

ఈనాడు, ఈనాడు డిజిటల్– తిరుపతి: విద్యాభ్యాసం మాతృభాషలోనే సాగినప్పుడే ప్రభావవంతంగా నేర్చుకోగలరని.. ఫిన్‌లాండ్ విద్యావిధానాన్ని మనం ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ సూచించారు. శాస్త్రీయ విజ్ఞానం అన్ని భారతీయ భాషల్లో సామాన్యులకు చేరాలని ఆకాంక్షించారు. సమాజానికి విజ్ఞానం పంచే విధంగా భారత్ దూసుకుపోతోందని.. ఇది మనకు మాత్రమే కాదు మొత్తం ప్రపంచానికి మార్గదర్శకంగా ఉండాలన్నారు. భారత్ సూపర్ పవర్ కాదు.. విశ్వగురువుగా ఎదగాలన్నారు. ప్రపంచానికి ఆర్థిక, సామాజిక, ఆధ్యాత్మిక కోణాలు కలిగిన సమగ్ర దృక్పథాన్ని అందించాలన్నారు. తిరుపతిలో శుక్రవారం ప్రారంభమైన భారతీయ విజ్ఞాన సమ్మేళనానికి మోహన్ భాగవత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'మనుషులందరికీ సుఖం, సౌకర్యం కావాలి. శాస్త్ర విజ్ఞానంతోనే మానవాళికి సదుపాయాలు కలుగుతాయి. సుఖం అనేది కేవలం మానసికపరమైంది. మానసికంగా సంతృప్తి లేకుంటే ఎంత పొందినా సుఖం ఉండదు. మనమంతా పాత అంధ విశ్వాసాలతో పాటు కొత్తగా అలవడే మూఢనమ్మకాల్లో చిక్కుకోకూడదు' అని సూచించారు.


ప్రసంగిస్తున్న ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్

సైన్స్, మతం.. రెండింటి లక్ష్యం ఒక్కటే

'సైన్స్, మతం మధ్య ఎలాంటి సంఘర్షణ లేదు. రెండింటి దారులు వేరైనా లక్ష్యం మాత్రం సత్యం తెలుసుకోవడమే. అర్థశాస్త్రానికి ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఎన్నో నిర్వచనాలు చెప్పినా చాణక్యుడి అర్థశాస్త్రం ప్రజల సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చింది. క్రమంగా ఇదే మనిషిని ఉన్నత స్థితిలో నిలుపుతుంది. కొందరిలో ఎదిగినకొద్దీ అహంకారం పెరుగుతోంది. మనిషి అహాన్ని వదిలి ఇతరుల కోసం ఎప్పుడు బతుకుతాడో అప్పుడే నిజమైన సుఖాన్ని పొందుతాడు. కష్టసాధనలో ఎక్కువగా సుఖసంతోషాలతో ఉండటమే వికాసం. మనుషులు తమ స్వార్థం, సుఖం కోసం ఇతర ప్రాణకోటికి నష్టం కలిగిస్తున్నారు. సంప్రదాయ వ్యవసాయం కారణంగా 10 వేల ఏళ్లుగా భూమి భద్రంగా ఉంది. ఇప్పుడు విచ్చలవిడి రసాయనాల వినియోగంతో సమస్యలు వస్తున్నాయి' అని మోహన్ భాగవత్ అన్నారు.

2047 నాటికి వైజ్ఞానిక శిఖరాగ్రాన భారత్

– కేంద్ర మంత్రి డా.జితేంద్ర సింగ్



స్వతంత్ర భారత శతాబ్ది ఉత్సవాల (2047) నాటికి భారతదేశాన్ని ప్రపంచ వైజ్ఞానిక పటంలో అగ్రస్థానంలో నిలబెట్టడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. పదేళ్లుగా విజ్ఞానశాస్త్ర రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ప్రయోగశాలలకే పరిమితమైన పరిశోధనలు నేడు సామాన్యుడి చెంతకు చేర్చగలిగామని పేర్కొన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన రంగాలపై ఇప్పుడు దృష్టి సారించామన్నారు. 'అంతరిక్ష రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అందుబాటులోకి తెచ్చాం. అణుశక్తి రంగంలోనూ సంస్కరణలు చేపట్టాం. సముద్ర గర్భంలో దాగున్న అపార ఖనిజాలు, లోహాలు, మత్స్య సంపదను వెలికితీసేందుకు డీప్ ఓషన్ మిషన్ చేపట్టాం. హిమాలయాల్లోని వనరుల అన్వేషణకూ ప్రాధాన్యమిస్తున్నాం' అని ఆయన తెలిపారు. అరోమా మిషన్ ద్వారా వ్యవసాయ రంగంలో నూతన ఒరవడి సృష్టించినట్లు జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. రెండు రోజుల కిందటే రాష్ట్రపతి చేతుల మీదుగా రాష్ట్రీయ విజ్ఞాన పురస్కారం పొందిన అరోమా మిషన్, దేశవ్యాప్తంగా 3,500 లావెండర్ స్టార్టప్‌ల ఆవిర్భావానికి కారణమైందని చెప్పారు. ఈ స్టార్టప్‌ల ఏటా యువత రూ.లక్షల్లో ఆదాయం గడిస్తూ ఆర్థికంగా స్థిరపడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. 'శాస్త్రీయ పరిజ్ఞానం కేవలం ఆంగ్ల భాష తెలిసినవారికే పరిమితం కాకూడదనే ఉద్దేశంతో గత పదేళ్లలో సైన్స్ పాఠ్యపుస్తకాలు, పరిశోధనా పత్రాలను ప్రాంతీయ భాషల్లోకి అనువదిస్తున్నాం. మాతృభాషలో విద్యనభ్యసించిన విద్యార్థులు కూడా దేశ నిర్మాణంలో గర్వంగా పాలుపంచుకోవాలి. ప్రతి రంగంలోనూ టెక్నాలజీ వాడకం సామాన్యుల జీవన ప్రమాణాలను పెంచుతున్నా'మని కేంద్ర మంత్రి వివరించారు.

2007లో తొలి సమ్మేళనం

2007లో భోపాల్‌లో ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా ప్రథమ భారతీయ విజ్ఞాన సమ్మేళనం ప్రారంభమైందని విజ్ఞాన భారతి అధ్యక్షుడు డాక్టర్ శేఖర్ సి.మాండే తెలిపారు. శాస్త్ర రంగాల్లోని విజయాలను మీ ముందు ఉంచాలన్నదే దీని లక్ష్యమన్నారు. విజ్ఞానాన్ని మాతృభాషలో వివరిస్తే మంచి ప్రయోజనం ఉంటుందని, ఈ ప్రయత్నంలో విజ్ఞాన భారతి నిమగ్నమైందని చెప్పారు.

భారతీయతే మన బలం


ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్. చిత్రంలో డీఆర్డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, విజ్ఞాన భారతి అధ్యక్షుడు డాక్టర్ శేఖర్ మాండే, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, మంత్రి అనగాని సత్యప్రసాద్, జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

(మొదటి పేజీ తరువాయి)

రామాయణాలు గొప్పవని నేర్పించాలి. కృష్ణుడి మహిమలు, శివుడి మహత్యం, రాముడి ఆదర్శాలు, పురుషోత్తముడి పాలన, రామరాజ్యం గురించి చెప్పాలి. బకాసురుడు, కంసుడు వంటి రాక్షసుల గురించి చెప్పి.. మంచికి, చెడుకు మధ్య తేడాను వివరించాలి. ఆ రోజుల్లో ఎన్టీఆర్ పౌరాణిక చిత్రాల ద్వారా మన ఇతిహాసాలను, విలువలను కళ్లకు కట్టినట్లు చూపించి చైతన్యం తెచ్చారు.

జనాభా పెరుగుదల దేశానికి శ్రీరామరక్ష

ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గుతోంది. చైనా, జపాన్, జర్మనీ, అమెరికా వంటి దేశాల్లో జనాభా వేగంగా క్షీణిస్తోంది. భారత్ ఒక్కటే రాబోయే కాలంలో 14.8 శాతం జనాభా వృద్ధిని నమోదు చేయబోతోంది. ఇది మనకు లభించిన గొప్ప అవకాశం. మన దగ్గర యువశక్తి పుష్కలంగా ఉంది. జనాభా స్థిరీకరణ స్థాయి (రీప్లేస్‌మెంట్ లెవెల్) కంటే మనం తగ్గకూడదు. అందుకే ప్రతి జంట కనీసం ముగ్గురు పిల్లలను కనాలని మోహన్ భాగవత్ చెప్పిన మాటలతో నేను ఏకీభవిస్తున్నా. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే నంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి ఈ జనాభా వృద్ధి ప్రధాన కారణం కాబోతోంది.

మళ్లీ మన టైమ్ వచ్చింది

అమెరికా, ఇటలీ, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, స్పెయిన్, జర్మనీ, రష్యా, జపాన్ వంటి దేశాలు రెండు వేల ఏళ్ల క్రితం మనకంటే ఎంతో వెనకబడి ఉన్నాయి. అప్పట్లో ప్రపంచ సంపదలో 40 శాతం వాటాతో మనమే అగ్రగామిగా ఉండేవాళ్లం. వలస పాలనతో వెనకబడ్డాం. ఇప్పుడు మళ్లీ మన టైమ్ వచ్చింది. 11వ స్థానం నుంచి 5వ స్థానానికి ఎగబాకాం. త్వరలోనే 3వ స్థానానికి, 2047 నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్ ఆర్థిక శక్తిగా భారత్ అవతరిస్తుంది. 4 నుంచి 5 కోట్ల మంది భారతీయులు విదేశాల్లో ఉన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నారు. అమెరికాలో స్థానికుల సగటు ఆదాయం 65 వేల డాలర్లు ఉంటే, అమెరికాలోని భారతీయుల ఆదాయం 1.30 లక్షల డాలర్లకు పైనే.

అమరావతికి క్వాంటమ్ కంప్యూటర్

ఆంధ్రప్రదేశ్‌ను సాంకేతిక హబ్‌గా మారుస్తున్నాం. రాబోయే 6 నెలల్లో అమరావతిలో తొలి క్వాంటమ్ కంప్యూటర్లను అందుబాటులోకి తెస్తాం. రెండేళ్లలో క్వాంటమ్ కంప్యూటర్లను తయారు చేసే ప్రపంచంలోని ఏకైక స్థాయికి ఎదుగుతాం. గ్రీన్ హైడ్రోజన్, సోలార్ ఎనర్జీ రంగాల్లో ఏపీ అగ్రగామిగా నిలుస్తుంది. విశాఖకు గూగుల్ వంటి సంస్థలు రావడం శుభ పరిణామం. కర్నూలులో డ్రోన్ సిటీ, తిరుపతిలో స్పేస్ సిటీ, విశాఖలో మెడ్-టెక్ పార్క్, అనంతపురంలో ఏరోస్పేస్ సిటీ ద్వారా రాష్ట్రాన్ని సాంకేతికతలో అగ్రగామిగా నిలుపుతాం.

జల భద్రతే లక్ష్యం

గంగా-కావేరీ నదుల అనుసంధానం దేశ చిరకాల స్వప్నం. దీనిపై ఏకాభిప్రాయం సాధించేందుకు మోహన్ భాగవత్ కృషి చేయాలి. జలభద్రత సాధిస్తే దేశం అద్భుతాలు సృష్టిస్తుంది. దేశంలో డిజిటల్ విప్లవానికి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి వాజ్‌పేయీ వేసిన పునాదిని నేడు ప్రధాని మోదీ మరో స్థాయికి తీసుకెళ్తున్నారు' అని చంద్రబాబు వివరించారు.

మోహన్ భాగవత్ సేవలు చిరస్మరణీయం

ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ దశాబ్దాలుగా నిస్వార్థంగా దేశాభివృద్ధికి, సామాజిక సామరస్యతకు చేస్తున్న కృషిని చంద్రబాబు కొనియాడారు. ఎలాంటి రాజ్యాంగ పదవులను ఆశించకుండా, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలను తయారు చేస్తూ దేశ సంస్కృతిని కాపాడుతున్నారని ప్రశంసించారు. ఆయన పిలుపునిచ్చినట్లుగా కుటుంబ విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 'ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్' పుస్తకాన్ని వేదికపై ఉన్న ప్రముఖులతో కలిసి చంద్రబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, విజ్ఞాన భారతి అధ్యక్షుడు డాక్టర్ శేఖర్ మాండే, డీఆర్డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. తొలుత సైన్స్ అండ్ టెక్నాలజీస్ స్టాళ్లను చంద్రబాబు ప్రారంభించి, ఆసక్తిగా తిలకించారు.

ఆదోని టెండరుకు.. కిమ్స్‌కు సంబంధం లేదు

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: 'ప్రభుత్వం పీపీపీ విధానంలో పిలిచిన టెండర్లలో ఆదోని వైద్యకళాశాలకే టెండరు దాఖలైంది. కిమ్స్ ఆసుపత్రిలో పని చేసిన డాక్టర్ ఆర్కే జైన్ టెండరు వేశారు. దీన్ని కిమ్స్ వేసిన టెండరుగానే అధికారులు భావించారు. ఇది కేవలం సమాచార లోపం కారణంగానే జరిగింది' అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం విజయవాడలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'ప్రభుత్వం సెప్టెంబరు 18న ఆదోని, పులివెందుల, మార్కాపురం, మదనపల్లె వైద్య కళాశాలలకు టెండర్లు పిలిచింది. అక్టోబరు 6న ప్రీబిడ్ సమావేశం నిర్వహించాం. అందులో ఆరు సంస్థలు పాల్గొన్నాయి. వాటిలో ఆదోని కళాశాలకు బిడ్ దాఖలైంది' అని తెలిపారు.

వైకాపా హయాంలో జల్‌జీవన్ మిషన్‌లో అవినీతి రూ.4,128 కోట్లు: ఆలపాటి

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.4,128 కోట్ల అవినీతి జరిగిందని తెదేపా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ధ్వజమెత్తారు. ఉపాధి హామీ పథకంలో దొంగ మస్టర్లు వేయించి, రూ.వేల కోట్లు బొక్కేశారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "జగన్ గ్రామాల్ని నాశనం చేసి.. పంచాయతీ వ్యవస్థను కుప్పకూల్చారు. గ్రామాల అభివృద్ధికి వెచ్చించాల్సిన రూ.13 వేల కోట్ల కేంద్రం నిధుల్ని దారి మళ్లించారు. సర్పంచుల హక్కుల్ని కాలరాశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రూ.1,987 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధుల్ని పంచాయతీల ఖాతాల్లో వేసి, వాటికి జీవం పోసిందని పేర్కొన్నారు.

ఒకరోజు ముందుగానే పింఛను

డిసెంబరు 31నే అందించాలని ప్రభుత్వం నిర్ణయం

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద జనవరి నెలకు సంబంధించిన సామాజిక భద్రత పింఛన్‌ను డిసెంబరు 31వ తేదీనే లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 1వ తేదీన నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని ఒక రోజు ముందుగానే పింఛను ఇవ్వనుంది. సంబంధిత నగదును బ్యాంకుల నుంచి 30వ తేదీనే నిర్దేశించిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు విత్‌డ్రా చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు జిల్లా డీఆర్‌డీఏ పీడీలు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించింది.

కెనడాలో కాల్పులు.. భారత విద్యార్థి మృతి

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు చెప్పారు. 'టొరంటో విశ్వవిద్యాలయంలో చదువుతున్న శివాంక్ అవస్థిపై హైల్యాండ్ క్రీక్ ట్రెయిల్ వద్ద కొందరు దుండగులు కాల్పులు జరిపారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాం. అప్పటికే బాధితుడు గాయాలతో ప్రాణాలు కోల్పోయాడు. నిందితులు పరారయ్యారు' అని తెలిపారు. కళాశాల ప్రాంగణాన్ని తాత్కాలికంగా మూసివేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై టొరంటోలోని భారత రాయబార కార్యాలయం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. బాధితుడి కుటుంబానికి అండగా ఉంటామని 'ఎక్స్'లో పేర్కొంది. ఇది ఈ ఏడాది టొరంటోలో జరిగిన 41వ హత్య అని పోలీసులు తెలిపారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వర్సిటీ సూచించింది. విశ్వవిద్యాలయ ప్రాంగణానికి దారితీసే మార్గాలన్నింటినీ పోలీసులు మూసివేశారు.

వారంలో రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు

(మొదటి పేజీ తరువాయి)

జగన్ బొమ్మలతో పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చింది. దీనిపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో ఇచ్చిన 21.86 లక్షల భూహక్కు పత్రాల (బీహెచ్‌పీ) స్థానంలో రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు(పీపీబీ) పంపిణీ చేయాలని నిర్ణయించింది. దీనికి రూ.22.50 కోట్లు విడుదల చేసింది. పట్టాదారు పాస్‌పుస్తకాల ముద్రణ పూర్తయినా, పంపిణీ కార్యక్రమం 8 నెలలుగా వాయిదా పడుతూ వస్తోంది. ఈ జాప్యం కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ముద్రణ పూర్తయిన పట్టాదారు పాస్‌పుస్తకాల్ని సత్వరమే రైతులకు అందించాలని ఇటీవల కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో రెవెన్యూ శాఖ జనవరి 2 నుంచి 9 వరకు గ్రామసభల ద్వారా పంపిణీకి కార్యాచరణ రూపొందించింది.

ఈకేవైసీ.. పట్టాదారు సంతకం

- పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీకి జనవరి 2 నుంచి 9 వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించాలి.
- పట్టాదారుల వివరాల్ని వెబ్‌ల్యాండ్‌లోని వివరాల ప్రకారం సరిపోల్చి చూడాలి.
- ఎలాంటి తప్పులు లేని పాస్‌పుస్తకాలు అందజేయాలి.
- వేలిముద్ర ద్వారా సంబంధిత పట్టాదారుకు కొత్త పుస్తకాలు అందించేలా చూడాలి. ఇందుకోసం అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలి.
- పంపిణీ ప్రక్రియ వీఆర్వో ఆన్‌లైన్ ఈకేవైసీ ద్వారా నిర్వహించాలి.
- పుస్తకాలు అందాయంటూ లబ్ధిదారులతో సంతకాలు తీసుకోవాలి. ఇది ఒక రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి.
- పాత భూహక్కు పత్రాలు(బీహెచ్‌పీ) వెనక్కి తీసుకోవాలి.
- రీసర్వే చేసిన గ్రామాల్లో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి.
- పారదర్శక పంపిణీలో భాగంగా.. నిర్ణయించిన తేదీ, సమయాలపై సంబంధిత ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, ఇతర భాగస్వాములకు ముందే తెలియజేయాలి.
- జిల్లాల వారీ షెడ్యూల్ కార్యక్రమాల వివరాల్ని డిసెంబరు 30లోగా సీసీఎల్‌ఏ కార్యాలయానికి పంపాలి.

తప్పులు సరిదిద్దితే మేలు..

ముద్రణ పూర్తయిన పట్టాదారు పాస్‌పుస్తకాల్లో పలు తప్పులు దొర్లాయి. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న వాటినే ముద్రించారు. చనిపోయిన రైతుల పేర్లతోనూ పుస్తకాలు వచ్చాయి. ఫోన్, ఆధార్ నంబర్లతోపాటు రైతుల పేర్లు, తల్లిదండ్రులు, భర్త పేర్లలోనూ అక్షరదోషాలు ఉన్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో పంపిణీ చేయాల్సిన మొత్తం పుస్తకాల్లో సగానికిపైగా తప్పులే ఉన్నట్లు ప్రజాప్రతినిధులు కూడా పేర్కొంటున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి కూడా వచ్చింది. ప్రభుత్వం వీటిపైనా అధికారులకు దిశానిర్దేశం చేయడంతోపాటు.. లబ్ధిదారుల ఆధార్, ఇతర వివరాల్ని పరిశీలించి పుస్తకాల్లోని తప్పుల్ని అక్కడికక్కడే సరిదిద్దేలా తహసీల్దార్లకు ఆదేశాలివ్వాలి. ఎల్పీ(ల్యాండ్ పార్సెల్), విస్తీర్ణం, చనిపోయిన పట్టాదారుల స్థానంలో వారసులకు పంపిణీకి సంబంధించిన ప్రక్రియ నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా చూడాలి.


పరకామణి కేసులో ప్రత్యేక ఎఫ్ఐఆర్

- నమోదు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఐడీకి హైకోర్టు సూచన
- రవికుమార్, కుటుంబసభ్యుల ఆస్తులపై హైకోర్టుకు ఏసీబీ నివేదిక

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీకి పాల్పడిన కేసులో నిందితుడు రవికుమార్, ఆయన కుటుంబసభ్యులు ఆస్తులను ఎవరెవరికి రిజిస్ట్రేషన్ చేశారనే వివరాలతో మధ్యంతర నివేదికను హైకోర్టుకు ఏసీబీ డీజీ సీల్డ్‌కవర్లో సమర్పించారు. దాన్ని పరిశీలించి తగిన ఉత్తర్వులిస్తామని న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ప్రకటించారు. పరకామణిలో చోరీ కేసు రాజీ ఘటనపై ఇప్పటికే చాలావరకు దర్యాప్తు పూర్తయిందని, కొన్ని అంశాల్లోనే దర్యాప్తు మిగిలి ఉందని గుర్తుచేశారు. ఈ కేసులో విభిన్న అంశాలున్నందున సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రత్యేక ఎఫ్ఐఆర్ నమోదుచేసే అంశాన్ని పరిశీలించాలని సీఐడీకి సూచించారు. తదుపరి విచారణను జనవరి 5కి వాయిదా వేశారు.

- తితిదే పరకామణిలో జరిగిన అక్రమాలు, చోరీ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడంపై సీఐడీ విచారణకు ఆదేశించాలని కోరుతూ పాత్రికేయుడు శ్రీనివాసులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. నిందితుడు రవికుమార్, ఆయన కుటుంబసభ్యులు ఆస్తులను ఎవరెవరికి రాశారో ఆ వివరాలతో నివేదిక ఇవ్వాలని ఏసీబీ డీజీని ఆదేశించింది. శుక్రవారం జరిగిన విచారణలో కోర్టు ఆదేశాల మేరకు నివేదిక సమర్పించినట్లు ఏసీబీ డీజీ తరఫున న్యాయవాది శీతిరాజు శ్యామ్ సుందర్‌రావు తెలిపారు. సీఐడీ తరఫున అదనపు పీపీ పాణిని సోమయాజి స్పందిస్తూ.. ఎఫ్ఐఆర్ నమోదు చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

ఇదీ సంగతి!



గ్రహం అనుగ్రహం

27–12–2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
హేమంత రుతువు, పుష్యమాసం, శుక్లపక్షం

సప్తమి: ఉ.9-01 తదుపరి అష్టమి; **ఉత్తరాభాద్ర:** తె.5-08 తదుపరి రేవతి
వర్జ్యం: మ. 3-12 నుంచి 4-45 వరకు; **అమృత ఘడియలు:** రా.12-30 నుంచి 2-02 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.6-31 నుంచి 7-59 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6.32; **సూర్యాస్తమయం:** సా.5.29

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	13.6	27.7
విజయనగరం	15.0	26.0
అనంతపురం	16.0	30.2
రాజమహేంద్రవరం	16.5	32.5
శ్రీకాకుళం	17.0	27.0
కడప	17.0	28.0
కర్నూలు	17.2	30.6
విశాఖపట్నం	17.6	29.0
విజయవాడ	17.8	29.0
నరసాపురం	18.6	29.4
సూర్యాపేట	19.5	29.0
గుంటూరు	20.0	29.0
ఒంగోలు	20.9	29.7
నెల్లూరు	22.0	29.6
తాడేపల్లిగూడెం	26.0	29.0

జంతుబలితో భయభ్రాంతులకు గురిచేస్తారా?



తిరుపతి జిల్లా పోలీసు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఎస్పీ సుబ్బరాయుడు

ఈనాడు–తిరుపతి; న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): 'గత ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన కార్యక్రమాల వల్ల ప్రజల్లో ఇప్పటికీ అశాంతి ఉంది. వైకాపా శ్రేణులు ఇంకా రౌడీయిజం చేయాలని ఆలోచిస్తున్నాయి. పోస్టర్లు పెట్టి వారి నాయకుడి పుట్టినరోజు చేసుకోవచ్చు. జంతు బలి చేసి పోస్టర్లపై రక్తం చల్లడమేంటి? సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేస్తారా?' అని వైకాపా నాయకులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మధ్య రప్పా రప్పా అంటున్నారు.. అదేంటో తనకు అర్థం కావట్లేదన్నారు. చట్టపరిధిలో ఎలాంటి కార్యక్రమాలు చేసుకున్నా అభ్యంతరం లేదని, రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తామంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి తిరుపతిలో నూతన పోలీసు కార్యాలయాన్ని సీఎం చంద్రబాబు శుక్రవారం ప్రారంభించారు. గౌరవవందనం స్వీకరించి సందర్శకుల పుస్తకంలో తన అభిప్రాయాన్ని రాసిన తర్వాత పోలీసులను ఉద్దేశించి మాట్లాడారు.

తిరుమలను అపవిత్రం చేసి.. మనోభావాలు దెబ్బతీశారు

'వైకాపా హయాంలో 2019-24 మధ్య చాలా సమస్యలు తలెత్తాయి. తిరుమలనూ అపవిత్రం చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతీశారు. వేంకటేశ్వరస్వామి విషయంలో ఎవరైనా తప్పు చేస్తే ఈ జన్మలోనే శిక్ష అనుభవిస్తారు. తిరుపతి, తిరుమలలో ఏ చిన్న అలజడి చోటుచేసుకున్నా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుంది కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. తిరుపతిని నేరాలు లేని ప్రశాంతనగరంగా తీర్చిదిద్దాలి. పది రోజులపాటు జరిగే వైకుంఠ ఏకాదశి సందర్భంగా రద్దీ ఎక్కువగా ఉంటున్నందున పోలీసులు, తితిదే అప్రమత్తంగా వ్యవహరించాలి. ఎక్కడ చిన్న ఇబ్బంది తలెత్తినా కఠిన చర్యలు తీసుకుంటా. సాంకేతికత వినియోగించి రౌడీషీటర్లపై నిఘా ఉంచండి. ఇన్‌విజిబుల్ పోలీసు, విజిబుల్ పోలీసింగ్ ఉండాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసులకు దిశానిర్దేశం చేశారు.

సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టులు

'రాయలసీమలో ముఠాకక్షలు అణచివేశా. తెదేపా నాయకుల ప్రమేయం ఉంటే వారినీ జైళ్లకు పంపా. రౌడీలను రాష్ట్ర బహిష్కరణ చేశానని గుర్తుంచుకోండి. దొంగతనం, నేరాలు చేసే వ్యక్తులు పట్టుబడతారని గుర్తుంచుకోవాలి. నేరస్థుల కంటే పోలీసులు సమర్థంగా వ్యవహరించాలి. అప్పుడే వారికి అడ్డుకట్ట పడుతుంది. గుంటూరులో వారి వాహనం కిందే ఒక మనిషిని తొక్కి.. అంబులెన్స్‌లో తీసుకెళ్లి పోలీసులే చంపేశారని మృతుడి కుటుంబసభ్యులతో చెప్పించారు. ఇలాంటి కార్యక్రమాలు చేసి ఇది అసమర్థ ప్రభుత్వమని చెబితే ఊరుకోం. సామాజిక మాధ్యమాల్లో ఇప్పటికీ వైకాపా శ్రేణులు నీచంగా, అసభ్యంగా పోస్టులు పెడుతున్నాయి. హత్యలు, అసాంఘిక కార్యక్రమాలు చేస్తే వదిలిపెట్టవద్దని పోలీసులకు స్పష్టంగా చెప్పా. అలాంటి నాయకులను నేను ప్రోత్సహించను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

నేనూ తిరుపతిలోనే పుట్టి పెరిగా

'కూటమి వచ్చాక దేవాలయాల్లో దొంగతనాలు, దాడులు తగ్గాయి. పోలీసులు గట్టిగా ఉన్నారని తెలిస్తే నేరస్థులు దారిలోకి వస్తారు. నోరు పారేసుకుంటాం.. ఇష్టారాజ్యంగా ఉంటాం.. రౌడీయిజం చేస్తామంటే ప్రభుత్వం గట్టిగా ఉంటుంది. నేను తిరుపతిలోనే పుట్టి పెరిగా. ప్రతి వీధి, సందూ తెలుసు' అని హెచ్చరించారు.

'నో హెల్మెట్- నో పెట్రోల్' అభినందనీయం

'తిరుపతి పోలీసులు గంజాయి, మాదకద్రవ్యాల ముఠాలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. 179 మందిని జైలుకు పంపారు. నో హెల్మెట్- నో పెట్రోల్ కార్యక్రమం అభినందనీయం. తుడా సహకారంతో నూతన పోలీసు కార్యాలయంలో పచ్చదనం పెంపొందిస్తున్న కలెక్టర్, ఎస్పీలకు ప్రశంసలు' అని చంద్రబాబు అన్నారు. ఇటీవల మరణించిన తెదేపా మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తండ్రి, తితిదే పాలకమండలి మాజీ సభ్యుడు ఎన్టీఆర్ రాజు నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

డీజీపీ కార్యాలయం తర్వాత ఇదే పెద్దది: హోంమంత్రి అనిత

డీజీపీ కార్యాలయం తర్వాత తిరుపతి జిల్లా పోలీసు కార్యాలయమే పెద్దదని హోంమంత్రి అనిత సీఎంకు వివరించారు. మిగిలిన జిల్లాల్లోనూ కార్యాలయాల నిర్మాణానికి సహకరించాలని కోరారు. గతంలో ఏ సమావేశమైనా ఎస్వీయూలో నిర్వహించేవాళ్లమని, ఇప్పుడు 30,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో డీపీవో అందుబాటులోకి రావడంతో ఈ ఇబ్బందులు తప్పాయని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు.



నిమ్మకూరులో పూర్వవిద్యార్థులు నిర్మించిన నూతన హాస్టల్ భవనాన్ని ప్రారంభించిన భువనేశ్వరి. చిత్రంలో వర్ల కుమార్‌రాజా, కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ, స్కూల్, కళాశాల సిబ్బంది, దాతలు

సొంతూరొస్తే.. ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం

- చిన్నప్పుడు సెలవులొస్తే.. నేరుగా నిమ్మకూరుకే
- బాల్య జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న భువనేశ్వరి
- స్వగ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభం

ఈనాడు, అమరావతి – పామర్రు గ్రామీణం, కూచిపూడి, న్యూస్‌టుడే: మా చిన్నప్పుడు మద్రాసులో ఉండగా.. సెలవులు వస్తే సొంతూరు నిమ్మకూరుకే వచ్చేవాళ్లం. [illegible] నిమ్మకూరు వచ్చాక.. కారు కోసం చూడకుండా.. ఆర్టీసీ బస్సులోనే తిరిగేవాళ్లం. పామర్రు వెళ్లి సినిమా చూసి ఇంటికి చేరుకునేవాళ్లం' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గంలోని నిమ్మకూరులో ఆమె శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని తన తల్లిదండ్రులు ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం.. నాబార్డు నిధులు రూ.6 కోట్లతో నిర్మించనున్న 30 పడకల సీహెచ్‌సీ భవనానికి భూమిపూజ చేశారు. గురుకుల పాఠశాల కంప్యూటర్ ల్యాబ్, కళాశాల పూర్వవిద్యార్థుల సహకారంతో రూ.3.5 కోట్లతో నిర్మించిన బాలుర వసతిగృహాన్ని ప్రారంభించారు. తర్వాత విద్యార్థులు, గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ◆ తన తండ్రి ఎన్టీఆర్ నిరుపేదల అభివృద్ధి కోసం జీవితాంతం కష్టపడ్డారని భువనేశ్వరి పేర్కొన్నారు. [illegible] తన తల్లిదండ్రుల కష్టమే కారణమన్నారు. 'ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు సేవలందిస్తున్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టుపెంచుకుంటే రాణించడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. మా కుటుంబ బాధ్యతగా.. 28 ఏళ్లుగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా విద్య, వైద్యానికి సాయం అందిస్తున్నాం' అని భువనేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పాఠశాలలకు జనవరి 10 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. పాఠశాలలు తిరిగి 19న పునఃప్రారంభమవుతాయి. మొదట వెల్లడించిన అకడమిక్ కేలండర్ ప్రకారమే సెలవులను ప్రకటించింది. ఫార్మెటివ్-3 పరీక్షలు జనవరి 5 నుంచి 8 వరకు జరుగుతాయి. ప్రాథమిక పాఠశాలలకు ఏడో తేదీతో పూర్తి కానుండగా.. 6-10 తరగతులకు 5 నుంచి 8 వరకు కొనసాగుతాయి.

ఈసారీ జగన్‌కు ప్రతిపక్ష హోదా అనుమానమే

ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

ఈనాడు డిజిటల్– భీమవరం; న్యూస్‌టుడే – కాళ్ల: జగన్‌మోహన్‌రెడ్డి తీరులో మార్పొస్తే ప్రతిపక్ష హోదా వస్తుందనుకున్నానని, కానీ రప్పారప్పా చూస్తుంటే ఈసారి కూడా అది అనుమానమేనని ఉప సభాపతి రఘురామకృష్ణరాజు వ్యాఖ్యానించారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. '2020 నుంచి (జగన్) నాపై బురదజల్లుతూనే ఉన్నారు. ఆయనపై పోరాటం ఎవరినీ అడిగి మొదలు పెట్టలేదు, ఒంటరి పోరాటం చేశాను. చంపాలని చూసినా పోరాడాను. నాపై మూడు కేసులున్నాయి కాబట్టి ఉపసభాపతి హోదా నుంచి తొలగించాలంటున్నారు. ప్రస్తుత, అప్రస్తుత ప్రతిపక్ష నాయకుడిపై 11 కేసులున్నాయి. ఆయన గతంలో ముఖ్యమంత్రిగా ఎలా పని చేశారు? విద్యుత్తు ప్లాంటు విషయంలో నన్ను చాలా ఇబ్బందులకు గురిచేశారు. ఆర్థికంగా ఎంతో నష్టపోయాను. నేను గోల్డెన్ స్పూన్‌తో పుట్టాను. నా జీవన విధానంలో ఎప్పుడూ మార్పు లేదు. ఒకప్పుడు పంది మాంసాలు అమ్ముకోలేదు. రాజకీయాల్లో కన్నాలేసి సంపాదించుకోలేదు. ఇది ఎవరికి చెబుతున్నానో వారికి అర్థమవుతుంది. నేను పెట్టిన కేసులపై చర్యలు తీసుకుంటే పోలీసు, పరిపాలన వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది. ఆ విషయంలో ప్రభుత్వం న్యాయం చేస్తుందనే నమ్మకం నాకుంది' అని రఘురామ అన్నారు.

బీసీల అభివృద్ధి భాజపాతోనే సాధ్యం

ఓబీసీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో మాధవ్



ఈనాడు, అమరావతి: బీసీల అభివృద్ధి భాజపాతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశం శుక్రవారం జరిగింది. 'దేశంలో గత పాలకులు ఓబీసీలను ఓటు బ్యాంకుగా చూస్తూ వారిని బ్యాలట్ దగ్గరే ఆపేశారు. దేశంలో బీసీ నాయకత్వాన్ని భాజపా ప్రోత్సహించింది. బీసీలకు భాజపా అండగా ఉంటుంది. కూటమి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాను. బీసీల్లో వివక్షకు గురవుతున్న అనేక కులాలను ఓబీసీ మోర్చా ద్వారా సంఘటితం చేస్తాం' అని మాధవ్ అన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులకు రూ.128 కోట్ల విడుదల

ఈనాడు, అమరావతి: ఉల్లి రైతులకు ప్రభుత్వం రూ.128.33 కోట్లు విడుదల చేసింది. ఈ-క్రాప్ ఐడీ పరిశీలించి సంబంధిత మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించింది. ఈ ఏడాది ఉల్లి ధరలు తగ్గిపోవడంతోపాటు ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా నాణ్యత తగ్గింది. రైతులు పంట కూడా అమ్ముకోలేకపోయారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం హెక్టారుకు రూ.20 వేల చొప్పున సాయం అందిస్తామని ప్రకటించింది. దీనికి అనుగుణంగా కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాల్లో 37,752 మంది రైతులు పంట నష్టపోయినట్లు గుర్తించి పరిహారం అందజేసింది.

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మోహన్ భాగవత్



ఆలయం ఎదుట మోహన్ భాగవత్, తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

తిరుమల, న్యూస్‌టుడే: ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్ శుక్రవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 మీదుగా ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, నరేష్‌కుమార్ స్వాగతం పలికారు. శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం, తితిదే ఛైర్మన్ తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట తితిదే ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం తదితరులు ఉన్నారు.

శ్రీవారి సేవలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా



ఆలయం ఎదుట డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

తిరుమల, న్యూస్‌టుడే: రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా శుక్రవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తి దర్శించుకోగా.. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

పర్యాటకులూ.. అటవీ ప్రాంతాల్లోకి వెళ్లొద్దు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో (ఏఓబీ) ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యాటక ప్రాంతాల సందర్శనకు వచ్చే వారంతా జాగ్రత్తలు పాటించాలని సీఐ గోపి నరేంద్రప్రసాద్ సూచించారు. మారేడుమిల్లిలో శుక్రవారం రాత్రి మాట్లాడుతూ.. ఇటీవల మారేడుమిల్లి అటవీప్రాంతం, తాజాగా ఒడిశా సరిహద్దులోని కొంధమాల్ జిల్లా అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్లు జరిగి మావోయిస్టు అగ్రనేతలు మరణిస్తున్నారని.. అందువల్ల సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మావోయిస్టులు భద్రతా దళాలను హతమార్చాలన్న లక్ష్యంతో ఈ ప్రాంతంలో మందుపాతరలు, ప్రెషర్ బాంబులు అమర్చినట్లు సమాచారం ఉందన్నారు. ప్రస్తుతం వీటిని వెలికితీసే కార్యక్రమాలు, కూంబింగ్ ముమ్మరంగా జరుగుతున్నట్లు చెప్పారు. ఈ పరిస్థితుల్లో పర్యాటకులతో పాటు స్థానికులు సైతం అటవీ ప్రాంతాలకు వెళ్లవద్దని కోరారు.

వైకుంఠ ద్వార దర్శనాల్లో పదిరోజులూ పవిత్రమైనవే..!

- మొదటిసారి 7.7 లక్షల మంది భక్తులకు ఏర్పాట్లు
- టోకెన్లు ఉన్నవారు సమయానికి వస్తే రెండు గంటల్లోనే దర్శనం
- ముందే వస్తే నిరీక్షించాల్సిందే
- ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

తిరుమల, న్యూస్‌టుడే: 'తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు జరగనున్న వైకుంఠద్వార దర్శనాలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశాం. వేదపండితులు, పురాణాల ప్రస్తావన మేరకు ఈ పదిరోజులూ పవిత్రమైనవే. వాటిలో ఏరోజు స్వామివారిని దర్శించుకున్నా ఒకే రకమైన ప్రతిఫలం లభిస్తుంది' అని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. వైకుంఠ ద్వార దర్శనాలపై 'న్యూస్‌టుడే'తో శుక్రవారం ఈవో ప్రత్యేకంగా మాట్లాడారు.

మూడు ప్రవేశ మార్గాలు సిద్ధం

వైకుంఠ ద్వార దర్శనాల కోసం మొదటిసారి ఈ-డిప్ విధానం అందుబాటులోకి తెచ్చాం. మొదటి మూడు రోజులకుగాను దేశవ్యాప్తంగా 1,89,000 మందికి పూర్తి పారదర్శక విధానంలో టోకెన్లు జారీ చేశాం. టోకెన్లు పొందినవారు నిర్దేశిత సమయం లోపు తిరుమలకు చేరుకుంటే రెండు గంటల్లోనే శ్రీవారి దర్శనం చేయిస్తాం. ఈ మేరకు మూడు ప్రవేశమార్గాలు సిద్ధం చేశాం. కేటాయించిన సమయానికి వచ్చే భక్తులను క్యూలైన్‌కు దగ్గరగా ఉన్న ప్రవేశమార్గంలో పంపుతాం. సమయాని కంటే ముందుగా వచ్చేవారిని మరో రెండు ప్రవేశమార్గాల గుండా క్యూలైన్‌లోకి తీసుకుని వారికి కేటాయించిన సమయంలోనే దర్శనానికి పంపే ఏర్పాట్లు చేస్తున్నాం. ఏకాదశికి ముందు 29వ తేదీన పరిమిత సంఖ్యలో టికెట్లు జారీచేసి వారికి అదేరోజు దర్శనాలు ముగిసేలా చూస్తాం.

ప్రతి రెండు గంటలకు రద్దీ సమాచారం

జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు రోజుకు 15000 చొప్పున ప్రత్యేక ప్రవేశదర్శన టికెట్లు, 1500 శ్రీవాణి టికెట్లు జారీచేశాం. మరో 3,60,000 మంది సర్వదర్శనానికి ఏర్పాట్లు పూర్తిచేశాం. ప్రతి రెండు గంటలకు ఒకసారి రద్దీపై ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా కచ్చితమైన సమాచారం వెల్లడిస్తాం. దీంతో సర్వదర్శన భక్తులు రద్దీ తక్కువ ఉన్న సమయంలో శ్రీవారిని దర్శించుకునేందుకు రావొచ్చు. వృద్ధులు, చిన్నపిల్లలు ఉన్న కుటుంబ సభ్యులు ఇబ్బందిపడకుండా ఉంటారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కలిపి 7,70,000 మందికి పదిరోజుల్లో దర్శనం కల్పించనున్నాం. గత మూడేళ్లూ దాదాపు 6,60,000 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 182 గంటల్లో 164 గంటలు సామాన్యభక్తులకే కేటాయించగా మిగిలిన సమయం మాత్రమే వీఐపీలు, వీవీఐపీలకు కేటాయించాం. ఈ పదిరోజుల్లో ప్రివిలేజ్ దర్శనాలు, బ్రేక్ దర్శనాలను పూర్తిగా రద్దుచేశాం. నేరుగా వచ్చే ప్రముఖులకే దర్శనం ఉంటుంది.

16 రకాల వంటకాలు

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కేంద్రంలో ఉదయం 8 నుంచి రాత్రి 12 గంటల వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తాం. దాదాపు 16 రకాల అన్నప్రసాదాలు, పానీయాలు సిద్ధం చేస్తున్నాం. వసతికి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశాం. తిరుమలలో భద్రత నిమిత్తం పోలీసు విభాగం నుంచి 2400, తితిదే విజిలెన్స్ నుంచి 1100 మందిని నియమించాం. దర్శన ఏర్పాట్లపై ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృతంగా తెలియజేయనున్నాం. తితిదేకు అనుబంధంగా ఉన్న ఆరు లక్షల మంది శ్రీవారి సేవకుల సాయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం' అని ఈవో పేర్కొన్నారు.

రెవెన్యూ క్లినిక్‌లు వస్తున్నాయ్

- భూమితో బంధం వారిది.. అర్జీలను సానుభూతితో పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశం
- సాధ్యమైనంత వరకు అదేరోజు.. కాకుంటే నిర్దిష్ట కాలపరిమితిలోగా
- డిజిటల్ రికార్డుల ఆధారంగా అక్కడికక్కడే పరిష్కారం

ఈనాడు, అమరావతి: ప్రజలకు భూమితో ఉన్న బంధాన్ని దృష్టిలో ఉంచుకుని.. రెవెన్యూ సిబ్బంది వారి పట్ల సానుభూతితో వ్యవహరించాలని, అర్జీల్ని పారదర్శకంగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్జీని అదేరోజు, లేదంటే నిర్దేశిత సమయంలో పరిష్కరించి ఫలితాన్ని ఫిర్యాదుదారునికి తెలియజేయాలని సూచించింది. దీనిలోభాగంగా ఇప్పటికే అమలవుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)కు అనుబంధంగా రెవెన్యూ క్లినిక్‌లు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. అక్కడ అర్జీల స్వీకరణ, టేబుల్స్ ఏర్పాటు, పరిష్కారానికి విధివిధానాలు సూచిస్తూ సీసీఎల్ఏ జయలక్ష్మి శుక్రవారం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశారు. తహసీల్దార్లు, సబ్‌కలెక్టర్లు, ఆర్డీవోలు, సంయుక్త కలెక్టర్, ఇతర రెవెన్యూ యంత్రాంగం శుక్రవారం నుంచి ఈ విధానాన్ని అమల్లోకి తేవాలని నిర్దేశించారు. ప్రతి ఫిర్యాదునూ పూర్తిగా పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. పార్వతీపురం మన్యం, అనంతపురం జిల్లాల్లో అమలుచేస్తున్న ఉత్తమ పద్ధతుల ఆధారంగా వీటిని అందుబాటులోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు.

అన్ని రికార్డులతో సన్నద్ధంగా ఉండాలి

'గ్రీవెన్స్ డే అంటే సోమవారం వచ్చేవారి నుంచి అర్జీలు తీసుకుని నమోదు చేసుకోవడంతోనే సరిపోదు. తహసీల్దార్లు, సబ్‌కలెక్టర్లు, సిబ్బంది అడంగల్, 10(1) ఖాతాలు, ఎస్ఎఫ్ఏ (సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్), వెబ్‌ల్యాండ్, ఓఆర్‌సీఎంఎస్, మీ సేవ, ఇతర అవసరమైన రికార్డుల్ని డిజిటల్/భౌతికంగా అందుబాటులో ఉంచుకోవాలి' అని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ప్రతి రెవెన్యూ క్లినిక్‌లో రిసెప్షన్.. కౌంటర్లు

ప్రతి రెవెన్యూ క్లినిక్‌లోనూ రిసెప్షన్ ఏర్పాటుచేసి, అంకితభావంతో పనిచేసే సిబ్బందిని నియమించాలి. వచ్చిన ఫిర్యాదుదారుల్ని వేచి ఉండే ప్రాంతంలో కూర్చోబెట్టాలి. ◆ తర్వాత స్వాగత కౌంటర్‌కు పిలిచి ఫిర్యాదుదారు నుంచి ప్రాథమిక వివరాలు తీసుకోవాలి. స్కానింగ్/ఇతర పత్రాలు తీసుకుని నిర్దేశిత ఫార్మాట్‌లో నమోదుచేయాలి. ఇంకా ఏవైనా అవసరమైతే అర్జీదారుకు తెలియజేయాలి. సంబంధిత మోడల్ ఫార్మాట్లలో వివరాలు ఒకేసారి నమోదుచేయాలి. పదేపదే తిప్పించకూడదు.

తహసీల్దారు అక్కడకొచ్చి: టేబుల్ వద్ద ఉండే అధికారులు, సిబ్బంది.. అర్జీదారుకు సంబంధించిన సమస్య పరిశీలించాలి. ప్రాథమికంగా ఏం చేయాలో నమోదుచేయాలి. ◆ సివిల్ వివాదాలైతే కోర్టు, జిల్లా న్యాయసేవా సంస్థను సంప్రదించాలని సూచించాలి. ◆ ఏదైనా సమస్యపై నిర్ణయం తీసుకోవడమో, స్పష్టత అవసరమో అయినప్పుడు.. తహసీల్దారును టేబుల్ వద్దకు పిలిచి అర్జీదారుతో మాట్లాడించాలి. సులభమైన భాషలో వివరించాలి. ◆ తహసీల్దారు అవసరమైతే వీఆర్‌ఓ, ఆర్ఐ, సర్వేయర్లతో ఫోన్‌లో మాట్లాడి సమాచారం తీసుకోవాలి. నిర్దేశిత విధానంలో ఏటీఆర్ (యాక్షన్ టేకెన్ రిపోర్టు) సిద్ధం చేయాలి. క్షేత్ర విచారణ, ఓఆర్‌సీఎంఎస్ అప్పీలు, మీసేవలో దరఖాస్తు, ఆక్రమణ, ఇతర సూచనలు అందులో పేర్కొనాలి

సమస్యల వారీగా వర్గీకరించి..

ఆర్ఓఆర్, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆర్ఓఎఫ్ఆర్, 1/70 సంబంధించినవి, రీసర్వే.. ఇలాంటి మొత్తం 14 రకాల సమస్యలుగా అర్జీలను విభజించాలి. వాటికి అనుగుణంగా 14 టేబుళ్లు, వాటివద్ద సిబ్బందిని ఉంచాలి. సమస్య ఏ విభాగానికి చెందినదో గుర్తించి అర్జీదారుల్ని ఆ టేబుల్ వద్దకే పంపాలి.

అక్కడికక్కడే ఆన్‌లైన్ దరఖాస్తు.. నోటీసులు

◆ ఆర్ఓఆర్ కేసుల్లో అప్పీలు అవసరమైతే.. తహసీల్దారు, సబ్‌కలెక్టర్ స్పందించాలి. ఓఆర్‌సీఎంఎస్ ద్వారా అప్పీలు చేసి.. సంబంధిత పక్షాలకు నోటీసులు జారీచేయాలి. ◆ మ్యుటేషన్, ఎఫ్ఎంసీ, 1బీ తదితర సేవలైతే.. సేవా కౌంటర్‌కు పంపి ఆన్‌లైన్ దరఖాస్తు చేయించాలి. రెవెన్యూ క్లినిక్ ఏటీటీతో జతచేయాలి. ◆ ఆక్రమణ, ఆర్ఓఎఫ్ఆర్, 22ఏ, అటవీ పట్టా, రీసర్వే, ఎఫ్ లైన్, సబ్‌డివిజన్, కోరిలేషన్ తదితర విషయాల్లో ఏం చేయాలో సంబంధిత మోడల్ ఫార్మాట్లలో సూచించారు.

డిజిటల్/కార్యాలయ దస్త్రాలతో పరిష్కరించలేకపోతేనే.. క్షేత్రస్థాయి ధ్రువీకరణ

సాధ్యమైనంత వరకు రెవెన్యూ క్లినిక్‌లలో అధికారుల వద్ద ఉండే డిజిటల్/కార్యాలయ దస్త్రాల ఆధారంగా సమస్య పరిష్కరించాలి. అలా పరిష్కరించలేనప్పుడే క్షేత్రస్థాయి విచారణకు ఆదేశించాలి. ఆ విషయాన్ని ఏటీటీలో నమోదుచేయాలి. వీఆర్‌ఓ, సర్వేయర్, ఆర్ఐ అందుకు అనుగుణంగా విచారణ/సర్వే చేసి ఫొటోలు తీసి నివేదికల్ని త్వరితగతిన సమర్పించాలి.



నిద్రలేమితో ఊబకాయం

జంక్ ఫుడ్ కన్నా నిద్రలేమి వల్లే ఊబకాయం ముప్పు ఎక్కువ. దీని పరిష్కారానికి గాఢ నిద్ర కోసం ఇలా చేయండి. ✦ మీరు నిద్రపోయే గది చిమ్మచీకటిగా ఉండేలా చూసుకోండి. ✦ పడక గదిని చల్లగా ఉంచుకోండి. ✦ నిద్రకు 8 గంటలు ముందు కాఫీని తీసుకోవద్దు. ✦ రోజూ ఒకే సమయానికి నిద్రపోండి. ✦ ఉదయపు సూర్యరశ్మి శరీరానికి తగిలేలా చూసుకుంటే చక్కటి నిద్ర పడుతుంది.

– మైఖేల్ మోరెలి, రచయిత

చెత్త తీసుకెళ్లే రిక్షాలో మృతదేహం తరలింపు!

పార్వతీపురం మన్యం జిల్లాలో ఘటన



రిక్షాలో తీసుకెళ్తున్న మృతదేహం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: నగదు లేక ఓ నిరుపేద వృద్ధ మహిళ మృతదేహాన్ని చెత్త తరలించే రిక్షాపై తీసుకెళ్లిన దుస్థితి ఇది. ఈ హృదయ విదారక ఘటన పార్వతీపురం మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. . గుమ్మలక్ష్మీపురానికి చెందిన రాధమ్మ(65) తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు భద్రగిరి సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయారు. ఆమె మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు ఆసుపత్రిలో అంబులెన్సు సదుపాయం లేకపోవడంతో ప్రైవేటు వాహనాన్ని సంప్రదించగా, రూ.2,500 అవుతుందని చెప్పారు. ఆ మొత్తం ఇచ్చే స్తోమత లేక, మరోదారి లేక చివరికి చెత్త సేకరించే రిక్షా బండిలోనే తరలించారు. రాధమ్మ భర్త, కుమార్తె కొన్నాళ్ల కిందట మృతి చెందడంతో ఆమె ఒంటరిగా జీవనం సాగిస్తున్నారు. ఆసుపత్రిలో ఉన్న ఐటీడీఏ అంబులెన్స్‌లో మృతదేహాలు తరలించడానికి అవకాశం లేదని, మహాప్రస్థానం వాహనం ఆసుపత్రిలో లేదని, అది మంజూరు చేస్తే సమస్య ఉండదని భద్రగిరి సీహెచ్‌సీ వైద్యులు అనిల్, త్రివేణి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

పాస్టర్లకు గౌరవ వేతన బకాయిల విడుదలపై హర్షం


ఈనాడు, అమరావతి: పేదల సంక్షేమమే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర యునైటెడ్ పాస్టర్ల ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బిషప్ జయప్రకాశ్ గంజికుంట అన్నారు. 2024 డిసెంబరు నుంచి 2025 నవంబరు మధ్య రాష్ట్రవ్యాప్తంగా 8,427 మంది పాస్టర్లకు రావాల్సిన గౌరవ వేతనం రూ.50.40 కోట్లు విడుదల చేసినందుకు సీఎంకు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. 'ఏడాదిపాటు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం ప్రభుత్వం విడుదల చేయగా ఒక్కో పాస్టర్‌కు రూ.60 వేలు వచ్చాయి. 2026 జనవరి నుంచి ప్రతి నెలా క్రమం తప్పకుండా చెల్లించేలా చర్యలు తీసుకోవాలి' అని జయప్రకాశ్ కోరారు.

జగన్ విష రాజకీయాలు

క్రూరులైన రాజకీయ నేతలు జనాన్ని భయపెడుతూ పాలిస్తారు. కుటిల నాయకులేమో పచ్చి అబద్ధాలతో జనాన్ని ఏమార్చుతూ పబ్బంగడుపుకొంటారు. ఈ రెండు అవలక్షణాలనూ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుణికిపుచ్చుకున్నారు. కుతంత్రాలూ దండోపాయాలతో అయిదేళ్ల పాటు ముఖ్యమంత్రిత్వం వెలగబెట్టిన జగన్- భిన్న రంగాల్లో ఏపీని గాఢాంధకారంలోకి నెట్టుకుపోయారు. అందుకు జనం ఛీకొట్టి నిరుటి ఎన్నికల్లో మట్టికరిపించాకైనా ఆయన తెలివి తెచ్చుకోలేదు. 11 సీట్లతో రాజకీయంగా చావుతప్పి కన్నులొట్టబోయినట్లు మిగిలిన తరవాత కూడా తనకు బాగా అలవాటైన బెదిరింపుల భాషను మానుకోలేదు. ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య(పీపీపీ) పద్ధతిలో నిర్వహణకు తీసుకునేవారిని తాము అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కటకటాల్లోకి పంపిస్తామని కొద్దిరోజుల క్రితం జగన్ రంకెలు వేశారు. ప్రభుత్వ విధానాలపై అభ్యంతరముంటే, ప్రజాస్వామ్యయుతంగా నిరసించవచ్చు. ఆందోళనలూ చేయవచ్చు. సర్కారీ నిర్ణయాల్లో రాజ్యాంగ, చట్టవిరుద్ధమైన అంశాలుంటే, ఎప్పటికైనా అవి న్యాయసమీక్షకు అతీతం కాకుండా పోవు. ఇవన్నీ వదిలేసి- ప్రైవేట్ పెట్టుబడిదారులకు సంకెళ్లు వేస్తామని బెదిరించడమేంటి? ప్రజాహితం కోసమంటూ ప్రత్యేక పథకాలతో వైద్యారోగ్య రంగంలో కేంద్రమే పీపీపీని ప్రోత్సహిస్తోంది. అలాంటప్పుడు దానిపై ఆసక్తితో టెండర్లలో పాల్గొనాలనుకునేవారిపై కత్తిగట్టి జగన్ బావుకునేదేంటి- సైంధవుడిలా పెట్టుబడులకు అడ్డంపడి రాష్ట్రాన్ని నాశనం చేయడం తప్ప!?

ప్రభుత్వ వైద్య కళాశాలలను మీరు నిర్మించలేకపోతే మేమొచ్చాక కడతాం అంటూ జగన్ రొయ్య మీసాలు తిప్పుతున్నారు. కానీ, తాను పదవిలో ఉన్నప్పుడే ఆ పని ఎందుకు చేయలేకపోయారు? వైద్యవిద్యా వ్యయభారం అధికంగా ఉన్న నేపథ్యంలో అర్హులైన విద్యార్థులకు ఉపకారవేతనాలివ్వాలని, కళాశాలలూ ఆసుపత్రులను పీపీపీ విధానంలో నిర్వహించడంపై ఆలోచించాలని పార్లమెంటరీ కమిటీయే ఇటీవల సిఫార్సు చేసింది. భాజపా, కాంగ్రెస్, బిజూ జనతాదళ్, ఆప్, ఎస్పీ, ఎన్సీపీ, డీఎంకే, జేడీయూ తదితర భిన్న పార్టీల ఎంపీలతో కూడిన స్థాయీసంఘమది. దాని సూచనలను సైతం చెవికెక్కించుకోని జగన్- ఆఖరికి ఏపీ హైకోర్టు వ్యాఖ్యలనూ కావాలని విస్మరిస్తున్నారు. 'నిధుల కొరతవల్ల వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి ఉండొచ్చు. అది తప్పెలా అవుతుంది? పూర్తిగా ప్రైవేటుకు అప్పగించకుండా ప్రభుత్వ భాగస్వామ్యం ఉండటం మంచిదే కదా' అన్న ఉన్నత న్యాయస్థానం మాటలకు జగన్ దగ్గర జవాబుందా?

పీపీపీ పద్ధతిలో చేపట్టే వైద్య కళాశాలలూ ఆరోగ్యసేవల ప్రాజెక్టులకు మూలధన వ్యయంలో 30-40శాతం, నిర్వహణ ఖర్చులో పాతికశాతం కేంద్రం గ్రాంటుగా సమకూర్చుతుంది. ఈ విషయాన్ని వెల్లడించిన కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా- నైపుణ్యం, సృజనాత్మకత, నిధుల సమీకరణ పరంగా పీపీపీ చాలా లాభదాయకమైనదని పేర్కొన్నారు. దాంతో ప్రాజెక్టుల స్థిరాభివృద్ధి సాధ్యమై జవాబుదారీతనం, పారదర్శకత ఇనుమడిస్తాయని ఉద్ఘాటించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని నడ్డా స్పష్టంచేశారు. రాష్ట్రాలు పీపీపీని అందిపుచ్చుకోవాలన్న కేంద్ర మంత్రినీ జగన్ తిట్టిపోస్తారా? పెట్టుబడుల రాకకు శాంతిభద్రతలు ప్రాణప్రదమైనవి. అవి కరవైతే పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలోలా అరాచకం ప్రబలి అభివృద్ధి అటకెక్కుతుంది. జగన్ కక్షపూరిత మనస్తత్వంతో ఏపీకి అలాంటి ముప్పే పొంచిఉంది. రాజకీయ అక్కసుతో ప్రజాప్రయోజనాలకు, రాష్ట్ర దీర్ఘకాల శ్రేయస్సుకు పాతరేయడానికి వెనకాడని జగన్ పోకడలు భారత ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమైనవి!



ఆదర్శంగా తీసుకోవడానికి, నేర్చుకోవడానికి గొప్ప గొప్ప నేతలే అక్కర్లేదు. చిన్న తేనెటీగ చాలు... మిరప మొక్క పువ్వుల నుంచి కూడా తనకు కావాల్సిన మకరందాన్ని తీసుకోగలదు. అదీ మొక్కకు ఎలాంటి హానీ జరగకుండా. మరొకరికి నష్టం కలగకుండానూ మన పనులు చేసుకోవచ్చు.

– బాబా ఆమ్టే

అంతా ప్రేమమయం

ప్రేమ... అమూల్యమైన భావన. దివ్యమైన అనుభూతి. విశ్వమంతా నిండి ఉన్నది ఈ పరమ పవిత్రమైన ప్రేమే. శిశువులు ఓలలాడేది మాతృప్రేమ సాగరంలోనే. సృష్టి స్థితులకు మూలకారణం ప్రేమ తత్వమే. అందుకే మానవతా విలువలన్నింటిలోనూ ప్రేమే ఉదాత్తమైనది.

ఈ ప్రపంచంలో పుట్టింది మొదలు తల్లిదండ్రులు, తోబుట్టువులు, భార్యాభర్తలు... ఇలా ఏ బంధమైనా ముడిపడి ఉండేది ప్రేమసూత్రంతోనే కదా! మనుషులే కాదు జీవకోటి మొత్తం ప్రేమబంధానికే కట్టుబడి ఉంది. పూర్వం మహర్షుల ఆశ్రమాలలో అన్ని రకాల జంతువులు జాతివైరాన్ని మరచి సంచరించేవట. అంటే ప్రేమ తరంగాలు ప్రసరించే చోట క్రూరత్వానికి, ద్వేషానికి తావుండదనేగా!

ప్రేమను వ్యక్తీకరించడం ఒక కళ. ప్రేమను పంచడం ఒక సాధన. మాట, స్పర్శ, చూపుల ద్వారా మనం వ్యక్తీకరించే ఆ భావన ఎదుటివారికి మనపట్ల అభిమానాన్ని, గౌరవాన్ని ఇనుమడింపజేస్తుంది. మన చుట్టూ ఉన్నవారినే కాదు... పశు పక్ష్యాదులను, ప్రకృతిని కూడా ప్రేమించగలగాలి. చిన్ని మొక్కకు ప్రేమతో నీరు పోస్తే పువ్వుల నవ్వులను విరబూస్తుంది. చిట్టి ఉడుత, చిన్ని పిట్ట... ఇలా ఏ ప్రాణి అయినా మనం చూపించే ప్రేమకు ప్రతిస్పందించే తీరు మనోహరం, అనుభవైకవేద్యం. మనం ప్రాణికోటి పట్ల చూపించే ప్రేమ నేరుగా భగవంతుడికే చేరుతుంది. అలాగే 'సర్వ జీవ తిరస్కారం కేశవం ప్రతి గచ్ఛతి' ఏ ప్రాణి పట్ల అనాదరణ చూపినా అది కూడా భగవంతుడే స్వీకరిస్తాడు. ఈ ఎరుకతో వ్యవహరించాలి.



అంతర్యామి

యశోద కృష్ణుణ్ని తాడుతో రోటికి కట్టివేసి క్రమశిక్షణలో ఉంచాననుకుంది. కానీ నిజానికి చిన్నికృష్ణుడు కట్టుబడింది ఆమె ప్రేమ పాశానికి. శ్రీరాముడు శబరి ఇచ్చిన పండ్లను తీసుకున్నా, శ్రీకృష్ణుడు కుచేలుడు తెచ్చిన అటుకులను స్వీకరించినా అల్పమైన ఆ వస్తువులలో అంతర్లీనమైన ప్రేమ భావనకు వశమవడం వల్లనే. బెజ్జ మహాదేవి ఆదిదేవుడైన శివుణ్ని బిడ్డగా భావించి తల్లిగా లాలించింది. ఉపచారాలు చేసింది. నిష్కల్మషమైన ఆ ప్రేమ ఆమెకు శివసాయుజ్యాన్ని ప్రాప్తింపజేసింది. అమ్మ బిడ్డకు ఆప్యాయంగా పెట్టే గోరుముద్దలు అమృతతుల్యం. గురువు ప్రేమతో నేర్పే విద్య విద్యార్థికి వెలుగుదారి. అది మనుగడకు శక్తినిస్తుంది. సత్యాన్ని దర్శింపజేస్తుంది. స్వార్థరహితమైన ప్రేమ భగవంతుడి పట్ల భక్తిగా పరిణమిస్తుంది. ఆయన అనుగ్రహం పొందాలనే తపన, భక్తి, ప్రేమతో కూడిన నిరంతర స్మరణ మనసును శుద్ధిచేస్తాయి.


మానవ జీవితమనే వృక్షానికి ప్రేమ మూలమని(వేరు), జ్ఞానం ఫలమని ఉపనిషత్తులు చాటుతున్నాయి. భయ, ద్వేషాలను ఆలోచనల నుంచి తరిమేస్తే హృదయమనే పాత్ర ప్రేమతో నిండిపోతుంది. భగవంతుడి సాన్నిధ్యానికి అనుసరించాల్సిన ఉత్తమమైన, సులభమైన మార్గం ప్రేమే. దీన్ని సాధించడానికి ఎటువంటి వ్యయప్రయాసలు అవసరం లేదు. అందరిలోనూ దైవాన్ని దర్శిస్తే చాలు. ప్రేమపూరిత వాక్కులు సత్యంగా, చేతలు ధర్మంగా, ఆలోచనలు శాంతిగా రూపుదిద్దుకుంటాయి. త్రికరణాలు ప్రేమపూరితమైతే జీవనం అమృతమయమే కదా!

– శ్రీమత్కందాళ బాలసరస్వతి

సంస్కరణల రాకెట్ ప్రయోగించాలి!

ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ అవకాశాల గని. ఇందులో మనదేశం గణనీయమైన వాటాను ఒడిసిపట్టాలంటే వ్యూహాత్మక ప్రణాళికలు అవసరం. ఇందుకోసం భారత అంతరిక్ష రంగ సంఘం- శాట్‌కామ్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (ఎస్ఐఏ-ఇండియా) ఒక మార్గసూచిని తయారు చేసింది. మన అంతరిక్ష రంగాన్ని సాంకేతికంగా, ఆర్థికంగా సమున్నత శిఖరాలపై నిలిపేందుకు అవసరమైన సంస్కరణలు ఇందులో ఉన్నాయి. డిజిటల్ అంతరాల తొలగింపు, పాలనలో మెరుగైన నిర్ణయాలు, భద్రత... మొత్తంగా దేశ సర్వతోముఖాభివృద్ధికి ఉపగ్రహ పరిజ్ఞానాన్ని సమర్థంగా ఉపయోగించడమే ఇప్పుడు కీలకం.

భారత అంతరిక్ష కార్యక్రమం అద్భుత విజయాలు సాధించినా, అంతర్జాతీయ వేదికపై గట్టి పోటీదారుగా ఎదగాలంటే రోదసి బడ్జెట్‌ను రూ.40వేల నుంచి 50వేల కోట్లకు (5-6 బిలియన్ డాలర్లు) పెంచాలి. దీనివల్ల అంతరిక్ష సామర్థ్య దేశాలతో పోల్చినప్పుడు ఉన్న నిధుల లోటును భర్తీ చేయడానికి వీలవుతుంది. అధునాతన ఉపగ్రహ సాంకేతికతలు, అంతరిక్ష మైనింగ్, రోదసి భద్రత పరిజ్ఞానాలపై దృష్టిపెట్టాలి. మెరుగైన సైబర్ భద్రత, అంతరిక్ష వ్యర్థాల నిర్వహణ, హరిత ఇంధన వ్యవస్థలు, పునర్వినియోగ పరిజ్ఞానాలు, క్వాంటమ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ వంటి కీలక రంగాలకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యమివ్వాలి. అంతరిక్ష రంగంలో ప్రస్తుతం ఉన్న వెయ్యి కోట్లకు పైగా ఉన్న వెంచర్ క్యాపిటల్ ఫండ్‌ను 3-5 రెట్లు పెంచాలి. తద్వారా స్పేస్‌ఎక్స్, వన్‌వెబ్ వంటి ప్రపంచ అంతరిక్ష దిగ్గజాలతో పోటీ పడటానికి వీలవుతుంది. ఇప్పటికే ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల అంతరిక్ష రంగంలో ప్రైవేటు పెట్టుబడులు కొంతవరకు పెరుగుతున్నాయి.



స్పేస్‌ఫోర్స్ కమాండ్ ఏర్పాటు కావాలి


దీర్ఘకాల, సుస్థిర వృద్ధి కోసం 30 ఏళ్ల వాణిజ్య అంతరిక్ష ప్రణాళికను రూపొందించుకోవాలి. పదేళ్ల కాలపరిమితితో కూడిన మూడు దశలతో ఒక్కో దశలో అయిదేళ్ల కాలానికి సంబంధించిన లక్ష్యాలు ఉండాలి. దశలవారీ విధానం వల్ల భారత అంతరిక్ష రంగం అంతర్జాతీయ మార్కెట్ తీరుతెన్నులకు అనుగుణంగా రూపాంతరం చెందడానికి వీలవుతుంది. ఈ ప్రణాళికలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాలు, పరిశోధన నిధులు, ఎగుమతుల ఆధారిత వృద్ధిపై ప్రధాన దృష్టి ఉండాలి. 30 ఏళ్ల వృద్ధి ప్రణాళికకు అనుగుణంగా ఆర్థిక అంశాలను సమన్వయం చేసేందుకు, అవసరమైన రాయితీలను కల్పించేందుకు ఆర్థిక మంత్రిత్వశాఖలో 'స్పేస్ ఎకానమీ టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు అవసరం. జీడీపీలో అంతరిక్ష రంగ వాటాను నిర్ధారించేందుకు గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ, ఇన్‌స్పేస్, ఇస్రో భాగస్వామ్యంతో శాటిలైట్ ఎకనమిక్ అకౌంట్స్‌ను ఏర్పాటు చేయాలి. దీనివల్ల ప్రభుత్వంలో డేటా ఆధారిత నిర్ణయాలకు, సమర్థ పెట్టుబడుల వ్యూహాల రూపకల్పనకు వీలవుతుంది. అంతరిక్షంతో ముడిపడిన రక్షణ కార్యకలాపాల పర్యవేక్షణ కోసం రక్షణ మంత్రిత్వశాఖలో ఒక స్పేస్‌ఫోర్స్ కమాండ్‌ను ఏర్పాటు చేయాలి. రక్షణ అంతరిక్ష సంస్థ (డీఎస్ఏ), ఇస్రో, ఇతర సంస్థల సమన్వయంతో సాగాలి. అంతరిక్ష రంగంలో రక్షణ సామర్థ్యాలను పెంచుకునేందుకు బడ్జెట్‌ను పెంచాలి. దేశ అంతరిక్ష పరిశ్రమలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా అంకుర పరిశ్రమ నిధిని ఏర్పాటు చేయాలి.

భారత్‌నెట్ కార్యక్రమంలో భాగంగా దేశంలోని 3.5లక్షల గ్రామ పంచాయతీలకు ఉపగ్రహ సంధానతను అనుబంధ మార్గంగా పరిగణించాలి. దీనివల్ల ఒక నెట్‌వర్క్ విఫలమైనా రెండోది సేవలు అందిస్తుంది. ఉపగ్రహ పరిజ్ఞానాన్ని జాతీయ సంధానత వ్యవస్థలో భాగం చేయాలి. ఇందుకు అవసరమైన విధానాలు, రాయితీలను ప్రకటిస్తే, ప్రైవేటు పెట్టుబడులకు ఊతం లభిస్తుంది. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ అంతరాన్ని పూడ్చేందుకు ఉపగ్రహ ఆధారిత గ్రామీణ సంధానతకు ప్రభుత్వం పన్ను రాయితీలను ఇవ్వాలి. స్పెక్ట్రమ్ వినియోగ రుసుములను తగ్గించి, ఆక్షన్ ఉపగ్రహ పరికరాలపై పన్ను మినహాయింపులు ఇస్తే ప్రైవేటు పెట్టుబడులకు ప్రోత్సాహం లభిస్తుంది. మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ వృద్ధికి వీలు కలుగుతుంది. ప్రభుత్వ సబ్సిడీలు, సీఎస్ఆర్ నిధులతో గ్రామీణ డిజిటల్ సమ్మిళితత్వ నిధి ఏర్పాటు కావాలి.

నిధులూ రాయితీలూ పెరగాలి

ఉపగ్రహాల ఎగుమతిలో భారత్ తన పూర్తి సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకునేందుకు శాటిలైట్ తయారీదారులు, లాంచ్ సేవలు అందించే సంస్థలకు నిధులు, రాయితీలు పెంచాలి. ఎగుమతి నిబంధనలను సరళీకరించి, ఏకగవాక్ష ఆమోద వ్యవస్థను తీసుకురావాలి. ఎగుమతి రుణ బీమాను ప్రవేశపెట్టాలి. అంతర్జాతీయ మార్కెట్లలోకి వెళ్లే చిన్న కంపెనీల రక్షణకు ఇది అవసరం. ఈ కంపెనీలకు పొంచి ఉన్న ముప్పులను తగ్గించి, పోటీతత్వాన్ని పెంచడానికి ప్రత్యేక స్కీమ్‌ను తీసుకురావాలి. వ్యూహాత్మక ద్వైపాక్షిక ఒప్పందాలు, పన్ను క్రెడిట్లతో భారత ఉపగ్రహాల ఎగుమతులు, లాంచ్ సేవలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. లాంచ్ వేదికల ఏర్పాటుకు పెట్టుబడులు పెంచడంవల్ల వాణిజ్య, సైనిక అవసరాల కోసం దేశీయంగా ఉపగ్రహాలను ప్రయోగించడానికి వీలవుతుంది. అత్యాధునిక అంతరిక్ష పరిజ్ఞానాల్లో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలి. తేలికపాటి మిశ్రమ లోహాలు, స్పేస్ ఎలక్ట్రానిక్స్, ఆప్టికల్ ఇమేజింగ్ వ్యవస్థలు వంటి కీలక రంగాల్లో దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచేలా పెట్టుబడులు పెరగాలి.

ఉపగ్రహ డేటాను జాతీయ అభివృద్ధి ప్రణాళికలతో అనుసంధానించడం చాలా ముఖ్యం. ఇందుకోసం ఒక ఏకీకృత ప్రభుత్వ (సర్వ) కార్యాచరణను తెచ్చేందుకు చర్యలు చేపట్టాలి. ఇది వివిధ శాఖలు, ప్రధానంగా వ్యవసాయం, పట్టణ ప్రణాళిక, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో ఉపగ్రహ డేటా ఫార్మాట్లు, విధానాలను ప్రామాణీకరించేందుకు దోహదపడుతుంది. దీనివల్ల భవిష్యత్తులో వనరుల కేటాయింపు, లక్షిత ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించేందుకు, మెరుగైన ద్రవ్య ప్రణాళికకు వీలు కల్పిస్తుంది. దేశీయ దిక్సూచీ వ్యవస్థ 'నావిక్' సేవలను విస్తరించాలి. స్వయంప్రతిపత్తి నేవిగేషన్ పరిజ్ఞానాలపై పెట్టుబడులు పెట్టాలి. అంతర్జాతీయ ప్రమాణాలతో సమగ్ర అంతరిక్ష సైబర్ భద్రతా కార్యాచరణను సిద్ధం చేసేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలి. దీనివల్ల ముప్పులను ఎప్పటికప్పుడు గుర్తించే వ్యవస్థ అభివృద్ధికి, భద్రతా సాంకేతికతల్లో పరిశోధనలకు నిధులు సమకూర్చడానికి వీలవుతుంది.



డాక్టర్ పావులూరి సుబ్బారావు
(ప్రెసిడెంట్, శాట్‌కామ్ ఇండస్ట్రీస్ అసోసియేషన్-ఇండియా; సీఎండీ, అనంత్ టెక్నాలజీస్

ఒకప్పుడు మనుషులు సమాజంలో జీవించేవారు, ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో బతుకులీడుస్తున్నారు. ఎమోషన్లు అన్నీ నేడు ఇమోజీలుగా మారాయి. చాయ్ కొట్టు కబుర్లన్నీ చాటింగులయ్యాయి. అరుగు మీద ముచ్చట్లకు ఆన్‌లైన్ వేదికైంది. పిచ్చాపాటీ విషయాలన్నీ ట్వీట్లుగా మారాయి. భావోద్వేగాలన్నీ స్టేటస్‌లుగా, భయాలన్నీ స్టోరీలుగా బహిరంగమవుతున్నాయి. రీల్స్ చూస్తూ రియల్ లైఫ్ అనుభూతుల్ని కోల్పోతున్నారు. షార్ట్స్ చూస్తూ ఏకాగ్రతని షార్ట్‌గా ఎనిమిది సెకండ్లకు కుదించేసుకుంటున్నారు చాలామంది. ప్రేమాప్యాయతలకు బదులుగా పోస్టులను పంచుకుంటున్నారు. ఆ పోస్టులకు వచ్చే లైకులు సోషల్ మీడియా కర్టసీ వల్ల తప్ప మన వ్యక్తిత్వమో, నైపుణ్యమో మెచ్చి కాదన్న సంగతిని మర్చిపోతున్నారు.

డిజిటల్ డిప్రెషన్!



తమను అనుసరించే వారిలో అభిమానించేవారే కాదు అనుమానించేవారు, కామెంట్లతో అవమానించే వారు కూడా ఉంటారని గమనించరు చాలామంది. జీవితంలో నిలకడ గురించి ఆలోచించని వారు స్నాప్ చాట్‌లో మాత్రం స్ట్రీకులు స్థిరంగా ఉంచడానికి ప్రయత్నిస్తుంటారు. ఫోనులో వందల కాంటాక్టులున్నా అవసరం అయినప్పుడు గబుక్కున ఎవరికి ఫోన్ చేయాలో తెలియని సదిగ్ధంలో పడుతుంటారు.

సామాజిక మాధ్యమాల వల్ల భిన్న కోణాలు తెలుస్తాయి, వాస్తవాలను అంచనా వేయొచ్చన్నది ఎంత నిజమో, అవి డిజిటల్ డిప్రెషన్‌కి గురిచేస్తాయన్నదీ అంతే నిజం. స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియాలను అతిగా వాడుతున్న యువతలో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని హెచ్చరిస్తున్నారు నిపుణులు. వాటిలో నిమగ్నమైపోయి గంటల తరబడి ఒంటరిగా గడపడం, అందం, ఫ్యాషన్లు తదితర విషయాల్లో ఇతరులతో పోల్చుకుని ఆత్మన్యూనతకు గురవడం, సైబర్ బుల్లీయింగ్ లాంటి సమస్యలు ఎదుర్కోనడం, నెగెటివ్ కామెంట్లను తట్టుకోలేకపోవడం... ఇలాంటివన్నీ కలిసి డిజిటల్ డిప్రెషన్‌కి దారితీస్తాయి. సాంకేతికత మనుషులను 'ఓన్లీ ఎ క్లిక్ ఎవే' అన్నంత దగ్గరగా చూపిస్తుంది. కానీ మనసుల మధ్య కొలవలేనంత దూరం ఉంటోంది. లక్షల ఫాలోవర్లున్నా ఒంటరితనం రాజ్యమేలుతోంది. ఇతరుల అందమైన ఫొటోలు, విజయాలు, విహారయాత్రలు, ఆనందంగా కనిపించే జీవితాలను చూసి ఈర్ష్య పెరిగిపోతోంది. ఫోన్ చూస్తూ తక్కువ సమయంలోనే విభిన్న భావోద్వేగాలకు గురవడం వల్ల డోపమైన్ పెరిగి సామాజిక మాధ్యమాల వాడకాన్ని వ్యసనంగా మార్చేస్తోంది. ఎప్పుడూ ఏదో కోల్పోయిన భావన, నిరాశ, విసుగు, ప్రతి చిన్న విషయానికీ ఆందోళన, కొద్దిపాటి పనికే ఒత్తిడికి గురికావడం... ఇవీ డిజిటల్ డిప్రెషన్ లక్షణాలు. ఇది మానసిక సమస్య మాత్రమే కాదు, శారీరక ఆరోగ్యానికీ రోజుకు 12 సిగరెట్లు తాగినంత హాని కలిగిస్తుందని, అకాల మరణాల ముప్పును తీవ్రంగా పెంచుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

ఈ సమస్య మరింతగా పెరిగే ప్రమాదాన్ని నివారించాలంటే- పెద్దలు ముందు తమను తాము పిల్లలకు ఆదర్శంగా ఉండేలా మలచుకోవాలి. ఫ్యామిలీ టైమ్‌కి ప్రాధాన్యమివ్వాలి. పిల్లల్ని చదువులో, ఆటపాటల్లో నిమగ్నం చేయాలి. పుస్తకం చదవడం, డైరీ రాయడం లాంటి అలవాట్లు నేర్పాలి. సోషల్‌లైఫ్‌కి ప్రాధాన్యమిస్తే ఆటోమేటిగ్గా పిల్లలూ దాన్ని అనుసరిస్తారు.

– మైలారపు అరవింద్



ఫార్మా వెలుగులు

భారత్‌లో తయారవుతున్న ఔషధాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఔషధాల ఉత్పత్తి పరిమాణం పరంగా ఇండియా నేడు ప్రపంచంలోనే మూడో స్థానంలో, వాటి విలువ పరంగా పద్నాలుగో స్థానంలో నిలుస్తోంది. మూడు వేలకు పైగా సంస్థలు, పది వేలకు మించి తయారీ కేంద్రాలు మన దగ్గర మందుల తయారీలో నిమగ్నమయ్యాయి. 60 రకాల చికిత్సలకు సంబంధించి అరవై వేల జనరిక్ బ్రాండ్లు తయారవుతున్నాయి. మన ఔషధాలు రెండు వందలకు పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఆయా ఆర్థిక సంవత్సరాల్లో దేశీయ ఫార్మా ఎగుమతుల పరిమాణం (లక్షల మెట్రిక్ టన్నుల్లో), విలువ (లక్షల కోట్ల రూపాయల్లో)...

సంవత్సరం	పరిమాణం	విలువ
2020–21	6.42	1.74
2021–22	10.72	1.74
2022–23	10.55	1.94
2023–24	12.24	2.19
2024–25	12.40	2.45

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

సర్‌తో సమస్య ఎక్కడ వస్తోంది?



గతంలో 2002-03లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ (సర్) కార్యక్రమం ఎలాంటి హడావుడి లేకుండా జరిగిపోయింది. 2025-26 'సర్' మాత్రం బాగా చర్చనీయాంశమవుతోంది. దాని విధివిధానాలపై ప్రజల్లోనూ అనేక సందేహాలు నెలకొన్నాయి. త్వరలో తెలంగాణలోనూ 'సర్'ను నిర్వహిస్తామని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటికే ఓటరు జాబితాల సవరణ కసరత్తు జరుగుతున్న రాష్ట్రాల్లో పరిస్థితిని తరచిచూడటం అవసరం.

ప్రస్తుత ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ (ఎస్ఐఆర్-సర్) పత్రంలో ప్రతి ఓటరు వ్యక్తిగత వివరాలను నింపాలి. పుట్టిన తేదీని, ఆధార్ కార్డు సంఖ్యను (తప్పనిసరి కాదు), తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి పేర్లను, ఓటరు కార్డు గుర్తింపు సంఖ్య ఉంటే దానినీ ఇవ్వాలి. అంతవరకు బాగానే ఉంది. ఎస్ఐఆర్ పత్రంలో దిగువ (రెండో) భాగంతోనే పేచీ వస్తోంది. అందులో ప్రతి ఓటరు తమ కుటుంబం గత 23 ఏళ్లుగా భారతదేశంలోనే నివసిస్తున్నట్లు ధ్రువీకరించే వివరాలను ఇవ్వాల్సి ఉంటుంది. ఓటర్లు ఈ దేశ పౌరులేనని నిర్ధారించడానికి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణమిది. ఈ వివరాలను ఇవ్వనివారి పేర్లను ఓటరు జాబితాల నుంచి కొట్టేసే ప్రమాదం ఉంది. అయితే ఈ మాటను అధికారికంగా బయటకు చెప్పకపోవడం వేరే సంగతి!


పాత వివరాలు వెతకడమెలా?

తాజా ఎస్ఐఆర్ దరఖాస్తు పత్రం దిగువ భాగంలో 2003నాటి ఎస్ఐఆర్ పత్రంలో ప్రచురితమైన ఓటరు వ్యక్తిగత వివరాలను కానీ, అతడు లేదా ఆమె తాతతండ్రుల పేర్లను కానీ ఇవ్వాలి. 2003నాటి ఓటరు జాబితాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఉంచారు. ఏ ఓటరుకైనా 2003 జాబితాలోని తన అసెంబ్లీ నియోజకవర్గం కానీ, పోలింగ్ బూత్ కానీ స్పష్టంగా తెలియకపోతే చిక్కులో పడినట్లే. తల్లిదండ్రులు, తాతానాయనమ్మల పేర్లను వెబ్‌సైట్‌లో వెతకడం కష్టం. అవి పీడీఎఫ్ రూపంలో, ప్రాంతీయ భాషలో ఉండటమే దీనికి కారణం. ఉదాహరణకు ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇలాంటి వివరాలు హిందీ భాషలో పీడీఎఫ్ రూపంలో ఉన్నాయి. ఓటరు దీర్ఘకాలంగా ఒకేచోట నివసిస్తున్నా, నియోజక వర్గం, పోలింగ్ కేంద్రం మారిపోయి ఉండవచ్చు. సర్ ఫారం ఎగువన స్థానిక బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌వోల) ఫోన్ నంబర్లు ఇవ్వడం కొంత నయమని చెప్పాలి. అయితే, ఓటరు వారికి ఫోన్ చేసి బూత్ గురించి తెలుసుకోవాలనుకున్నా, ఆ సమయంలో బీఎల్‌వోలు వేరే పనుల్లో ఉండి ఫోన్ ఎత్తలేకపోవచ్చు. అంతకన్నా పై అధికారుల పరిస్థితి కూడా అలాగే ఉండవచ్చు. కొంతమంది బీఎల్‌వోలు, ముఖ్యంగా గ్రామాల్లోని వారు 'సర్' పత్రంలో మొదటి (ఎగువ) భాగాన్ని నింపి ఇచ్చేయాలని ఓటర్లకు సూచిస్తున్నారు. రెండో(దిగువ) భాగంలోని వివరాలను వారే భర్తీ చేస్తున్నారు. ఒకవేళ బీఎల్‌వోలు ఫారం దిగువ భాగాన్ని నింపలేకపోతే పత్రం సగం ఖాళీగా మిగిలిపోతుంది. ఖాళీ పత్రాలను సమర్పించిన తరవాత ఓటరుకు 2003నాటి వివరాలు, ముఖ్యంగా తాతతండ్రుల వివరాలు తెలిసివస్తే, వాటిని స్వీకరించడానికి తమకు అధికారం లేదంటూ బీఎల్‌వోలు నిరాకరిస్తున్నారు.

గడువులోగా పని పూర్తిచేయాలని పైవాళ్ల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక కొందరు బీఎల్‌వోలు తమకు తోచిన వివరాలతో ఫారాలను నింపేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి ఓటర్ల పేర్లు గడువు తేదీకల్లా ప్రచురితమయ్యే తొలి జాబితాలో లేకపోతే, కొత్త ఓటరుగా రిజిస్టరు కావడానికి ఆరో నంబర్ ఫారాన్ని సమర్పించాల్సి వస్తుంది. కొంతమంది ఓటర్ల పేర్లు, వారి తాతతండ్రుల పేర్లు 2003 ఓటర్ల జాబితాలో ఉన్నప్పటికీ ప్రస్తుత జాబితాలలో లేకపోవడంతో ఎస్ఐఆర్ ఫారాన్ని పొందలేకపోతున్నారు. వీరి పేర్లను ఉద్దేశపూర్వకంగా కానీ, కాకతాళీయంగా కానీ జాబితా నుంచి తొలగించి ఉండవచ్చు. ఇలాంటివారు కూడా కొత్త ఓటర్లుగా ఆరో నంబర్ ఫారాన్ని సమర్పించాల్సి వస్తోంది.

అభ్యంతరాలు ఎదురైతే పరిస్థితేంటి?

లఖ్‌నవూలోని అక్బర్ నగర్‌లో నిరుడు ఇళ్ల కూల్చివేతకు గురైనవారికి నగరంలోని వసంత్‌కుంజ్‌లో ప్రధానమంత్రి పట్టణ ఈడబ్ల్యూఎస్ గృహ వసతి కోటాలో ఇళ్లు కేటాయించారు. దీంతో వారి అసెంబ్లీ నియోజకవర్గాలు మారిపోయాయి. మొదటి జాబితా విడుదలైన తరవాత కొత్త ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ఈ ఓటర్లను ఆదేశించారు. అయితే, ఒకేసారి పెద్ద సంఖ్యలో ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవడం వల్ల అభ్యంతరాలు ఎదురయ్యే అవకాశం లేకపోలేదు. వారి పేర్లతోపాటు తాతతండ్రుల వివరాలు 2003నాటి ఓటరు జాబితాలో ఉన్నా ఇబ్బందులు తప్పకపోవచ్చు. ఇలాంటి చిక్కుముళ్లతోనే ప్రస్తుతం పలు రాష్ట్రాల్లో 'సర్' కార్యక్రమాలు వివాదాలు రాజేస్తున్నాయి. నిర్దిష్టంగా సమాచారం అందిస్తూ ప్రజల భయాందోళనలను ఉపశమింపజేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలి.



సందీప్ పాండే
సామాజిక ఉద్యమకారులు, విశ్లేషకులు

స్నేహమంటే...

ఒక అడవిలో ఒక ఎలుక, కుందేలు స్నేహంగా ఉండేవి. ఆహారం దొరికితే ఎంచక్కా రెండూ పంచుకుని తినేవి. కొన్నిసార్లు వాటి స్నేహాన్ని చూసి ఇతర జంతువులు అసూయ పడేవి. కుందేలుకు ఒక బుజ్జి పిల్ల ఉండేది. దాన్ని చాలా గారాబంగా చూసుకునేది. ఒకరోజు ఆ కుందేలు పిల్ల తప్పిపోయింది. ఎంత వెతికినా దొరకలేదు. ఏం చేయాలో తోచక తల్లి కుందేలు ఏడుస్తూనే ఉంది. చుట్టుపక్కల ఉండే జంతువులన్నీ దాని దగ్గరికి వచ్చి ఓదార్చసాగాయి. కానీ ఎలుక మాత్రం లేదు. అది కుందేలుకు ఇంకా బాధ కలిగించింది. దానికి తోడు అక్కడికి వచ్చిన జంతువులన్నీ.. 'ఆహారం పంచుకోవడానికి ముందున్న ఎలుక, నువ్వు బాధలో ఉన్నప్పుడు మాత్రం వదిలేసి వెళ్లిపోయింది. ఇదేం స్నేహం' అన్నాయి. దాంతో ఇంకా ఎక్కువగా



ఏడవసాగింది కుందేలు. అలా ఒకరోజు గడిచింది. అకస్మాత్తుగా కుందేలు పిల్లని తీసుకుని ఎలుక కూడా వచ్చింది. దాన్ని చూసి ఎడాపెడా తిట్టేసింది కుందేలు. అప్పుడు పిల్ల కుందేలు.. 'అమ్మా! నువ్వు పొరబడుతున్నావు. ఏవైనా పండ్లు దొరుకుతాయేమోనని అలా వెళ్లాను. దారి తెలియక ఒక వలలో చిక్కుకున్నాను. అటువైపే వచ్చిన ఎలుక మామ నన్ను చూసింది. నాతోనే ఉండి.. వలను కొరికి నన్ను కాపాడింది. నాకు తినడానికి ఆహారం కూడా పెట్టింది' అంది. 'అయినా నాకు ఒకసారి వచ్చి చెబితే ధైర్యంగా ఉంటాను కదా!' అంది కుందేలు. 'నీ దగ్గరికి వచ్చే సమయంలో ఇంకొన్ని తాళ్లు కొరకొచ్చు కదా! ఒకవేళ ఆలోపు వేటగాడు వస్తే?' అంది పిల్ల కుందేలు. 'ఓదార్పు కంటే.. సాయమే ముఖ్యం. ఎలుక చేసింది కూడా అదే' అంది అక్కడే ఉన్న నక్క. 'విషయం పూర్తిగా తెలుసుకోకుండా ఈ జంతువులన్నీ మాట్లాడిన మాటలు విని నేనూ నిన్ను అపార్థం చేసుకున్నాను. నన్ను క్షమించు మిత్రమా! నా బిడ్డని రక్షించినందుకు ధన్యవాదాలు' అంది కుందేలు.

– ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి

హాయ్! బుజ్జీ!!

ఆ ఒక్కటి ఏది?

ఇక్కడ ఇచ్చిన వాటిలో ఒకటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి చూద్దాం.

1. ఫోన్, కంప్యూటర్, పువ్వు, రిమోట్
2. ఆవు, కుర్చీ, పిల్లి, కుక్క
3. ఆపిల్, పెన్సిల్, పెన్ను, పేపర్
4. ముక్కు, చెవి, కళ్లు, స్కూల్

జవాబు: 1. పువ్వు 2. కుర్చీ 3. ఆపిల్ 4. స్కూల్

తిరుపతిలో ఉదయమే టోకెన్ల జారీ!

రద్దీ కష్టాల నుంచి కాస్త ఉపశమనం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం వచ్చిన సర్వదర్శన భక్తుల కష్టాలు శుక్రవారం కాస్త తగ్గుముఖం పట్టాయి. వారాంతం రద్దీ నేపథ్యంలో తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద టోకెన్ల కోసం పెద్ద ఎత్తున భక్తులు నిరీక్షించాల్సి వస్తోంది. ఏడాదిలో లంగా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో టోకెన్లు ఇస్తున్నారు. గతంలో అర్ధరాత్రి తరువాత ఇచ్చేవారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని మూడు రోజులుగా ఉదయం పది గంటల నుంచే ఇవ్వడం మొదలుపెట్టారు. దీంతో కోటా పూర్తయిన వెంటనే మిగిలినవారు తిరుమల వైకుంఠం-2కు చేరుకుంటున్నారు. శుక్రవారం గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉదయం 7.30 గంటలకే టోకెన్ల పంపిణీ ప్రారంభించారు. 13 వేల టోకెన్లు మూడు గంటల్లోనే పూర్తికావడంతో మిగిలిన భక్తులు నేరుగా తిరుమలకు ప్రయాణమవుతున్నారు. రానున్న రోజుల్లో ఇదే విధానం అనుసరించాలని పలువురు అభిప్రాయపడ్డారు.

తితిదేలో అన్యమత ఉద్యోగులకు వీఆర్ఎస్

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదేలో 33 మంది అన్యమత ఉద్యోగులను వీఆర్ఎస్‌పై పంపేందుకు వీలుగా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల బోర్డు చేసిన తీర్మానం మేరకు రానున్న పదిరోజుల్లో అంగీకార పత్రాలు సమర్పించాలని స్పష్టం చేశారు. ఉద్యోగంలో చేరినప్పుడు వారు తాము అన్యమతస్థులమని ప్రమాణీకరించారు. తొమ్మిదిమంది ఇప్పటికే ఉద్యోగ విరమణ చేయగా మిగిలిన 33 మంది వీఆర్ఎస్ తీసుకోవాలి. వారిలో 24 మందికి పింఛను సౌకర్యం ఉండగా మరో తొమ్మిది మందికి లేదు. ఉద్యోగాల్లో చేరేటప్పుడు హిందువులుగా పేర్కొంటూ తర్వాత అన్యమత ప్రార్థనలకు వెళ్తున్నవారు తితిదేలో పెద్దసంఖ్యలో ఉన్నట్లు సమాచారం. ఇటీవల ముగ్గురు ఉద్యోగులు ఆధారాలతో దొరికిపోవడంతో వారిపై వేటు వేశారు. ఇలాగే వెళ్తున్న మరో 125 మంది వివరాలను తితిదే సేకరించినట్లు సమాచారం.

చెన్నై- కోల్‌కతా హైవేతో
అమరావతి అనుసంధానం

యర్రబాలెం నుంచి డీజీపీ కార్యాలయం వరకు ఇ-13 రోడ్డు పొడిగింపు

మంగళగిరి ఎయిమ్స్ సమీపంలో కొండ మీదుగా ఘాట్ రోడ్డు

- చురుగ్గా నిర్మాణ పనులు
- ఏడాదిలో పూర్తి చేయాలని లక్ష్యం



మంగళగిరి ఎయిమ్స్ సమీపంలో రోడ్డు నిర్మాణం కోసం చదును చేస్తున్న కొండ

ఈనాడు - అమరావతి : రాజధాని అమరావతిని యర్రబాలెం నుంచి చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారితో (ఎన్‌హెచ్-16) అనుసంధానించే ఇ-13 రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాజధాని మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా నెక్కల్లు నుంచి యర్రబాలెం వరకు ప్రతిపాదించిన ఇ-13 రహదారిని ఇప్పుడు ఎన్‌హెచ్-16 వరకు పొడిగిస్తున్నారు. ఇది విజయవాడ- మంగళగిరి మధ్య డీజీపీ కార్యాలయం సమీపంలో ఎన్‌హెచ్-16తో కలుస్తుంది. యర్రబాలెం నుంచి నుంచి ఎన్‌హెచ్-16 వరకు సుమారు 3.54 కి.మీ. ఈ రహదారి మార్గంలో కొండలు ఉన్నాయి. సుమారు కిలోమీటరు పొడవున కొండలపై ఘాట్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ రహదారి నిర్మాణం కొంత దూరం ఎలివేటెడ్ కారిడార్, ఆ తర్వాత కొంత దూరం కొండపై రహదారి, మళ్లీ కొంత దూరం ఎలివేటెడ్ కారిడార్, మళ్లీ కొంత దూరం కొండ పైన, ఆ తర్వాత ఫ్లైఓవర్, చివర్లో ట్రంపెట్ ఇలా సాగుతుంది. రహదారి నిర్మాణానికి మంగళగిరి ఎయిమ్స్ సమీపంలోని కొండను చదును చేయడం వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రాజధానిలోని నెక్కల్లు నుంచి ఎన్‌హెచ్-16 వరకు 11 కి.మీ.

- రాజధాని మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఇ-13 రహదారిని నెక్కల్లు నుంచి యర్రబాలెం వరకు 7.5 కి.మీ. దూరం నిర్మిస్తున్నారు. ఇది ఆరు వరుసల రహదారి.
- 2024లో రాజధాని పనుల్ని పునఃప్రారంభించాక అమరావతిని బయటి ప్రాంతాలతో అనుసంధానించేందుకు కొన్ని రహదారుల్ని పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానిలో భాగంగా ఇ-13 రహదారిని యర్రబాలెం నుంచి ఎన్‌హెచ్-16 వరకు పొడిగిస్తున్నారు. ఈ దూరం సుమారు 3.54 కి.మీ. దీన్ని కూడా ఆరు వరుసలుగా నిర్మిస్తున్నారు.
- మధ్యలో కొంత అటవీ భూమి ఉండటంతో రోడ్డు నిర్మాణానికి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు తీసుకున్నారు.
- రూ.384 కోట్ల అంచనా వ్యయంతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఏడాదిలో పూర్తి చేయాలన్నది లక్ష్యం.

ఇలా నిర్మిస్తారు..

- ▼ యర్రబాలెం నుంచి ఎన్‌హెచ్-16 వరకు 3.54 కి.మీ. పొడవున రోడ్డు నిర్మాణానికి లీ కన్సల్టెన్సీ సంస్థ డీపీఆర్, ఇంజినీరింగ్ డిజైన్లు రూపొందించింది. మధ్యలో కొండల మీదుగా ఘాట్ రోడ్డు నిర్మించాల్సి రావడం, చివర్లో జాతీయ రహదారితో అనుసంధానించేందుకు ట్రంపెట్ నిర్మిస్తుండటంతో ఈ రోడ్డు డిజైన్ ఆసక్తి రేకెత్తిస్తోంది.
- ▼ ఆ డిజైన్ ప్రకారం యర్రబాలెం నుంచి మొదట 400 మీటర్ల దూరం కింది నుంచి పైకి ఏటవాలుగా రహదారి నిర్మిస్తారు. అక్కడి నుంచి 960 మీటర్ల దూరం స్తంభాలపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. ఆ తర్వాత రైల్వే లైన్‌పై 76 మీటర్ల పొడవైన రైల్ ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) వస్తుంది. అది దాటాక మళ్లీ 405 మీటర్ల పొడవైన ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. అక్కడి నుంచి 741 మీటర్ల పొడవున కొండపై ఘాట్‌రోడ్డు నిర్మిస్తారు.
- ▼ ఆ తర్వాత కొంత లోయ భాగం, తర్వాత మళ్లీ కొండ ఉండటంతో.. లోయ భాగంలో 560 మీటర్ల పొడవైన ఎలివేటెడ్ కారిడార్, ఆ తర్వాత మళ్లీ కొండపై 230 మీటర్ల పొడవైన ఘాట్ రోడ్డు నిర్మిస్తారు. అక్కడి నుంచి జాతీయ రహదారి వరకు 360 మీటర్ల పొడవున ఏటవాలుగా రోడ్డు నిర్మిస్తారు. జాతీయ రహదారిని క్రాస్ చేసేందుకు 5.5 మీటర్ల ఎత్తున ఫ్లైఓవర్, దాని చివర ట్రంపెట్ నిర్మిస్తారు.
- ▼ గుంటూరు నుంచి అమరావతిలోకి, అమరావతి నుంచి విజయవాడ వైపు వెళ్లేవారు సర్వీసు రహదారుల మీదుగా జాతీయ రహదారిపైకి చేరుకునేలా.. అమరావతి నుంచి గుంటూరు వైపు, విజయవాడ నుంచి అమరావతిలోకి వెళ్లేవారు ట్రంపెట్ మీదుగా వెళ్లేలా డిజైన్ రూపొందించారు.

రైతులకు దన్నుగా.. అద్దెకు సాగుకు పరికరాలు

- తొలి విడతగా 300 చోట్ల కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటు
- ఒక్కో సీహెచ్‌సీకి రూ.20 లక్షల చొప్పున విడుదల



ఈనాడు, అమరావతి: అన్నదాతలకు అండగా నిలిచేలా కూటమి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. వ్యవసాయం, ఉద్యాన పంటలను సాగు చేసే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గేలా సాగుకు అవసరమైన పరికరాలను అద్దెకు ఇచ్చేందుకు కస్టమ్ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ)ను అందుబాటులోకి తీసుకురానుంది. డ్వాక్రా మహిళా రైతులతో (వారి కుటుంబ సభ్యులు)కూడిన ఎఫ్‌పీవోల ఆధ్వర్యంలో ఇవి పనిచేస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా 520 ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్లు (ఎఫ్‌పీవో) ఉండగా వాటి పరిధిలో తొలి విడతగా 300 సీహెచ్‌సీలను ఏర్పాటు చేయనున్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఇవి అందుబాటులోకి రానున్నాయి. వ్యవసాయం, ఉద్యాన, పశుసంవర్ధకశాఖ సహకారంతో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు.

సీహెచ్‌సీల నిర్వహణకు రూ.60 కోట్లు...

సీహెచ్‌సీల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం రూ.60 కోట్లు కేటాయించింది. జాతీయ జీవనోపాధుల కార్యక్రమం కింద ఈ నిధులను మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఈ కేంద్రాలను నిర్వహిస్తారు. సీహెచ్‌సీల ఏర్పాటుకు ఒక్కో ఎఫ్‌పీవోకు రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది.

సీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచే పరికరాలు...

డ్రోన్లు, ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, మినీ ట్రక్కులు, భూసార పరీక్షలు చేసే పరికరాలు, మినీ రైస్ మిల్లు, ప్రాసెసింగ్ ప్లాంట్, ఇతర పరికరాలు

రైతులకు స్థానికంగా అవసరమయ్యే పరికరాలే....

- రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో ఎఫ్‌పీవో పరిధిలో 1500 నుంచి 2 వేల మంది సన్నచిన్నకారు రైతులు సభ్యులుగా ఉన్నారు. ఇవి మండలానికి ఒకటి చొప్పున ఉన్నాయి.
- రైతులకు స్థానికంగా అవసరమయ్యే పరికరాలను కొని సీహెచ్‌సీల్లో ఉంచుతారు.
- రైతులకు ఈ పరికరాలను బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకు అద్దెకిస్తారు.
- సీహెచ్‌సీల నిర్వహణను ఎఫ్‌పీవోనే చూస్తుంది. వచ్చిన ఆదాయాన్ని తిరిగి వాటి నిర్వహణకే వెచ్చిస్తారు.



బిందెల నిండా పాలు నీకు గుండెల నిండా నీవే మాకు!

సముద్రం సునామీలా విరుచుకుపడి డిసెంబరు 26తో 21 ఏళ్లయ్యాయి. ఆనాటి అలల అలజడి కలలోనైనా రావద్దని తీరంలోని మత్స్యకారులు శుక్రవారం గంగమ్మ తల్లిని వేడుకున్నారు. సముద్రం ఎప్పుడూ ప్రశాంతంగా ఉండాలని పసుపు నీళ్లు, పాలు సమర్పించారు. విశాఖ పెదజాలరిపేట తీరంలో ఉదయం మత్స్యకార మహిళలు పసుపు నీళ్ల బిందెలతో ఊరేగింపుగా తీరానికి వెళ్లారు. అక్కడ ఇసుకలో శివలింగాలు చేసి పసుపు, కుంకుమలతో పూజించారు. అనంతరం బిందెల్లో తెచ్చిన పసుపు నీళ్లు, పాలు సముద్రంలో కలిపారు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం (పెదవాల్తేరు)

రాష్ట్రంలో తొలిసారి మన్యం జిల్లాలో

ఉత్సాహంగా గోబాల సంబరాలు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు పాడిపై అవగాహన పెంచుకోవాలని, రైతులు పశుపోషణతో అదనపు ఆదాయం పొందాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి సూచించారు. మండలంలోని ఎమ్మార్‌నగరం పశు వైద్యశాల వద్ద శుక్రవారం ఆయన 'గోబాల' సంబరాలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోనే తొలిసారిగా మన్యం జిల్లాలో ఈ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. దూడలు, పశువులపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు పశుపోషణతో అదనపు ఆదాయం పొందొచ్చని గ్రామాల్లోని రైతులు, మహిళలకు చైతన్యం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. శిబిరంలో వివిధ ప్రాంతాల రైతులు 162 దూడలను ప్రదర్శించారు. వాటిని బాగా పెంచిన పలువురు రైతులకు, వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మెగా పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.



దూడను పట్టుకున్న విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

వంగవీటి రంగా వారసత్వాన్ని నిలబెట్టాలి

- ఎంపీ ఆర్.కృష్ణయ్య

విశాఖపట్నం (తాటిచెట్లపాలెం), న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాల కోసం పాటుపడిన వంగవీటి రంగా వారసత్వాన్ని నిలబెట్టేందుకు ఆయన కుమార్తె ఆశాకిరణ్ రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని రాజ్యసభ సభ్యుడు, బీసీ నేత ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. రంగా వర్ధంతి సందర్భంగా రాధా రంగా రాయల్ సంఘం అధ్యక్షుడు గాదె బాలాజీ అధ్యక్షతన విశాఖలోని పోర్టు ఆసుపత్రి సమీపంలో 'రంగానాడు' బహిరంగ సభ నిర్వహించారు. కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాపుల అభివృద్ధి రాజకీయ ప్రాతినిధ్యంతోనే సాధ్యమన్నారు. బీసీల పిల్లలు బాగా చదువుకొని అభివృద్ధిలోకి రావాలని, ఇందుకోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యకు ఆర్థిక సాయం వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రంగా కుమార్తె ఆశాకిరణ్ మాట్లాడుతూ తన తండ్రి పేదల కోసం జీవించారని.. వారి కోసమే ప్రాణత్యాగం చేశారన్నారు. ఆయన వారసత్వాన్ని కొనసాగించేందుకు ప్రజల్లోకి వస్తున్నానని.. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి బీసీలు, విద్యార్థులను కలిసి రాధా రంగా మిత్రమండలిని మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో తన తండ్రి ఫొటో పెట్టుకొని గెలిచిన నాయకులు తమకేం న్యాయం చేశారని, జిల్లాకు తమ నాయకుడి పేరు ఎప్పుడు పెడతారని ప్రశ్నించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ పేదల పెన్నిధి వంగవీటి రంగాకు నివాళి అర్పించడం తనకెంతో గౌరవంగా ఉందన్నారు. రంగా సోదరుడి కుమారుడు శంతనుకుమార్ మాట్లాడుతూ రంగా అందరి హృదయాల్లో బతికే ఉన్నారన్నారు. తెలంగాణ మున్నూరు కాపు అధ్యక్షుడు కొండా దేవయ్య మాట్లాడుతూ రంగా బీసీల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న వంగవీటి రంగా కుమార్తె ఆశాకిరణ్, వేదికపై ఎంపీ ఆర్.కృష్ణయ్య, తదితరులు

కునుకు.. ఐదుగురిని బలితీసుకుంది

- డివైడర్‌ను దాటి బస్సును ఢీకొట్టిన కారు
- నంద్యాల జిల్లాలో దుర్ఘటన

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: విశ్రాంతి తీసుకోకుండా సాగిస్తున్న కారు ప్రయాణం ఐదుగురిని బలి తీసుకుంది. ఈ దుర్ఘటన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామం వద్ద 40వ జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని నిజాంపేట ప్రాంతానికి చెందిన కులకర్ణి గుండెరావు క్యాటరింగ్ చేస్తుంటారు. బస్సుల్లో విహార, తీర్థయాత్రలకు వెళ్లే వారితో ఒప్పందం చేసుకుని వారి వెంట మరో వాహనంలో వెళ్లి భోజనాలు తయారు చేస్తుంటారు. గుండెరావు మరో ఐదుగురు బృందంగా ఏర్పడి వెళ్తారు. ఇలా 15 రోజుల కిందట వెళ్లిన వీరు తిరుపతిలో పని ముగించుకుని, వేంకటేశ్వరస్వామి దర్శనం అనంతరం కారులో సొంతూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో నల్లగట్ల గ్రామం దాటగానే తెల్లవారుజామున 2.05 గంటల సమయంలో డ్రైవింగ్ చేస్తున్న శివసాయి కునుకు తీయడంతో వాహనం అదుపు తప్పింది. డివైడర్‌ను ఢీకొట్టి అవతలి రోడ్డుపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని కులకర్ణి గుండెరావు (46), సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ గ్రామానికి చెందిన ఇటికాడి నరసింహ(30), హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన శ్రవణ్(21), కర్ణాటకలోని బీదర్‌కు చెందిన సిద్ధప్ప (50) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడి నంద్యాలలో చికిత్స పొందుతున్న గుండెరావు కుమారులు శివసాయి, సిద్ధార్థలలో శుక్రవారం సాయంత్రం సిద్ధార్థ(20) చనిపోయారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ముఖం కడుక్కోమంటే వినలేదు..

చాగలమర్రి మండలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద వాహన డ్రైవర్లకు నిద్రమత్తు తొలగించేందుకు 'ఫేస్ వాష్' చేపడుతున్నారు. వాహనాలు నిలిపి డ్రైవర్లు ముఖం కడుక్కోవాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. గుండెరావు బృందం వాహనాన్ని కూడా ఫేస్‌వాష్ చేసుకోవాలని సూచించారు. కానీ వారు వినకుండా అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు.

అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠా అరెస్టు

- 'సిమ్ బాక్స్'తో ఇంటర్నేషనల్ ఫోన్‌కాల్స్ రూటింగ్
- ఏపీలో రూ.20 కోట్లు కొల్లగొట్టిన ముఠా
- వివరాలు వెల్లడించిన సైబర్ నేరాల ఎస్పీ

ఈనాడు, అమరావతి: దక్షిణాసియాలోని వియత్నాం, మయన్మార్, కంబోడియా, లావోస్, థాయిలాండ్, మలేషియా తదితర దేశాల్లో కాల్‌సెంటర్‌లు ఏర్పాటు చేసుకుని భారతదేశ ప్రజలే లక్ష్యంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఓ అంతర్జాతీయ ముఠా గుట్టు రట్టయ్యింది. 'సిమ్ బాక్స్' అనే ప్రత్యేక పరికరం ద్వారా ఇంటర్నేషనల్ ఫోన్ కాల్స్‌ను...లోకల్ కాల్స్‌గా మార్చి ఈ ముఠా సైబర్ మోసాలు చేస్తున్నట్లు వెల్లడైంది. ఆంధ్రప్రదేశ్ సీఐడీ సైబర్ నేరాల పోలీసుస్టేషన్‌లో నమోదైన ఓ కేసు దర్యాప్తులో భాగంగా గత నెల రోజులుగా పలు రాష్ట్రాల్లో దాడులు చేపట్టిన బృందాలు ఈ నేర నెట్‌వర్క్‌ను ఛేదించాయి. 20 మందిని నిందితులుగా గుర్తించి.. వియత్నాం దేశీయుడు సహా మొత్తం 14 మందిని అరెస్టు చేశాయి. వీరిలో విదేశీ సైబర్ ముఠాల తరఫున భారత్‌లో ఆపరేటర్లుగా పనిచేస్తున్నవారు, ఈ నేర కార్యకలాపాల కోసం సిమ్‌కార్డులు సరఫరా చేసిన వారు ఉన్నారు. వారి నుంచి పెద్ద ఎత్తున 'సిమ్ బాక్సులు', వేల సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా బారిన పడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 61 మంది బాధితులు మోసపోయినట్లు, వారు రూ.20 కోట్ల మేర సొత్తు పోగొట్టుకున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో సైబర్ నేరాల విభాగం ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, డీఎస్పీ రవికిరణ్, టెలికాం శాఖ డీడీజీ హేమంత్ రథ్వీలు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఈ వివరాలు వెల్లడించారు.

యాంప్లిఫయర్స్ ముసుగులో సిమ్‌బాక్స్‌లు దిగుమతి...

- వియత్నాం, మయన్మార్, కంబోడియా, లావోస్, థాయ్‌లాండ్, మలేషియా దేశాల్లో పాగా వేసిన అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠాలు..ఆయా దేశాల్లో వేల మందితో కాల్‌సెంటర్లను నడిపిస్తున్నాయి. అక్కడి నుంచి మన దేశంలోని లక్షల మందికి నిరంతరం ఫోన్‌కాల్స్ చేసి సైబర్ మోసాలకు పాల్పడుతున్నాయి. ఇలా రూ.వందల కోట్లల్లో దోచుకుంటున్నాయి. డిజిటల్ అరెస్టుల పేరిట బెదిరింపులు సహా అనేక నేరాలు చేస్తున్నాయి. తమ ఉనికి చిక్కకుండా..స్థానికులమేనని నమ్మించేందుకు ఇంటర్నేషనల్ ఫోన్‌కాల్స్‌ను లోకల్ కాల్స్‌గా కనిపించేలా చేస్తున్నాయి. దీని కోసం 'సిమ్‌బాక్స్' దందాకు తెరలేపాయి.
- పవర్ యాంప్లిఫయర్స్ ముసుగులో వేల సిమ్‌బాక్స్‌లను చైనా, ఇతర దక్షిణాసియా దేశాల నుంచి భారత్‌లోకి ఈ ముఠాలు పంపిస్తున్నాయి. మన దేశంలో సిమ్ బాక్సుల వినియోగం నిషేధం. అందుకే కస్టమ్స్ కళ్లుగప్పేందుకు బయట యాంప్లిఫయర్స్‌లా తయారు చేసి లోపల సిమ్ బాక్సులను అమరుస్తున్నాయి. వాటిని భారత్‌లోకి దిగుమతి చేసి లోకల్ ఆపరేటర్లకు చేరుస్తున్నాయి.
- విదేశాల్లోని సైబర్ నేరాల కాల్‌సెంటర్ల నుంచి మన దేశంలోని వారికి కాల్స్ చేసినప్పుడు.. వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్ (వీవోఐపీ)ను వినియోగించి సిమ్ బాక్స్‌లోకి పంపిస్తారు. దీని ద్వారా అంతర్జాతీయ కాల్స్ అన్నీ లోకల్ సిమ్ నుంచి బయటకు వెళ్తాయి. సైబర్ నేరగాళ్లు విదేశాల నుంచే కాల్స్ చేసినప్పటికీ మన దేశంలోని బాధితులకు అవి స్థానిక ఫోన్ నంబర్లలానే కనిపిస్తాయి. దీని వల్ల నేరాలకు పాల్పడిన వారి ఉనికి తెలీదు.
- విదేశాల్లో ఉద్యోగాలిస్తామని సామాజిక మాధ్యమాల ద్వారా పెద్ద ఎత్తున ప్రకటనలిచ్చి అమాయక యువతను ఉచ్చులోకి లాగుతున్నారు. వీరితోనే ఈ ఫోన్‌కాల్స్ చేయిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. సీఐడీ ఇప్పుడు ఈ ముఠానే అరెస్టు చేసింది.



సిమ్‌బాక్స్‌లు, ఇతర పరికరాలు చూపిస్తున్న సైబర్ నేరాల విభాగం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, డీఎస్పీ రవికిరణ్ తదితరులు

గాజువాకలో తీగ లాగితే..

- ✦ విశాఖపట్నంలోని గాజువాక-పెదగంట్యాడ ప్రాంతాల నుంచి అనుమానాస్పద కాలింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ టెలికమ్యూనికేషన్స్ శాఖకు (డీవోటీ) సంబంధించిన సంచార్ సాథీ పోర్టల్‌లో కొన్ని నెలల కిందట ఓ ఫిర్యాదు నమోదైంది. దీనిపై ప్రాథమిక విచారణ జరిపిన డీవోటీ ఇవన్నీ సిమ్ బాక్స్ ఆధారిత ఆపరేషన్లను గుర్తించి ఏపీ సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేసింది. కొరియర్ సర్వీసెస్ ద్వారా సిమ్‌బాక్సులను తెప్పించుకుని వాటిని సైబర్ మోసాల కోసం వినియోగిస్తున్నట్లు సీఐడీ దర్యాప్తులో గుర్తించింది. విశాఖపట్నం, హైదరాబాద్, రవుర్కెల (ఒడిశా), నలంద (బిహార్), అరంబోల్ (గోవా), కోల్‌కతా (పశ్చిమబెంగాల్)లోని స్థావరాలపై దాడులు చేసింది.
- ✦ వియత్నాం సహా మరో దేశం నుంచి ఇక్కడికి వచ్చి ఈ సిమ్ బాక్స్ కార్యకలాపాల నిర్వహణపై స్థానిక ఆపరేటర్లకు అవగాహన కల్పిస్తున్న ఇద్దర్ని అదుపులోకి తీసుకుంది. వీరికి భారీ మొత్తాల్లో సిమ్‌కార్డులు సమకూరుస్తున్న వారినీ అరెస్టు చేసింది. సిమ్ కార్డుల జారీ కోసం ఈ-కేవైసీ నమోదు చేసినప్పుడు వివరాలు సరిగ్గా పడలేదని చెప్పి మరో సిమ్‌ను ఈ ఏజెంట్లు తీసుకుంటున్నట్లు తేలింది.
- ✦ ఈ నేర నెట్‌వర్క్‌లో సిమ్ హ్యాండ్లర్లు, మనీ మ్యూల్స్ ఇలా అనేక మంది ప్రమేయం ఉంది.

ముఖం కడుక్కుందామని కారాపితే.. బస్సొచ్చి ఢీకొట్టింది

- ముగ్గురు దుర్మరణం.. ఐదుగురికి గాయాలు
- గుంటూరు సమీపంలో దుర్ఘటన

ఈనాడు, అమరావతి-గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ఆగి ఉన్న కారును వేగంగా దూసుకొచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొనడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన గుంటూరు సమీపంలోని అంకిరెడ్డిపాలెం వద్ద చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణలోని సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం మిడతలపల్లి గ్రామానికి చెందిన కంచనపల్లి మధు కుటుంబం కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటోంది. మధు తన ఇద్దరు కుమారులైన జ్ఞానేశ్వర్(4), వర్షిత్ (11 నెలలు)లకు తిరుమలలో తలనీలాలు సమర్పించేందుకని భార్య మనీషా, తల్లిదండ్రులు కంచనపల్లి వెంకటయ్య (62), సుశీల (55), మామయ్య నవిల మన్సూర్‌లతో కలిసి బంధువైన మహేష్ (28) కారులో మంగళవారం వెళ్లారు. మొక్కులు తీర్చుకుని గురువారం రాత్రి తిరుగుపయనమయ్యారు. శుక్రవారం వేకువజామున అంకిరెడ్డిపాలెం వద్దకు రాగానే డ్రైవర్ మహేష్ ముఖం కడుక్కునేందుకు జాతీయ రహదారి పక్కనే మార్జిన్‌లో కారు నిలిపారు. ఈ క్రమంలో చిలకలూరిపేట వైపు నుంచి విజయవాడ వైపు వేగంగా వచ్చిన వీఆర్‌సీఆర్ ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో కారును వెనుక నుంచి ఢీకొట్టింది. ఆ ధాటికి డ్రైవింగ్ సీటులో ఉన్న మహేష్, మధ్య సీటులోని వెంకటయ్య, సుశీల ప్రాణాలు కోల్పోయారు.



బస్సు ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన కారు

వట్లూరు రైతులకు పరిహారం చెల్లించాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: ఏలూరు జిల్లా వట్లూరులో రైతుల నుంచి తీసుకున్న 340 ఎకరాలకు పరిహారం ఇవ్వాలని, లేదంటే ఆ భూములను రైతులకే తిరిగి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. "వట్లూరులో భూములు కోల్పోయిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వెమ్ టెక్నాలజీ పరిశ్రమ ఏర్పాటు పేరుతో రైతుల నుంచి సేకరించిన భూములకు ఇప్పటివరకూ పరిహారం ఇవ్వలేదు. పరిశ్రమ నెలకొల్పలేదు. ఈ భూముల్లో అక్కడి రైతులు పదేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిశ్రమ ఏర్పాటుపై మళ్లీ చర్చ సాగుతోంది. పరిహారమైనా ఇవ్వాలని, లేదంటే భూములైనా తిరిగి ఇచ్చేయాలని రైతులు గగ్గోలు పెడుతున్నారు" అని ఈశ్వరయ్య తెలిపారు.



అత్యంత పొడవైన ఎక్స్‌ప్రెస్ వే సొరంగం

ప్రారంభించిన చైనా

బీజింగ్: ప్రపంచంలోకెల్లా అత్యంత పొడవైన ఎక్స్‌ప్రెస్ వే సొరంగాన్ని చైనా శుక్రవారం ప్రారంభించింది. 'తియాన్షన్ షెంగ్లీ'గా దానికి నామకరణం చేశారు. ఈ సొరంగం పొడవు 22.13 కిలోమీటర్లు. వాయవ్య చైనాలోని షింజియాంగ్ యూగర్ అటానమస్ రీజియన్‌లో సెంట్రల్ తియాన్షన్ పర్వతాల గుండా ఇది వెళ్తుంది. ఆ పర్వతాల్లో గంటల పాటు పట్టే ప్రయాణ సమయాన్ని తియాన్షన్ షెంగ్లీ సొరంగం 20 నిమిషాలకు తగ్గిస్తుంది. 324.7 కిలోమీటర్ల పొడవైన జీ0711 ఉరుమ్కీ-యులి ఎక్స్‌ప్రెస్ వేలో భాగంగా దీన్ని నిర్మించారు.

కొంగు బిగించారు.. కొత్తరోడ్డు వేశారు



ఈటీవీ భారత్: ఆ ఊరికి సరైన రోడ్డు సదుపాయం లేదు. వర్షాకాలంలో విద్యార్థులకు నిత్యం ఇబ్బందులే. ఇదే కారణంగా అంబులెన్స్ సర్వీసులు గ్రామంలోకి రావు. బస్సులు తిరగవు. ఈ సమస్యను పాలకులకు, అధికారులకు పలుమార్లు విన్నవించి విసిగిపోయిన గ్రామస్థులు ఇక తామే ఏదో ఒకటి చేయాలని నడుం బిగించారు. ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించిన మహిళలు శ్రమదానం చేసి ఒక్కరోజులో రోడ్డు సమస్యను పరిష్కరించుకున్నారు. ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లా బదకులేవిరా గ్రామ పంచాయతీ పరిధిలో ఘుమల్ నుంచి రంగమతియా గ్రామం వరకు ఇప్పుడు కొత్త రోడ్డు సిద్ధమైంది. 250కు పైగా కుటుంబాలు నివసిస్తున్న ఘుమల్ గ్రామంలో వెయ్యి మంది ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామస్థుల రోడ్డు సమస్య తాత్కాలికంగా తీరినా, తాగునీటి సంక్షోభం రూపంలో మరో సమస్య వారిని వెంటాడుతోంది. ఘుమల్ తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తామని బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారి దేబశిష్ పాండా తెలిపారు.

నైజీరియాలో ఐసిస్ లక్ష్యాలపై అమెరికా దాడి

క్రైస్తవుల ఊచకోతకు ప్రతీకారమన్న ట్రంప్

వెస్ట్‌పామ్ బీచ్ (యూఎస్): వాయవ్య నైజీరియాలోని ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐసిస్) లక్ష్యాలపై గురు, శుక్రవారాల్లో అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు కొనసాగిస్తున్న దమనకాండకు ప్రతీకారంగానే ఈ దాడికి తాను ఆదేశించానని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ప్రకటించారు. ఈ సందర్భంగా ఐసిస్‌కు తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. క్రైస్తవుల ఊచకోత ఆపకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని గతంలో తాను పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తన ఆదేశాలతోనే అమెరికా సైన్యం అత్యంత సమర్థంగా, కచ్చితత్వంతో దాడులను నిర్వహించిందని, పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను హతమార్చిందని ఆయన పేర్కొన్నారు.

సిక్కువీరుల పరాక్రమాన్ని మరువలేం

- మతమౌఢ్యాన్ని సాహసోపేతంగా అడ్డుకున్నారు
- వీరపుత్రులకు మోదీ నివాళి



రాష్ట్రీయ బాల పురస్కార గ్రహీతలతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

దిల్లీ: మొగల్ చక్రవర్తులు మతమౌఢ్యంతో క్రూరంగా వ్యవహరించి, ఇతర మతాల ఉనికిని సవాల్ విసిరిన సమయంలో వీరోచితంగా ఎదురుతిరిగి, ప్రాణాలర్పించిన సిక్కు బిడ్డల త్యాగాలను ఎప్పటికీ మరిచిపోలేమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మత పునాదుల్ని కదిలించేటంతగా భయభ్రాంతుల్ని చేయాలని చూసినా దాన్ని అడ్డుకోవడంలో సిక్కుల పదో గురువు గురు గోవింద్‌సింగ్ కుమారుల (సాహిబ్‌జాదే) శౌర్యపరాక్రమాలను దేశం మననం చేసుకుంటుందని పేర్కొన్నారు. దేశానికి గర్వకారణంగా నిలిచిన సాహిబ్‌జాదే బాబా జొరావర్‌సింగ్, బాబా ఫతేసింగ్‌ల బలిదానాలను స్మరించుకుంటూ శుక్రవారం నిర్వహించిన వీర్‌బాల్ దివస్‌లో ఆయన ప్రసంగించారు. "వయసు పరిమితులను, పరిస్థితులను అధిగమించి మొగలుల క్రూరత్వాన్ని ఎదుర్కొనేందుకు రాతి శిలలా సిక్కుబిడ్డలు నిలిచారు. ఎంతో వైభవోపేత గతమున్న దేశంలో, ఎంతో స్ఫూర్తి నింపే అలాంటి యువకులు ఉన్నప్పుడు ఇక మనం సాధించలేనిది ఏముంటుంది? సాహిబ్‌జాదేలు చిన్నవయసువారైనా ఔరంగజేబును ఎదిరించారు. ప్రజల్లో భయం నింపి, మతమార్పిళ్లను బలవంతంగా జరిపించాలంటే నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయాలని ఔరంగజేబుకు తెలుసు. అందుకే సాహిబ్‌జాదేలను లక్ష్యంగా చేసుకున్నాడు. మన గురువులు సామాన్యులు కారని మాత్రం ఔరంగజేబు తెలుసుకోలేకపోయాడు. త్యాగానికి, స్ఫూర్తికి వారు సజీవ తార్కాణాలు. సిక్కు గురువులు, వీరపుత్రులు చూపిన ధైర్యం, నమ్మిన సిద్ధాంతాలు మనందరిలో బలాన్ని నింపుతాయి. వీరు చేసింది కేవలం అధికారం కోసం పోరాటం కాదు.. మన విలువలను, మత పిచ్చికి మధ్య మర్యాద.. నిజాయతీకి, తప్పుడు ప్రచారానికి మధ్య పోరు" అని మోదీ చెప్పారు. జెన్ జడ్, జెన్ ఆల్ఫా యువత మనదేశాన్ని వికసిత భారత్‌గా మార్చగలదని చెప్పారు. వారిలో తొణికిసలాడే ఆత్మవిశ్వాసం, సత్తాను చూసి తనకెంతో నమ్మకం కలుగుతోందన్నారు. 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార' గ్రహీతలతో మోదీ ముచ్చటించారు.

ఫాసిస్టు శక్తులపై ఐక్య పోరాటం

- వామపక్ష పార్టీలకు సీపీఐ పిలుపు



సీపీఐ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కోల్‌కతాలో ఆ పార్టీ కార్యకర్తల ర్యాలీ

దిల్లీ: దేశాన్ని ఫాసిస్టు శక్తుల నుంచి రక్షించాల్సిన అవసరాన్ని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) నొక్కి చెప్పింది. దేశంలో వామపక్ష సమైక్యత సాధించాలని, సామ్యవాద భారతాన్ని నిర్మించాలని పార్టీ ప్రధాన కార్యదర్శి డి. రాజా పిలుపునిచ్చారు. పార్టీ ప్రధాన కార్యాలయమైన అజోయ్ భవన్‌లో జరిగిన 101వ వ్యవస్థాపక దినోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. రానున్న కాలంలో అనేక సవాళ్లు ఎదురవుతాయని, వాటన్నిటినీ అధిగమించి దేశాన్ని రక్షించడం కోసం సంఘర్షణను ఉధృతం చేయాలని ఆయన పేర్కొన్నారు. "మేం నిరంతరం వామపక్ష సమైక్యత కోసం పిలుపునిస్తూనే ఉన్నాం. మా పిలుపుపై ఇతర పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి" అని రాజా అన్నారు. "ఇలా ఎంత కాలం సాగుతుంది? వామపక్ష ఉద్యమం చీలిపోయింది. బ్రిటిష్ హయాంలో మనం సమష్టిగా పోరాడాం. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కమ్యూనిస్టులు ఎంతకాలం విడిపోయి ఉంటారు?'' అని ఆయన ప్రశ్నించారు. ఫాసిస్టులు రాజకీయ పక్షాలను విభజిస్తున్నారు అని ఆరోపించారు. మతతత్వ ఫాసిస్టు శక్తుల నుంచి దేశం ముప్పు ఎదుర్కొంటోందన్నారు.

ఎయిర్ ప్యూరిఫైయర్లపై జీఎస్టీని 5 శాతానికి ఎందుకు తగ్గించలేరు?

- కేంద్రాన్ని ప్రశ్నించిన దిల్లీ హైకోర్టు



దిల్లీ: దేశ రాజధాని దిల్లీ సహా చుట్టుపక్కల పలు ప్రాంతాల్లో గాలి నాణ్యత నానాటికీ క్షీణిస్తున్న నేపథ్యంలో.. ఎయిర్ ప్యూరిఫైయర్లపై ఇంకా 18% జీఎస్టీ కొనసాగుతుండటంపై దిల్లీ హైకోర్టు మరోసారి అసంతృప్తి వ్యక్తం చేసింది. సామాన్య ప్రజలు కూడా కొనుగోలు చేసేలా వాటిపై జీఎస్టీని 5%కు ఎందుకు తగ్గించలేరని కేంద్ర ప్రభుత్వాన్ని శుక్రవారం ప్రశ్నించింది. ఎయిర్ ప్యూరిఫయర్లను వైద్య పరికరాలుగా గుర్తించి, వాటిపై 5% మాత్రమే జీఎస్టీ విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై వివరణాత్మక స్పందన తెలియజేసేందుకు జస్టిస్ వికాస్ మహాజన్, జస్టిస్ వినోద్ కుమార్‌ల ధర్మాసనం కేంద్రానికి 10 రోజుల గడువిచ్చింది. తదుపరి విచారణను జనవరి 9కి వాయిదా వేసింది. "ఎయిర్ ప్యూరిఫైయర్ల ధరల శ్రేణి రూ.10,000-రూ.12,000 నుంచి మొదలై.. రూ.60 వేల వరకూ ఉంది. సామాన్య జనం వాటిని కొనలేరు. ఆ ధరలను సహేతుక స్థాయికి ఎందుకు తీసుకురాకూడదు?'' అని ధర్మాసనం ప్రశ్నించింది. అంతకుముందు కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్.వెంకటరామన్ వాదనలు వినిపించారు. ఎయిర్ ప్యూరిఫైయర్లపై పన్ను తగ్గింపు కోసం జీఎస్టీ మండలి సమావేశమవ్వాలంటూ హైకోర్టు బుధవారం చేసిన సూచనపై ఆయన స్పందించారు. ఆ మండలి రాజ్యాంగబద్ధంగా ఏర్పడిందని, జీఎస్టీ అనేది సమాఖ్య సుంకమని గుర్తుచేశారు. జీఎస్టీని తగ్గించాలంటే దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అంగీకారం తెలపాల్సి ఉంటుందన్నారు. దానిపై ఓటింగ్‌ను వీడియో కాన్ఫరెన్స్ విధానంలో నిర్వహించలేమని పేర్కొన్నారు. ఈ అంశంపై కేంద్రం తరఫున సవివరంగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేస్తామని చెప్పారు.



భోజనమయ్యాక 10 నిమిషాలు నడిస్తే..

భోజనం చేశాక కనీసం 10 నిమిషాల పాటు నడవడం అలవాటుగా చేసుకోండి. ఎందుకంటే ఆరోగ్యాన్ని అందించడంలో ఆ అలవాటు తోడ్పతుంది. ఎలాగంటే..

- ✦ రక్తంలో చక్కెర స్థాయిని 17 శాతం తగ్గిస్తుంది.
- ✦ ట్రైగ్లిజరైడ్లను 72 శాతం తగ్గిస్తుంది.
- ✦ రక్తపోటును 5 ఎంఎంహెచ్‌జీ మేర తగ్గిస్తుంది.
- ✦ సుఖనిద్ర పడుతుంది.

– బ్రియాన్ జాన్సన్, ఇన్‌ఫ్లుయెన్సర్

హెచ్-1బి వీసా ఇంటర్వ్యూల వాయిదాపై భారత్ ఆందోళన



దిల్లీ: హెచ్-1బి వీసాల కోసం దరఖాస్తు చేసుకున్న వేలమంది భారతీయులకు ఇప్పటికే నిర్ణయించిన ఇంటర్వ్యూలను అమెరికా వాయిదా వేయడంపై మన దేశం ఆందోళన వ్యక్తంచేసింది. ఈ అంశంపై అమెరికా వర్గాలతో చర్చిస్తున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. "ఈ నెల ద్వితీయార్థంలో జరగాల్సిన వీసా ఇంటర్వ్యూలను అర్ధంతరంగా అనేక నెలలపాటు వాయిదా వేశారు. దరఖాస్తుదారుల ఆన్‌లైన్ ప్రొఫైళ్లను, సామాజిక మాధ్యమాలను పరిశీలించాల్సి ఉందని చెప్పారు. గత వారం జరగాల్సిన ఇంటర్వ్యూలు ఏకంగా వచ్చే ఏడాది మే నెలకు వాయిదా పడినట్లు కొందరు దరఖాస్తుదారులకు ఈ-మెయిళ్లు వచ్చాయి. ఇలాంటి మార్పుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలియజేస్తూ ప్రభుత్వానికి పలువురు వినతులు సమర్పించారు. వీసాల అంశం దేశ సార్వభౌమ పరిధిలోనిది. అందుకే ఈ అంశాన్ని దిల్లీలో, వాషింగ్టన్ డీసీలో అమెరికా వర్గాల దృష్టికి తీసుకువెళ్లి, అభ్యంతరం తెలిపాం. ఇంటర్వ్యూల వాయిదాతో చాలామంది ప్రవాస భారతీయులు మన దేశంలో ఎక్కువకాలం నిలిచిపోవాల్సి వస్తోంది. దీనివల్ల వారు, వారి కుటుంబ సభ్యులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి కష్టాలను సాధ్యమైనంతగా తగ్గించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం" అని జయస్వాల్ వివరించారు.


సకాలంలో ఆస్తి వివరాలు ఇవ్వకపోతే చర్యలు

ఐఏఎస్‌లకు కేంద్రం హెచ్చరిక

దిల్లీ: ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసు (ఐఏఎస్) అధికారులందరూ సకాలంలో తమ ఆస్తుల వివరాలు సమర్పించకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని కేంద్రం హెచ్చరించింది. నిర్దిష్ట సమయానికి ఆస్తి వివరాలు సమర్పించని ఐఏఎస్‌లపై పదోన్నతి నిలిపివేత వంటి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కేంద్ర సిబ్బంది శాఖ ఒక అధికారిక ప్రకటనలో తెలియజేసింది. దేశంలోని ఐఏఎస్ అధికారులందరూ తమ స్థిరాస్తి వివరాలు వచ్చే నెల 31 లోగా ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉంది. వేతన వృద్ధికి అవకాశం కల్పించే పదోన్నతి పొందాలంటే తప్పనిసరిగా స్థిరాస్తి వివరాలు తెలిపే విధంగా నిబంధనల్ని సవరించామని ప్రకటన వివరించింది.

పాక్ అణ్వాయుధాలు కలవరపెడుతున్నాయి

- అమెరికా ముందు గతంలో ఆందోళన వ్యక్తంచేసిన పుతిన్



వాషింగ్టన్: పాకిస్థాన్ అణ్వాయుధాల విస్తరణపై రెండు దశాబ్దాల క్రితం అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్‌తో జరిగిన సమావేశంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆందోళన వ్యక్తం చేసిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. అమెరికాకు చెందిన నేషనల్ సెక్యూరిటీ ఆర్కైవ్స్ 2001-2008 నాటి వివరాలను బహిర్గతం చేసింది. దీని ప్రకారం..2001లో స్లోవేనియాలో జరిగిన ఓ సమావేశానికి పుతిన్, నాటి అమెరికా అధ్యక్షుడు బుష్ హాజరయ్యారు. అణు కార్యక్రమాల నిబంధనలను ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దేశాల విషయంలో వ్యవహరించినట్లుగా.. పాక్‌పై ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని నాడు బుష్‌ను పుతిన్ ప్రశ్నించారు. "అది అణ్వాయుధాలు కలిగిన సైనిక ప్రభుత్వం. అక్కడ ప్రజాస్వామ్యం లేదు. పశ్చిమ దేశాలు దానిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదు. దీని గురించి మాట్లాడాల్సిన అవసరం ఉంది" అని రష్యా అధ్యక్షుడు పేర్కొన్నారు. పాక్ పట్ల ఉదాసీనంగా వ్యవహరించడంపై పలు అనుమానాలు లేవనెత్తారు. ఇరాన్ అణు కార్యక్రమంలో పాక్ యురేనియాన్ని గుర్తించామని 2005లో జరిగిన మరో భేటీలో బుష్ వద్ద పుతిన్ ప్రస్తావించారు. పాక్ అణుపితామహుడు అబ్దుల్ ఖాదిర్ ఖాన్ కార్యకలాపాలు బయటపడిన తర్వాత ఆ దేశంపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చామని, ఖాన్‌తో పాటు అతడి అనుచరులను నిర్బంధించేలా చేశామని నాడు బుష్ వెల్లడించారు. ప్రజాస్వామ్య జవాబుదారీతనం లేని ప్రభుత్వాల చేతుల్లో అణ్వాయుధాలు అధికంగా ఉన్నాయని పుతిన్ పదేపదే లేవనెత్తగా.. ఆ సున్నితమైన పరిజ్ఞానం మరింత వ్యాప్తి చెందకుండా నిరోధించాల్సిన అవసరం ఉందని బుష్ సమర్థించినట్లు తాజాగా బయటపడిన పత్రాల్లో వెల్లడైంది.

కొనసాగుతున్న బంగ్లా ప్రకంపనలు

- ఢాకాలో నిరసనలు
- మైనారిటీలపై దాడుల్ని ఖండించిన భారత్

ఢాకా, దిల్లీ: బంగ్లాదేశ్‌లో ముస్లిమేతరులు సహా పలువురి మీద జరుగుతున్న దాడులపై ప్రకంపనలు కొనసాగుతున్నాయి. విప్లవవాద నాయకుడు షరీఫ్ ఒస్మాన్ హాదీ హత్యను నిరసిస్తూ అతని మద్దతుదారులు శుక్రవారం ఢాకాలోని కీలక కూడలిని దిగ్బంధం చేశారు. న్యాయం చేయాలని నినదిస్తూ బైఠాయించడంతో ట్రాఫిక్ గంటలతరబడి నిలిచిపోయింది. ఢాకా విశ్వవిద్యాలయ మసీదు నుంచి షాబాగ్ వరకు ప్రదర్శన చేపట్టి ధర్నా నిర్వహించారు. న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. హాదీ హత్యానంతరం చెలరేగిన అల్లర్లు, విధ్వంసకాండలో హిందూ కార్మికుడు దీపూ చంద్రదాస్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మరోవైపు.. బ్రిటన్‌లోని ప్రవాసం వీడి 17 ఏళ్ల తర్వాత స్వదేశానికి చేరుకున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రహ్మాన్ తన తండ్రి, బంగ్లా మాజీ అధ్యక్షుడు జియాఉర్ రహ్మాన్ సమాధిని సందర్శించి నివాళులర్పించారు. 19 ఏళ్ల తర్వాత ఈ సమాధి వద్దకు రాగలగడంపై ఉద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు.



యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో బజరంగ్‌దళ్ కార్యకర్తల ఆందోళన

బంగ్లా, పాక్‌లలో బాబర్‌లు ఇంకా ఉన్నారు: మీనాక్షి

బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై దాడుల్ని కేంద్ర మాజీమంత్రి మీనాక్షీ లేఖి ఖండించారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో ఇంకా కొందరు నేతలు మొగల్ చక్రవర్తి బాబర్ మాదిరి ఆలోచనాధోరణితో ఉన్నారని విమర్శించారు. అందుకే ఆ రెండు దేశాల్లో హత్యలు జరుగుతున్నాయన్నారు. భారత్‌ను రెచ్చగొట్టాలనేదే వారి ఉద్దేశమని ఆరోపించారు. దండెత్తి వచ్చేవారిపై సహృదయత చూపాల్సిన అవసరం లేదన్నారు.

5 లక్షల మంది సన్యాసులతో హైకమిషన్‌ను ముట్టడిస్తా: సువేందు

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల్ని భారత్ ఖండించింది. కిరాతకమైన దాడిలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోవడానికి కారకులైన దోషుల్ని శిక్షించాలని డిమాండ్ చేసింది. తాత్కాలిక ప్రభుత్వం వచ్చాక దాదాపు 2,900 హింసాత్మక ఘటనలు మైనారిటీలపై జరిగాయని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. వీటిని రాజకీయ హింసగా కొట్టిపారేయలేమంది. పశ్చిమబెంగాల్ శాసనసభ విపక్షనేత సువేందు అధికారి కోల్‌కతాలో బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ కార్యాలయంలో సీనియర్ అధికారులను కలిశారు. హిందూ మైనారిటీలపై దాడులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐదులక్షల మంది సన్యాసులతో వచ్చి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లోని రెండుకోట్ల మంది హిందువుల్ని పదేపదే లక్ష్యంగా చేసుకుంటుంటే భారత్‌లోని వందకోట్ల మంది హిందువులు మౌన ప్రేక్షకులుగా కూర్చొంటారా అని ప్రశ్నించారు.



మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాహుల్

మన్మోహన్‌సింగ్‌కు కాంగ్రెస్ నివాళి

దిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్ర నాయకులు శుక్రవారం ఆయనకు నివాళులర్పించారు. ఆయన వినయం, నిజాయతీ, సేవాభావం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆయన దూరదృష్టి గల నాయకత్వం భారత్‌కు ప్రపంచ గుర్తింపును తీసుకొచ్చిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆయన నిజాయతీ, కష్టపడే స్వభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన మనదేశ ఆర్థిక మార్గాన్ని మార్చిన మహానేత అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. ఆర్థిక సంస్కరణల ద్వారా కోట్లమందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చారని చెప్పారు. సమానత్వం, సంక్షేమం, హక్కుల ఆధారిత పాలన ఆయన నాయకత్వానికి నిదర్శనమన్నారు. దేశ పురోగతికి ఆయన అంకితభావం శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

వైమానిక దళం ఏర్పాటుకు టీటీపీ ప్రణాళిక

- పాక్‌కు ఇక కష్టాలే!

ఇస్లామాబాద్: అఫ్గానిస్థాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాకిస్థాన్‌పై దాడులతో విరుచుకుపడుతున్న తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్(టీటీపీ) తమ కార్యకలాపాలను విస్తరించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. పాకిస్థాన్ సైన్యానికి పోటీగా కొత్త ఏడాదిలో వైమానిక దళం ఏర్పాటు చేసేందుకు సిద్ధపడింది. ఈ విషయాన్నే తాజాగా టీటీపీ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించింది. సలీం హక్కానీ ఈ దళానికి నాయకత్వం వహిస్తారని వివరించింది. దీంతో పాటు ప్రావిన్స్‌ల వారీగా మోహరింపులు, మిలిటరీ యూనిట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపింది. మిలిటరీ కమాండర్లతో కూడిన రెండు కొత్త పర్యవేక్షణ జోన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించింది. కశ్మీర్, గిల్గిత్- బాల్టిస్థాన్‌తో సహా మరి కొన్ని ప్రావిన్స్‌లను తమ అధీనంలోకి తీసుకోవాలని ప్రణాళికలు రచిస్తోంది.

వచ్చే ఐదేళ్లలో మరిన్ని క్షిపణుల తయారీ: కిమ్



క్షిపణి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కిమ్

ప్యాంగాంగ్: ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తన ఆయుధ సంపత్తిని మరింత పెంచుకోవాలని భావిస్తున్నారు. వచ్చే ఐదేళ్లలో మరిన్ని క్షిపణి వ్యవస్థలను రూపొందించేందుకు సిద్ధమయ్యారు. సంబంధిత అధికారులకు కిమ్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు ఉత్తరకొరియా మీడియా కథనం వెల్లడించింది. తమ దేశ సాయుధ దళాల డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాలను పెంచాల్సిన అవసరం ఉందని కిమ్ పేర్కొన్నట్లు ఆ కథనం తెలిపింది. ఇందుకోసం కొత్త ఆయుధ కర్మాగారాల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొంది. ఇటీవలి కాలంలో ఉత్తరకొరియా తమ అణుశక్తి పరీక్షలను గణనీయంగా పెంచిన విషయం తెలిసిందే.

20 అమెరికా సంస్థలపై చైనా ఆంక్షలు

బీజింగ్: చైనా 20 అమెరికా రక్షణ సంస్థలపై శుక్రవారం ఆంక్షలు విధించింది. తైవాన్‌కు 1,100 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు సరఫరా చేయాలని అమెరికా నిర్ణయించిన నేపథ్యంలో చైనా ఈ చర్య తీసుకుంది. తైవాన్ అంశంపై మమ్మల్ని రెచ్చగొట్టే ప్రయత్నాలను గట్టిగా తిప్పి కొడతాం అని చైనా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. చైనాకు చెందిన తైవాన్ ప్రాంతానికి అమెరికా ఆయుధ సరఫరా చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో 20 అమెరికన్ రక్షణ సంస్థలు, 10 సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు స్పష్టం చేసింది. అమెరికా "ఒకటే చైనా" సూత్రాన్ని పాటించాలని, తైవాన్‌కు ఆయుధాలు అందించడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడరాదని హెచ్చరించింది.

మహిళా మేనేజర్‌పై సామూహిక అత్యాచారం

ఐటీ సంస్థ సీఈవో సహా ముగ్గురి అరెస్టు

జైపుర్: మహిళా మేనేజర్‌ను పుట్టినరోజు పార్టీకి పిలిచిన ఓ ఐటీ సంస్థ సీఈవో ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మరో మహిళా ఉద్యోగి భర్తతో కలిసి అత్యాచారం చేశాడు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితుడు జితేశ్ సిసోదియా సీఈవోగా వ్యవహరిస్తున్న ఐటీ సంస్థలో బాధితురాలు మేనేజర్‌గా పనిచేస్తోంది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. ఇటీవల సిసోదియా తన పుట్టినరోజు సందర్భంగా పార్టీ ఏర్పాటు చేశాడు. దానికి బాధితురాలితో పాటు ఆ సంస్థలో ఎగ్జిక్యూటివ్ హెడ్‌గా పనిచేస్తున్న మహిళ తన భర్త గౌరవ్ సిరోహితో కలిసి హాజరైంది. పార్టీ అనంతరం బాధితురాలిని ఇంటికి తీసుకెళ్తానని చెప్పి ఎగ్జిక్యూటివ్ హెడ్ తన కారులో ఎక్కించుకుంది. అదే కారులో సీఈవో, గౌరవ్ సిరోహి కూడా ఉన్నారు. దారి మధ్యలో వారు సిగరెట్లను కొనుగోలు చేశారు. వాటిని తాగిన వెంటనే బాధితురాలు స్పృహ కోల్పోయింది. మరుసటి రోజు ఉదయం మెలకువ వచ్చేసరికి తనపై లైంగిక దాడి జరిగినట్లు తెలిసిందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.40 కోట్ల 'క్రేజీ మెడిసిన్' పట్టివేత

- మణిపుర్‌లో ఒకరి అరెస్టు

ఇంఫాల్: మణిపుర్‌లోని జిరిబామ్‌లో అస్సాం రైఫిల్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.40 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 24న జరిపిన ఈ దాడుల్లో 1.6లక్షల నిషిద్ధ యాబా మాత్రలు లభ్యమైనట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. థాయ్‌లాండ్‌లో క్రేజీ మెడిసిన్‌గా పిలిచే ఈ మాత్రలు కేంద్ర నాడీ వ్యవస్థను తీవ్రస్థాయిలో ఉత్తేజితం చేస్తాయి. ఈ ఘటనకు సంబంధించి ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు చెప్పారు. మరో ఘటనలో నిషేధిత 'కాంగ్లీ యావోల్ కన్నా లుప్' సంస్థకు చెందిన సభ్యుణ్ని, అతడితో సంబంధమున్న వ్యక్తిని భద్రతా దళాలు అరెస్టు చేశాయి. వారి వద్ద నుంచి మందుగుండు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి.

రక్షణ కేటాయింపుల్ని 9.4% పెంచిన జపాన్



టోక్యో: జపాన్ మంత్రిమండలి వచ్చే సంవత్సరానికి సంబంధించి 5,800 కోట్ల డాలర్ల రక్షణ బడ్జెట్‌కు శుక్రవారం ఆమోదం తెలిపింది. ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరిగిపోతున్న తరుణంలో క్రూజ్ క్షిపణులు, మానవ రహిత ఆయుధ సంపత్తి సమకూర్చుకోవడం ద్వారా తన సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుందని జపాన్ భావిస్తోంది. ప్రస్తుత సంవత్సరం రక్షణ బడ్జెట్‌తో పోలిస్తే వచ్చే ఏప్రిల్ నుంచి అమలులోకి వచ్చే రక్షణ కేటాయింపులు 9.4 శాతం అధికం. తన వార్షిక ఆయుధ వ్యయాన్ని రెండింతలు చేసి ఐదేళ్ల కాలంలో స్థూల దేశీయోత్పత్తిలో 2 శాతానికి పెంచే దిశగా జపాన్ రక్షణ బడ్జెట్ పెంచుతూ పోతోంది. చైనాతో ఉద్రిక్తతలు పెరిగిపోతున్న తరుణంలో జపాన్ తాజా కేటాయింపులకు ఆమోదం తెలిపింది. స్వతంత్ర ప్రాంతమైన తైవాన్‌పై చైనా చర్యలు తీసుకుంటే జపాన్ జోక్యం చేసుకోవచ్చని జపాన్ ప్రధాని సనాయే తకాయిచి గత నవంబరులో ప్రకటించిన నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రధాని అధ్యక్షతన నేడు, రేపు సీఎస్‌ల సమావేశం

ఈనాడు, దిల్లీ: ప్రధానమంత్రి నరంద్రమోదీ అధ్యక్షతన శని, ఆదివారాల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల 5వ జాతీయసమావేశం జరుగనుంది. 'వికసిత్ భారత్‌కు మానవ వనరుల మూలధనం' అన్న ఇతివృత్తంతో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో ప్రధానంగా విద్యారంగంపై చర్చించనున్నారు. పూర్వ ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్యవరకు అన్ని స్థాయిల్లో విద్యారంగంలో తీసుకురావాల్సిన మార్పులు, చేర్పులు, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, ఇతర అదనపు కార్యకలాపాలపై పూర్తిస్థాయిలో సమాలోచన చేయనున్నారు. అలాగే రాష్ట్రాల్లో డీరెగ్యులేషన్, పరిపాలనలో సాంకేతిక వినియోగం, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ లింకేజీ కల్పించి, అందుకోసం సులభమైన సరఫరా వ్యవస్థ ఏర్పాటుచేయడం, ఒక రాష్ట్రం... ఒక ప్రపంచస్థాయి పర్యాటక గమ్యస్థానం, ఆత్మనిర్భర్ భారత్, స్వదేశీ వస్తువుల ప్రోత్సాహం, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో భవిష్యత్తు ప్రణాళికల అమలు అన్న అంశాలపై ఆరు ప్రత్యేక సెషన్లు నిర్వహించి చర్చించనున్నారు. అలాగే భారత వారసత్వ సంపద, ప్రాచీన పత్రాల సంరక్షణ, డిజిటలీకరణ గురించి కసరత్తు చేస్తారు. ప్రాథమిక ఆరోగ్యసేవల్లో సంప్రదాయ జ్ఞాన వినియోగం గురించి చర్చిస్తారు.

చాంపియన్


హర్మన్‌ప్రీత్, షెఫాలి

మొదట టాస్ గెలిచి భారత్ ఫీల్డింగ్ ఎంచుకోవడం.. బౌలర్లు విజృంభించి శ్రీలంకను కట్టడి చేయడం.. అనంతరం బ్యాటర్లు చెలరేగి అలవోకగా ఛేదనను పూర్తి చేయడం.. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఇవే దృశ్యాలు పునరావృతమయ్యాయి. వేదిక మారినా ఫలితం మారలేదు. వన్డే ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన తర్వాత ఆడిన తొలి సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే చేజిక్కించుకుంది హర్మన్‌ప్రీత్ సేన.

హ్యాట్రిక్ కొట్టారు.. సిరీస్ పట్టారు

మెరిసిన రేణుక, దీప్తి, షెఫాలి ● మరోసారి లంక చిత్తు

మూడో టీ20లోనూ భారత్ ఘనవిజయం


రేణుక సింగ్


దీప్తి

తిరువనంతపురం

శ్రీలంకతో టీ20 సిరీస్‌లో భారత మహిళల జట్టుకు ఎదురే లేదు. హ్యాట్రిక్ విజయం సాధించిన హర్మన్‌ప్రీత్ సేన.. అయిదు టీ20ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0తో చేజిక్కించుకుంది. శుక్రవారం తిరువనంతపురంలో జరిగిన మూడో టీ20లో భారత్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట లంక 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 112 పరుగులే చేయగలిగింది. రేణుక సింగ్ (4-1-21-4) అద్భుత గణాంకాలు నమోదు చేసింది. దీప్తి శర్మ (3/18) సైతం లంక పతనంలో కీలక పాత్ర పోషించింది. షెఫాలి వర్మ (79 నాటౌట్; 42 బంతుల్లో 11×4, 3×6) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ మెరుపు అర్ధశతకం సాధించడంతో లక్ష్యాన్ని భారత్ 13.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. నాలుగో టీ20 తిరువనంతపురంలోనే ఆదివారం జరుగుతుంది.

రేణుక, దీప్తి విజృంభణ: ప్రపంచకప్ తర్వాత భారత్ ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో తుది జట్టులో లేని పేసర్ రేణుక సింగ్.. మూడో టీ20లో బరిలోకి దిగి లంకను వణికించింది. స్పిన్నర్ దీప్తి శర్మ గొప్పగా బౌలింగ్ చేయడంతో లంక ఏ దశలోనూ మెరుగైన స్కోరు సాధించేలా కనిపించలేదు. తొలి 4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 25 పరుగులు చేసిన ఆ జట్టు.. దీప్తి వేసిన అయిదో ఓవర్లో కెప్టెన్ చమరి ఆటపట్టు వికెట్‌ను కోల్పోయింది. 12 బంతుల్లో 3 పరుగులే చేయడంతో అసహనానికి గురైన భారీ షాట్‌కు ప్రయత్నించిన చమరి.. అమన్‌జ్యోత్‌కు క్యాచ్ ఇచ్చింది. తొలి స్పెల్‌లో ఒక్క ఓవర్ వేసి 12 పరుగులు ఇచ్చిన రేణుక.. ఆరో ఓవర్లో తిరిగి బౌలింగ్‌కు వచ్చి లంకను గట్టి దెబ్బ తీసింది. ఒక ఎండ్‌లో నిలకడగా ఆడుతున్న హాసిని (25)తో పాటు హర్షిత సమరవిక్రమ (2)లను ఆమె ఔట్ చేసింది. తన తర్వాతి ఓవర్లో నీలాక్షిక (4) వికెట్‌ను సైతం రేణుకే పడగొట్టడంతో 10 ఓవర్లకు 45/4తో లంక పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కవిష (20), ఇమేషా (27) పోరాడడంతో లంక కాస్త పుంజుకుంది. అయితే కవిషను దీప్తి ఔట్ చేసింది.. రేణుక తన చివరి ఓవర్లో ఒక్క పరుగూ ఇవ్వకుండా ఇమేషా వికెట్ పడగొట్టింది. ఆఖర్లో కౌశిని (19) పోరాటంతో లంక స్కోరు వంద దాటింది. అనంతరం ఛేదనలో షెఫాలి దూకుడుగా ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. స్మృతి (1) వరుసగా మూడో మ్యాచ్‌లోనూ నిరాశపరిచినా.. జెమీమా (9) కూడా ఎక్కువ సేపు నిలబడకపోయినా.. హర్మన్‌ప్రీత్ (21 నాటౌట్)తో కలిసి షెఫాలి జట్టును గెలిపించింది. భారత్ కోల్పోయిన రెండు వికెట్లనూ కవిష (2/18)నే పడగొట్టింది.

దీప్తి రికార్డు

టీమ్‌ఇండియా స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ.. ప్రపంచ రికార్డును అందుకుంది. టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొనసాగుతున్న ఆస్ట్రేలియా పేసర్ మెగాన్ షట్ (151)ను ఆమె సమం చేసింది. శ్రీలంకతో మూడో టీ20లో 4 ఓవర్లలో 18 పరుగులిచ్చి 3 వికెట్లు తీసిన దీప్తి.. షట్ రికార్డును చేరుకుంది. దీప్తి 131 టీ20ల్లో 18.73 సగటుతో 151 వికెట్లు తీసింది. షట్ కంటే దీప్తి 8 మ్యాచ్‌లు ఎక్కువ ఆడింది. మొత్తంగా మహిళల క్రికెట్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో దీప్తి (333) మూడో స్థానంలో ఉంది. ఝులన్ గోస్వామి (భారత్-355), కేథరిన్ బ్రంట్ (ఇంగ్లాండ్-335) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. శ్రీలంకతో టీ20 సిరీస్ ముగిసేలోపు ఆమె రెండో స్థానానికి చేరుకోవచ్చు.

శ్రీలంక ఇన్నింగ్స్: హాసిని పెరీరా (సి) దీప్తి (బి) రేణుక 25; చమరి ఆటపట్టు (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 3; హర్షిత సమరవిక్రమ (సి) అండ్ (బి) రేణుక 2; ఇమేషా (సి) జెమీమా (బి) రేణుక 27; నీలాక్షిక ఎల్వి (బి) రేణుక 4; కవిష (సి) అమన్‌జ్యోత్ (బి) దీప్తి 20; కౌషిని నాటౌట్ 19; మల్షా (బి) దీప్తి 5; మల్కి నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) 112; **వికెట్ల పతనం:** 1-25, 2-31, 3-32, 4-45, 5-85, 6-90, 7-98; **బౌలింగ్:** రేణుక సింగ్ 4-1-21-4; క్రాంతి గౌడ్ 4-0-22-0; దీప్తి శర్మ 4-0-18-3; వైష్ణవి శర్మ 3-0-14-0; అమన్‌జ్యోత్ 4-0-23-0; శ్రీ చరణి 1-0-11-0

భారత్ ఇన్నింగ్స్: షెఫాలి వర్మ నాటౌట్ 79; స్మృతి మంధాన ఎల్బీ (బి) కవిష 1; జెమీమా (బి) కవిష 9; హర్మన్‌ప్రీత్ నాటౌట్ 21; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (13.2 ఓవర్లలో 2 వికెట్లకు) 115; **వికెట్ల పతనం:** 1-27, 2-67; **బౌలింగ్:** మల్షా షెహాని 2-0-28-0; మల్కి మదారా 2-0-11-0, నిమష మీపగే 2-0-29-0; కవిష దిల్హరి 3-0-18-2; ఇనోక రణవీర 4-0-28-0

దూకుడు పెంచాలనుకున్నాం

"ఇది మాకు గొప్ప సిరీస్. ప్రపంచకప్ విజయం తర్వాత మేం మా ఆటతీరు ఎలా ఉండాలన్నదానిపై చర్చించుకున్నాం. టీ20ల్లో మరింత దూకుడుగా ఆడాలనుకున్నాం. ఎందుకంటే ఈ ఫార్మాట్లో తర్వాతి ప్రపంచకప్ ఆడాల్సి ఉంది. ఇప్పటిదాకా మా ప్రదర్శన పట్ల చాలా సంతోషంగా ఉన్నాం. బౌలర్ల ప్రదర్శన ఎక్కువ సంతృప్తినిస్తోంది. టీ20ల్లో బౌలింగ్ చాలా కీలకం. ఈ సిరీస్ విజయంలో బౌలర్ల పాత్రే కీలకం. ఈ మ్యాచ్‌లో రేణుక గొప్పగా బంతులేసింది. శ్రీలంకకు టాప్ ఆర్డరే ప్రధానం. ప్రధాన బ్యాటర్ల వికెట్లు తీసి రేణుక మాకు పైచేయి సాధించే అవకాశమిచ్చింది. తొలి ఓవర్లో బంతులు సరిగా పడకపోయినా.. తర్వాత పుంజుకుని నాలుగు వికెట్లు తీయడం గొప్ప విషయం"

– హర్మన్‌ప్రీత్ సింగ్

అగ్రస్థానంలో అర్జున్, గుకేశ్

ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్


అర్జున్

దోహా: ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌ను అర్జున్ ఇరిగేశి, ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ ఘనంగా మొదలెట్టారు. ర్యాపిడ్ విభాగంలో అయిదు రౌండ్లు ముగిసే సరికి చెరో 4.5 పాయింట్లు సంపాదించిన ఈ ఇద్దరు.. మాగ్నస్ కార్ల్‌సన్ (4.5)తో కలిసి అగ్రస్థానంలో ఉన్నారు. తొలి నాలుగు గేముల్లో నెగ్గిన అర్జున్.. అయిదో రౌండ్లో కార్ల్‌సన్ (నార్వే)ను నిలువరించాడు. నాలుగు గేముల్లో నెగ్గిన గుకేశ్.. ఒక గేమ్‌ను డ్రాగా ముగించాడు. తొలి నాలుగు గేముల్లో ప్రజ్ఞానంద (3) రెండు గేములు నెగ్గి, రెండింటిని డ్రా చేసుకున్నాడు. నిహాల్ సరీన్ (3) మూడు గేముల్లో గెలిచి.. ఒక గేమ్‌లో ఓడిపోయాడు. మహిళల విభాగంలో నాలుగు రౌండ్లు ఆడిన ద్రోణవల్లి హారిక.. 3.5 పాయింట్లతో ఉమ్మడిగా రెండో స్థానంలో ఉంది. ఆమె మూడు గేముల్లో గెలిచి.. ఒకటి డ్రాగా ముగించింది. డిఫెండింగ్ ఛాంపియన్ కోనేరు హంపి (3) రెండు విజయాలు సాధించింది. రెండు గేములను డ్రా చేసుకుంది. వైశాలి (3) మూడు గేముల్లో నెగ్గి, ఒకటి ఓడిపోయింది. దివ్య దేశ్‌ముఖ్ (3) రెండు గేముల్లో విజేతగా నిలిచి, రెండింటిని డ్రాగా ముగించింది. మూడు రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో ఓపెన్ విభాగంలో 13 గేమ్‌లు.. మహిళల విభాగంలో 11 గేమ్‌లు నిర్వహిస్తారు. అత్యధిక పాయింట్లు సాధించినవారు విజేతలుగా నిలుస్తారు.


నీసర్


టంగ్

యాషెస్ నాలుగో టెస్టు

ఒక్క రోజులో 20 వికెట్లు

ఆస్ట్రేలియా 152.. ఇంగ్లాండ్ 110

మెల్‌బోర్న్: యాషెస్ సిరీస్ నాలుగో టెస్టులో టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా కేవలం 45.2 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌటైపోయింది. సిరీస్ చేజారాక అయినా తమ బౌలర్లు లయ అందుకున్నందుకు సంతోషపడి.. ఈ మ్యాచ్‌లో గెలిచి ఆస్ట్రేలియా ఆధిక్యాన్ని తగ్గిద్దామని ఆశించి ఉంటుందేమో ఇంగ్లాండ్! కానీ తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు సంతోషమంతా ఆవిరైపోయింది, ఆశలు కూలిపోయాయి. ఆస్ట్రేలియా బౌలర్లు మరింతగా విజృంభించడంతో ఇంగ్లిష్ జట్టు కేవలం 110 పరుగులకే కుప్పకూలింది. ఇరు జట్ల బౌలర్లూ పోటీపడి వికెట్లు తీసిన వేళ.. యాషెస్‌లో ఒక్క రోజులో రెండు ఇన్నింగ్స్‌లు ముగిసిపోయాయి. ఉదయం జోష్ టంగ్ (5/45), గస్ అట్కిన్సన్ (2/28)ల ధాటికి ఆస్ట్రేలియా ఒక దశలో 51 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. హెడ్ (12), వెదరాల్డ్ (10), లబుషేన్ (6), స్టీవ్ స్మిత్ (9) పెవిలియన్‌కు క్యూ కట్టారు. అయితే ఉస్మాన్ ఖవాజా (29), అలెక్స్ కేరీ (20)ల పోరాటంతో ఆ జట్టు కాస్త పుంజుకుంది. 89/4తో ఉన్న ఆసీస్.. స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లు కోల్పోయి 91/6కు చేరుకుంది. ఈ స్థితిలో మైకేల్ నీసర్ (35) ధాటిగా ఆడి స్కోరును పెంచాడు. ఆసీస్ కాస్త కోలుకుంటున్న సమయంలో ఇంగ్లిష్ బౌలర్లు విజృంభించి 9 పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు తీసి ఆసీస్‌ను 152కే పరిమితం చేశారు. కానీ ఇంగ్లాండ్ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. పేస్‌కు సహకరిస్తున్న పిచ్‌పై ఆసీస్ పేస్ త్రయం మరింతగా రెచ్చిపోయింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (5), బెన్ డకెట్ (2)లను వరుస ఓవర్లలో ఔట్ చేసి స్టార్క్ (2/23) జట్టుకు అదిరే ఆరంభాన్నివ్వగా.. మైకేల్ నీసర్ (4/35), స్కాట్ బోలాండ్ (3/30) మిగతా ఇంగ్లిష్ బ్యాటర్ల పని పట్టారు. కేవలం 29.5 ఓవర్లలోనే ఆ జట్టు ఇన్నింగ్స్ ముగిసింది. హ్యారీ బ్రూక్ (41), గస్ అట్కిన్సన్ (28) పోరాడకుంటే స్కోరు వంద కూడా దాటేది కాదు. జాకబ్ బెతెల్ (1), జో రూట్ (0) జేమీ స్మిత్ (2), విల్ జాక్స్ (5) ఘోరంగా విఫలమయ్యారు. స్టోక్స్ 16 పరుగులే చేశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీస్.. శుక్రవారం ఆట చివరికి వికెట్ నష్టపోకుండా 4 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌కు 94,199 మంది ప్రేక్షకులకు హాజరవడం విశేషం. ప్రపంచంలో రెండో పెద్ద క్రికెట్ మైదానమైన ఎంసీజీలో అత్యధికంగా వీక్షకులు హాజరైన మ్యాచ్ ఇదే.

సెమీస్‌లో చరిష్మ, రక్షిత

● క్వార్టర్స్‌లో ఉన్నతి, తన్విలకు షాక్
● జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్


సూర్య చరిష్మ

ఈనాడు, అమరావతి, విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో తెలుగమ్మాయిలు సూర్య చరిష్మ, రక్షిత శ్రీ సంచలన విజయాలు సాధించారు. శుక్రవారం మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో చరిష్మ (ఆంధ్రప్రదేశ్) 21-12, 21-15తో టాప్ సీడ్ ఉన్నతి హుడా (హరియాణా)కు షాకిచ్చింది. రక్షిత శ్రీ (తెలంగాణ) 16-21, 21-14, 21-18తో మరో స్టార్ తన్వి శర్మ (పంజాబ్)ను ఓడించింది. ఎం.శ్రుతి (ఏపీ) కూడా సెమీస్ చేరింది. ఆమె 22-20, 21-12తో అనుపమ ఉపాధ్యాయపై నెగ్గింది. మరోవైపు తన్వి పత్రి (ఒడిశా) 21-16, 12-21, 22-20తో ఆకర్షి కశ్యప్ (ఛత్తీస్‌గఢ్)పై సంచలన విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్, రిత్విక్ సంజీవి సెమీస్ చేరారు. కిరణ్ 21-18, 21-18తో రౌనక్ చౌహాన్‌ను ఓడించాడు. మరోవైపు రిత్విక్ 21-13, 22-20తో సతీష్ కుమార్‌పై నెగ్గాడు. తరుణ్ 21-13, 22-20తో మన్‌రాజ్‌పై, భరత్ 21-17, 21-13తో గిన్‌పాల్‌పై గెలిచి తుది నాలుగులో చోటు దక్కించుకున్నారు. పురుషుల డబుల్స్‌లో భార్గవ్ రామ్-విశ్వతేజ (ఆంధ్రప్రదేశ్) జోడీ ఓడిపోయింది. క్వార్టర్స్‌లో భార్గవ్ ద్వయం 18-21, 17-21తో హరిహరన్-రూబెన్ కుమార్ (తమిళనాడు) జంటకు తలొంచింది.


రక్షిత శ్రీ

మెరిసిన కోహ్లి, పంత్

● దిల్లీకి మరో విజయం
● హైదరాబాద్ ఓటమి, ఆంధ్ర గెలుపు

విజయ్ హజారే ట్రోఫీ


పంత్ 70


కోహ్లి 77

బెంగళూరు

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి (77; 61 బంతుల్లో 13×4, 1×6) విజయ్ హజారే ట్రోఫీలో జోరు కొనసాగిస్తున్నాడు. శుక్రవారం అతడు గుజరాత్‌పై అర్ధసెంచరీతో సత్తా చాటాడు. టోర్నీ తొలి మ్యాచ్‌లో శతకం సాధించిన విరాట్.. అదే ఫామ్‌ను గుజరాత్‌పైనా కొనసాగించాడు. దీంతో దిల్లీ 7 పరుగుల తేడాతో గుజరాత్‌ను ఓడించింది. మొదట దిల్లీ 9 వికెట్లకు 254 పరుగులు చేసింది. తన శైలిలో ఆన్‌డ్రైవ్‌లు, కట్ షాట్లతో స్కోరు పెంచిన కోహ్లి.. చింతన్ గజా బౌలింగ్‌లో ఓ మెరుపు పుల్ షాట్ సిక్స్‌తో అలరించాడు. సెంచరీ చేసేలా కనిపించిన విరాట్.. స్పిన్నర్ విశాల్ (4/42) బంతిని తప్పుగా అంచనా వేసి స్టంపౌట్ అయ్యాడు. విరాట్ వెనుదిరిగినా కెప్టెన్ రిషబ్ పంత్ (70; 79 బంతుల్లో 8×4, 2×6) నిలవడంతో దిల్లీ పోరాడే స్కోరు చేయగలిగింది. ఆర్య (57), సౌరవ్ చౌహాన్ (49)రాణించడంతో గుజరాత్ ఒక దశలో గెలిచేలా కనిపించినా.. ఆఖర్లో తడబడి ఓటమి పాలైంది. ఆ జట్టు 247కు ఆలౌటైంది.

రోహిత్ డకౌట్: ఈ టోర్నీలో తొలి మ్యాచ్‌లో మెరుపు శతకం సాధించిన రోహిత్ శర్మ.. ఉత్తరాఖండ్‌తో మ్యాచ్‌లో డకౌట్ అయ్యాడు. జైపుర్‌లో జరిగిన మ్యాచ్‌లో దేవేంద్ర బోరా బౌలింగ్‌లో ఎదుర్కొన్న తొలి బంతికే అతడు వెనుదిరిగాడు. హార్దిక్ తమోర్ (93; 82 బంతుల్లో 7×4, 2×6), సోదరులు ముషీర్ ఖాన్ (55; 56 బంతుల్లో 7×4), సర్ఫరాజ్ ఖాన్ (55; 49 బంతుల్లో 5×4, 1×6), ములాని (48; 35 బంతుల్లో 4×4, 1×6) సత్తా చాటడంతో ముంబయి 7 వికెట్లకు 331 పరుగులు చేసింది. బదులుగా ఉత్తరాఖండ్ 280/9కే పరిమితమైంది. యువరాజ్ (96), సుచిత్ (51) పోరాటం ఆ జట్టును గెలిపించలేకపోయింది. శార్దూల్ (2/40), ముషీర్ (2/57) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఆర్యన్ జుయల్ (134; 118 బంతుల్లో 7×4, 8×6), రింకు సింగ్ (106; 60 బంతుల్లో 11×4, 4×6) శతకాలు బాదడంతో ఉత్తర్‌ప్రదేశ్ 227 పరుగుల భారీ తేడాతో చండీగఢ్‌ను చిత్తు చేసింది. మొదట యూపీ 4 వికెట్లకు 367 పరుగులు చేసింది. ధ్రువ్ జురెల్ (67) కూడా రాణించాడు. ఛేదనలో చండీగఢ్ 29.3 ఓవర్లలో 140కే ఆలౌటైంది. జీషన్ అన్సారి (4/29) సత్తా చాటాడు. కరుణ్ నాయర్ (130 నాటౌట్; 130 బంతుల్లో 14×4), దేవ్‌దత్ పడిక్కల్ (124; 137 బంతుల్లో 12×4, 3×6) సెంచరీలు సాధించడంతో కర్ణాటక 8 వికెట్ల తేడాతో కేరళను ఓడించింది. మొదట కేరళ 7 వికెట్లకు 284 పరుగులు చేసింది. అజహరుద్దీన్ (84) టాప్ స్కోరర్. కరుణ్, పడిక్కల్ శతకాలతో కర్ణాటక 48.2 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది.

హైదరాబాద్ మళ్లీ..: హైదరాబాద్‌కు రెండో ఓటమి ఎదురైంది. రాజ్‌కోట్‌లో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 89 పరుగుల తేడాతో విదర్భ చేతిలో చిత్తయింది. మొదట విదర్భ 5 వికెట్లకు 365 పరుగులు చేసింది. ధ్రువ్ షోరే (109 నాటౌట్; 77 బంతుల్లో 9×4, 6×6) అజేయ సెంచరీతో అదరగొట్టాడు. రవి కుమార్ (63) కూడా రాణించాడు. కార్తికేయ (3/87) ఆకట్టుకున్నాడు. ఛేదనలో హైదరాబాద్ 49.2 ఓవర్లలో 276 పరుగులకు ఆలౌటైంది. వరుణ్ గౌడ్ (85; 68 బంతుల్లో 4×4, 4×6) టాప్ స్కోరర్. అభిరథ్ రెడ్డి (43), రాహుల్ సింగ్ (37) రాణించారు. హర్ష్ దూబె (3/39), యశ్ (2/29), నచికేత్ (2/54) ప్రత్యర్థిని కట్టడి చేశారు.

హేమంత్ ఆల్‌రౌండ్ జోరు: హేమంత్ రెడ్డి ఆల్‌రౌండ్ జోరు ప్రదర్శించడంతో టోర్నీలో ఆంధ్ర బోణీ కొట్టింది. ఆలూర్‌లో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో రైల్వేస్‌ను ఓడించింది. మొదట రైల్వేస్ 9 వికెట్లకు 266 పరుగులు చేసింది. రవి సింగ్ (76), అన్ష్ యాదవ్ (59), జుబైర్ (48) రాణించారు. సత్యనారాయణ రాజు (3/41), కలిదిండి రాజు (3/68), హేమంత్ రెడ్డి (2/34) రైల్వేస్‌కు కళ్లెం వేశారు. రికీ భుయ్ (76; 74 బంతుల్లో 7×4, 3×6), నితీశ్ కుమార్‌రెడ్డి (55 నాటౌట్; 41 బంతుల్లో 3×4, 2×6), హేమంత్ (41 నాటౌట్; 35 బంతుల్లో 3×3, 3×6) మెరుపులతో ఆంధ్ర 44.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

● లిస్ట్-ఎ క్రికెట్లో అత్యధిక సగటు విరాట్ కోహ్లి (57.87)దే. గుజరాత్‌పై అర్ధసెంచరీ చేసిన అతడు.. ఆ క్రమంలో మైకేల్ బెవాన్ (ఆస్ట్రేలియా, 57.86) రికార్డును బద్దలు కొట్టాడు.
● గత ఆరు లిస్ట్-ఎ మ్యాచ్‌ల్లో కోహ్లి 3 సెంచరీలు, 3 అర్ధ సెంచరీలు సాధించాడు. ఆస్ట్రేలియాతో వన్డేలో 74 పరుగులు సాధించిన అతడు.. తర్వాత దక్షిణాఫ్రికాపై వన్డేల్లో వరుసగా 135, 102, 65 నాటౌట్ స్కోర్లు సాధించాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్రతో తొలి మ్యాచ్‌లో 131 పరుగులు సాధించిన విరాట్.. గుజరాత్‌పై 77 పరుగులు చేశాడు.

ఐఎస్ఎల్‌ను మేమే నిర్వహిస్తాం: ఏఐఎఫ్ఎఫ్

దిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)కు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) కొత్త వ్యవస్థను ప్రతిపాదించింది. దీని ప్రకారం ఏఐఎఫ్ఎఫ్ వచ్చే 20 ఏళ్లపాటు తానే యజమానిగా ఐఎస్ఎల్‌ను నిర్వహిస్తుంది. ఐఎస్ఎల్ క్లబ్‌లతో సమావేశం అనంతరం సమాఖ్య ఈ ప్రతిపాదనను సిద్ధం చేసింది. అంతా సవ్యంగా సాగితే ఫిబ్రవరి మొదటివారంలో ఐఎస్ఎల్ కొత్త సీజన్ ఆరంభమవుతుంది. "క్లబ్‌లకు మేం ప్రతిపాదన పంపాం. వాళ్ల స్పందన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటాం" అని ఐఏఎఫ్ వర్గాలు తెలిపాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ ఎఫ్ఎస్‌డీఎల్ ఇప్పటివరకు ఐఎస్ఎల్‌ను నిర్వహించింది.

కమిన్స్ పొట్టి కప్పు కోసమే..


కమిన్స్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా టెస్టు, వన్డే కెప్టెన్ ప్యాట్ కమిన్స్.. టీ20 ప్రపంచకప్‌పై దృష్టిపెట్టాడు. వెన్ను గాయం కారణంగా ఇంగ్లాండ్‌తో తొలి రెండు టెస్టులకు దూరమైన అతడు మూడో టెస్టుతో ఘనంగా పునరాగమనం చేశాడు. ఆ మ్యాచ్‌లో ఆరు వికెట్లు పడగొట్టాడు. సిరీస్ ఆసీస్ సొంతం కావడంతో చివరి రెండు టెస్టులకు కమిన్స్‌కు విశ్రాంతినిచ్చారు. విశ్రాంతి తీసుకున్నాక టీ20 ప్రపంచకప్‌పై దృష్టిపెడతానని కమిన్స్ చెప్పాడు. "ఇప్పుడు బాగున్నా. ఎలాంటి ఇబ్బంది లేకుండానే మూడో టెస్టును ముగించా. కొన్ని వారాల కిందే వెన్ను నొప్పితో బాధపడ్డా. వరుస టెస్టులు ఆడడం శ్రేయస్కరం కాదు. కాస్త విశ్రాంతి తీసుకుని.. టీ20 ప్రపంచకప్‌పై దృష్టిపెడతా" అని అన్నాడు. టీ20 ప్రపంచకప్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న మొదలు కానుంది.

రఘువంశీ స్ట్రెచర్‌పై..


రఘువంశీ

జైపుర్: ఉత్తరాఖండ్‌తో విజయ్ హజారే మ్యాచ్‌లో ముంబయి బ్యాటర్ రఘువంశీ ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డాడు. ఉత్తరాఖండ్ ఇన్నింగ్స్‌లో తనుష్ కోటియాన్ వేసిన 30వ ఓవర్లో సౌరభ్ రావత్ స్లాగ్ స్వీప్ చేశాడు. డీప్ మిడ్ వికెట్‌లో ఉన్న రఘువంశీ ఒంటి చేత్తో క్యాచ్ పట్టేందుకు డైవ్ చేశాడు. ఈ క్రమంలో అతడి తల మైదానానికి బలంగా తాకి కంకషన్‌కు గురయ్యాడు. బాధతో విలవిలలాడుతున్న అతడిని స్ట్రెచర్‌పై పెవిలియన్‌కు తీసుకొచ్చారు. నిలుచోలేని పరిస్థితి ఉండడంతో ఆసుపత్రికి తరలించారు. స్కాన్ తీసిన వైద్యులు రఘువంశీ గాయం ఆందోళన కలిగించేది కాదని తెలిపారు. అతడు డిశ్చార్జి అయి జట్టుతో కలిశాడు.

మహానగరానికి.. మంచి తరుణం..!

- గ్రేటర్ విజయవాడతోనే సర్వతోముఖాభివృద్ధి
- లేదంటే ఓ పాత నగరంలా మిగిలే అవకాశం
- విస్తరిస్తే 20 లక్షలకు పైనే జనాభా
- 31 లోగా నోటిఫికేషన్ ఇవ్వకపోతే తీవ్ర జాప్యం



విజయవాడ నగరం

ఈనాడు, అమరావతి: విజయవాడ మహానగరానికి అడుగులు మరింత త్వరితగతిన పడాల్సిన సమయమిది. ఒకవైపు ప్రపంచ స్థాయి నగరంగా అమరావతి రూపకల్పన జరుగుతున్న తరుణంలో.. విజయవాడను ఇలాగే వదిలేస్తే.. ఎలాంటి సౌకర్యాలు, మౌలిక వసతులు లేని ఓ చిన్న పాత నగరంలా మిగిలిపోతుంది. ఇప్పటికే విజయవాడకు చుట్టుపక్కల ఉన్న మైలవరం, పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని.. పదుల సంఖ్యలో గ్రామాలు, తాడిగడప లాంటి మున్సిపాలిటీలు అనధికారికంగా విలీనమైనా.. నగరపాలికలో భాగం కాకపోవడంతో అభివృద్ధికి దూరంగా ఉండిపోతున్నాయి. విజయవాడ మహానగరమైతే విస్తీర్ణం భారీగా పెరుగుతుంది. జనాభా 20 లక్షల పైనే ఉంటుంది. దీంతో వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద పెద్దఎత్తున నిధులు వస్తాయి. సీనియర్ ఐఏఎస్ అధికారులు కమిషనర్లుగా ఉంటారు. వేగంగా అభివృద్ధి చెందే వీలుంటుంది. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు మహానగరం ఆవిర్భవిస్తుంది.

విలీనంతోనే

నగరానికి ఆనుకుని ఉండే.. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ప్రాంతాలే కాకుండా గుంటూరు పరిధిలోని తాడేపల్లి, మంగళగిరి మున్సిపాలిటీలు కూడా దాదాపు విజయవాడతో కలిసిపోయాయి. వీటిని కూడా విలీనం చేస్తే.. రాష్ట్రంలోనే అతిపెద్ద నగరంగా ఏర్పడుతుంది. భవిష్యత్తులో చుట్టుపక్కల ఉండే.. గుంటూరు, తెనాలి, పరిటాల, గన్నవరం, కంకిపాడు వరకూ.. నగరం విస్తరిస్తుంది. ప్రస్తుతం గ్రేటర్ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్చజెండా ఊపడంతో అధికారులు మరింత వేగంగా చర్యలు చేపడితే దశాబ్దాల కల సాకారమవుతుంది.

గ్రేటర్ జనాభా 20లక్షల పైనే

విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో 2011 లెక్కల ప్రకారం..10.34 లక్షల జనాభా ఉంది. విలీనం చేయబోయే 74 గ్రామాల పరిధిలో ఉన్న 5.54 లక్షలతో కలిపి 15.88 లక్షలవుతుంది. రాష్ట్ర విభజన తర్వాత గత పదేళ్లలో నగర జనాభా 20 శాతానికి పైగా పెరిగింది. విలీన గ్రామాల్లోని పెరుగుదలతో కలిపితే కనీసం నాలుగైదు లక్షలు అదనంగా ఉంటుంది. ఈ లెక్కన గ్రేటర్ జనాభా.. ప్రస్తుతం అనధికారికంగా 20 లక్షలకు పైనే ఉంటుంది.

★ విజయవాడ శివార్లలోని ఏడు మండలాల్లోని గ్రామాలు విలీనం కానున్నాయి. ఇబ్రహీంపట్నం-13, విజయవాడ రూరల్ -19, జి.కొండూరు-02, కంకిపాడు-11, పెనమలూరు-08, గన్నవరం-19, ఉంగుటూరు పరిధిలో 2 గ్రామాలున్నాయి. తాడిగడప, కొండపల్లి మున్సిపాలిటీలు రెండూ విలీనం కానున్నాయి.

ఈ గ్రామాలు ఎప్పుడో భాగమైపోయాయి

విజయవాడలో ఇప్పటికే జక్కంపూడి, గొల్లపూడి, కానూరు, పోరంకి, తాడిగడప, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి ఇవన్నీ పూర్తిగా కలిసిపోయాయి. పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ఉండడంతో అభివృద్ధికి దూరంగా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు కూడా సరిగా లేవు.

★ జక్కంపూడి, వైఎస్ఆర్ కాలనీలు నగరంలో అనధికారికంగా భాగమైపోయాయి. అత్యధిక మందికి గుర్తింపు కార్డులు కూడా విజయవాడలోనే ఉన్నాయి. 30 వేలకు పైగా ఇక్కడ ఓట్లుంటే.. కేవలం 13 వేలు మాత్రమే మైలవరంలో ఉన్నాయి. శివార్లలోని అన్ని గ్రామాల పరిస్థితీ ఇదే.

తాడేపల్లి, మంగళగిరి కలిపితే

తాడేపల్లి, మంగళగిరి ప్రాంతాల్లోనూ 2014 తర్వాత జనాభా 20 శాతానికి పైగానే పెరిగిందని అంచనా. తాడేపల్లి, మంగళగిరి పేరుకు గుంటూరు జిల్లాలోనే ఉన్నా..ఎక్కువగా ఆధారపడేది విజయవాడపైనే. తాడేపల్లి, మంగళగిరి మున్సిపాలిటీలను కూడా గ్రేటర్ విజయవాడలో విలీనం చేస్తే నగర పరిధి భారీగా పెరుగుతుంది. గ్రేటర్ విజయవాడ ఏర్పడితే విస్తీర్ణం 661.79 చ.కి.మీ. అవుతుంది. తాడేపల్లి, మంగళగిరి కూడా కలిస్తే. . మహానగరపాలక సంస్థగా మారుతుంది.

కొందరు నేతలు మోకాలడ్డుతున్నారు

చిన్న పంచాయతీలు, మున్సిపాలిటీలుగా ఉంటేనే తమ చెప్పుచేతల్లో ఉంటాయని, నచ్చినట్టు పనులు చేయించుకోవచ్చని కొందరు ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. అందుకే వీరు గ్రేటర్ విజయవాడలో విలీనం వద్దంటూ.. మోకాలడ్డుతున్నారు. గ్రేటర్‌గా మారితే.. అక్కడ ఉన్నతాధికారులుంటారని, తమ మాట వినే పరిస్థితి ఉండదనేది వీరి భయం.

★ గ్రేటర్ ఏర్పాటుకు డిసెంబర్ 31లోగా నోటిఫికేషన్ కచ్చితంగా ఇస్తేనే.. ప్రక్రియ పట్టాలెక్కుతుంది. లేదంటే జనవరి నుంచి జనగణన ప్రారంభమవుతుంది. అధికారులంతా నెలల తరబడి ఆ పనుల్లో తలమునకలై ఉంటారు. ఆ తర్వాత పంచాయతీల ఎన్నికల కోడ్ వస్తుంది. ఎన్నికలు జరిగితే ఈ పంచాయతీలకు కొత్త సర్పంచులొస్తారు. ఎన్నికైన వెంటనే విలీనమంటే అంగీకరించరు. దీంతో గ్రేటర్ ప్రతిపాదన మళ్లీ మొదటికొస్తుంది.

★ విలీన ప్రాంతాల్లో గ్రామసభలు పెట్టి తీర్మానాలు చేసిన తర్వాత నోటిఫికేషన్ ఇవ్వాలంటే.. ఈ నెలాఖరులోగా పూర్తవడం కష్టం. అందుకే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించి.. గెజిట్‌ను విడుదల చేస్తే.. వెంటనే ప్రక్రియను ప్రారంభించవచ్చని ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నారు. తాజాగా హైదరాబాద్ మహానగరపాలక సంస్థ పరిధిని పెంచి 300 డివిజన్లుగా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇలాగే గెజిట్‌ను విడుదల చేసింది. ఇదే విధానం ఇక్కడా అమలు చేస్తే బాగుంటుందని చెబుతున్నారు.

వచ్చే ఐదేళ్లలో నాలుగు రైల్వేస్టేషన్ల సామర్థ్యం రెట్టింపు

- వాటిలో హైదరాబాద్, విశాఖ, విజయవాడ, తిరుపతి
- దేశవ్యాప్తంగా మొత్తం 48 స్టేషన్ల ఎంపిక

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా రైలు ప్రయాణాలకు డిమాండ్ నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో దేశంలోని 48 ప్రధాన రైల్వేస్టేషన్ల సామర్థ్యాన్ని వచ్చే ఐదేళ్లలో రెట్టింపు చేయనున్నట్లు రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి స్టేషన్లు ఉన్నాయి. ఇక్కడ 2030 నాటికి ఇప్పుడున్న టెర్మినళ్లలో అదనపు ప్లాట్‌ఫామ్‌లు, స్టేబ్లింగ్ లైన్లు, పిట్ లైన్లు, తగిన మోతాదులో షంటింగ్ సౌకర్యాలు ఏర్పాటుచేస్తారు. ఈ నగరాల చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త రైల్వే టెర్మినళ్ల నిర్మాణం చేపడతారు. మెగా కోచింగ్ కాంప్లెక్సులు ఏర్పాటుచేస్తారు. సిగ్నలింగ్ ఆధునికీకరణ, పెరిగే రైలు సర్వీసులకు అనుగుణంగా మల్టీట్రాక్‌లు నిర్మిస్తారు. ఈ పనులన్నింటినీ రాబోయే ఐదేళ్లలో దశలవారీగా చేపడతారు. ప్రతి డివిజన్‌లో ట్రైన్ హ్యాండ్లింగ్ సామర్థ్యాన్ని పెంచేలా ప్రణాళికలు తయారుచేయాలని ప్రతి రైల్వేజోన్‌నూ ఆదేశించారు. టెర్మినల్ సామర్థ్యం పెంచడమే కాకుండా మొత్తం సెక్షన్ సామర్థ్యాన్నీ పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైళ్ల నిర్వహణ విషయంలో స్టేషన్లు, యార్డుల్లో ఎదురవుతున్న ఇబ్బందులనూ పరిష్కరించేలా ప్రణాళికలు రూపొందించాలని నిర్దేశించారు.

జోగి రమేష్ చెప్పినట్లే చేశాం

- నకిలీ మద్యం తయారీ కేంద్రం ఏర్పాటుకు డబ్బులిచ్చింది ఆయనే
- నిందితులు అద్దేపల్లి సోదరుల వాంగ్మూలం



జనార్దన్‌రావును సబ్ జైలు నుంచి కస్టడీకి తీసుకెళ్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఈనాడు- కడప; న్యూస్‌టుడే- ములకలచెరువు: మాజీ మంత్రి జోగి రమేష్ సూచనతోనే ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కేసులోని కీలక నిందితులు అద్దేపల్లి జనార్దన్‌రావు, ఆయన సోదరుడు జగన్మోహన్‌రావు ఎక్సైజ్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు.

కోర్టు అనుమతితో జనార్దన్‌రావు, అతని సోదరుడు జగన్మోహన్‌రావులను శుక్రవారం వేర్వేరుగా విచారించారు. నకిలీ మద్యం తయారీ కేంద్రం ఏర్పాటుకు జోగి రమేష్ ఆర్థికసాయం అందజేశారని.. తనను ఆఫ్రికాకు పంపించాక ఎక్సైజ్ అధికారులకు ఉప్పందించి దాడులు చేయించారని జనార్దన్‌రావు చెప్పినట్లు తెలిసింది. లేబుల్ తయారీకి సహకరించిన తిరుమలశెట్టి శ్రీనివాసరావు (ఏ27), రమేష్‌బాబు (ఏ28), అల్లాబక్ష్ (ఏ29)లను మూడు రోజులపాటు విచారించేందుకు కోర్టు అనుమతిచ్చింది. దీంతో ఎక్సైజ్ పోలీసులు మదనపల్లె సబ్‌జైల్ నుంచి శుక్రవారం వీరిని కస్టడీలోకి తీసుకున్నారు. శనివారం విచారించనున్నారు.

శ్రీశాంతి ఆశ్రమ పీఠాధిపతి జ్ఞానేశ్వరి మాతాజీ కన్నుమూత



ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం తోటపల్లి కొండల్లోని ఆధ్యాత్మిక కేంద్రం శ్రీశాంతి ఆశ్రమం పీఠాధిపతి జ్ఞానేశ్వరి మాతాజీ (95) శుక్రవారం ఉదయం కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురవడంతో కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చగా.. శుక్రవారం ఉదయం 6.40 గంటలకు శివైక్యం చెందారని ఆశ్రమ వర్గాలు తెలిపాయి. మాతాజీ పార్థివదేహాన్ని ఆశ్రమంలో భక్తుల సందర్శనార్థం ఉంచారు. శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తారు. 1917లో శ్రీశాంతి ఆశ్రమాన్ని ఓంకార స్వామి ఏర్పాటు చేశారు. ఆయన మరణానంతరం జ్ఞానేశ్వరి మాతాజీ 1982 నుంచి ఆశ్రమ పీఠాధిపతిగా ఉన్నారు. ఆశ్రమం ఆధ్వర్యంలో పాఠశాల, ప్రజావైద్యశాల, పశువైద్యశాలలను ఏర్పాటు చేసి తోటపల్లి పరిసర 20 గ్రామాలకు మౌలిక వసతులు సమకూర్చారు. కాకినాడ, పిఠాపురం, విశాఖపట్నంలోని పెదవాల్తేరు, కైలాసగిరి, తమిళనాడు రాష్ట్రం ఊటీలోని కోటగిరిల్లో ఈ ఆశ్రమ శాఖలు ఉన్నాయి.

విద్యుత్ టవర్లను ఆనుకుని మట్టి తవ్వకాలపై చర్యలు

- లారీలు, పొక్లెయిన్లు సీజ్
- 'ఈనాడు' కథనానికి స్పందన

ఈనాడు, అమరావతి: విద్యుత్ టవర్లు ఉన్న ప్రాంతంలో తవ్వకాలు జరుపుతున్న పొక్లెయిన్లు, లారీలను సీజ్ చేసినట్లు ఏపీ ట్రాన్స్‌కో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. టవర్లను ఆనుకుని తవ్వకాలు జరిపిన ప్రాంతానికి సంబంధించిన కౌలుదారులకు గుంతలు పూడ్చాలని నోటీసులు జారీ చేసినట్లు పేర్కొంది. 'విద్యుత్ టవర్లనూ వదలని మట్టి మాఫియా' శీర్షికన 'ఈనాడు'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. 'టవర్ల సమీపంలో మట్టి తవ్వకాలు జరపడంపై రెవెన్యూ, గనులు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశాం. బొమ్మూరు-కొండగుంటూరు 132 కెవి లైన్ 40 ఏళ్ల కిందట, వేమగిరి-సామర్లకోట 220 కెవి లైన్ 25 ఏళ్ల కిందట ఏర్పాటు చేశాం. ఈ ప్రాంతంలో గనులశాఖ 10 ఏళ్లుగా తవ్వకాలకు అనుమతులు ఇస్తోంది. తవ్వకాల వల్ల టవర్లకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. తనిఖీ బృందాలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాయి. ప్రస్తుతం మట్టి తవ్వకాలు నిలిపివేయించాం' అని ట్రాన్స్‌కో తెలిపింది.

ముగ్గురు పట్టణ ప్రణాళిక అధికారుల సస్పెన్షన్ కొనసాగింపు

ఈనాడు, అమరావతి: గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు చెందిన వాణిజ్య సముదాయ భవనాన్ని అక్రమంగా కూల్చివేసిన ఘటనలో ముగ్గురు పట్టణ ప్రణాళిక అధికారుల సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. టౌన్ సర్వే నంబరు 5/1, 5/3లో నిర్మాణంలో ఉన్న భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా, సంబంధిత పోర్టల్‌లో నోటీసు కూడా పెట్టకుండా 2021 ఏప్రిల్ 25న మహా విశాఖ నగరపాలక సంస్థ(జీవీఎంసీ) ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదుపై విచారణ చేయించిన ప్రభుత్వం జీవీఎంసీ జోన్-6 డిప్యూటీ సిటీ ప్లానర్(డీసీపీ) టి.నరేంద్రరెడ్డి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్(టీపీఎస్) ఎస్.వరప్రసాద్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్(టీపీవో) ఎస్.వినయ్ ప్రసాద్‌ని ఇప్పటికే సస్పెండ్ చేసింది. దీనిపై తాజాగా సమీక్షించిన ప్రభుత్వం ముగ్గురు అధికారుల సస్పెన్షన్‌ను కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

108 వాహనాల కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె నోటీసు

ఈనాడు, అమరావతి: సమస్యలు పరిష్కరించకపోతే జనవరి 12 నుంచి సమ్మెకు దిగుతామని ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రకటించింది. సంఘంఅధ్యక్షుడు కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు వైద్య ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి కార్యాలయంలో సమ్మె నోటీసు అందించారు.

EENADU Vol: 52, Issue: 137 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



ఈనాడు



విజయవాడ 27-12-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 137

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



R.S. Brothers™
MEGA SHOPPING MALL
NEW YEAR 2026 SALE
పట్టు చీరలపై ప్రత్యేకమైన ఆఫర్లు మీకోసం...
షాపింగ్ చేయండి. అద్భుతమైన ఆఫర్లు పొందండి
RUPEE SALE
PURE LINEN COTTON @ ₹499 GET 2ND SAREE@ ₹1
AMBANI SAREE @ ₹798 GET 2ND SAREE@ ₹1
PURE BANARASI @ ₹850 GET 2ND SAREE@ ₹1
PURE SAIYAARA @ ₹1195 GET 2ND SAREE@ ₹1
KEERTHY SILK @ ₹1250 GET 2ND SAREE@ ₹1
BANARASI KATAN SILK @ ₹2495 GET 2ND SAREE@ ₹1
SAREES
BUY 3 @ ₹500 RANG COTTON SAREE
KANJIVARAM BROCADE SAREE ₹1198 ₹599 50% OFF
₹325 ₹199 KAVERI PRINT SAREE
50% OFF ₹398 ₹199 NAVYA TISSUE SAREE
50% OFF ₹550 ₹275 RICCO PATTU SAREE
50% OFF ₹596 ₹298 VISTHARA PRINT SAREE
50% OFF ₹598 ₹299 DOLA PRINT SAREE
BUY 3 @ ₹550 TURKEY SILK
BUY 3 @ ₹598 LINEN COTTON SAREE
50% OFF ₹650 ₹325 VISCOS PRINT SAREE
50% OFF ₹698 ₹349 GATTU SILK SAREE
50% OFF ₹798 ₹399 TUSSER SILK SAREE
50% OFF ₹950 ₹475 DHARMAVARAM SILK SAREE
₹478 ₹295 SINDOOR SILK SAREE
₹795 ₹350 MOKSHA PATTU SAREE
₹850 ₹395 DEEPIKA WORK SAREE
₹895 ₹450 BANGLORE SILK SAREE
₹950 ₹495 SRI VALLI SAREE
₹1395 ₹650 CHINNON PATTU SAREE
50% OFF ₹1198 ₹599 TISSUE PATTU SAREE
50% OFF ₹1250 ₹625 BANARASI PATTU SAREE
50% OFF ₹1498 ₹749 MAHESHWARI PATTU SAREE
50% OFF ₹1550 ₹775 JOHRIVAAJ CATALOG SAREE
PATTU SAREE
BUY 1 MEENAKARI PATTU SAREE @4995 & GET 2ND SAREE @ ₹49
BUY 1 POCHAMPALLY WORK SAREE @3995 & GET 2ND SAREE @ ₹39
LADIES WESTERN & LEISURE WEAR
BUY 5 @ ₹500 DUPATTAS
BUY 4 @ ₹500 COTTON NIGHTY
BUY 3 @ ₹555 PRINTED PLAZO
UPTO 50% ₹595 KURTHIS
UPTO 50% ₹695 KURTHIS
UPTO 50% ₹695 STRAGHIT PANTS
UPTO 50% ₹795 KURTHIS
BUY 2 @ ₹799 ALPINE NIGHY
UPTO 50% ₹895 KURTHIS
UPTO 50% ₹995 KURTHIS
UPTO 50% LADIES JEANS
UPTO 30% OFF HEAVY WORK LEHENGAS
BUY 3 @ ₹1199 NIGHT DRESS
BUY 2 @ ₹1499 COTTON PATIYALA SUIT
BUY 2 @ ₹2599 FANCY LEHENGAS
GIRLS WEAR
UPTO 50% ₹495 GIRLS SKIRTS
BUY 4 @ ₹500 GIRLS SHORTS
BUY 4 @ ₹500 GIRLS PYJAMA
BUY 4 @ ₹550 GIRLS PYJAMA
BUY 4 @ ₹550 GIRLS T-SHIRTS
BUY 4 @ ₹600 GIRLS TRACK PANT 3/4
BUY 3 @ ₹695 GIRLS COTTON FROCKS
BUY 3 @ ₹895 GIRLS COTTON FROCKS
BOYS WEAR
BUY 4 @ ₹550 BOYS T-SHIRTS
BUY 4 @ ₹595 BOYS T-SHIRTS
BUY 4 @ ₹600 BOYS T-SHIRTS
UPTO 50% ₹645 BOYS SHIRTS
UPTO 50% ₹695 BOYS SHIRTS
BUY 3 @ ₹745 BOYS T-SHIRTS -NECKER
UPTO 50% ₹995 PANTS
UPTO 50% ₹1095 PANTS
UPTO 50% ₹1195 PANTS
SUITING & SHIRTING
Arvind LINEN CLUB GIZA HOUSE OCM Raymond Reid & Taylor SÖKTAS DIGJAM
SPECIAL OFFERS ON LEADING MENS WEAR BRANDS
MENS WEAR
JACK&JONES
BUY 1 @ 30% OFF BUY 2 @ 40% OFF BUY 4 @ 50% OFF
Allen Solly
BUY 2 @ 40% OFF BUY 3, GET 3 FREE
MONTE CARLO
FLAT 20%
MUFTI
BUY 1 @ 25% OFF BUY 2 @ 40% OFF BUY 4 @ 50% OFF
benetton
BUY 1 @ 20% OFF BUY 2 @ 30% OFF BUY 4 @ 40% OFF
rockit CROCODILE
BUY 1 @ 20% OFF BUY 2 @ 30% OFF
BUY 1 @ 20% OFF BUY 2 @ 30% OFF BUY 3 @ 40% OFF
BUY 1 @ 20% OFF BUY 2 @ 30% OFF BUY 3 @ 40% OFF BUY 4 @ 50% OFF
BUY 2, GET 1 FREE BUY 1 @ 20% OFF
BUY1 GET 1 ₹295 BLANKETS
BUY 4 ₹199 TOWELS
BUY 4 ₹499 SINGLE BEDSHEETS SET
BUY 3 ₹999 DOUBLE BEDSHEETS SET
HOME FURNISHING
The withdrawal of offers and schemes is solely at the discretion of management.
*Conditions Apply
R.S. Brothers™
MEGA SHOPPING MALL
బీసెంట్ రోడ్ క్రాస్, ఏలూరు రోడ్ విజయవాడ
బందర్ రోడ్ విజయవాడ
TOLL FREE 1800 570 1999
Email : info@rsbrothers.net | Shop us @ www.rsbrothers.net Follow us on : RSBrothersIndia rsbrothersindia

రేపు ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుకలు

ఈనాడు - అమరావతి: తెలుగువారి ప్రియపత్రిక ఈనాడు దినపత్రిక 50 వసంతాలు పూర్తిచేసుకుంది. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. 'ఈటీవీ.. మీటీవీ' అనగానే మూడు దశాబ్దాలుగా తెలుగు ప్రజలు అక్కున చేర్చుకున్నారు. ✦ ఈ సందర్భంగా ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుకలకు విజయవాడ వేదిక కాబోతోంది. ఈనెల 28న నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వేడుకలు సాయంత్రం 6 గంటల నుంచి అంగరంగ వైభవంగా జరగబోతున్నాయి. ✦ సినీ గీతాలు, కడుపుబ్బ నవ్వించే హాస్యం, డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌లతో ఉర్రూతలూగించేలా పలు కార్యక్రమాలు ఈ వేడుకల్లో ఉంటాయి. ✦ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాస్యబ్రహ్మ బ్రహ్మానందం హాజరవుతున్నారు. ప్రముఖ సినీ నేపథ్య గాయనీ గాయకులు విజయ్‌ప్రకాష్, నేహా, సమీరా భరద్వాజ్, మంగ్లీ, రిషిల్, దినకర్, హరిప్రియ, రేవంత్ తదితరులు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. ✦ సినీ నటి మానసచౌదరి, బొమ్మరిల్లు శిరీష డ్యాన్స్‌లతో అలరిస్తారు. బుల్లితెర నటి, ప్రయోక్త సుమ యాంకర్‌గా వ్యవహరిస్తారు. ✦ ఆద్యంతం వినోద భరితంగా సాగే ఈ కార్యక్రమంలో పాల్గొనాలంటే.. పాస్‌లు తప్పనిసరి.

నేడు పాస్‌ల పంపిణీ...

✦ డిసెంబర్ 27న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానం వద్ద పాస్‌లు పంపిణీ చేస్తారు.
✦ పాస్‌తోపాటు ప్రత్యేక ఆకర్షణగా ఇచ్చే రిస్ట్ బ్యాండ్‌లను ధరించిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుంది.

కేఎల్‌యూ 15వ స్నాతకోత్సవం నేడు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం 15వ స్నాతకోత్సవాన్ని శనివారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథులుగా నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా అధ్యక్షుడు ఆచార్య వినోద్. కె.సింగ్, గౌరవ అతిథులుగా ముంబయి టాటా మెమోరియల్ సెంటర్ పీడియాట్రిక్ హెమటో ఆంకాలజీ చాప్టర్ ఆఫ్ ఐఏపీ ఛైర్‌పర్సన్ డాక్టర్ శ్రీపాద్ బానావలి పాల్గొంటారు. 2025లో చదువు పూర్తి చేసిన 5000 మందికి డిగ్రీలు ప్రదానం చేయనున్నారు.

పాస్ పుస్తకాల కోసం..

రైతులు మీ చుట్టూ తిరగాలా?

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం ★ డీఆర్సీలో ఆర్డీవోపై ఎమ్మెల్యే తాతయ్య అసహనం

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, సూర్యారావుపేట

'రెవెన్యూ సేవల దరఖాస్తులను అధికారులు పట్టించుకోవడం లేదు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పిస్తున్నారు. మ్యుటేషన్, ఆన్‌లైన్ చేసేందుకు, పాస్ పుస్తకాలకు దరఖాస్తు చేసుకుంటే వాటి గురించి పట్టించుకోకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. పాసుపుస్తకాల మంజూరులో నందిగామ ఆర్డీవో రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దరఖాస్తుల పరిష్కారంలో నిర్లిప్తంగా ఉన్నారు.' అని శుక్రవారం విజయవాడలో జరిగిన ఎన్టీఆర్ జిల్లా సమీక్షా సమావేశంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'మ్యుటేషన్‌కు సంబంధించిన ఫైళ్లు అసలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియడం లేదు. ఒక కేసులో 22ఏ జాబితా నుంచి భూమిని తొలగించేందుకు దాదాపు రెండేళ్లు పట్టిందని' అన్నారు. 'జగ్గయ్యపేట పారిశ్రామికవాడ స్థలాల కేటాయింపులో స్థానిక ఎమ్మెల్యేగా అధికారులు నాకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదు. కొందరు తెరవెనుక వ్యవహారం చేస్తున్నారు. దీనిపై అధికారులు సైతం వారికే అనుకూలంగా వ్యవహరిస్తున్నారు.' అని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఏపీఐఐసీ అధికారులు జవాబిస్తూ స్థలాల కేటాయింపు జరగలేదన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్. పక్కన డీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కలెక్టర్ లక్ష్మీశ

శివారు గ్రామాలను విలీనం చేయాలి : ఎమ్మెల్యే యార్లగడ్డ

గత సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన వివిధ అంశాలు వాటిపై తీసుకున్న చర్యలపై చర్చించారు. ఎన్ని అంశాలు పరిష్కారమయ్యాయి? వివిధ దశల్లో ఉన్నవి ఎన్ని? తదితర అంశాలను విశ్లేషించారు. పరిశ్రమలు, వైద్య ఆరోగ్యం, రహదారులు, వ్యవసాయ అనుబంధ రంగాలు, శాంతిభద్రతలు, పోలీస్ కమిషనరేట్ అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు, జీవో నంబరు 30, పీఎం సూర్యఘర్‌పై సమీక్షించారు. గన్నవరం నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం ఉన్న 9 గ్రామాలను విజయవాడ నగరపాలిక పరిధిలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. ఈ గ్రామాలను మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా వేధిస్తోందని, నగరానికి ఆనుకుని ఉండడంతో వేలాది మంది అక్కడ నివసిస్తున్నారని, కార్పొరేషన్‌లో కలిపితే అన్ని వసతులు సమకూరుతాయన్నారు. ★ కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. ఎ.కొండూరులో ప్రతి వారం నెఫ్రాలజిస్ట్ వైద్యసేవలు అందిస్తున్నామని, దీనికి సంబంధించి గిరిజన తండాల్లో ప్రచారం చేస్తున్నామన్నారు. కృష్ణా జలాల పంపిణీపై ట్రయల్ రన్ జరుగుతోందని, త్వరలోనే పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామని వివరించారు.

టెండర్లు, డీపీఆర్‌లపై దృష్టి: మంత్రి సత్యకుమార్

గత సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన 61 అంశాలకు సంబంధించి 11 అంశాలు పరిష్కారం అయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. టెండర్ల ప్రక్రియతో పాటు డీపీఆర్‌ల రూపకల్పనపై దృష్టి సారిస్తున్నాం. 2023-24లో తలసరి ఆదాయం రూ.3.21లక్షలు కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.4.17లక్షలు లక్ష్యంగా పెట్టుకున్నాం. జీడీపీ 2024-25లో రూ.94,561 కోట్లు కాగా 2025-26లో రూ.1,12,148 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నాం.

ప్రజాప్రతినిధులకు అంత తీరిక లేదా?

ఇన్‌ఛార్జి మంత్రి సత్యకుమార్, అన్ని శాఖల అధికారులు హాజరైన డీఆర్సీ సమావేశానికి జిల్లా నుంచి జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాత్రమే హాజరయ్యారు. ఎంపీ కేశినేని శివనాథ్ సహా మిగిలిన ఆరుగురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధం లేని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ హాజరైనా.. ఎన్టీఆర్ జిల్లా ప్రజాప్రతినిధులు మాత్రం రాలేదు. జిల్లా అభివృద్ధికి కీలకమైన సమావేశానికి రాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మీ బహుమతి.. ప్రాణం నిలబెడుతుంది!

రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం వాడాలని పోలీసులు నిరంతరం సూచిస్తూనే ఉన్నారు. అయినా కొందరు ఇప్పటికీ హెల్మెట్ లేకుండానే వెళ్తున్నారు. దీనికోసం విజయవాడ నగర పోలీసులు వినూత్నంగా ప్రచార బోర్డులు ఏర్పాటు చేశారు. పెళ్లిళ్లు, వేడుకలకు వచ్చే స్నేహితులు, బంధువులకు రిటర్న్ గిఫ్ట్‌లు ఇస్తుంటారు. అలా బహుమతిగా ఒక హెల్మెట్‌ని అందిస్తే వారి ప్రాణాలను కాపాడుతుందని సందేశం ఇస్తున్నారు.

-ఈనాడు అమరావతి



అలవాటు చేసి.. అగాధంలోకి తోసేసి..

- యువకులను మత్తుకు బానిసలుగా చేస్తున్న రౌడీషీటర్లు
- గంజాయి అమ్మకాల ఆదాయంతో గ్యాంగుల నిర్వహణ

నగరంలో రౌడీషీటర్లు, గంజాయి విడదీయలేని విధంగా పెనవేసుకుపోయాయి. గంజాయిని ఆదాయవనరుగా మార్చుకుని గ్యాంగులను పోషిస్తున్నారు. వీరిపై పటిష్టమైన నిఘా కొరవడడంతో కార్యకలాపాలకు అడ్డుకట్ట పడడం లేదు.

– ఈనాడు, అమరావతి



ఏజెన్సీ నుంచి తెప్పిస్తూ..

నగరంలో 470 మంది రౌడీషీటర్లు, 350 మంది సస్పెక్ట్ షీటర్లు ఉన్నారు. రౌడీషీటర్లలో 130 మంది క్రియాశీలకంగా ఉంటూ తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. సుమారు 55 మందిపై పోలీసులు నగర బహిష్కరణ విధించారు. వీరిలో పలువురు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తెప్పించి నగరంలో అమ్ముతూ ఆదాయం పొందుతున్నారు. నగరంలో దందాలు చేస్తూ ప్రైవేటు సైన్యాన్ని పెంచి పోషిస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు రౌడీషీట్ తెరుస్తున్నా పూర్తి స్థాయి నిఘా కొరవడింది. ప్రతి వారం నిర్వహించే రౌడీ షీటర్ల కౌన్సెలింగ్ మొక్కుబడిగా సాగడమే ఈ పరిస్థితికి కారణమైంది. సరైన నిఘా లేకపోవడంతో రికార్డులకు ఎక్కని ఎంతో మంది అసాంఘిక శక్తులుగా చలామణి అవుతున్నారు.

✪ రౌడీషీటర్ **హేమంత్** అలియాస్ నాని ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో గంజాయి కొని తెచ్చి నగరంలో విక్రయించేవాడు. అనుచరులతో కలిసి విద్యార్థులు, పనులు చేసుకునే యువకులను గుర్తించి వారికి గంజాయి సరఫరా చేసి బానిసలుగా మార్చాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆర్డర్లు తీసుకుంటాడు. ఆటోలో వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ గంజాయి ప్యాకెట్లను అందిస్తుంటాడు.

✪ **అన్నదమ్ములైన మనోజ్, రాజేష్** పలువురు యువకులను గంజాయికి బానిసలుగా మార్చి తమ కార్యకలాపాలకు ఉపయోగించుకుంటున్నారు. కొంత గంజాయిని హైదరాబాద్‌కు పంపించి అక్కడా విక్రయిస్తుంటారు. కేజీ రూ.10వేల నుంచి రూ.15వేల వరకు అమ్ముతుంటారు. హైదరాబాద్‌కు ద్విచక్ర వాహనాలపై పంపిస్తుంటారు.

అటూ.. ఇటూ కార్యకలాపాలు

విజయవాడలో నగర బహిష్కరణకు గురైన రౌడీషీటర్లు పోలీసులకు చిక్కకుండా.. కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోకి వచ్చే శివారు ప్రాంతాల్లో మకాం వేస్తున్నారు. రాత్రి సమయాల్లో కార్యకలాపాలు చేస్తున్నారు. జిల్లా విభజన తర్వాత పెనమలూరు మండలం కృష్ణా పరిధిలోకి వెళ్లింది. దీంతో విజయవాడ నగరానికి ఆనుకుని ఉన్న యనమలకుదురు, కానూరు, పోరంకి, తదితర ప్రాంతాల్లో వీరు నివాసం ఉంటున్నారు. మరికొందరు ఐదు కి.మీ దూరంలోని తాడేపల్లిలో ఉంటున్నారు. నగర పోలీసులు రెండు జిల్లాల పోలీసుల సమన్వయంతో సాగితేనే రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుంది.

నిమ్మకూరు అభివృద్ధి బాధ్యత నాది

ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ భువనేశ్వరి

పామర్రు(గ్రామీణం, కూచిపూడి, కోనేరుసెంటర్, న్యూస్‌టుడే: 'నిమ్మకూరు ప్రజలు సంతోషంగా ఉండేందుకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తాను. గ్రామంలో అసంపూర్తిగా వదిలేసిన పనులు, రోడ్లు, పాఠశాల, కళాశాలలో సమస్యలపై.. అందిన అర్జీలన్నింటినీ జిల్లా కలెక్టర్, అధికారుల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా నా వంతు కృషి చేస్తాను.' అని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ నారా భువనేశ్వరి వెల్లడించారు. నిమ్మకూరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో ఆమె ముఖ్యఅతిథిగా శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు రోడ్డు పొడవునా స్వాగత తోరణాలు ఏర్పాటు చేసి ఆమెను సాదరంగా ఆహ్వానించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, తెదేపా జిల్లా అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి తదితరులు పాల్గొని.. నారా భువనేశ్వరిని ఆహ్వానించారు. ★ నిమ్మకూరు, కొమరవోలు గ్రామాలకు చెందిన వారికి.. నూతన వస్త్రాలు, మిఠాయిలతో కూడిన కిట్లను భువనేశ్వరి అందజేశారు. ★ భువనేశ్వరి బంధుమిత్రులు, గ్రామస్థులు కలిసి శాలువాలు కప్పి, పూలమాలలు, జ్ఞాపికలు అందించి సత్కరించారు. స్థానిక మహిళలు మంగళహారతులతో స్వాగతించారు. ★ గ్రామంలోని పార్వతీ సమేత బుద్దేశ్వరస్వామి, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాలను సందర్శించి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ★ కార్యక్రమంలో ఉప సర్పంచి నందమూరి జయకృష్ణప్రసాద్, జిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ వల్లూరుపల్లి గణేష్, తెదేపా మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, పామర్రు, మొవ్వ ఏఎంసీ ఛైర్మన్లు జన్ను శోభన్‌బాబు, దోనేపూడి శివరామయ్య పాల్గొన్నారు. ★ స్థానిక గురుకుల పాఠశాల కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి విద్యార్థుల ఆంగ్ల నైపుణ్యాన్ని పరిశీలించారు.


నూతన హాస్టల్ భవనాన్ని ప్రారంభించిన ఆనందంలో..


భువనేశ్వరికి గ్రామస్థుల ఆత్మీయ పలకరింపు


మహిళల సింగిల్స్ సెమీఫైనల్‌కు చేరిన తెలంగాణ క్రీడాకారిణి రక్షితశ్రీ



విజయవాడలోని చెన్నుపాటి ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పురుషుల డబుల్స్‌లో ఆడుతున్న భార్గవ్‌రామ్, విశ్వతేజ (ఆంధ్రప్రదేశ్)

-ఈనాడు, అమరావతి

దుర్గగుడి.. విద్యుత్తుశాఖ మధ్య వివాదం

☆ రూ.3.08కోట్ల బిల్లు బకాయిలంటున్న ఏపీసీపీడీసీఎల్
☆ సౌర విద్యుత్తు ప్లాంట్‌తోనే పరిష్కారమంటున్న దేవస్థానం

ఈనాడు, అమరావతి, సూర్యారావుపేట, న్యూస్‌టుడే

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం విద్యుత్తు బకాయిలు రూ.3.08 కోట్లు తమకు రావాలంటూ ఏపీసీపీడీసీఎల్ చెబుతోంది. 2023 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు ఒక్క పైసా కూడా బిల్లులు చెల్లించకుండా విద్యుత్తును వాడుకుంటున్నారంది. బకాయిలు చెల్లించాలంటూ అనేకసార్లు నోటీసులు జారీ చేసినా దుర్గగుడి అధికారుల్లో స్పందన ఉండడం లేదని విద్యుత్తు అధికారులు పేర్కొంటున్నారు. బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలంటూ.. శనివారం ఉదయం చర్యలకు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం.' ☛ దుర్గగుడి అధికారులు మాత్రం విజయవాడ శివార్లలోని పాతపాడులో ఐదు ఎకరాల్లో తాము రూ.కోట్లను వెచ్చించి.. ఏర్పాటు చేసిన సౌర ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అవుతున్న విద్యుత్తును. . ఆ శాఖకు ఇస్తుండడంతో తాము బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంటున్నారు. దీంతో ఈ వ్యవహారం ఇప్పుడు రెండు శాఖల మధ్య వివాదంగా మారుతోంది. ☛ దేవస్థానానికి సర్కిల్ 01 పరిధిలో ఒక హెచ్‌టీ 'విజేఏ257', 10 ఎల్‌టీ సర్వీసులు ఉన్నాయి. ఈ 11 సర్వీసుల ద్వారా విద్యుత్తును వినియోగించుకుంటున్నారు. ఒక మెగావాట్ సౌర విద్యుత్తు ప్లాంట్‌ను నున్న మండలంలోని పాతపాడులో ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి అయిన విద్యుత్తును 12 నెలల పాటు గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. ఆ తరవాత సాంకేతిక కారణాలతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్తును పంపిణీ సంస్థ నమోదు చేయకపోవడంతో బిల్లులు చెల్లించాలంటూ తాఖీదులిస్తున్నారు.

మహిళకు రూ.32 లక్షల టోకరా

పెనమలూరు, న్యూస్‌టుడే: లండన్‌లో ఉద్యోగమంటూ ఓ మహిళ నుంచి ఆన్‌లైన్ మోసగాడు రూ.32 లక్షలు కొట్టేశాడు. కృష్ణా జిల్లా పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడపకు చెందిన ఓ మహిళ లండన్‌లో ఉద్యోగం చేస్తూ గతేడాది తిరిగి స్వదేశానికి వచ్చేసింది. తిరిగి లండన్‌లో ఉద్యోగం చేయడానికి ఇటీవల ప్రయత్నాలు ప్రారంభించింది. ఉద్యోగావకాశాల కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతుండగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఈమెకు మైఖేల్ విన్సెంట్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తాను ఇమ్మిగ్రేషన్‌లో పని చేస్తున్నానని, యూకేలో ఉద్యోగ నియామకాల వ్యవహారాలను తానే చూస్తుంటానని నమ్మబలికాడు. ఈ మాటలు నమ్మిన ఈమె రూ.లక్ష పంపగా.. గత అక్టోబరులో ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇంటర్వ్యూకు హాజరైన తర్వాత ఈమెకు లండన్‌లోని థాట్‌వర్క్స్ లిమిటెడ్ సంస్థలో సహాయ మేనేజరుగా ఎంపికైనట్లు ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా నకిలీ ఈ-మెయిల్ పంపాడు. ఇది నిజమేనని నమ్మిన ఆమె మైఖేల్ విన్సెంట్‌కు రూ.32 లక్షలు పంపింది. వీసా, బయోమెట్రిక్‌ల కోసం ఎదురుచూస్తుండగా మరో రూ.7500 పౌండ్లు పంపాలని ఇంకో ఈ-మెయిల్ వచ్చింది. దీంతో బాధితురాలికి అనుమానం వచ్చి మెయిల్స్‌ను తనిఖీ చేసుకోగా సంబంధిత ఈ-మెయిల్ డొమైన్ ఉనికిలో లేనట్లు గుర్తించింది. మోసపోయినట్లు గ్రహించి శుక్రవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంచ్ చామంతి.. భలే ఉంది..



కుండీలో పెరిగిన ఈ మొక్క పేరు బంచ్ చామంతి. దీనిని చూస్తే అచ్చం పుష్పగుచ్ఛంలా అనిపిస్తుంది. అన్ని పూలూ ఒక మొక్కకే పూస్తాయి. నగరంలోని బెంజిసర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లవర్‌షోలో రంగులను బట్టి రూ.250 నుంచి రూ.400 వరకు బంచ్ చామంతి మొక్కలను విక్రయిస్తున్నారు. -ఈనాడు, అమరావతి

తప్పులు సరిదిద్దాలి.. సాఫీగా సాగాలి

జనవరి-2 నుంచి 4వ విడత రీసర్వే మొదలు

ఈనాడు, అమరావతి

జాయింట్ ఎల్పీ నంబర్లు.. విస్తీర్ణంలో వ్యత్యాసాలు.. నిషేధిత జాబితాలోకి వెళ్లిపోవడం ఇలా వైకాపా పాలనలో జరిగిన సర్వేలో లోపాలు రైతుల పాలిట శాపాలయ్యాయి. కూటమి సర్కారు గ్రామసభలు పెట్టినా పరిష్కారం కాలేదంటే ఆ స్థాయిలో లోపాలు జరిగాయి. కూటమి వచ్చాక రెండు విడతల రీసర్వే పూర్తి కాగా జనవరి-2 నుంచి 4వ విడత సర్వేకి రంగం సిద్ధమైంది. గత లోపాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

జిల్లా	గ్రామాలు	విస్తీర్ణం (ఎకరాల్లో)	బృందాలు
ఎన్టీఆర్	61	1,83,735.81	93
కృష్ణా	83	2,35,000	202
మొత్తం	144	4,18,735.81	295

వెంటాడుతున్న వైకాపా నిర్వాకం

"వైకాపా పాలనలో రీసర్వే రైతులను ఇప్పటికీ తిప్పలు పెడుతోంది. ఉమ్మడి జిల్లాలో 365 గ్రామాల్లో రీసర్వే చేస్తే 6,753 జాయింట్ ఎల్పీ నంబర్లు వచ్చాయి. దీంతో ఆయా భూముల రైతులకు రుణాలు రాక, క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ చేయలేక, పాస్‌పుస్తకాలు కూడా రాక అవస్థలు పడుతున్నారు. వందల ఎకరాల్లో భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయాయి. ★ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన రెండు విడతల రీసర్వేను పూర్తి చేశారు. చాలావరకు తప్పులు దొర్లకున్నా ఉమ్మడి జిల్లాలో దాదాపు వెయ్యి వరకు జాయిట్ ఎల్పీఎంలు ఉన్నాయి. వీటితో పాటు విస్తరణలో వ్యత్యాసాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పాఠాలు నేర్చుకోవాలి..

✦ గతంలో రైతులకు సమాచారం ఇవ్వకుండా, వారు స్థానికంగా లేకున్నా రీసర్వే చేపట్టడం సమస్యలకు ప్రధాన కారణం. దీంతో జాయింట్ ఎల్పీ నంబర్ల సమస్య వచ్చింది. నిబంధనల ప్రకారం రైతులకు రెండు రోజుల ముందే సమాచారం నోటీసుల రూపంలో అందించాలి.
✦ గతంలో రీసర్వే ప్రాంతాల్లో గ్రామసభలు మొక్కుబడిగా నిర్వహించడంతో దానిపై రైతులకు అవగాహనే లేదు. ఈసారి ముందుగా సమాచారమిచ్చి రైతులంతా గ్రామసభల్లో పాల్గొనేలా ప్రచారం చేయాలి.
✦ సర్వేలో గ్రామ సర్వేయర్, వీఆర్వో తప్పనిసరిగా ఉండాలి. ఏ ఒక్కరు లేకున్నా తప్పులు దొర్లే అవకాశం ఉంది. ✦ రైతులు సైతం అధికారులు చెప్పిన సమయానికి అందుబాటులో ఉంటే సమస్యలు ఉత్పన్నం కావు. ✦ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల సర్వే ఏడీలు మోహనరావు, జోషీలా మాట్లాడుతూ..'రైతులకు సమాచారం ఇస్తున్నాం. వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేశాం. గతంలో ఉత్పన్నమైన సమస్యలు పునరావృతం కాకుండా చూసుకుంటామని' తెలిపారు.

బౌలర్ల ఉత్సాహం.. బ్యాటర్ల పోరాటం

న్యూస్‌టుడే- విజయవాడ క్రీడలు: కానూరులోని వీపీ సిద్ధార్థ ఆర్ట్స్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో జరుగుతున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. జూనియర్ విభాగంలో ఆంధ్రా లయోలా జూనియర్ కళాశాల (ఏఎల్‌సీ), సీనియర్స్ విభాగంలో అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాల జట్లు తమ ప్రత్యర్థి జట్లపై విజయం సాధించి తర్వాతి రౌండ్‌కు అర్హత సాధించాయి.

లయోలాదే గెలుపు

తొలి మ్యాచ్‌లో ఆంధ్రా లయోలా జూనియర్ కళాశాల జట్టు ఏడు వికెట్ల తేడాతో అవంతి జూనియర్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన ఆంధ్రా లయోలా జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన అవంతి కళాశాల జట్టు పది ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 51 పరుగులు చేసింది. ఎల్. పవన్‌కుమార్‌రెడ్డి 11, పి.రాజబాబు 10 పరుగులతో రాణించారు. ప్రత్యర్థి బౌలర్లు ఎం.దుర్గాప్రసాద్, బి.పూర్ణ శివసాయి రెండేసి వికెట్లు తీశారు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా లయోలా జట్టు 6.2 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 52 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. ఎన్‌కే శరం 19, బి.పూర్ణ శివసాయి 11 పరుగులతో రాణించారు. ఈ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా బి.పూర్ణ శివసాయి ఎంపికయ్యారు.

అమృతసాయిదే పైచేయి..

మరో మ్యాచ్‌లో అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాల జట్టు 30 పరుగుల తేడాతో ఎస్సార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన ఎస్సార్ జట్టు ఫీల్డింగ్ ఎంపిక చేసుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన అమృతసాయి జట్టు పది ఓవర్లలో అయిదు వికెట్ల నష్టానికి 81 పరుగులు చేసింది. వెంకట రమణ 21 పరుగులతో క్రీజులో నిలవగా.. బి.వంశీకృష్ణ 19 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ ఎం. సంతోష్ పది పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన ఎస్సార్ జట్టు 4 వికెట్ల నష్టానికి 51 పరుగులు చేసింది. జి. రోహిత్ ఏడు బంతుల్లో 11 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ప్రత్యర్థి బౌలర్ ఎస్‌కే జైబుర్దీన్ రెండు పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా బి.వంశీకృష్ణ ఎంపికయ్యాడు.

☛ మరో మ్యాచ్‌లో ఎల్బీఆర్‌సీఈ, వాసవి ఇంజినీరింగ్ కళాశాల (నందమూరు) జట్లు తలపడాల్సి ఉండగా.. ఎల్బీఆర్‌సీఈ జట్టు గైర్హాజరవడంతో వాసవి జట్టును అంపైర్లు విజేతగా ప్రకటించారు.


విజయానందంలో ఆంధ్రా లయోలా జూనియర్ కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..


బి.పూర్ణ శివసాయి బి.వంశీకృష్ణ


గెలుపొందిన ఆనందంలో అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాల జట్టు

నేటి మ్యాచ్‌ల వివరాలు

- ★ కేబీఎన్ కళాశాల × సిద్ధార్థ అకాడమీ (మొదటి మ్యాచ్)
- ★ వికాస్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల × ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల (రెండో మ్యాచ్)
- ★ ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలల × ప్రభుత్వ దంత కళాశాల (మూడో మ్యాచ్)
- ★ కేబీఎన్ జూనియర్ కళాశాల × ఎస్ఆర్‌ఆర్ జూనియర్ కళాశాల (నాలుగో మ్యాచ్)

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా రజక కుల వధూవరులకు సువర్ణావకాశం

నేడు, రేపు రజక కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, రజక కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. విజయవాడ ఆటోనగర్‌లోని స్టైలిష్ కార్పొరేట్ బిల్డింగ్, బి బ్లాక్, 3వ అంతస్తులోని ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు నేడు, రేపు (27 & 28 డిసెంబరు 2025) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు 95501 28306 & 83744 45190 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

104 యూనిట్లలో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: 104 మొబైల్ మెడికల్ యూనిట్లలో ఖాళీగా ఉన్న డ్రైవర్లు, డేటా ఆపరేటర్ల పోస్టుల భర్తీకి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ-సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం, ఆదివారం గొల్లపూడి మార్కెట్ యార్డ్‌లో ఉదయం 10 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సి.మధుభూషణ్‌రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసేవారు పదో తరగతి పాస్ కావడంతో పాటు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, నెలకు రూ.16 వేల వేతనం ఇస్తారని పేర్కొన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ల దరఖాస్తు చేసుకునే వారు డిగ్రీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని, వారికి నెలకు రూ.15 వేల వేతనం ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, ఆధార్, పాన్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలు తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 75870 16988 నంబరులో సంప్రదించాలని కోరారు.


సరకుల నిల్వపై నిర్లక్ష్యం..!

దశాబ్దాలుగా అధికారుల కళ్లకు గంతలు ప్రతిపాదనకు నోచుకోని సెంట్రల్ స్టోర్సు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవాలయమైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఏటా రూ.24 కోట్లు విలువ చేసే సరకులను గుత్తేదారు ద్వారా కొనుగోలు చేస్తారు. ఇది కాకుండా దసరా భవానీ దీక్షల సమయంలో మరో రూ.10 కోట్లు వెచ్చిస్తారు. దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి అవసరమైన బియ్యం, కందిపప్పు, నూనె డబ్బాలు, ప్రసాదాల తయారీకి అవసరమైన నెయ్యి, యాలుకలు, జీడిపప్పు, కిస్మిస్, శనగపిండి వంటివి గుత్తేదారు పెద్ద మొత్తంలో సరఫరా చేస్తారు. దేవస్థానం అభివృద్ధికి మాస్టరు ప్లాను రూపొందించేందుకు దశాబ్దకాలంగా కసరత్తు జరుగుతోంది. కనీసం ఇంజినీరింగ్ విభాగం నుంచి సెంట్రల్ స్టోర్సు ప్రతిపాదన కూడా రాలేదంటే వ్యవస్థ దుస్థితిపై భక్తులతోపాటు దేవస్థానం ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత దేవస్థానం స్టోర్సులో వారం రోజులకు సరిపడా సరకును కూడా నిల్వ చేసే సామర్థ్యం లేదు. గుత్తేదారు తీసుకొచ్చిన సరకు నాణ్యతను పరిశీలించడం కుదరడం లేదు. నెల రోజులకు అవసరమైన సరకు నిల్వ చేసే సామర్థ్యం లేకపోవడంతో గుత్తేదారు చిన్న మొత్తాల్లో సరకును అవసరానికి అనుగుణంగా సరఫరా చేయడంలో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు సమాచారం.

☛ ఈ విషయమై ఈవో శీనానాయక్‌ను సంప్రదించగా.. మాస్టరు ప్లానులో దీనిని ప్రతిపాదించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాలకమండలి సభ్యులు, అధికారులతో చర్చించి ఎక్కడ సెంట్రల్ స్టోర్సు ఏర్పాటు చేయాలన్న విషయం చర్చిస్తామన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రసాదాల పోటు, కనకదుర్గానగర్‌లో విజయేశ్వరాలయం ఎదురుగా ఉన్న ప్రాంతం, మల్లికార్జున మహామండపం సమీపంలో ఖాళీస్థలాలు ఉన్నాయని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పూర్తి పరిశీలన చేసిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.


నాలుగు అంతస్తుల నూతన ప్రసాదాల పోటు

రంగా ఆశయాలు సాధిస్తాం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు వంగవీటి రాధాకృష్ణ, కుమార్తె వంగవీటి ఆశాకిరణ్ నివాళులర్పించారు. [illegible]


మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాధాకృష్ణ, ఎమ్మెల్యే బోడే ప్రసాద్, బొప్పన భవకుమార్

రాజకీయ ఎజెండా లేదు: ఆశాకిరణ్

[illegible] కార్యక్రమాలు పూర్తయితే ఆయన కూడా రంగానాడుకు వస్తారని తెలిపారు.


అభిమానులకు అభివాదం చేస్తున్న ఆశాకిరణ్

టెన్నికాయిట్ పోటీలో పతకాలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రం కాసరగోడ్‌లో ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు జరిగిన 37వ జాతీయ సబ్ జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర క్రీడాకారులు [illegible] పతకాలు సాధించారని రాష్ట్ర టెన్నికాయిట్ సంఘం అధ్యక్షుడు పేరం రవీంద్రనాథ్ తెలిపారు. [illegible]


ట్రోఫీలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులతో సంఘం ప్రతినిధులు

ఆర్చర్ షణ్ముఖి నాగసాయికి రజతం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాయపూర్ (ఛత్తీస్‌గఢ్)లో ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకు జరుగుతున్న 45వ జాతీయ జూనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నగర క్రీడాకారిణి బద్ది షణ్ముఖి నాగసాయి రజత పతకాన్ని కైవసం చేసుకున్నదని రాష్ట్ర ఆర్చరీ సంఘం కార్యదర్శి చెవల వెంకటరమణ తెలిపారు. శుక్రవారం జరిగిన కాంపౌండ్ ఆర్చరీ ర్యాంకింగ్ రౌండ్‌లో షణ్ముఖి నాగసాయి 720 పాయింట్లకు గాను 700 పాయింట్లు స్కోర్ చేసి రెండో ర్యాంకులో నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్చరీ సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ నాగసాయిని అభినందించారు.



ఇంజినీరింగ్ చదివి.. జల్సాలకు బానిసై..

విశాఖలో నకిలీ వైద్యుడి అరెస్టు

విశాఖపట్నం: ఇంజినీరింగ్ చదివి, జల్సాలకు బానిసై.. మోసాలకు పాల్పడుతున్న నకిలీ వైద్యుడిని విశాఖ ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం నగర పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ(లా అండ్ ఆర్డర్) మణికంఠ వెల్లడించిన వివరాలివి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన డి. రామ్‌జీ చిన్న కుమారుడు మోక్షిత్ రామ్(5)కు మూత్రపిండాల సమస్య ఉంది. వైద్యం కోసం గతేడాది విశాఖలో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు... మూత్రపిండాలు మార్పిడి చేయాలన్నారు. పేదరికం కారణంగా కుమారుడి శస్త్రచికిత్సకు ఆర్థికసాయం కావాలని రామ్‌జీ కోరడంతో, ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ దిన పత్రికలో (ఈనాడు కాదు) వార్త ప్రచురితమైంది. విజయవాడకు చెందిన ఇమ్మంది జ్యోతి శివశ్రీ (33) (అలియాస్ డాక్టర్ నరసింహ, ప్రవీణ్) ఆ వార్త చూశారు. [illegible] ఇచ్చారు. డబ్బులు తీసుకున్న నిందితుడు అక్కడ నుంచి పరారై, ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. మోసాన్ని గ్రహించిన బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితుడు మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి, జల్సాలకు అలవాటు పడి, మోసాలకు పాల్పడుతున్నాడు. అతడిపై ఇప్పటి వరకు 33 కేసులు ఉన్నాయి.." అని డీసీపీ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ మణికంఠ, చిత్రంలో నిందితుడు, పోలీసులు

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)



ఎన్ఈసీసీ: బ్రాయిలర్ ఫాం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

విలువలతో కూడిన విద్య అందించాలి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: విలువలతో కూడిన విద్య అందించాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. విజ్ఞాన విహార్ పాఠశాల వార్షికోత్సవం దుర్గాపురంలోని జీవీఆర్ సంగీత కళాశాలలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసవర్మ మాట్లాడుతూ దేశానికి మాతృభూమి రుణం తీర్చుకొనే యువత కావాలన్నారు. నేటి విద్యావిధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు అర్హత లేని అధ్యాపకులతో కాలం గడిపేస్తున్నాయని, విజ్ఞానవిహార్ లాంటి విద్యాసంస్థలు దేశానికి అవసరమన్నారు. విజ్ఞానవిహార్ విద్యాసంస్థల కార్యదర్శి గోవిందరావు మాట్లాడారు. కార్యక్రమంలో దాసరి రామకృష్ణ, పుట్టగుంట వెంకట సతీష్, డాక్టర్ లక్ష్మీశ్వేతలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస వర్మ

ప్రకటన

మా క్లయింటు కాకినాడ కాపురస్తులు మేకా వెంకట హరనాథబాబు గారి కుమార్తె సీతాలత గారు యీ దిగువ షెడ్యూలు ఆస్తిని క్రయం పొందుటకు కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, పెదఅవుటపల్లి గ్రామము, పంచాయతీ ఆఫీస్ దగ్గర, గౌడపేట, డోరు నెం. 5-85 కాపురస్తులు, సింహాద్రి సుబ్బారావు గారి భార్య శివకుమారి మరియు వారి కుమారుడు సింహాద్రి దామోదర పవన్‌కుమార్ గారలతో ఒప్పందము చేసుకునియున్నారు.

షెడ్యూలు ఆస్తి మరియు మరికొన్ని ఆస్తులను కలిపి ది. 10-09-1974న విజయవాడ సబ్‌కోర్టు ఫైలు I.P. నెం. 27/1973 (O.R.I.P. నెం. 40/1974)లో ఇన్సాల్వెంట్ ప్రకారం నిర్వహించిన బహిరంగ వేలములో సూరే కేశవనారాయణ గారు క్రయం పొంది, సదరు కోర్టు వారికి సంపూర్తిగా చెల్లించిన దర్మిలా సదరు కోర్టువారి తరపున అఫీషియల్ రిసీవర్ గారిచే గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి ఫైలు- దస్తావేజు నెం. 2235/1974 రీత్యా క్రయం పొంది, వారిపేరు రెవెన్యూ రికార్డులలో నమోదుకాబడి, సదరు సూరే కేశవనారాయణ గారు సర్వ సంపూర్ణ హక్కులతో అనుభవిస్తూ ది. 10-04-1983న ఇంటెస్టేట్‌గా పరమపదించినారు. సదరు కేశవనారాయణ గారు మరణించిన దర్మిలా వారి భార్య నాంచారమ్మ మరియు వారి ఏకైక కుమారుడు అయిన ఏకాంబరరావు అనే ఏకాంబరం గారలకు సంక్రమించి వారలు అనుభవించుచున్నంతలో 30 సం॥ల క్రితం సదరు నాంచారమ్మ గారు ఇంటెస్టేట్‌గా మరణించిన దర్మిలా షెడ్యూలు ఆస్తి సదరు ఏకాంబరరావు గారికి సంక్రమించి, వారి పేరు రెవెన్యూ రికార్డులలో నమోదుకాబడి, సర్వ సంపూర్ణ హక్కుభుక్తములలో ఉండి ఉన్నది. అట్లుండగా, సదరు ఏకాంబరరావు గారు ది. 11-04-2020న వారి భార్య దమయంతమ్మ గారు ది. 25-07-2016న వారల అవివాహిత కుమారుడు రామచంద్రరావు ది. 28-01-2009న మరియు వారల మరియొక కుమారుడు బాలశంకరగుప్త ది. 14-02-2019న మరణించగా, షెడ్యూలు వారి వారసులైన సూరే దేవేంద్రరావు, సూరే కృష్ణమూర్తి మరియు సూరే లోకనాగలక్ష్మీకళ్యాణి గారలకు సంక్రమించి, వారి వారల సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములతో ఉండగా, సదరు దేవేంద్రరావు వగైరాలు ది. 22-04-2021న షెడ్యూలు ఆస్తిని విక్రయించుటకు దఖలుపర్చుటకు, వగైరాల నిమిత్తం, గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి ఫైలు - దస్తావేజు నెం. 3068/2021 రీత్యా పవర్ ఆఫ్ అటార్నీని సింహాద్రి (లేటు) బాబూరావు గారి కుమారుడు సుబ్బారావు గారికి వ్రాయించియున్నారు. సదరు పవరుని ఉపయోగించి సదరు సుబ్బారావు గారు ది. 29-05-2021న గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి ఫైలు - దస్తావేజు నెం. 3556/2021 రీత్యా వారి భార్య సింహాద్రి శివకుమారి గారికి కొంత భాగమున్నూ, మిగిలిన భాగమును దస్తావేజు నెం. 3557/2021 రీత్యా వారి కుమారుడు, సింహాద్రి దామోదర పవన్‌కుమార్ గారలకు క్రయపరిచియున్నారు. సదరు శివకుమారి మరియు దామోదర పవన్‌కుమార్ గారలు వారి వారల పేర్లు రెవెన్యూ రికార్డులలో నమోదు కాబడి, వారి వారల సంపూర్ణ హక్కుభుక్తములలో ఉండిఉన్నది. కావున షెడ్యూలు ఆస్తిని మా క్లయింటు సదరు సింహాద్రి శివకుమారి మరియు సింహాద్రి దామోదరపవన్ కుమార్ గారల వద్ద నుండి క్రయం పొంది రిజిష్టర్డు క్రయదస్తావేజును పొందుటలో ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు కాని హక్కులు కాని, క్లెయిములు కాని, ఇతరత్రా ఆక్షేపణలు కాని యున్నయడల పది రోజులలో లిఖితపూర్వకముగా తెలియపరచవలసినదిగా కోరడమైనది. తదుపరి వచ్చు క్లెయిములు మా క్లయింటుని బైండు చేయజాలవు.

షెడ్యూలు: గన్నవరం మండలం, బాహుబలేంద్రునిగూడెం గ్రామ పంచాయతీ, బాహుబలేంద్రునిగూడెం గ్రామ పాత సర్వే నెం. 31లో య. 1-00 స్థిరాస్తికి, దర్మిలా కాబడిన రీ సర్వే రీత్యా ఆర్.యస్.నెం.. 95/8A లో య. 0-94 సెంట్లలో హైవే అథారిటీస్ లాండ్ ఎక్విజిషన్ నిమిత్తం య. 0.58 సెంట్లు పోగా మిగిలిన య. 0-36 సెంట్ల దాఖలా రెవెన్యూ రికార్డుల దాఖలా య. 0-30 సెంట్ల భూమికి హద్దులు. **తూర్పు:** గన్నవరం టు ఆగిరిపల్లి పోవు రోడ్డు, **దక్షిణం:** డొంక, **పడమర:** నర్రా నరసింహారావు వగైరాల భూమి, **ఉత్తరం:** రోడ్డు.

తుర్లపాటి భైర్రాజు, పి.వి.వి.హరినాథ్‌బాబు, అడ్వకేట్స్
సత్యనారాయణపురం, విజయవాడ - 520 011, ఫోన్: 97053 53284

మామ చేతిలో అల్లుడి హత్య

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం పెనమకూరు గ్రామంలో గురువారం అర్ధరాత్రి మామ చేతిలో అల్లుడు దారుణ హత్యకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదిమూలపు సురేష్(31) స్వగ్రామం ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం గజ్జలకొండ గ్రామం. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆయనకు పెనమకూరు గ్రామానికి చెందిన చీకుర్తి శ్రీనివాసరావు కుమార్తె ఝాన్సీరాణితో 2017లో వివాహమైంది. సురేష్ దంపతులిద్దరూ విజయవాడలో ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. సురేష్ మద్యానికి బానిసై పిల్లలను సరిగ్గా చూడకపోవడంతో ఝాన్సీరాణి తమ పిల్లలను తండ్రి చీకుర్తి శ్రీనివాసరావు వద్ద ఉంచారు. ఆగస్టులో వీరి పాప అనారోగ్య కారణంతో మృతిచెందింది. డిసెంబరు 24న రెండో కుమారుడు దేవాన్ష్ సార్థక్ పుట్టినరోజు కావడంతో కేక్ తీసుకుని సురేష్ దంపతులు పెనమకూరు వచ్చి వేడుకలు చేసుకున్నారు. డిసెంబరు 25 క్రిస్మస్ వేడుకలు చేసుకున్నారు. గురువారం రాత్రి సురేష్(31) మద్యం తాగి పాప చనిపోవడానికి మీరే కారణమని అత్తమామలపై గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాట మాట పెరగడంతో శ్రీనివాసరావు పక్కనే ఉన్న చెక్కతో అల్లుడు సురేష్ తలపై బలంగా కొట్టాడు. సురేష్ తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, వైద్యులు పరీక్షించి సురేష్ మృతి చెందాడని తెలిపారు. పెనమకూరు వీఆర్‌వో శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పమిడిముక్కల సర్కిల్ సీఐ వై. చిట్టిబాబు గురువారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు.


సురేష్ (పాత చిత్రం)

91.9 FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజీ స్టైల్	సా. 5 - రా. 9
ఈఎఫ్ఎం సరాగాలు	రా. 9 - రా. 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 11 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

తిరువూరు

• తిరువూరు • మైలవరం

అందుబాటులో 82 మెట్రిక్ టన్నుల యూరియా

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధిలో గ్రామాల్లో 82 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని రెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం నాగులూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ యూరియా ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు అమ్మితే స్థానిక ఆర్ఎస్‌కేలో లేదా తనకు చెబితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. పంటలకు అధికంగా రసాయన ఎరువులు వినియోగించవద్దని సూచించారు. నాగులూరు ధాన్యం కొనుగోలు కేంద్రానికి మరో రెండువేల గోనెసంచులు కావాలని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

ఈ- ఆటో ప్రారంభం

మైలవరం, న్యూస్‌టుడే : స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మండలంలోని కీర్తిరాయునిగూడెం పంచాయతీకి మంజూరు చేసిన ఈ ఆటోను శుక్రవారం ఏపీ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ డైరెక్టర్ డి.విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటి పరిసరాలతో పాటు, బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి కిషోర్, నాయకులు సుబ్బారావు, రాముడు, నాగరాజు పాల్గొన్నారు.


ఆటోను ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

సృజన వెలికి తీసేందుకు ప్రతిభా పోటీలు దోహదం


విజేతలతో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎస్‌కే నాగుల్ మీరా, ఉపాధ్యాయులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో సృజన వెలికి తీయడానికి ప్రతిభా పాటవ పోటీలు తోడ్పడతాయని శ్రీశ్రీ విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.వెంకట్ అన్నారు. విస్సన్నపేట శ్రీశ్రీనివాస ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. వీటిలో ఒ.దుర్గా వెంకట ప్రసాద్ (7వ తరగతి), వి.రాకేష్ (7వ తరగతి), బి.దీపక్ (6వ తరగతి) ప్రతిభ చూపి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఛైర్మన్ వెంకట్, ప్రిన్సిపల్ ఎం.రఘునాథ్ విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.కె. నాగుల్ మీరా, ఎన్.మాన్సీ, జి.సాయి ప్రసన్న, పి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నాళ్లో .. వారధి నిర్మాణం?

కొండపల్లి, న్యూస్‌టుడే

పాలకుల ఉదాసీనత.. గుత్తేదార్ల నిర్లక్ష్యం వెరసి కొండపల్లి ఎర్ర వంతెన ఏళ్ల తరబడి అసంపూర్తిగానే మిగిలింది. 2015 నుంచి 2017లో ఎన్‌హెచ్ ఇబ్రహీంపట్నం- ఛత్తీస్‌ఘడ్ రహదారిని అభివృద్ధి చేసింది. అయితే ఆ సమయంలో కొండపల్లి ఎర్ర వంతెనను నాలుగు వరుసలుగా నిర్మించాల్సి ఉంది. కానీ ఒక వైపు మాత్రమే అంటే రెండు వరుసలుగా సంబంధిత గుత్తేదారులు నిర్మించి వదిలేశారు. దీంతో ఎన్‌హెచ్ఏ -30పై వెళ్లే వాహనాలు వంతెన ప్రాంతంలో తీవ్ర ఇబ్బందులు పడుతూనే రాకపోకలు సాగిస్తున్నాయి. అసంపూర్తిగా మిగిలిన ఈ వంతెనన 8 ఏళ్ల నుంచి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ సమయంలో మొత్తం 28 ప్రమాదాలు సంభవించగా అందులో కొండపల్లికి చెందిన ఏడుగురు, ఇతర ప్రాంతాలకు చెందిన ఐదుగురు మృత్యువాత పడ్డారు. 20 మందికి పైగా గాయపడ్డారు.

★ **రాకపోకలకు ఇబ్బంది :** వంతెన నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో జాతీయ రహదారి నుంచి బాలుర పాఠశాల మీదుగా రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు వాహనదారులకు ఇబ్బందిగా మారింది. దీంతో అప్పటి నుంచి మైలవరం, కొండూరు, కట్టుబడిపాలెం తదితర గ్రామాలకు చెందినవారు రైల్వేస్టేషన్ కూడలికి రాలేక ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. ఇదిలా ఉంటే కరోనా సమయం నుంచి ప్యాసింజర్ రైళ్లకు స్టేషన్‌లో స్టాప్ లేక రైల్వేస్టేషన్ కూడలి నిర్మానుష్యంగా మారింది. దీంతో ఆ కూడలిలోని పదుల సంఖ్య వ్యాపారులు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయారు. అయితే తెల్లవారుజామున, రాత్రి వేళ నిలిచే ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు సౌకర్యాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

★ **ఈ మధ్యనే మొదలై :** ఎర్ర వంతెన రెండో భాగం పనులు నవంబర్ నెలలో ప్రారంభమయ్యాయి. పూర్వ వంతెన తొలగించే పనులు మొదలుపెట్టి గత వారంలో పనులు నిలిపివేశారు. వంతెన పూర్తవుతుందని, తమ కష్టాలు తీరుతాయని భావించిన రైల్వేస్టేషన్ వాసులు ఆశలకు అడ్డుకట్ట పడింది. వంతెనను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైల్వేస్టేషన్ కూడలికి ప్రయాణికులు వచ్చేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పాత వంతెన తొలగింపు పనుల వద్ద ఆపిన భారీ యంత్రాలు

★ సుదీర్ఘ కాలంగా ఆగిన కొండపల్లి ఎర్ర వంతెన పనులు

★ ప్రమాదాలకు ఆస్కారంగా కూడలి

★ **పనులు ప్రారంభమయ్యాయి :** ఎర్ర వంతెన రెండో దశ నిర్మాణం ప్రారంభమైంది. పనులు తాత్కాలికంగా ఆగాయి. పాత వంతెన తొలగింపు పూర్తి కాగానే పనులు చేపడతాం. అనంతరం అప్రోచ్ పనులు ప్రారంభమవుతాయి.

-గుత్తేదారు, అధికారులు


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అప్పారావు

పరిజ్ఞానం పొందడం నిరంతర ప్రక్రియ

మైలవరం, న్యూస్‌టుడే : అధ్యాపకులు సైతం కృత్రిమమేధ వంటి ఆధునిక అంశాలపై పరిజ్ఞానం పొందడం నిరంతర ప్రక్రియగా సాగాలని, అప్పుడే మెరుగైన బోధన సాధ్యమని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు పేర్కొన్నారు. కళాశాలలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఏఐపై అధ్యాపకులకు అభివృద్ధి శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 31 వరకు హైబ్రిడ్ విధానంలో శిక్షణ కొనసాగుతుందని వివరించారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి నాగార్జునరెడ్డి, డీన్ శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్ ఆర్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు నిర్వహణకు భద్రతా ఏర్పాట్లు


ఏర్పాట్లపై ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న సీపీ రాజశేఖర బాబు

కొండపల్లి, న్యూస్‌టుడే : షాబుఖారీ దర్గా ఉరుసును విజయవంతం చేసేందుకు భద్రతాపరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు అన్నారు. కొండపల్లి బి.కాలనీ వద్ద ఉన్న దర్గాను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉరుసుకు వేలసంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. మూడు రోజుల కార్యక్రమాల్లో భాగంగా సీసీ కెమెరాలు, లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పోలీస్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా ఏర్పాట్లు చూస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, తహసీల్దారు వెంకటేశ్వర్లు, అల్తాఫ్ బాబా, దర్గా అభివృద్ధి కమిటీ సభ్యులు, ముజావర్లు పాల్గొన్నారు.

కృష్ణా జలం.. రహదారి పాలు


వృధాగా పోతున్న నీళ్లు

కోడూరు ప్రధాన ఆర్అండ్‌బీ రహదారి పక్కనే నూజివీడు వైపు కృష్ణా జలాల పైపులైన్ లీకై నీరంతా వృధాగా పోతోంది. ఈ నీరు పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల గేటు ముందుగా పారుతుండటంతో రాకపోకలకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు వేగంగా వెళ్తున్న సందర్భాల్లో నీరు చింది పాదచారులపై, పాఠశాల ప్రహరీ పక్కనే ఉన్న విద్యుత్తు నియంత్రిక మీద పడుతూ మంటలు రేగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా వారు స్పందించాలని కోరుతున్నారు. **-జి.కొండూరు, న్యూస్‌టుడే**

వైభవంగా వైష్ణవాలయాల్లో ధనుర్మాసోత్సవాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గంపలగూడెం మండలం గోసవీడు శ్రీరుక్మిణి, సత్యభామా సమేత మదన వేణుగోపాల స్వామి గుడిలో శుక్రవారం మూలవిరాట్టు దామంతి పుష్పాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. గంపలగూడెం శ్రీరామ మందిరంలో బాల, బాలికలకు గోదా రంగనాయకుల వేషాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తిరువూరు వేంకటాచలస్వామి, నెమలి వేణుగోపాలస్వామి, ఊటుకూరు కోదండ రామాలయం, గంపలగూడెం సీతారామచంద్రస్వామి గుడిలో ఆండాళ్, రంగనాయకులు పూజలు చేసి, గోదాదేవి తిరుప్పావై పాశురాలను అర్చకులు, భక్తులు పఠించారు.


గోసవీడు వేణుగోపాలస్వామి గుడిలో దేవతామూర్తులు


తిరువూరు వేంకటాచలస్వామి గుడిలో పుష్పాలతో మూలవిరాట్టు అలంకరణ


గంపలగూడెం : మేడూరులో జెండా ఆవిష్కరణ

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

తిరువూరు, గంపలగూడెం : సీపీఐ 101వ ఆవిర్భావ దినోత్సవాన్ని తిరువూరు పార్టీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా, మండల నాయకులు టి.కృష్ణయ్య, ఎం.ఉదయ్, ఎస్‌కే సుభాని తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వందేళ్లుగా రైతులు, కార్మికులు, పేదల సమస్యల పరిష్కారానికి సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమాలను వక్తలు వివరించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. గంపలగూడెం మండలంలోని ఊటుకూరు, తోటమూల, మేడూరులో జెండాలు ఆవిష్కరించారు.

ఏడు పదుల వయసులో.. నాటి జ్ఞాపకాల్లో..

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : ఐదున్నర దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఏడు పదుల వయసులో తిరువూరు పట్టణంలో శుక్రవారం ఆత్మీయ సమావేశంలో కలిశారు. తమ చిన్ననాటి సహాధ్యాయులను కలుసుకుని ఆనంద పరవశులయ్యారు. 55 ఏళ్ల నాడు బడిలో, తరగతి గదిలో తమ మధుర స్మృతులను నెమరవేసుకుని సంబరపడ్డారు. తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1969-72 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు పట్టణంలోని రాజుపేటలో తమ బాల్యమిత్రుడు గువ్వల నాగేశ్వరరావు గృహంలో కలిశారు. ఉన్నత స్థానాలకు ఎదిగిన వారంతా తమ సహాధ్యాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు కంచి అంజయ్యను శాలువాతో సత్కరించారు. విశ్రాంత జిల్లా జడ్జి టి.రమేష్‌తో పాటు పూర్వ విద్యార్థులు ఎన్.సాయిబాబా, ఎస్.కృష్ణమోహన్‌రావు, జి.ఉమా మహేశ్వరరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన పూర్వ విద్యార్థులు

కృష్ణాలయంలో అష్టోత్తర శత దీపాలంకరణ సేవ



నెమలి (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి గుడిలో శుక్రవారం రాత్రి అష్టోత్తర శత దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. అర్చకుడు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు. రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులకు అద్దాల మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ప్రకటన

నా క్లయింటు అయిన యన్.టి.ఆర్. జిల్లా, తిరువూరు మండలం, [illegible] ... 1691/2008 ఎచటనో జారిపోయినది. ఎంత వెదకినను జాడ కానరాలేదు. ఎవరికైనను లభించిన యెడల ఈ క్రింది చిరునామాదారుకు తెలియజేయగలరు.

ఇట్లు: కె.వి.ఆర్.యన్. ముత్యప్రసాద్
అడ్వకేట్ & నోటరీ
తిరువూరు, యన్.టి.ఆర్.జిల్లా
Cell: 98855 74113

రహదారి ప్రమాదంలో యువకుడి దుర్మరణం


కార్తిక్ (పాత చిత్రం)

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలో గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందారు. ఎస్సై శతకృష్ణ వివరాల ప్రకారం.. పట్టణంలోని జిల్లి కార్తిక్ (30), స్నేహితుడు దేవరపల్లి సాయికిరణ్ ద్విచక్ర వాహనంపై తెలంగాణ నుంచి తిరువూరు వైపు వస్తున్నారు. పశువుల సంత సమీపంలోని జాతీయ రహదారి కూడలి వద్ద వాహనం అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ప్రమాదంలో కార్తిక్ అక్కడికక్కడే మృతి చెందారు. సాయికిరణ్‌కు తీవ్రగాయాలు కాగా మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి లారీడ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కార్తిక్ పట్టణంలోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలో పని చేసేవారు. ఆతను జనసేన పార్టీ కార్యకర్త. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, కార్తిక్ మృతదేహానికి నివాళి అర్పించారు. ఆతని కుటుంబానికి ధైర్యం చెప్పారు. యువకుడి మృతితో ఆతను నివాసం ఉండే కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి.


తోటమూలలో రంగా చిత్రపటానికి నివాళి అర్పించిన జనసేన నాయకులు


రెడ్డిగూడెంలో అభిమానులు


మైలవరంలో తెదేపా ఆధ్వర్యంలో..

పేదల పక్షపాతి వంగవీటి మోహన రంగా

న్యూస్‌టుడే, బృందం : పేదల సంక్షేమానికి వంగవీటి మోహన రంగా పోరాటాలు సాగించి అమరుడిగా నిలిచారని నేతలు కొనియాడారు. దివంగత శాసనసభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు వంగవీటి మోహన రంగా వర్ధంతి జిల్లాలో పలు చోట్ల శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.


కొండపల్లి : రంగా విగ్రహం వద్ద జనసేన నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం.. ✦ పట్టణంలోని ప్రధాన రహదారి వెంట ఉన్న మొక్కలు, చెట్లను కత్తిరించిన చెత్త వ్యర్థాలను రోడ్డుపై అలాగే వదిలేశారని స్థానికుడు నాగేంద్రరావు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన మున్సిపల్ కమిషనర్ సిబ్బందితో ఆ చెత్తను శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

✦ కుంటముక్కల పంచాయతీ కార్యాలయం సమీపంలో బోరు చెడిపోయి 23న 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన సమస్య ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి మురళి స్పందించి.. సిబ్బందితో బోరు మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

275 మందికి వైద్యసేవలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రెడ్డిగూడెం అమరేశ్వరపురంలో వైకాపా మండల కన్వీనర్ కె.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ ఆసుపత్రి వారి వైద్య శిబిరం నిర్వహించారు. 275 మందికి వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ జాఫర్, డైరెక్టర్ సందీప్ సేవలు అందించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సిహెచ్ రాజిరెడ్డి, సీనియర్ నాయకుడు ఎం.మాధవరెడ్డి, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

కచ్చితత్వానికి రోవర్లతో భూముల రీ సర్వే


ర్యాలీలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు

విస్సన్నపేట: భూయజమానుల్లో ఎలాంటి అపోహలకు ఆస్కారం లేకుండా కచ్చితత్వం కోసం రోవర్ల ద్వారా భూముల రీ సర్వే చేస్తున్నట్లు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్ తిరుపతిరావు సారంగపాణి అన్నారు. [illegible] గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. ... గ్రామాల రెవెన్యూ పరిధిలో ఉన్న వ్యవసాయ భూములకు సంబంధించి రీ సర్వే ప్రక్రియ జనవరి 2 నుంచి నిర్వహిస్తారని తెలిపారు. గ్రామసభలో రీసర్వేపై డి.ఐ.ఒ.ఎస్ సారంగపాణి, ఆర్ఐ సుజాత రైతులకు అవగాహన కల్పించారు. తొలుత భూముల రీ సర్వే గురించి [illegible] ... కుమార్, వీఆర్‌వోలు, వీఎస్‌లు, గ్రామపెద్దలు నెక్కలపు శ్రీనివాసరావు (డాబా శ్రీను), ఆకుల రాధాకృష్ణ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గంగిశెట్టి మధుబాబు, మురుగుల ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఊటుకూరు, ఆర్లపాడు (గంపలగూడెం): మండలంలోని ఊటుకూరు, ఆర్లపాడులో జనవరి 2 నుంచి భూముల రీసర్వే ప్రక్రియ ప్రారంభిస్తామని తహసీల్దార్ [illegible] రాజకుమారి తెలిపారు. 2026లో దశ-1లో రీసర్వే ఆరు నెలలు నిర్వహిస్తారని చెప్పారు. రెండు గ్రామాల్లో శుక్రవారం ఆమె ఆధ్వర్యంలో భూములు రీసర్వే ప్రక్రియపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మన్మోహన్ సేవలు ఎనలేనివి



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే: మాజీ ప్రధాని డా. మన్మోహన్‌సింగ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా తిరువూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పల్లెపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఆయన దేశానికి దశ, దిశ నిర్దేశించారని, రిజర్వ్‌బ్యాంకు గవర్నర్, దేశ ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా చేసిన సేవలు మరువలేనివని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు జీవన్‌బాబు, కృష్ణ, మోహన్, నాగేశ్వరరావు, జగన్నాథం, రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూర్ణయ్య కుటుంబ సభ్యులకు పరామర్శ

చింతలనర్వ (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని చింతలనర్వ గ్రామ ప్రముఖుడు యనమద్ది పూర్ణయ్య మృతి చెందగా ఆయన మృతదేహానికి శుక్రవారం విజయవాడ మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు వేర్వేరుగా నివాళి అర్పించారు.

ఉద్దమ్‌సింగ్‌కు నివాళి

పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలనులో శుక్రవారం దేశభక్తుడు, విప్లవ యోధుడు ఉద్దమ్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రామస్థులు, వివిధ సంఘాల నాయకులు నివాళి అర్పించారు. జలియన్ వాలాబాగ్ ఉదంతానికి ప్రతీకారంగా 20 ఏళ్ల తర్వాత లండన్ వెళ్లి అందుకు బాధ్యుడైన మైఖేల్ డయ్యర్ హతమార్చిన దేశభక్తుడు ఉద్దమ్ అని వక్తలు అన్నారు.

కోమటి భాస్కరరావు సేవలు చిరస్మరణీయం

జి.కొండూరు : మైలవరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, ఏపీ మార్క్‌ఫెడ్ మాజీ ఛైర్మన్ కోమటి భాస్కరరావు సేవలు చిరస్మరణీయమని ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అప్పసాని సందీప్ అన్నారు. కోమటి భాస్కరరావు 31వ వర్ధంతి సందర్భంగా ఆత్కూరు గ్రామంలో శుక్రవారం ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గ్రామంలో పేదలకు పండ్లు పంచారు. నాయకులు కఠారి ఉమా మహేశ్వరరావు, రామినేని వెంకటేశ్వరరావు, దొడ్డా విష్ణు, వేములకొండ సాంబశివరావు పాల్గొన్నారు.

మైలవరం : మైలవరం మాజీ శాసనసభ్యుడు కోమటి భాస్కరరావు వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కఠారు ఉమా మహేశ్వరరావు, ఏపీఎంఎస్ఐడీసీ మాజీ డైరెక్టర్ అప్పసాని సందీప్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ నవ్యశ్రీ, చీమలపాడు బాబా, వివిధ పార్టీలకు చెందిన బ్రహ్మయ్య, ఎన్‌డీపీ, సాంబిరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కొండపల్లి : మాజీ శాసనసభ్యుడు కోమటి భాస్కరరావు నియోజకవర్గానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఏపీఎంఎస్ ఐడీసీ మాజీ డైరెక్టర్ అప్పసాని సందీప్ అన్నారు. భాస్కరరావు వర్ధంతి కార్యక్రమాన్ని కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. విగ్రహానికి భాస్కరరావు కుటుంబ సభ్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ఆత్కూరులో విగ్రహానికి నివాళి అర్పించిన సందీప్, ఉమామహేశ్వరరావు తదితరులు


మైలవరంలో భాస్కరరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రాక్టీస్ బిట్స్ — బయాలజీ


1. వెంట్రుకల అధ్యయనాన్ని ఏమంటారు?
1) ట్రైకాలజీ 2) బయాలజీ 3) అగ్రస్టాలజీ 4) 1, 3
2. కింది వాటిలో అతి చిన్న పుష్పం?
1) రఫ్లేషియా 2) ఉల్ఫియా 3) సికోయా 4) 1, 2
3. వాణిజ్యపరంగా విలువైన నారలు ఎందులో భాగం?
1) మృదు కణజాలం 2) స్థూలకోణ కణజాలం 3) దృఢ కణజాలం 4) సంక్లిష్ట కణజాలం
4. ఆర్కిడేసి కుటుంబ మొక్కల్లో బాష్పశీల తైలాలను ఉత్పత్తి చేసేవి?
1) ఆస్మోఫోరా 2) లాటిసిఫెరస్‌లు 3) మకరంద గ్రంథులు 4) స్రావక కుహరాలు
5. కీటకాహార మొక్కల్లో ఉండే ప్రోటియోలైటిక్‌లను ఉత్పత్తిచేసే కణజాలం?
1) పోషక కణజాలం 2) మృదు కణజాలం 3) సరళ కణజాలం 4) ప్రత్యేక కణజాలం
6. మొక్క శాఖీయాభాగాల నుంచి ఏర్పడే వేరుకు ఉదా?
1) మోన్‌స్టెరా 2) మర్రి 3) టర్నిప్ 4) 1, 2

సమాధానాలు
1-1; 2-2; 3-3; 4-1; 5-4 6-4.

ఈనాడు ప్రతిభ
విజయవాడ, శనివారం, డిసెంబరు 27, 2025
12
◆ https://pratibha.eenadu.net ◆ https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కొన్ని ఎలుగుబంట్లు.. ఏనుగులైతే!

పండ్లు ఆరోగ్యానికి మంచివి. ఆపిల్ ఒక పండు. అంటే ఆపిల్ ఆరోగ్యానికి మంచిది. రెండు ప్రకటనల నుంచి ఒక కచ్చితమైన ముగింపును రాబట్టారు. ఇందులో మూడు భాగాలు ఉన్నాయి. అందుకే 'త్రిపాద'గా పేర్కొంటారు. మొదటిది ప్రధాన ప్రతిపాదన. దీనిలో సాధారణంగా ఒక సత్యం లేదా నియమం ఉంటుంది. రెండోది గౌణ ప్రతిపాదన. అందులో నిర్దిష్ట సందర్భాన్ని వివరిస్తారు. మూడోది ఆ రెండింటి నుంచి వచ్చే ఫలితం. అందుకే దానిని త్రిపాద తర్కం అంటారు. ఆంగ్లంలో శిలాజిజంగా వ్యవహరిస్తారు. రీజనింగ్‌లో భాగంగా పోటీ పరీక్షల్లో ఈ అధ్యాయం నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. తద్వారా అభ్యర్థుల నిర్ణయ సామర్థ్యాన్ని, విమర్శనాత్మక ఆలోచన తీరును అంచనా వేస్తారు. వెన్ చిత్రాలు, పలు రకాల ప్రకటనలు, వివిధ ముగింపులు తదితరాల గురించి తెలుసుకొని పట్టు పెంచుకుంటే వేగంగా సమాధానాలను కనుక్కోవచ్చు. రెండు ప్రతిపాదనల్లో ఏదో ఒకటే సత్యమయ్యే సందర్భాలపై కూడా ఇటీవల పరీక్షల్లో ఎక్కువగా ప్రశ్నలు వస్తున్నాయి. ఆ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాక్టీస్ చేయాలి.




త్రిపాద తర్కవాదం




సాధారణంగా ఈ ప్రశ్నల్లో భాగంగా రెండు ప్రకటనలు (ప్రవచనాలు), రెండు లేదా అంత కంటే ఎక్కువ నిర్ధారణలు ఇస్తారు. ప్రవచనాలు వాస్తవ విరుద్ధంగా ఉన్నప్పటికీ అవి నిజమే అనుకుని ఏ విధమైన నిర్ధారణకు వస్తామో కనుక్కోవాల్సి ఉంటుంది.

ప్రధానంగా ప్రవచనాలు నాలుగు రకాలు అవి:


i) అన్ని A లు B లు




iii) కొన్ని A లు B లు కాదు



ii) కొన్ని A లు B లు



iv) ఏ A కూడా B కాదు




మాదిరి ప్రశ్నలు

ఈ ప్రశ్నల్లో రెండు ప్రవచనాలు, వాటి కింద రెండు నిర్ధారణలు ఇస్తారు. ప్రవచనాలు వాస్తవ విరుద్ధంగా ఉన్నప్పటికీ వాటిని పూర్తిగా నిజమని భావించి, నిర్ధారణలను గమనించి సరైన నిర్ణయం/నిర్ణయాలను ప్రవచనాల ఆధారంగా తర్కబద్ధంగా గుర్తించాలి. జవాబులను కింది ఆప్షన్ల ప్రకారం ఎంపిక చేసుకోవాలి.


1) నిర్ధారణ I మాత్రమే సరైంది అయితే 2) నిర్ధారణ II మాత్రమే సరైంది అయితే
3) నిర్ధారణ I, II లు సరైనవి అయితే 4) నిర్ధారణ I, II లు సరైనవి కాకపోతే

1 ప్రవచనాలు:
ఎ) అన్ని బస్సులు కార్లు.
బి) అన్ని కార్లు ట్రక్కులు.
నిర్ధారణలు:
I. అన్ని ట్రక్కులు బస్సులు.
II. అన్ని బస్సులు ట్రక్కులు.


వివరణ: అన్ని బస్సులు కార్లు



అన్ని కార్లు ట్రక్కులు




ఇచ్చిన రెండు ప్రవచనాల నుంచి...



అన్ని బస్సులు.. ట్రక్కులు అనే నిర్ధారణ సరైంది. **జ: 2**

2 ప్రవచనాలు: ఎ) కొన్ని కుక్కలు పిల్లులు.
బి) అన్ని పిల్లులు ఎలుకలు.
నిర్ధారణలు: I. కొన్ని పిల్లులు కుక్కలు.
II. అన్ని ఎలుకలు కుక్కలు.


వివరణ: ఎ, బి ప్రవచనాల నుంచి...



నిర్ధారణలు I, II ల నుంచి కొన్ని పిల్లులు కుక్కలు అవుతాయి. **జ: 1**

3 ప్రవచనాలు:
ఎ) కొన్ని ఏనుగులు ఎలుగుబంట్లు
బి) అన్ని ఎలుగుబంట్లు పక్షులు
నిర్ధారణలు:
I. కొన్ని ఎలుగుబంట్లు ఏనుగులు
II. కొన్ని ఏనుగులు పక్షులు


వివరణ: ఎ, బి ప్రవచనాల నుంచి...



నిర్ధారణలు I, II ల నుంచి రెండూ సరైనవే. **జ: 3**

4 ప్రవచనాలు:
ఎ) అన్ని బల్లలు కుర్చీలు.
బి) కొన్ని కుర్చీలు పీటలు.
నిర్ధారణలు:
I. కొన్ని పీటలు కుర్చీలు.
II. ఏ బల్ల పీట కాదు.


వివరణ: ప్రవచనాలు ఎ, బి ల నుంచి...



నిర్ధారణలు I, II ల నుంచి కొన్ని పీటలు, కుర్చీలు అవుతాయి. **జ: 1**

5 ప్రవచనాలు:
ఎ) అన్ని కిటికీలు తలుపులు.
బి) ఏ తలుపు గోడ కాదు.
నిర్ధారణలు:
I. కొన్ని కిటికీలు గోడలు.
II. ఏ గోడ తలుపు కాదు.


వివరణ: ప్రవపచనాలు ఎ, బి ల నుంచి....



నిర్ధారణలు I, II ల నుంచి ఏ గోడ కూడా తలుపు కాదు. **జ: 2**

6 ప్రవచనాలు:
ఎ) కొన్ని ఆవులు కాకులు.
బి) కొన్ని కాకులు ఏనుగులు.
నిర్ధారణలు:
I. కొన్ని కాకులు ఏనుగులు.
II. అన్ని కాకులు ఏనుగులు.

వివరణ: ప్రవచనాలు ఎ, బి ల నుంచి...




నిర్ధారణలు I, II ల నుంచి కొన్ని కాకులు ఏనుగులు అవుతాయి.
జ: 1



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

జూనియర్ ఇంటర్ గణిత శాస్త్రం — సంబంధాలు, ప్రమేయాలు





ఒక మార్కు

ఫైనల్ పరీక్షలు 2026 — ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

1. $\left(2x + 1, \frac{y}{2}\right) = (3, 3)$ అయితే x, y ల యొక్క విలువలు...
1) 1, 6 2) 2, 2 3) 3, 3 4) $7, \frac{3}{2}$
జ: 1
2. $A = \{1, 2, 3\}, B = \{a, b\}$ అయితే $A \times B$ = ...
1) {(1, a) (2, b) (3, a)}
2) {(a, 1) (b, 2) (a, 3) (b, 3)}
3) {(1, a) (1, b) (2, a) (2, b) (3, a) (3, b)}
4) {(1, a) (1, b) (2, b) (3, b)}
జ: 3
3. ఒక సంబంధాన్ని కింది ఏ విధంగా తెలపవచ్చు?
1) రోస్టర్ పద్ధతి 2) సెట్ బిల్డర్ పద్ధతి 3) ఒక బాణ పటం 4) పై మూడు రూపాల్లో
జ: 4
4. $f(x) = \frac{|x|}{x}$ అయితే f(0) = ...
1) 1 2) −1 3) నిర్వచించలేం 4) 0
జ: 3
5. $\frac{1}{\sqrt{x^2 - 25}}$ ప్రమేయానికి ప్రదేశం.
1) $(-\infty, -5) \cup (5, \infty)$ 2) $(-\infty, -5] \cup [5, \infty)$
3) $(-\infty, -5] \cup (5, \infty)$ 4) $(-\infty, -5) \cup [5, \infty)$
జ: 1
6. $\sqrt{|x| - x}$ ప్రమేయానికి ప్రదేశం.
1) R 2) $[0, \infty)$ 3) $(-\infty, 0]$ 4) Z
జ: 1

2 మార్కులు

1. $\left(\frac{x}{3} + 1, y - \frac{2}{3}\right) = \left(\frac{5}{3}, \frac{1}{3}\right)$ అయితే x, y విలువలను కనుక్కోండి?

జ: $\frac{x}{3} + 1 = \frac{5}{3}, y - \frac{2}{3} = \frac{1}{3}$

$\frac{x}{3} = \frac{5}{3} - 1, y = \frac{1}{3} + \frac{2}{3}$

$\frac{x}{3} = \frac{2}{3}, y = \frac{3}{3}$

x = 2, y = 1

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు



రచయిత: యు.ప్రసన్నకుమార్

ముఖ్యాంశాలు



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పోర్చుగల్ పర్యటనలో భాగంగా రాజధాని లిస్బన్ నగర మేయర్ నుంచి ప్రతిష్ఠాత్మక 'సిటీ కీ ఆఫ్ ఆనర్'ను అందుకున్నారు.

అంతరిక్ష యానం.. క్వాంటమ్ గ్రామం!

దేశంలో వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, జవాబుదారీతనాన్ని పెంచేందుకు రూపొందించిన తాజా వక్ఫ్ చట్టం గత ఏప్రిల్‌లో అమల్లోకి వచ్చింది. ఆత్మనిర్భర్ పథకాల ఫలితాన్ని చాటే రీతిలో తొలిసారి మొబైల్ ఎగుమతుల విలువ రెండు లక్షల కోట్ల రూపాయలు దాటింది. వరంగల్ ప్రాంతంలో పండించే చపాటా మిరపకు జీఐ ట్యాగ్ వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారుల కోటాను రెండు నుంచి మూడు శాతానికి పెంచారు. ఆస్కార్ పురస్కారాల్లో 'స్టంట్ డిజైన్' అనే కొత్త విభాగాన్ని చేర్చారు. డీఆర్‌డీఓ తయారు చేసిన దీర్ఘశ్రేణి గ్లైడ్ బాంబు పరీక్ష విజయవంతమైంది. భిన్న రంగాలకు చెందిన ఆరుగురు మహిళల అంతరిక్షయానం వార్తల్లో నిలిచింది. భూమికి సుదూరంగా ఉన్న ఒక గ్రహంలో జీవం ఉనికిని బ్రిటన్ శాస్త్రవేత్తలు కనిపెట్టారు. దేశంలోనే తొలి క్వాంటమ్ గ్రామాన్ని ఏపీ రాజధానిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పోప్ ఫ్రాన్సిస్, ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరి రంగన్, రాజయోగిని దాదీ రతన్ మోహిని, ప్రముఖ నటుడు మనోజ్ కుమార్, వనజీవి రామయ్య తదితర ప్రముఖులు మరణించారు. ఈ ఏడాదిలో ఏప్రిల్‌లో చోటుచేసుకున్న ఇలాంటి ప్రధాన ఘటనలు, పరిణామాలు, వార్తల్లో నిలిచిన వ్యక్తుల వివరాలను అభ్యర్థులు పోటీ పరీక్షార్థుల కోణంలో మరోసారి చదువుకోవాలి.



➡ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 90వ వార్షికోత్సవాన్ని ఏప్రిల్ 1న ఘనంగా నిర్వహించారు. (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934 ప్రకారం 1935, ఏప్రిల్ 1న ఆర్‌బీఐ ఏర్పాటైంది)

➡ భారత్ - అమెరికా సంయుక్తంగా నిర్వహిస్తున్న 'టైగర్ ట్రయంఫ్ - 2025' సముద్ర విన్యాసాలు ఏప్రిల్ 1న విశాఖపట్నంలో 'ఐఎన్ఎస్ జలాశ్వ' నౌకపై ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 1 నుంచి 7 వరకు హార్బర్ ఫేజ్, ఏప్రిల్ 8 నుంచి 13 వరకు 'సీఫేజ్' విన్యాసాలు నిర్వహించారు. ముగింపు వేడుకలు ఏప్రిల్ 13న కాకినాడ తీరాన అమెరికా నౌక యూఎస్ఎస్ - కాంస్టాక్‌పై జరిగాయి.

➡ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను విమర్శిస్తూ డెమోక్రాట్ సెనేటర్ కోరీ బుకర్ 25 గంటల పాటు ప్రసంగించి వార్తల్లో నిలిచారు. సెనేట్ చరిత్రలోనే సుదీర్ఘ ప్రసంగం చేసిన సభ్యుడిగా రికార్డు సాధించారు.

➡ గోల్డ్ మెర్క్యురీ ఇంటర్నేషనల్ సంస్థ టిబెటన్ ఆధ్యాత్మిక గురువు దలైలామాకు శాంతి, సుస్థిరతకు గోల్డ్ మెర్క్యురీ అవార్డు ప్రదానం చేసింది.

➡ తంజావూరులోని కుంభకోణం తమలపాకు, కన్యాకుమారిలోని తోవలై పూలదండకు భారత ప్రభుత్వం భౌగోళిక సూచిక (జీఐ) ట్యాగ్‌లు మంజూరు చేసింది.

➡ తెలంగాణలోని వరంగల్ ప్రాంతంలో పండే చపాటా మిరపకాయ(టమాటో మిరపకాయ)కు జీఐ ట్యాగ్ వచ్చింది.

➡ ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడిగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ సయ్యద్ మొహసిన్ నఖ్వీ బాధ్యతలు స్వీకరించారు.

➡ దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను పదవి నుంచి తొలగిస్తున్నట్లు ఆ దేశ రాజ్యాంగ న్యాయస్థానం ఏప్రిల్ 4న తీర్పు ఇచ్చింది.

➡ ఏప్రిల్ 4న టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ 50 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సంస్థను 1975, ఏప్రిల్ 4న బిల్‌గేట్స్, పాల్ అలెన్‌లు స్థాపించారు.

➡ ప్రధాని నరేంద్ర మోదీ బ్యాంకాక్‌లో జరిగిన బిమ్‌స్టెక్ సదస్సులో ఏప్రిల్ 5న పాల్గొన్నారు. అనంతరం శ్రీలంక పర్యటనకు వెళ్లారు. శ్రీలంక అత్యున్నత పురస్కారం 'మిత్రవిభూషణ'ను మోదీకి శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే ప్రదానం చేశారు. ఇరు దేశాల మధ్య ఏడు ఒప్పందాలు కుదిరాయి.

➡ ఏప్రిల్ 8 నుంచి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అంతకుముందు వక్ఫ్ (సవరణ) బిల్లు 2025కు, ముసల్మాన్ వక్ఫ్ (ఉపసంహరణ) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏప్రిల్ 5న ఆమోదం తెలిపారు.

➡ ప్రముఖ హిందీ నటుడు, దర్శకుడు మనోజ్ కుమార్ (87) ఏప్రిల్ 4న ముంబయిలో మరణించారు. దేశభక్తి చిత్రాలకు చిరునామాగా నిలిచి 'భరత్ కుమార్'గా ప్రసిద్ధి గాంచారు. పద్మశ్రీ, దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాలు అందుకున్నారు.

➡ ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ అధిపతి 'రాజయోగిని' దాదీ రతన్ మోహిని (101) ఏప్రిల్ 8న అహ్మదాబాద్‌లో మరణించారు.

➡ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి మొబైల్ ఫోన్ ఎగుమతులు రూ.2 లక్షల కోట్లను అధిగమించినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

➡ ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా, జలవనరుల శాఖ మంత్రి ఉపాధ్యక్షుడిగా ఆంధ్రప్రదేశ్‌లో జలహారతి కార్పొరేషన్ ఏర్పాటైంది. వరద జలాల సద్వినియోగానికి దీన్ని ప్రభుత్వ ఎంటర్‌ప్రైజెస్‌గా పేర్కొన్నారు.

ప్రఖ్యాత ఒడిశా సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ 'ది ఫ్రెడ్ డారింగ్టన్ బ్రిటిష్ శాండ్ ఆర్ట్ మాస్టర్ అవార్డు - 2025' గెలుచుకుని ఈ పురస్కారం పొందిన తొలి భారతీయుడిగా ఘనత సాధించారు.



➡ ఆంధ్రప్రదేశ్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,17,880 హెక్టార్ల విస్తీర్ణంలో బిందు, తుంపర్ల సేద్యం అమలు చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

➡ ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) పథకం కింద మోడరైజేషన్ ఆఫ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్(ఎం-సీఏడీడబ్ల్యూఎం) అనే కొత్త ఉప పథకాన్ని కేంద్రం ఆమోదించింది.

➡ 2025-2027 కాలానికి ఐక్యరాజ్య సమితి ఇంటర్ గవర్నమెంటల్ వర్కింగ్ గ్రూప్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ ఆన్ ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ ఆఫ్ అకౌంటింగ్ అండ్ రిపోర్ట్ (ఐఎస్ఏఆర్)కు భారత్ ఎన్నికైంది.

➡ ఆస్కార్ పురస్కారాల్లో కొత్తగా 'అచీవ్‌మెంట్ ఇన్ స్టంట్ డిజైన్' అనే కేటగిరీని ప్రవేశపెడుతున్నట్లు అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ సైన్సెస్ సంస్థ ప్రకటించింది. 2027లో విడుదలయ్యే చిత్రాలకు ఈ పురస్కారం లభిస్తుంది.

➡ దీర్ఘశ్రేణి గ్లైడ్ బాంబు 'గౌరవ్'ను విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. వెయ్యి కిలోల తరగతికి చెందిన ఈ అస్త్రాన్ని డీఆర్‌డీఓ దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసింది. సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధవిమానం నుంచి దీన్ని జారవిడవగా, నిర్దేశిత 100 కిలోమీటర్ల పరిధిని అత్యంత కచ్చితత్వంతో సాధించింది.

➡ స్కైట్రాక్స్ వరల్డ్ ఎయిర్‌పోర్ట్స్ అవార్డు - 2025లో సింగపూర్‌లోని చాంగి విమానాశ్రయం ఉత్తమ విమానాశ్రయంగా (13వ సారి) నిలిచింది.

➡ అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ)తో కంట్రీ పార్టనర్‌షిప్ ఫ్రేమ్‌వర్క్ (సీపీఎఫ్) పై సంతకం చేసిన మొదటి ఆఫ్రికన్ దేశంగా, ప్రపంచవ్యాప్తంగా నాలుగో దేశంగా మారిషస్ అవతరించింది. బంగ్లాదేశ్, భూటాన్, క్యూబా ఇప్పటికే ఐఎస్ఏతో సీపీఎఫ్‌పై సంతకాలు చేశాయి.

➡ ఐపీఎల్ చరిత్రలో మొత్తం 1000 బౌండరీలు (ఫోర్లు + సిక్సర్లు) సాధించిన తొలి ఆటగాడిగా విరాట్ కోహ్లీ ఘనత సాధించాడు.

➡ పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవిగా పేరుగాంచిన దరిపల్లి రామయ్య (87) ఖమ్మం జిల్లా, రెడ్డిపల్లి గ్రామంలో ఏప్రిల్ 12న మరణించారు.

➡ ఒలింపిక్ రజత పతక విజేత సాయిఖోమ్ మీరాబాయి చాను ఇండియన్ వెయిట్‌లిఫ్టింగ్ ఫెడరేషన్(ఐడబ్ల్యూఎఫ్) అథ్లెట్స్ కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు.

ప్రపంచ బాక్సింగ్‌కప్‌లో స్వర్ణం సాధించిన తొలి భారతీయుడిగా హితేష్ గులియా చరిత్ర సృష్టించాడు. గాయం కారణంగా ప్రత్యర్థి ఒడెల్ కమరా (ఇంగ్లాండ్) 70 కేజీల ఫైనల్‌లో వాకోవర్ ఇవ్వడంతో హితేష్ విజేతగా నిలిచాడు.



➡ తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 14న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బిల్లుకు ఏప్రిల్ 8న గవర్నర్ ఆమోదం తెలిపారు.

➡ ఏప్రిల్ 14న బ్లూ ఆరిజిన్ న్యూషెపర్డ్ రాకెట్ పూర్తిగా మహిళా సిబ్బందితో సబ్ ఆర్బిటల్ అంతరిక్ష ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తిచేసింది. ఈ ప్రయోగం టెక్సాస్‌లోని వాన్‌హార్న్ నుంచి జరిగింది. విభిన్న రంగాలకు చెందిన ఆరుగురు ప్రముఖ మహిళలు ఈ ప్రయాణంలో పాల్గొన్నారు.

➡ ఇంటర్‌పోల్ కొత్తగా ఏర్పాటు చేసిన గవర్నెన్స్ కమిటీకి ఛైర్‌పర్సన్‌గా యూఏఈ ఎన్నికైంది. ఫ్రాన్స్‌లోని లియోన్‌లో ఉన్న ఇంటర్‌పోల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో యూఏఈకి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ డానా హుమైద్ అల్ మొర్జీ 67% ఓట్లతో విజయం సాధించారు.

➡ 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అమెరికా నిలిచింది. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 2024-25లో 131.84 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అమెరికా ఇలా భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా నిలవడం ఇది వరుసగా నాలుగో ఏడాది.

➡ తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్ఆర్సీ) ఛైర్మన్‌గా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ ఏప్రిల్ 17న బాధ్యతలు స్వీకరించారు.

➡ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను ఏప్రిల్ 17న అమల్లోకి తెచ్చింది. 2024, ఆగస్టులో ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. రాష్ట్రాలకు దీనిపై రాజ్యాంగబద్ధ అధికారం ఉందని పేర్కొంటూ ఆయా వర్గాల వెనుకబాటుతనం ఆధారంగా రాష్ట్రాలు నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొంది.

➡ భారత స్టార్ క్యూయిస్ట్ సౌరవ్ కొఠారి ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్ (టైమ్డ్ ఫార్మాట్)-2025 విజేతగా నిలిచాడు. సౌరవ్ తండ్రి మనోజ్ కొఠారి కూడా టైమ్డ్ ఫార్మాట్‌లో 1990లో ప్రపంచ విజేతగా నిలిచాడు.

➡ మానవ వారసత్వాన్ని భద్రంగా ఉంచే యునెస్కో మెమొరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో భారతీయ సంస్కృతి, వారసత్వ ప్రతీక అయిన భగవద్గీత, భరతముని రచించిన నాట్యశాస్త్ర లిఖిత ప్రతులకు చోటు దక్కింది.

➡ ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) యంగ్ గ్లోబల్ లీడర్ అవార్డును కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు ప్రకటించారు.

గాజాపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో రెండు చేతులు కోల్పోయిన పాలస్తీనా బాలుడు మహమ్మద్ అజ్జూర్ (9) చిత్రం వరల్డ్ ప్రెస్ ఫొటో ఆఫ్ ది ఇయర్ 2025గా ఎంపికైంది. ఖతర్ కేంద్రంగా పనిచేస్తున్న పాలస్తీనియన్ మహిళా ఫొటోగ్రాఫర్ సమర్ అబు ఎలౌఫ్ 'ది న్యూయార్క్ టైమ్స్' కోసం ఈ ఫొటో తీశారు.



➡ ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారుల రిజర్వేషన్‌ను రెండు నుంచి మూడు శాతానికి పెంచుతూ ఏపీ ప్రభుత్వం ఏప్రిల్ 19న ఉత్తర్వులు వెలువరించింది.

➡ ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ (ఐబీసీఏ) ప్రధాన కార్యాలయం, సచివాలయాలను భారత్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

➡ ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ఉపాధ్యక్షుడిగా భారత మాజీ ఆర్థిక కార్యదర్శి అజయ్ భూషణ్ ప్రసాద్ పాండే నియమితులయ్యారు.

➡ క్యాథలిక్కుల అత్యున్నత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) ఏప్రిల్ 21న మరణించారు. అర్జెంటీనాకు చెందిన ఈయన వాటికన్ చరిత్రలోనే తొలి లాటిన్ అమెరికన్ పోప్‌గా చరిత్ర సృష్టించారు. పోప్ అసలు పేరు జోర్జ్ మారియో బెర్గోగ్లియో.

➡ డెజర్ట్ ఫ్లాగ్-10 పేరిట వైమానిక విన్యాసాలను ఏప్రిల్ 21 నుంచి మే 8 వరకు యూఏఈలో నిర్వహించారు. భారత్ నుంచి మిగ్-29, జాగ్వార్ యుద్ధ విమానాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి.

భూమి నుంచి 120 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న 'కె2-18బి' అనే గ్రహంపై జీవం ఉందని బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు గుర్తించారు. సముద్ర జలాల్లోని కొన్ని సూక్ష్మజీవులు ఉత్పత్తి చేసే అణువుల జాడను దీనిపై కనుక్కున్నట్లు తెలిపారు.




➡ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దినేష్ మహేశ్వరి 23వ లా కమిషన్ ఆఫ్ ఇండియా ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. 23వ లా కమిషన్ అధికారికంగా 2024, సెప్టెంబరు 1న ఏర్పడింది. 2027, ఆగస్టు 31 వరకు ఇది కొనసాగుతుంది.

➡ ఇస్రో మాజీ అధిపతి, పద్మవిభూషణ్ డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ (84) ఏప్రిల్ 25న బెంగళూరులో మరణించారు.

➡ లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డ్స్ - 2025ను స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో ప్రదానం చేశారు. 25 ఏళ్ల స్వీడిష్ - అమెరికన్ పోల్‌వాల్టర్ మోండో డుప్లాంటిస్ లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ మ్యాన్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికయ్యాడు. వరల్డ్ స్పోర్ట్స్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని అమెరికా జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్ గెలుచుకుంది.

➡ భారత గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ఫిడే మహిళల గ్రాండ్ ప్రి టైటిల్‌ను గెలుచుకుంది.

➡ దేశంలోనే తొలి క్వాంటమ్ కంప్యూటింగ్ గ్రామాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



రచయిత: సీహెచ్.కృష్ణప్రసాద్

టచ్ చేస్తే చాలు... ఇంట్లో కొత్తందాలు!

మెరిసే లైట్లు.. ఆటోమేటిక్ పరికరాలు రకరకాల డిజైన్లు.. రంగుల గోడలు ఇలా ఇంటికి అలంకరిస్తున్న స్మార్ట్ ఉపకరణాలెన్నో. వీటికి మరిన్ని అందాలు అద్దుతూ.. ఆపరేటింగ్‌ను సులభతరం చేస్తూ.. కొత్త సాంకేతికతతో వచ్చిన టచ్ స్విచ్‌బోర్డుల గురించి తెలుసుకుందాం..







అలంకరణ విషయంలో ఇంటిని ఆధారితో పోలుస్తుంటారు పెద్దలు. ఎన్ని మెరుగులు దిద్దినా ఇంకా ఏదో మిగిలే ఉంటుందని కావచ్చు. ఇలా ఇంటి అందం, భద్రతల్లో ఎన్నో మార్పులు వచ్చి ప్రస్తుతం ఏఐతో కూడిన ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చేసింది. మనం ఇంట్లో ఉన్నా, లేకున్నా.. ఇంటి లోపలి పరిస్థితులను ఎక్కడినుంచైనా నియంత్రించుకోవచ్చు. ఆరుబయట వాతావరణానికి అనుగుణంగా ఇంట్లో ఉష్ణోగ్రతలను ఆపరేట్ చేసుకోవచ్చు. ఇళ్లు, కార్యాలయాల్లో ఆటోమేషన్ ట్రెండ్‌గా మారుతుండటంతో వాటికి సంబంధించిన ఉపకరణాల విక్రయ కేంద్రాలు విరివిగా వస్తున్నాయి.

ట్రెండింగ్‌గా టచ్ స్విచ్‌లు..

ప్రస్తుత మార్కెట్లో టచ్ స్విచ్‌లు బాగా ట్రెండ్ అవుతున్నాయి.

తొలినాళ్లలో చెక్క, ఐరన్‌తో చేసిన ప్యానళ్లు, స్విచ్‌ల స్థానంలో కాలానుగుణంగా అనేక మోడళ్లొచ్చాయి.

ఇప్పుడు అవన్నీ పోయి టచ్ స్విచ్‌లకు డిమాండ్ పెరిగింది.

వీటికి ఆటోమేషన్ తోడవ్వడంతో మున్ముందుగా ఆపరేట్ చేయాల్సిన పని లేకుండా ఎక్కడి నుంచైనా ఆన్, ఆఫ్ చేసుకోవచ్చు.

గుర్తుపెట్టుకుంటాయి..

- టచ్ స్విచ్‌బోర్డులు కేవలం సంజ్ఞలతోనే పని చేస్తాయి.
- ఫ్యాన్ వేయాలంటే దాని గుర్తుమీద టచ్ చేస్తే సరిపోతుంది. స్పీడ్ పెంచాలంటే దానిపై ఎన్నిసార్లు నొక్కితే అంత వేగంగా తిరుగుతుంది.
- ఇందులో ట్యూబ్, డిమ్ లైట్స్, ఏసీ, కాలింగ్ బెల్ వంటి గుర్తులుంటాయి.
- వీటిలో కొంచెం అధునాతనంగా తెరలు మారేవీ ఉన్నాయి.
- లైట్స్ వద్ద టచ్ చేస్తే రూఫ్, గదుల వివరాలు చూపిస్తుంది. వాటిల్లో మనకు అవసరమైనవి ఆన్, ఆఫ్ చేసుకోవచ్చు.
- మార్కెట్లో కంపెనీలు (బ్రాండ్స్), సౌకర్యాలను బట్టి రూ.1,500 నుంచి రూ.10 లక్షల వరకు అందుబాటులో ఉన్నాయి.
- ఆటోమేషన్‌లో భాగంగా కొన్ని కంపెనీలు స్విచ్చులను మొబైల్ యాప్‌ల ద్వారా నియంత్రించేలా తయారు చేస్తున్నాయి. వీటిని వాయిస్ కమాండ్‌తోనూ ఆపరేట్ చేసుకోవచ్చు.
- రోజూ ఒకే సమయానికి ఆన్, ఆఫ్ అయ్యేలా టైమింగ్ సెట్ చేసుకోవచ్చు.

అరచేతిలో ఇంటి నియంత్రణ

- మన అభిరుచికి తగ్గట్లు ఎప్పటికప్పుడు మార్చుకునేలా ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారు.
- అందులో కృత్రిమ లైటింగ్, ట్రెండ్స్‌తో నచ్చిన విధంగా ఏర్పాటు చేసుకోవచ్చు.
- ప్రకృతి ఒడిలో ఉన్నట్లు, పర్వతాల మధ్య నడుస్తున్నట్లు, సెలయేరును చూస్తున్నట్లు, హిమాలయాల మధ్య ధ్యానం చేస్తున్నట్లుగా గ్రేట్ సీలింగ్ ట్రెండ్స్‌నూ అమర్చుకోవచ్చు.
- దీనిద్వారా ఎండాకాస్తున్నా వర్షం పడుతున్న అనుభూతి పొందొచ్చు.
- ప్రకృతిలో ఉన్న వాతావరణాన్ని సృష్టించి పుస్తకాలు చదవవచ్చు. పాటలు వినవచ్చు.
- ఇష్టమైన ఆర్ట్‌ని తగిన పరిమాణంలో గోడలకు ఆకర్షించే ప్రొజెక్టర్ లైట్ ద్వారా కాంతి ప్రసరించేలా చేసి గదిని ఆహ్లాదకరంగా మార్చుకుంటున్నారు.
- లైట్ల ద్వారా వార్డ్‌రోబ్, కూలింగ్ మెయింటెనెన్స్ చేసుకోవచ్చు. వాల్ లైట్స్ ఐ కంఫర్ట్‌గా ఉండేలా ఎప్పటికప్పుడు మార్చుకోవచ్చు.
- వీటన్నిటినీ మొబైల్ యాప్‌తో నియంత్రించుకోవచ్చు. లేకుంటే ఆ గదిలో మనం ఉండే చోట నుంచే ఆపరేట్ చేసుకునే మాడ్యులర్ స్విచ్‌బోర్డులు అందుబాటులో ఉన్నాయి.
- మొబైల్ యాప్ ద్వారానే రిఫ్రిజిరేటర్ ఆన్, ఆఫ్, పెట్ మానిటరింగ్, గ్యారేజ్ డోర్, సెక్యూరిటీ కెమెరాలను నిర్వహించుకోవచ్చు.

పాత ఇళ్లకు కొత్త టచ్..

- టచ్ స్విచ్ బోర్డులను కొత్త ఇళ్లల్లోనే కాదు పాత వాటిలోనూ ఏర్పాటు చేసుకోవచ్చు.
- వందేళ్లనాటి ఇళ్లయినా వైరింగ్ సక్రమంగా ఉంటే పాత స్విచ్ బోర్డులు తొలగించి టచ్ ప్యానళ్లు అమర్చవచ్చు.
- అన్ని రకాల స్విచ్‌లు అందులోనే వచ్చేస్తాయి.
- పాత ఇళ్ల రీమోడలింగ్‌లో ఎక్కువమంది వీటినే ఎంపిక చేసుకుంటున్నారు.

- ఈనాడు, విశాఖపట్నం





పూజారులుగా తల్లీకుమార్తెలు

సాధారణంగా ఆలయాల్లో పురుషులనే పూజారులుగా చూస్తుంటాం. కానీ, కృష్ణా జిల్లా బాపులపాడులోని తల్లీకుమార్తెలు రాజ్యలక్ష్మి, శ్రీలక్ష్మి రెండు దశాబ్దాలుగా పూజారులుగా రాణిస్తున్నారు. ఏలూరు జిల్లా తడికలపూడిలో 25 ఏళ్ల కిందట సాయిబాబా మందిరం నిర్మించినప్పుడు పూజారి లేకపోవడంతో భోజనపల్లి శ్రీలక్ష్మి ఆ బాధ్యతలు తీసుకున్నారు. 3 నెలల్లో పూజా విధానం నేర్చుకొని.. అక్కడ సేవలందించారు. ఐదేళ్లుగా బాపులపాడు సాయి మందిరంలో సేవ చేస్తున్నారు. శ్రీలక్ష్మి తల్లి వజ్రపదం రాజ్యలక్ష్మి అనుకోకుండా ఈ వృత్తిలోకి అడుగు పెట్టారు. నిర్వాహణ లోపంతో మూసివేసిన బాపులపాడులోని పురాతన కోదండ రామాలయాన్ని రాజ్యలక్ష్మి కుటుంబీకుల సహకారంతో స్థానికులు 23 ఏళ్ల కిందట పునస్థాపించారు. అనంతరం పూజారి బాధ్యతలను ఆమెకే అప్పగించారు. ప్రత్యేకంగా శిక్షణ లేకపోయినా.. చిన్నప్పుడు నేర్చుకున్న వేద విద్యకు ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుకుంటూ దేవుడి సేవలో రాణిస్తూ.. భక్తుల మన్ననలు పొందుతున్నారు. -న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్

ఐవీఎఫ్‌తో అధిక పాలిచ్చే గోవులు!



ప్రయోగశాలలో ఫలదీకరణ ప్రక్రియ- ఐవీఎఫ్ ద్వారా అధిక పాల దిగుబడినిచ్చే గోవులను పెద్దసంఖ్యలో ఉత్పత్తి చేయడంలో బిహార్ విజయం సాధిస్తోంది. మేలుజాతి గో సంతతి వృద్ధికి జాతీయ గోకుల్ మిషన్ పథకం కింద దేశమంతటా 31 ఐవీఎఫ్ ప్రయోగశాలలను ఏర్పాటు చేయగా, వాటిలో బిహార్ ప్రయోగశాల అత్యధిక విజయాలను నమోదు చేస్తోందని ఆ లేబరేటరీ అధిపతి డాక్టర్ దుష్యంత్ యాదవ్ తెలియజేశారు. ఐవీఎఫ్ సాంకేతికతతో సహివాల్, అరుణ సింధీ, థర్పర్కర్, అరుణ పూర్ణియా వంటి దేశవాళీ మేలుజాతి గోవుల నుంచి గో సంతతిని అపారంగా వృద్ధి చేయవచ్చు. ఈ గోవులు రోజుకు 20 లీటర్ల వరకూ పాలు ఇస్తాయి. ఇలాంటి అధిక దిగుబడి దేశవాళీ జాతి గోవు నుంచి తడవకు 100-120 అండాలను సేకరించి మేలుజాతి ఆంబోతు వీర్యకణాలతో ప్రయోగశాలలో ఫలదీకరణ చేస్తారు. అక్కడ ఏడు రోజులపాటు పెరిగిన పిండాన్ని తక్కువ దిగుబడినిచ్చే గో గర్భంలో ప్రవేశపెడతారు. బిహార్‌లో ఈ ప్రక్రియ ద్వారా ఇంతవరకు 25 దూడలు జన్మించగా.. అవన్నీ ఆడవే కావడం విశేషం. ముర్రా జాతి గేదెలకూ ఐవీఎఫ్ ప్రక్రియను వర్తింపజేయడానికి ప్రయత్నిస్తున్నామని బిహార్ పశువైద్య విశ్వవిద్యాలయం తెలిపింది.

-ఈటీవీ భారత్

లెక్కలు తేల్చే ల్యాబ్!



నిచ్చెనలు, పాములతో నిండిన వైకుంఠపాళి ఆటను చిన్నతనంలో ఆడే ఉంటాం. కానీ గణిత ప్రక్రియ సోపానక్రీడ ఎప్పుడైనా చూశారా? ఈ ఆటలో నిచ్చెనలు, పాములకు బదులు క్యూబ్‌లు, స్క్వేర్ రూట్‌లు, గుణింతాలు, భాగహారాలు.. ఇలా రకరకాల ప్రక్రియలు ఉంటాయి. వీటిని ఆధారం చేసుకునే ఆటలో పైకి వెళ్లడమా.. కిందకి దిగిపోవడమా అనేది జరుగుతుంది. లెక్కలంటే భయపడే చిన్నారులకు అవగాహన కల్పించడానికి, ఆసక్తికరంగా మలచడానికి గణిత విద్యావేత్త డాక్టర్ పి.సత్యనారాయణశర్మ దీనిని రూపొందించారు. ఇదే కాదు.. దాదాపు 150కి పైగా అంశాలతో విజయవాడ కేబీఎన్ కళాశాలలో ఒక మ్యాథమెటిక్స్ ల్యాబ్‌నే తీర్చిదిద్దారు. గణితంతో మనిషి జీవితం ఎలా ముడిపడి ఉందనే కోణంలో చెప్పడమే ఈ ల్యాబ్ వెనుక ప్రధాన ఉద్దేశమని వివరించారు.

- ఈనాడు, అమరావతి



అవును.. ఇది వంకాయ్



ఒక్కసారిగా చూడగానే చెట్టుకు పాము వేలాడుతున్నట్లుగా కనిపిస్తోంది కదూ! కానీ ఇది వంకాయ. సాధారణంగా వంకాయలు ఐదు నుంచి ఆరు అంగుళాల పొడవు ఉంటాయి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలోని కోడి వెంకటేశ్ ఇంట్లోని వంకాయ చెట్టుకు మాత్రం 15 అంగుళాల పొడవు పెరిగి ఆశ్చర్యపరిచింది.

-న్యూస్‌టుడే, కేసముద్రం రూరల్

ఇద్దరమ్మాయిల ప్రేమపెళ్లి.. గ్యాస్‌స్టవ్ చుట్టూ ఏడడుగులు!



బిహార్‌లోని మధేపురా జిల్లా వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు యువతులు వివాహబంధంతో ఒక్కటయ్యారు. పూజా గుప్తా (21), కాజల్ కుమారి (18)లకు సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. సుపాల్ పట్టణంలోని ఓ మాల్‌లో పనిచేస్తున్న వీరిద్దరూ కలిసి జీవించాలని నిర్ణయించుకొని మంగళవారం రాత్రి కాళీమాత మందిరంలో నిరాడంబరంగా పెళ్లి చేసుకున్నారు. హోమానికి బదులుగా గ్యాస్ స్టవ్ చుట్టూ ఏడడుగులు వేశారు. యువతులిద్దరూ తమ పెళ్లి వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. అభిరుచులు కలిశాయని, పైగా అబ్బాయిలంటే తమకు ఆసక్తి లేకపోవడంతో పరస్పర అంగీకారంతో వివాహం చేసుకున్నట్లు వారు తెలిపారు. ఈ విషయం పట్టణమంతా పొక్కడంతో సుపాల్‌లోని 18వ వార్డులో యువతులు ఇద్దరూ అద్దెకు ఉంటున్న గది ముందు స్థానికులు పెద్దసంఖ్యలో గుమికూడి కోలాహలం నెలకొంది.

-ఈటీవీ భారత్

సాహసికి సత్కారం.. ఒంటిచేతి చేవకు పట్టం!

- రాష్ట్రీయ బాల పురస్కార్ అందుకున్న తెలుగు తేజాలు

ఈనాడు, దిల్లీ: వీర బాలదివస్ సందర్భంగా కేంద్ర మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ప్రకటించిన 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2025'ను 18 రాష్ట్రాలకు చెందిన 20 మంది పిల్లలు అందుకున్నారు. ధైర్యసాహసాలు, కళలు, సంస్కృతి, పర్యావరణ పరిరక్షణ, సామాజికసేవ, శాస్త్రసాంకేతిక, క్రీడా విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన వారిని ఈ పురస్కారాలు వరించాయి. శుక్రవారం ఇక్కడి విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలు స్వీకరించారు. ఇందులో తెలంగాణ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన 16 ఏళ్ల పర్వతారోహకుడు విశ్వనాథ్‌కార్తికేయ పడకంటి, ఏపీ కర్నూలు జిల్లాకు చెందిన 17 ఏళ్ల శివాని హోసూరు ఉప్పర ఉన్నారు. ఈ పురస్కారాలు దేశవ్యాప్తంగా యువతలో స్ఫూర్తి నింపుతాయని రాష్ట్రపతి ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవి పాల్గొన్నారు.

పర్వతాలు పాదాక్రాంతం..

పదహారేళ్ల విశ్వనాథకార్తికేయ పడకంటి చిన్న వయసులోనే పలు పర్వతాలను అధిరోహించారు. 2025లో ఎవరెస్ట్ అధిరోహించడంతో ప్రపంచంలోని ఏడు ఎత్తైన పర్వత శిఖరాలను ఎక్కిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించారు. కార్తికేయ పేరుపై నాలుగు ప్రపంచ రికార్డులున్నాయి. నైరుతి రష్యాలోని మౌంట్ ఎల్‌బ్రస్‌ను 24 గంటల్లోనే అధిరోహించిన చిన్న వయస్కుడిగానూ ఘనత సాధించారు. ఆరు ఖండాల్లోని 20 ఎత్తైన శిఖరాలను జయించి ఇండియా, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌ల్లోకి ఎక్కారు. ఈ ఏడాది ఐ3 ఫౌండేషన్ ద్వారా టెన్జింగ్ నార్కే



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి పురస్కారం అందుకుంటున్న విశ్వనాథకార్తికేయ పడకంటి

ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు.

ఒక్క చేత్తో రికార్డుల మోత

ఒక చేయి లేకపోయినా తనలో చేవ ఉందని నిరూపించుకున్నారు మద్దికెరకు చెందిన శివాని. తల్లిదండ్రులిద్దరూ కూరగాయలు విక్రయించి జీవనం సాగిస్తున్నప్పటికీ ఈ అమ్మాయి షాట్‌పుట్, జావెలిన్‌త్రోలో అంతర్జాతీయంగా రాణించి రాష్ట్ర పతాకాన్ని రెపరెపలాడించారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 8కిపైగా పతకాలు సాధించారు. 2023లో థాయ్‌లాండ్‌లో జరిగిన వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్ గేమ్స్‌లో జావెలిన్‌త్రో, షాట్‌పుట్ విభాగాల్లో అండర్ 20 ఛాంపియన్‌గా నిలిచారు. 2024లో బెంగళూరు నేషనల్ జూనియర్, సబ్‌జూనియర్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పరుగు, జావెలిన్‌త్రో, షాట్‌పుట్‌లో బంగారు పతకాలు సాధించారు.

స్నేహితుడిని కాపాడబోయి.. ప్రాణాలు విడిచి..



వ్యోమ ప్రియ

చెన్నై, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురైన స్నేహితుడిని కాపాడబోయి ప్రాణాలు విడిచిన ఎనిమిదేళ్ల చిన్నారికి ప్రకటించిన బాల పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఆమె తల్లి అందుకున్నారు. తమిళనాడులోని కోయంబత్తూర్ జిల్లా చిన్నవేడంపట్టికి చెందిన వ్యోమ ప్రియ(8) గతేడాది మే23న అపార్ట్‌మెంట్ పార్కులో స్నేహితులతో కలిసి ఆడుకుంటోంది. అదే సమయంలో ఆరేళ్ల బాలుడు విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. అతడిని గమనించిన వ్యోమ ప్రియ కాపాడేందుకు ప్రయత్నించి బాలుడితో సహా ప్రాణాలు కోల్పోయింది. ఆమె ధైర్య సాహసాలకు అప్పట్లోనే 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్'ను ప్రకటించారు. దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బాలిక తల్లి అర్చనా శివరామకృష్ణన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.



పురస్కారం స్వీకరిస్తున్న అర్చనా శివరామకృష్ణన్

సంచలన క్రికెటర్ సూర్యవంశీకి..



దిల్లీ: భారత సంచలన యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ దక్కింది. వివిధ రంగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఈ అవార్డు ఇస్తారు. ఈ ఏడాది ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ఆడుతూ విధ్వంసక ఇన్నింగ్స్‌తో (38 బంతుల్లో 101; గుజరాత్ టైటాన్స్‌పై) వెలుగులోకి వచ్చిన 14 ఏళ్ల సూర్యవంశీ.. తర్వాతా ఆ దూకుడు కొనసాగిస్తున్నాడు. తాజాగా విజయ్ హజారే ట్రోఫీలో బిహార్ తరఫున అరుణాచల్ ప్రదేశ్‌పై కేవలం 84 బంతుల్లోనే 190 పరుగులు చేశాడు. ఈ క్రమంలో 36 బంతుల్లోనే సెంచరీ అందుకున్నాడు. వైభవ్‌తోపాటు స్విమ్మింగ్ కెరటం దినిది దేశింగు (కర్ణాటక), చెస్ సంచలనం లక్ష్మీ ప్రాజ్ఞిక (గుజరాత్), జ్యోతి (పారా అథ్లెట్, హరియాణా), యోగిత (జూడో, ఛత్తీస్‌గఢ్), జోష్న(వెయిట్ లిఫ్టింగ్, ఒడిశా), అనుష్క(ఫుట్‌బాల్, ఝార్ఖండ్)లకు కూడా ఈ అవార్డు లభించింది.

'సిందూర్' వేళ సాయం చేసి..



'ఆపరేషన్ సిందూర్' సమయంలో పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ జిల్లాకు చెందిన పదేళ్ల బాలుడు శ్రవణ్ సింగ్ మన సైనికులకు బాసటగా నిలిచాడు. అడగకముందే వారికి మంచినీరు, పాలు, టీ, లస్సీ.. వంటివి అందిస్తూ తనవంతు సాయం చేశాడు. ఆ బాలుడి ధైర్యసాహసాలు, ఉత్సాహానికి ప్రశంసించిన సైన్యం అతడి చదువుకయ్యే ఖర్చులు పూర్తిగా భరించేందుకు ముందుకొచ్చింది. ఈ క్రమంలో తాజాగా శ్రవణ్ సింగ్‌ను ఇప్పుడు బాలల పురస్కారం వరించింది.

పిల్లలు అశ్లీల చిత్రాలు చూడటాన్ని అడ్డుకునేలా సాఫ్ట్‌వేర్ తప్పనిసరి

- కేంద్ర ప్రభుత్వానికి మదురై ధర్మాసనం సూచనలు

చెన్నై, న్యూస్‌టుడే: పిల్లలు ఆన్‌లైన్‌లో అశ్లీల చిత్రాలు చూడటాన్ని అడ్డుకునేలా సాఫ్ట్‌వేర్ తప్పనిసరి అని కేంద్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం సూచించింది. విజయకుమార్ అనే వ్యక్తి ఈ అంశంపై ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. జాతీయ బాలల సంరక్షణ చట్టం ప్రకారం ఇలాంటి అశ్లీల వీడియోలను అడ్డుకునేలా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలంటూ కేంద్ర సమాచార, ప్రసారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి, హోంశాఖ కార్యదర్శి, జాతీయ, తమిళనాడు బాలల హక్కుల సంరక్షణ కమిషన్ల సభ్యత్వ కార్యదర్శులు, ఇంటర్నెట్ సర్వీసెస్ ప్రొవైడర్ల సంఘం కార్యదర్శి తదితరులకు ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తులు జస్టిస్ జయచంద్రన్, జస్టిస్ కె.కె.రామకృష్ణన్‌లతో కూడిన ధర్మాసనం.. కేంద్ర ప్రభుత్వం 2017లో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఇలాంటి వివాదాస్పదమైన వీడియోలను అడ్డుకోవడానికి మార్గాలు ఉన్నాయని తెలిపింది. అశ్లీల చిత్రాలను పిల్లలు చూడటాన్ని పూర్తిగా అడ్డుకోవడానికి మార్గం సుగమం చేసే సాఫ్ట్‌వేర్ తప్పనిసరి అని పేర్కొంది. ఇలాంటి జుగుప్సాకరమైన దృశ్యాలను చూడటం, మానుకోవడం వారివారి ఇష్టం, హక్కుకు సంబంధించిన విషయమైనా ఇలాంటి వీడియోలను పిల్లలు చూస్తే దుష్ప్రభావానికి గురవుతారని పేర్కొంది. ఆస్ట్రేలియా తరహాలో 16 ఏళ్లలోపు పిల్లలు ఆన్‌లైన్‌ను చూడటాన్ని కేంద్ర ప్రభుత్వం నిషేధించాలని, అప్పటివరకు ఈ విషయమై పిల్లలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బాలల హక్కుల కమిషన్ వంటివి చేపట్టాలని సూచించింది.

అక్రమంగా భూముల బదలాయింపుపై న్యాయం చేయండి

- వైఎస్సార్ జిల్లా ఇన్‌ఛార్జి జేసీకి సునీత దంపతుల వినతి



ఇన్‌ఛార్జి జేసీ విశ్వేశ్వరనాయుడితో మాట్లాడుతున్న సునీత దంపతులు

ఈనాడు, కడప: తన తల్లి వైఎస్ సౌభాగ్యమ్మ పేరిట ఉన్న భూములను ఇతరులకు అక్రమంగా బదలాయించడంపై సమగ్ర విచారణ చేపట్టి, న్యాయం చేయాలని మాజీ మంత్రి వైఎస్ వివేకా కుమార్తె సునీత.. తన భర్త రాజశేఖరరెడ్డితో కలిసి వైఎస్సార్ కడప జిల్లా ఇన్‌ఛార్జి జేసీ విశ్వేశ్వరనాయుడిని కోరారు. తన తల్లి పేరిట ఉన్న భూముల పత్రాలు, ఇతర ఆధారాలను శుక్రవారం కడపలోని కలెక్టర్ కార్యాలయానికి తీసుకొచ్చి చూపించారు. 2006లో కొనుగోలు చేసిన భూములు 2022 వరకు సౌభాగ్యమ్మ పేరిటే ఉండగా, ఆ తర్వాత కనిపించలేదని.. భూముల బదలాయింపునకు తాము దరఖాస్తు చేయలేదని ఆయన దృష్టికి తెచ్చారు. పలువురు రెవెన్యూ అధికారులతో మాట్లాడిన ఇన్‌ఛార్జి జేసీ.. ఈ అంశంలో విచారణ చేపట్టి, భూములను తిరిగి సౌభాగ్యమ్మ పేరిట బదలాయించడంతో పాటు సమస్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్ శ్రీధర్ డిజిటల్, ఫోరెన్సిక్ విచారణకు ఆదేశించారని, ఆ నివేదిక సైతం త్వరలో వస్తుందని వెల్లడించారు.

కర్నూలు వైద్య కళాశాలలో నాలెడ్జ్ సెంటర్

- రూ.50 కోట్లతో నిర్మించేందుకు ముందుకొచ్చిన పూర్వ విద్యార్థులు



నాలెడ్జ్ సెంటర్ నిర్మాణ ప్లాన్‌ను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వైద్య కళాశాలలో నాలెడ్జ్ సెంటర్ నిర్మించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. విద్యా సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో వైద్య కళాశాల, సర్వజన వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. విదేశాల్లో ఉన్న కర్నూలు వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు.. తాము చదువుకున్న విద్యా సంస్థ రుణం తీర్చుకునేందుకు రూ.50 కోట్లతో నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చారన్నారు. దీన్ని 66.66 సెంట్ల స్థలంలో నిర్మించనున్నట్లు చెప్పారు. అందులోనే అత్యాధునిక గ్రంథాలయం, పరిశోధన కేంద్రం, వ్యాయామశాల, పెవిలియన్, ఇండోర్ గేమ్స్ కాంప్లెక్స్, సమావేశ మందిరం ఇతర సదుపాయాలు ఉంటాయని వెల్లడించారు. ఏడాది కాల వ్యవధిలో నిర్మాణ పనులు పూర్తి చేసి, భవనాన్ని ప్రిన్సిపల్‌కు అప్పగిస్తారని వివరించారు.



ఇలా ఉంటే పెట్టుబడులకు అర్హత ఉన్నట్లే

- ఏ విషయాన్నైనా నేర్చుకునే మానసిక సంసిద్ధత.
- తార్కికమైన ఆలోచన.
- లోతైన అధ్యయనం చేసే నైజం.
- క్రమశిక్షణ, ఓర్పు.
- 5 సంవత్సరాలకు మించిన దీర్ఘకాల దృష్టి. ఈ లక్షణాలుంటే స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టేందుకు అర్హత సాధించినట్లే.

– చంద్ర భాటియా, ఇన్వెస్టర్

రుణాల మంజూరులో తీరు మార్చుకోకపోతే డిపాజిట్లన్నీ మళ్లిస్తాం

- కార్పొరేట్ బ్యాంకులపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆగ్రహం



గుంటూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న పథకాలకు సంబంధించిన రుణాల మంజూరులో కార్పొరేట్ బ్యాంకులు అలసత్వం ప్రదర్శిస్తున్నాయని, వచ్చే సమీక్ష నాటికి తీరు మార్చుకోకపోతే వాటిల్లోని ప్రభుత్వ డిపాజిట్లను ప్రభుత్వ రంగ బ్యాంకులకు మళ్లిస్తామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హెచ్చరించారు. గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పథకాలకు సంబంధించి కార్పొరేట్ బ్యాంకులు కనీస రుణాలు మంజూరు చేయకపోవడంపై పెమ్మసాని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా బ్యాంకులు వ్యాపారాలు తప్ప, ప్రజలకు సేవ చేయడం లేదని పేర్కొన్నారు. రుణాల మంజూరులో ప్రభుత్వ రంగ బ్యాంకులైన ఎస్‌బీఐ, యూబీఐలు ముందున్నాయని అభినందించారు. ముద్ర రుణాల మంజూరులో గుంటూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు.

గుంటూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కుర్రా అప్పారావు

- ఉదయగిరికి విజయలక్ష్మి, సిద్దవటానికి శ్రీలేఖ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని మూడు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం ఛైర్మన్లను ప్రకటించింది. తెదేపా, భాజపా, జనసేనల నుంచి ఒక్కొక్కరికి ఈ అవకాశం కల్పించింది. రాష్ట్రంలోనే పెద్ద మార్కెట్ యార్డుల్లో ఒకటైన గుంటూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా తెదేపాకు చెందిన కుర్రా అప్పారావును, వైఎస్సార్ కడప జిల్లా సిద్దవటం ఏఎంసీ ఛైర్మన్‌గా జనసేనకు చెందిన తమ్మిశెట్టి శ్రీలేఖను, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా భాజపాకు చెందిన పలుగుళ్ల విజయలక్ష్మిని నియమించింది.

వసుంధర

vasundhara@eenadu.in




వృత్తి, వ్యక్తిగత జీవితాల్లో ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులకు కుంగిపోని మహిళలు ఉండరు. కొందరైతే అవే ఆలోచిస్తూ నిద్రకూ దూరం అవుతారు. ఈ ఆలోచనల వల్ల ఒరిగేదేమీ ఉండదు సరికదా... మానసిక సమస్యలు చుట్టుముడతాయి.

నిద్రకు దూరం కాకూడదంటే..!

ఈ ఆలోచనలన్నీ విసిగించేది రాత్రి సమయంలోనే. దాంతో నిద్రకు దూరం అవుతాం. దాని ప్రభావం తర్వాతి రోజు మీదా పడుతుంది. అలాకాకూడదంటే... రోజు సరిగా లేనప్పుడు, నిద్రపోయేముందు కొన్ని విషయాల్ని ఓసారి మననం చేసుకోమంటున్నారు నిపుణులు. ఇవి మీలో సానుకూల దృక్పథాన్ని పెంచి, నిద్ర పట్టేందుకు సహకరిస్తాయట. 'ఈ రోజు చాలా కష్టంగా ఉంది. కానీ పూర్తయిపోయింది. కాబట్టి దాని గురించి ఆలోచించినా ఉపయోగం ఉండదు. మరచిపోవాలి, మరచిపోయేందుకు ప్రయత్నించాలి'... ఇలా మనసులో పదేపదే తలుచుకోమంటున్నారు. ఈ విధానం గతాన్ని మరచిపోయి ప్రస్తుతానికి మెదడును తీసుకువచ్చేందుకు సహకరిస్తుంది. అలాగే ధ్యానం చేస్తూ... 'పాత విషయాలు ఆలోచించే సమయం నాకు లేద'ని చెప్పుకోమంటున్నారు. శ్వాస మీద ధ్యాస పెట్టమంటున్నారు. దీంతోపాటు 'అన్ని రోజులూ ఒకేలా ఉండవు, ఈరోజు బాగాలేదు... రేపు దీని కన్నా మంచిగా ఉండదని గ్యారెంటీ లేదు కదా! కాబట్టి అయిపోయిన దానికోసం ఆలోచించన'ని అనుకోమంటున్నారు. భావోద్వేగాల విషయంలో మెదడు కూడా ఓ రకంగా కంప్యూటర్ లాంటిదే. మనం చెప్పినట్లే వింటుంది. అందుకే ఇలాంటి సానుకూల దృక్పథాన్ని అలవరచుకోవడం వల్ల ప్రతికూలతలు దూరమై... మంచి నిద్రని సొంతం చేసుకోవచ్చు అంటున్నారు నిపుణులు. పాటించి చూడండి మరి!

త్రయాంగాసనం



చేసే విధానం: ముందుగా యోగా మ్యాట్‌పైన ప్రశాంతంగా కూర్చోండి. నెమ్మదిగా రెండు చేతుల్నీ ముందుకు చాచి నేలపైన ఆన్చండి. నడుమును పైకి లేపుతూ... పాదాలను వెనక్కి జరపండి. నడుము కొండ మాదిరిగా పైకి ఉండాలి. తలను చేతులకు సమాంతరంగా కిందకు దించి మోకాళ్లు వంచకుండా జాగ్రత్త పడండి. దీన్నే అధిముఖ శ్వానాసనం లేదా పర్వతాసనం అంటారు. శ్వాస తీసుకుంటూ ఒక కాలిని నెమ్మదిగా పైకి లేపాలి. పైకి లేపిన కాలుని మెల్లగా ఎంత వీలైతే అంత... దాదాపు 60 డిగ్రీల కోణంలో చాచడానికి ప్రయత్నించండి. ఆపై దృష్టిని నేలపైన నిలిపి ఆసనాన్ని నిలబెట్టాలి. ఆ స్థితిలో 10-15 సెకన్లపాటు ఉండి శ్వాస తీసుకోవాలి. తర్వాత శ్వాస వదులుతూ కాలిని కిందకు దించి ఆసనం నుంచి బయటకు వచ్చి విశ్రాంతి పొందండి.

ఉపయోగాలు: కాళ్లు, చేతులు బలంగా తయారవుతాయి. శారీరక బలం, మానసిక దృఢత్వం లభిస్తాయి. ఈ ఒక్క ఆసనం నాలుగైదు వ్యాయామాలతో సమానం.

జాగ్రత్తలు: తుంటి, నడుము సర్జరీలు అయినవాళ్లు డాక్టర్ సలహాతో చేయాలి.

ఆహారం: సాత్వికమైన ఫలాలూ, కూరగాయలూ, విత్తనాలు. ప్రొటీన్ల కోసం సోయాబీన్స్, పనీర్‌ని ఆహారంలో చేర్చండి.

- శిరీష, యోగ గురు



జగజ్జేత... మనమ్మాయి!



ఎవరెన్ని చెప్పినా అమ్మాయిలూ, ఆటలూ కాస్త దూరం దూరమే! కానీ మార్పు మొదలైంది. కారణం మన క్రీడాకారిణుల మరపురాని గెలుపులే! వాటిని చూశాక చాలామంది మారారు. అమ్మాయిల్ని క్రీడలవైపు ప్రోత్సహించొచ్చన్న ఆలోచన చేస్తున్నారు. అలాంటి విజయాలను అందించిన మన అమ్మాయిల బృందాల్ని కలుసుకోండి.

నీలి దళం గెలిచింది!

క్రికెట్... చాలామంది భారతీయులకు అభిమాన క్రీడే! అయితే అది మగవాళ్ల ఆటకే పరిమితం. మెన్ ఇన్ బ్లూ'కి ఉన్న ఆదరణ అమ్మాయిల జట్టుకి లేదనే చెప్పాలి. అయినప్పటికీ ఆటలో, వేతనాల్లో, గుర్తింపులో సమానత్వం కోసం మన మహిళా క్రికెట్ జట్టు పోరాడుతూనే ఉంది. ఆటను మెరుగుపరచుకుంటూ రికార్డులు సృష్టిస్తూ అవకాశాలను అందుకుంటూనే ఉంది. వాళ్లకీ ఒకటే కల 'వరల్డ్ కప్' సాధించడం. ఈసారీ దాన్ని నెరవేర్చలేరనే అనుకున్నారంతా. కానీ మన అమ్మాయిలు పోరాడారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వంటి బలమైన జట్లను మట్టికరిపించి కప్పు సాధించారు. వాళ్ల పోరాటం ప్రతి క్రికెట్ అభిమానినీ కదిలించింది. ఆ సంబరాలను ఆస్వాదించేలా చేసింది.

- అమ్మాయిల సీనియర్ జట్టు చరిత్ర సృష్టించిందన్న మాట వాస్తవమే! కానీ జూనియర్ జట్టూ తక్కువేమీ కాదు. సీనియర్ల కంటే ముందే అండర్-19 అమ్మాయిల జట్టు టీ20 వరల్డ్ కప్‌ని గెలిచింది. అదీ ఒక్క మ్యాచ్ కూడా ఓడకుండా! ఇందులో బ్యాటు, బంతి రెండింటితో రాణించింది మన తెలుగమ్మాయి... గొంగడి త్రిష. అన్నట్టూ ఇది అండర్ 19 జట్టుకి రెండో వరల్డ్ కప్.
- భారత మహిళా జట్టు తొలిసారి వరల్డ్‌కప్‌ని ముద్దాడిందన్న సంతోషాన్ని మరవక ముందే మరో విజయాన్ని తీసుకొచ్చారు మన అమ్మాయిలు. అయితే ఈసారి దాన్ని మోసుకొచ్చింది భారత అంధ మహిళా క్రికెట్ జట్టు. తొలిసారి నిర్వహించిన టీ20 ప్రపంచకప్‌లో విశ్వవిజేతగా నిలిచి, మేమూ ఎవరికీ తీసిపోమని నిరూపించారు.

బుట్టలో వేశారు



ఈ ఏడాది ఫిబా అండర్-16 ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో భారత అమ్మాయిలు చరిత్ర సృష్టించారు. మలేషియాలో జరిగిన ఈ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఒక్క ఓటమి కూడా లేకుండా విజయాన్ని సొంతం చేసుకున్నారు. 2017 తరవాత మనకి ఒక్క పతకమూ రాలేదు. ఎనిమిదేళ్ల తరవాత ఈ విజయంతో తిరిగి తమ సత్తాని చాటారీ అమ్మాయిలు. ఇదే కాదు, ఈ ఏడాది సౌత్ ఏషియన్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (సబా) నిర్వహించే విమెన్స్ ఛాంపియన్‌షిప్‌ని సొంతం చేసుకుందీ మన అమ్మాయిలే. మొదట్నుంచీ ఆధిపత్యం ప్రదర్శించి, బంగారు పతకాన్ని అందుకున్నారు.



ఖోఖో... కబడ్డీ

ఈ ఏడాది జనవరిలో తొలిసారిగా 'ఖోఖో వరల్డ్‌కప్' నిర్వహించారు. దిల్లీలో జరిగిన ఈ పోటీల్లో 19 అంతర్జాతీయ జట్లు పాల్గొన్నాయి. ఫైనల్లో నేపాల్‌ని ఓడించి కప్‌ని అందుకుంది మన అమ్మాయిల జట్టు. ఈసారి కబడ్డీ వరల్డ్‌కప్‌ని గెలిచిందీ భారత అమ్మాయిల జట్టే. ఇది రెండోది. బంగ్లాదేశ్‌లో జరిగిన ఈ పోటీలో గత ఏడాది గెలుపుని కొనసాగిస్తూ విజయఢంకా మోగించారు. కబడ్డీలో మన అమ్మాయిల ఆధిపత్యాన్ని ప్రపంచానికి చూపించారు.

హాకీలో మరో ముందడుగు



గ్రూప్ స్టేజ్, సూపర్ ఫోర్స్‌లో రాణించింది భారత అమ్మాయిల హాకీ జట్టు. ఫలితంగానే ఆసియా కప్‌లో ఫైనల్స్‌కి దూసుకెళ్లింది. తుదిపోరులోనూ ఆరంభం బాగానే ఉంది. కానీ దాన్ని నిలబెట్టుకోవడంలోనే తడబడ్డారు. దీంతో వెండి పతకంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితేనేం, వాళ్ల ప్రయత్నాన్ని ప్రధాని సహా దేశమంతా కొనియాడింది. హాకీలో మన అమ్మాయిల పురోగతికి దీన్నో సంకేతంగానూ భావిస్తున్నారంతా.

'మీకెందుకు ఆటలు? ఇంటికెళ్లి అమ్మలుగా స్థిరపడిపోక'... యూఏఈలో ఇలాంటి అవమానాలెన్నో ఎదుర్కొన్నారు మన ఐస్ హాకీ క్రీడాకారిణులు. దానికి ఆటతోనే సమాధానం చెప్పారు వాళ్లు. ఆటమీద ప్రేమతో గడ్డకట్టిన నదులు, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్ వంటి చలిప్రదేశాల్లో కఠోర సాధన చేశారు. పోటీలకు హాజరయ్యారు. కాంస్యం అయితేనేం, చరిత్రలోనే తొలి పతకాన్ని అందుకున్నారు. భారత విమెన్ ఐస్ హాకీ చరిత్రలో ఇదీ ఓ మైలురాయే!

పరిచయం లేదు కానీ...

రోల్ బాల్... ఈ ఆట మనకు కొత్తే. కానీ కొన్నేళ్లుగా దీనికి సంబంధించి అంతర్జాతీయ పోటీలు జరుగుతున్నాయి. రోలర్ స్కేట్స్, బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, త్రోబాల్‌ల ప్రత్యేక కలయిక ఈ ఆట. ఈ రోల్‌బాల్ వరల్డ్‌కప్ పోటీలు తాజాగా దుబాయిలో జరిగాయి. వరుస విజయాలతో దూసుకెళ్తున్న కెన్యాకు కళ్లెం వేసి మనమ్మాయిలు కప్‌ని సాధించారు. అయితే ఇదేమీ తొలిసారి కాదు. గతంలోనూ రెండుసార్లు భారతీయ మహిళా రోల్ బాల్ బృందం ఈ వరల్డ్‌కప్‌ని గెలిచింది.



నా విజయం: ఆరోగ్యం సాధించా!

'ఇంట్లో వాళ్లు బాగుంటే మనమూ బాగుంటాం'... ఒకప్పుడు అందరిలా నేనూ ఇలాగే భావించేదాన్ని. ఇంట్లోవాళ్లకి పెట్టాకే నేను తినడం, వాళ్ల ఆరోగ్యం మీదే దృష్టిపెట్టడం చేసేదాన్ని. ఈ క్రమంలో నన్ను నేను నిర్లక్ష్యం చేసుకుని, అనారోగ్యాలు తెచ్చిపెట్టుకున్నా. అప్పుడు ఇంటి పరిస్థితి చూడాలి. ఏ వస్తువులు ఎక్కడున్నాయో తెలియదు. పరిశుభ్రత, సరైన ఆహారం లేక ఇంట్లోవాళ్లూ అనారోగ్యం పాలయ్యారు. అప్పుడు నాకు అర్థమైంది. వాళ్లు బాగుంటే మనం బాగున్నట్లు కాదు. నేను బాగుంటేనే కుటుంబమూ క్షేమంగా ఉంటుందని! అందుకే ఈ ఏడాది నా మీద నేను ప్రత్యేక శ్రద్ధ పెట్టా. వ్యాయామం చేశా, పోషకాహారం తీసుకున్నా. అప్పుడే 'ఆరోగ్యమే మహాభాగ్య'మన్న పెద్దల మాట అర్థమైంది. నేను ఉత్సాహంగా మారిపోయా. నా వాళ్లూ సురక్షితం. ఏం సాధించినా ఎంత సంపాదించినా ఆరోగ్యం సరిగా లేనప్పుడు ఏ ఆనందమూ కలగదు. ఇది అనుభవపూర్వకంగా తెలుసుకున్నా. ఈ ఏడాది నేను సాధించిన ఆరోగ్య విజయమిది. దీన్ని ఇతర మహిళలూ సాధించాలని కోరుకుంటున్నా.



- హేమ, హైదరాబాద్


మీకు తెలుసా!



శిశువు పెరుగుదల 3-6-9 నియమంలో జరుగుతుందట. అంటే బిడ్డ పుట్టిన 3, 6, 9 వారాల్లోనూ అలాగే ఆయా నెలల్లోనూ ఎత్తు, బరువులు వేగంగా పెరుగుతారు. ఈ సమయాల్లో వారికి ఆకలి, నిద్ర రెండూ పెరుగుతాయట. ఇవి వారిని శారీరకంగానూ, మానసికంగానూ ఆరోగ్యంగా ఉంచుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

వెనక్కి వెళ్లిపోతా అనుకున్నారు... కానీ!

బుల్లెట్‌పై సుదూర ప్రయాణాలు చేస్తుంటే... ఏదో తెలియని ఉత్సాహం వస్తుంది. పైగా ఇవి ఎన్నో జీవిత పాఠాలనీ నేర్పుతున్నాయి అంటారు నీరజ వేలమూరి. అవేంటో ఆమె మాటల్లోనే...





మాది విశాఖపట్నం. అమ్మ పద్మావతి. నాన్న మూర్తి, ఉద్యోగరీత్యా అసోం, దిల్లీ, విశాఖ తదితర ప్రాంతాల్లో నా చదువు సాగింది. ఇండోర్ ఐఐఎంలో ఎంబీఏ పూర్తి చేశా. నాన్నకు బైక్ రైడింగ్ అంటే చాలా ఇష్టం. బుల్లెట్‌పై లద్దాఖ్ వెళ్లాలనేది ఆయన కోరిక. బాధ్యతల వల్ల వీలుపడలేదు. కానీ ఆ విశేషాల్ని చెబుతుండేవారు. దాంతో బైక్ రైడింగ్ మీద ఇష్టం ఏర్పడటంతోపాటు నాకూ లద్దాఖ్ అందాలు చూడాలన్న కోరిక బలపడింది.

అప్పుడే నేర్చుకున్నా...

తొమ్మిదో తరగతిలోనే స్కూటీ నేర్చుకున్నా. తర్వాత అన్నయ్య బైక్ నేర్పించాడు. ఓ సంస్థలో బైక్ రైడింగ్ కోర్సులో చేరి మెలకువలూ నేర్చుకున్నా. ప్రస్తుతం ఉద్యోగరీత్యా గురుగ్రామ్‌లో ఉంటున్నా. బైక్ రైడ్స్ అంటే ఇష్టమే... కానీ, మొదట్లో ఎలా, ఎక్కడి నుంచి మొదలుపెట్టాలన్న స్పష్టత లేదు. ఈ క్రమంలో ఓ రోజు నా సహోద్యోగులు ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌కు బైకుల మీద వెళ్తున్నారని తెలిసింది. నేనూ వస్తా అన్నా. 'అమ్మాయి అంత దూరం బైక్ ఏం నడుపుతుంది' అనుకున్నారంతా. 'సగం నుంచే వెనక్కి వెళ్లిపోతుందిలే' అని అనుకున్న వాళ్లూ లేకపోలేదు. వాళ్ల అంచనాలన్నీ తారుమారు చేస్తూ... రిషికేశ్ మొత్తం చుట్టొచ్చా. అలా 2025 ఏప్రిల్ కల్లా గంగోత్రి, పంజాబ్‌లోని అమృత్‌సర్, హిమాచల్‌ప్రదేశ్‌లోని కసోలి... ఇలా దాదాపు 4వేల కి.మీ. బైక్ మీద ప్రయాణించా. ఈ ప్రయాణాలకు వాడే బైక్ కూడా నాన్నదే. ఆయనకు 45 ఏళ్లు వచ్చాక చాలా ఇష్టపడి కొనుక్కున్నారు దీన్ని. నేను ఉద్యోగం చేస్తూనే దీన్నో వ్యాపకంగా కొనసాగిస్తున్నా. ఇటీవల అనుకోకుండా నేను కలలు కన్న లద్దాఖ్‌కు వెళ్లే అవకాశమూ వచ్చింది.

ఇబ్బందులు దాటుకుని...

ఎండ, వాన, ఒక్కోసారి మైనస్ డిగ్రీ ఉష్ణోగ్రతలు... లద్దాఖ్‌లోని ఉమ్లింగ్ లా చేరుకునే క్రమంలో మాకు ఎదురైన వాతావరణ పరిస్థితులివి. 19,024 అడుగుల ఎత్తులో ఉంటుందీ ప్రాంతం. గురుగ్రామ్ నుంచి రానూపోనూ 4300 కి.మీ. 17 రోజులపాటు సాగిందీ ప్రయాణం. ఒక్కోసారి 300-400 కి.మీ. వరకూ పెట్రోల్ బంకులు ఉండేవి కాదు. వెళ్లే మార్గం మంచుతో మూసుకుపోయిన రోజులూ ఉన్నాయి. దాంతో రెండు మూడు రోజులు టెంట్లలోనే గడిపాం. టైరులో గాలి తగ్గించి మంచుతో నిండిన రహదారిలోనూ ప్రయాణం చేశాం. చివరికి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నా. ఈ క్రమంలో ఎన్నో పాఠాల్నీ నేర్చుకున్నా. ఓపిక, సహనం, రక్షణ, కష్టం-సుఖం వంటివి నేర్పిందీ ప్రయాణం. తొందర్లోనే నాన్నను కూడా లద్దాఖ్ తీసుకువెళ్లాలి.

- కేతిరెడ్డి రాజ్యలక్ష్మి, విశాఖపట్నం

కొరియన్లనవే మెచ్చారు!






కొరియన్ వెబ్‌సిరీస్‌లు, సినిమాలను దాటింది మన అమ్మాయిల అభిమానం. కాబట్టే, వాళ్ల స్టైల్, యాక్సెసరీలు అన్నింటినీ అనుసరించేస్తున్నారు. ఈ ఏడాది అలా మనవాళ్ల మనసు దోచినవేంటో తెలుసా? హెయిర్ యాక్సెసరీలు. సాఫ్ట్ పేస్టల్ రంగులు, అల్ట్రా గ్లామ్ హంగులు వంటివి వాళ్లని బాగా ఆకట్టుకున్నాయి. పైగా ధర కూడా అందుబాటులోనే ఉండటంతో పోటీపడి మరీ కొనేసుకున్నారు. పేస్టల్ క్లా క్లిప్స్, శాటిన్ స్క్రంచీలు, పెరల్ బాబీ పిన్నులు, హెయిర్ బోలు, బ్యారెట్, అక్రిలిక్ క్లిప్‌లు... ఎంచుకోవడానికి బోలెడు రకాలు. ఇంకేం, 'మై కొరియన్ హెయిర్ కలెక్షన్' అంటూ నచ్చినవన్నీ తెచ్చేసుకున్నారు. వాటితో బోలెడు స్టైల్స్ ప్రయత్నించి, సోషల్‌మీడియాలోనూ పంచుకున్నారు. కాబట్టే, ఈ ఏడాది ట్రెండ్‌గానూ మారాయి. మీరూ వీటికి ఫ్యానేనా? అయితే ప్రయత్నించేయండి మరి!









బామ్మల టీచరమ్మ..!



ఆ ఊరిలో నిరక్షరాస్యులు ఉండకూడదు అనుకుంది. చదువుకుని ఉద్యోగానికే పరిమితం కాకుండా గ్రామంలో వృద్ధులకూ చదువు చెప్పాలనుకుంది. వారి జీవితంలో వెలుగులు నింపాలనుకుంది. అందుకే అప్పటి వరకు పుస్తకం పట్టని వారికి చదవడం, రాయడం నేర్పడానికి టీచర్‌గా మారింది 28 ఏళ్ల రాజ్వీందర్‌కౌర్.



పంజాబ్‌లోని బల్లా గ్రామంలో పుట్టి పెరిగింది రాజ్వీందర్‌కౌర్. 'సామాజిక అడ్డంకులు, తల్లిదండ్రులు విద్యకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో మా గ్రామంలో చాలామంది వృద్ధులు చదువుకోలేదు. పెన్షన్, బీమా, ఆస్తిపత్రాలపై సంతకాలు పెట్టడానికి బదులు వేలిముద్రలు వేసేవారు. ఈ పరిస్థితిని మార్చాలనుకున్నా. వారికి చదవడం, రాయడం నేర్పించాలనుకున్నా. సర్దార్ గుర్‌భజన్‌సింగ్ సేవాసమితి సొసైటీ స్థాపించిన 'ది బెబే బాపు' స్కూల్లో 50ఏళ్లు పైబడిన వారికి చదువు చెబుతున్నాను. ప్రస్తుతం వందమందికి పైగా విద్యార్థులు ఇక్కడ పాఠాలు నేర్చుకుంటున్నారు. మొదట మా ఊళ్లో ఈ విషయం చెప్పినప్పుడు మలివయసులో చదువేంటి అన్నవారే ఎక్కువ. చదువుకి వయసుతో పనేంటి? ఇది అందరికీ ఉపయోగపడుతుందని బోధించడం మొదలుపెట్టా. నా ప్రయత్నం ఫలిస్తోంది. వీళ్లలో చాలామంది వేలిముద్ర మాని సంతకాలు చేస్తున్నారు. ఇంకొందరు విదేశాల్లో ఉన్న తమ పిల్లల్ని కలుసుకోవడానికి వెళ్లినప్పుడు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఆయాపత్రాల్లో సంతకాలూ పెడుతున్నారు. ఇలా వాళ్ల సంతకం వాళ్లే పెట్టుకున్న వారికి బహుమతులిచ్చి ప్రోత్సహిస్తుంటా. అంతేకాదు, వీళ్లకోసం ప్రత్యేకంగా లైబ్రరీలను ఏర్పాటుచేశాం. అక్కడ పిల్లలకీ, పెద్దలకీ కలిపి క్లాసులు నిర్వహిస్తాం. దీంతో ఒకరి నుంచి మరొకరు తెలియని విషయాలు తెలుసుకోగలుగుతున్నారు. చిన్నారులకీ పెద్దలపట్ల గౌరవమూ పెరుగుతుంద'ంటారీమె.

బంగారం - వెండి



26న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,42,400	1,28,875	2,36,459
విజయవాడ	1,37,625	1,28,350	2,37,800
ప్రొద్దుటూరు	1,42,800	1,31,380	2,35,500
రాజమహేంద్రవరం	1,40,020	1,28,350	2,54,000
విశాఖపట్నం	1,40,000	1,28,350	2,35,000
తమిళనాడు	-----	1,28,900	2,54,000

రంగవల్లిక





ఎస్. కస్తూరి రాణి, హైదరాబాద్

21 చుక్కలు 1 వచ్చేవరకు

17 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకూ





సంబరాజు కమల, వెల్దండ, మహబూబ్‌నగర్





దేవరకొండ శారద కుమారి, మండపేట

17 చుక్కలు 9 వరుసలు
9 చుక్కలు 4 వరుసలు

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా: వసుంధర, ఈనాడు, ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in

ఈనాడు బిజినెస్

పసిడి బాండ్లలో రూ.2,816 పెట్టుబడిపై రూ.10,747 లాభం



ప్రభుత్వం తరఫున రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గతంలో జారీ చేసిన పసిడి బాండ్లలో పెట్టుబడులు పెట్టిన మదుపర్లకు భారీ ప్రతిఫలం లభిస్తోంది. 2017 డిసెంబరు 26న జారీ చేసిన సార్వభౌమ పసిడి బాండ్ల (ఎస్‌జీబీ) 2017-18 సిరీస్-13కు తుది రిడెమ్షన్ ధరను, యూనిట్‌కు రూ.13,563గా నిర్ణయించారు. అప్పటి మేలిమి బంగారం ధర గ్రాము రూ.2,816 చొప్పున ఈ బాండ్లలో పెట్టుబడి పెడితే, ఇప్పుడు గ్రాముకు రూ.10,747 లాభాన్ని (382%) మదుపర్లు పొందనున్నారు. దీనికి వార్షిక వడ్డీ రేటు (2.5%) అదనం. ఈనెల 22 నుంచి 24 వరకు పసిడి ముగింపు ధరల సగటు ఆధారంగా, బాండ్‌కు తుది రిడెమ్షన్ ధరను నిర్ణయించారు.

సౌదీ అరేబియాలో విమానాశ్రయ ప్రాజెక్టు బిడ్డింగుకు అర్హత సాధించిన జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్



హైదరాబాద్: సౌదీ అరేబియాలో ప్రతిపాదించిన తైయిఫ్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టు కోసం జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ పోటీ పడనుంది. దాదాపు 800 మిలియన్ డాలర్ల (రూ.7,200 కోట్ల) విలువైన ఈ ప్రాజెక్టుకు పోటీపడేందుకు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ అర్హత సాధించినట్లు తెలుస్తోంది. కొన్ని ఇతర సంస్థలతో కలిసి బృందం (కన్సార్షియమ్) గా ఏర్పడి, ఆ విమానాశ్రయ ప్రాజెక్టు చేపట్టడానికి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ సన్నద్ధం అవుతోంది. ఈ ప్రాజెక్టు లభిస్తే, గల్ఫ్ దేశాల్లో తన కార్యకలాపాలను ఇంకా విస్తరించే అవకాశం కలుగుతుందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ యాజమాన్యం భావిస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థ మనదేశంలోని దిల్లీ, హైదరాబాద్, గోవా విమానాశ్రయాలను నిర్మించి, నిర్వహిస్తోంది. విశాఖపట్నం సమీపంలోని భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాన్ని చేపట్టింది. ఫిలిప్పీన్స్, ఇండొనేషియాల్లోనూ ఈ సంస్థ విమానాశ్రయాల ప్రాజెక్టులు చేపట్టింది.

బొండాడ ఇంజినీరింగ్‌కు రూ.392 కోట్ల సౌర విద్యుత్తు కాంట్రాక్టు

ఈనాడు, హైదరాబాద్: ఉత్తర ప్రదేశ్‌లోని లలిత్‌పూర్‌లో 300 మెగా వాట్ల సౌరవిద్యుత్తు ప్రాజెక్టుకు సంబంధించిన బ్యాలెన్స్ ఆఫ్ సిస్టమ్ (బీఓఎస్) కాంట్రాక్టును హైదరాబాద్‌కు చెందిన బొండాడ ఇంజినీరింగ్ దక్కించుకుంది. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ నుంచి రూ.392 కోట్ల విలువైన ఈ కాంట్రాక్టు లభించినట్లు సంస్థ తెలియజేసింది. ఈపీసీ విధానంలో నిర్వహించే ఈ పనిలో ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, సైట్ డెవలప్‌మెంట్, టెస్టింగ్, కమిషనింగ్ పనులు ఉంటాయి. ఈ కాంట్రాక్టును 15 నెలల్లో పూర్తిచేయాలి.

కోడి గుడ్లు

27న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	650
వరంగల్	652
విజయవాడ	690
తూ/ప గోదావరి	665
విశాఖపట్నం	660
చిత్తూరు	703

2% వరకు కార్ల ధరలు పెంపు: రెనో ఇండియా

తమ కార్ల ధరలను జనవరి నుంచి 2% వరకు పెంచుతున్నట్లు ఫ్రెంచి సంస్థ రెనో అనుబంధ రెనో ఇండియా శుక్రవారం తెలిపింది. తయారీ వ్యయాలు పెరగడమే ఇందుకు కారణమంది. క్విడ్, ట్రైబర్, కైగర్ మోడళ్లను ఈ సంస్థ విక్రయిస్తోంది. ప్రాంతాలు, మోడల్‌ను బట్టి ధర పెంపు ఉంటుందని సంస్థ వివరించింది.

ఎయిర్ కండిషనర్ల ధరలు వేడెక్కుతాయ్!



- విద్యుత్తు వినియోగ సామర్థ్య ప్రమాణాల పెంపు వల్లే
- 3 స్టార్ ఏసీల ధరలు 3-4%, 5 స్టార్ ఏసీలు 8-12% పెరిగే అవకాశం

ఏసీల తయారీలో కీలకమైన రాగి ధర పెరగడం వల్ల, కంప్రెసర్, మోటార్, హీట్ ఎక్స్ఛేంజర్, ట్యూబింగ్, వైరింగ్ వ్యయాలు అధికమవుతున్నాయి. అల్యూమినియం పరుగులతో పాటు, రూపాయి క్షీణత వల్ల దిగుమతి చేసుకునే కంప్రెసర్లు భారమవుతున్నాయి.

చల్లదనం ఇచ్చేందుకు ఏసీల్లో నింపే రిఫ్రిజిరెంట్ కూడా మారుతుంది. ప్రస్తుతం ఆర్410ఏను వినియోగిస్తుండగా, పర్యావరణ అనుకూల ఏ2ఎల్‌ను వాడాల్సి ఉంటుంది.

జీఎస్టీ రేట్ల సవరింపుతో పాటు, ఈ ఏడాదిలో వర్షాల వల్ల అమ్మకాలు తగ్గిపోవడంతో, పండుగ సీజన్‌లో ఎయిర్ కండిషనర్ల (ఏసీ) ధరలను కంపెనీలు 10% వరకు తగ్గించాయి. మళ్లీ వచ్చే జనవరి నుంచి వీటి ధరలను 3-12% పెంచేందుకు సంస్థలు సన్నద్ధం అవుతున్నాయి. ఏసీలు విద్యుత్తును మరింత తక్కువ వినియోగించుకునేలా నూతన ప్రమాణాలను బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) తెస్తుండటమే ఇందుకు కారణం.

సామర్థ్యం మెరుగు పడాలంటే

ఏసీ కొనడం సులభమే అయినా, వినియోగించుకోవడమే ఎక్కువమందికి భారంగా ఉంటోంది. ఏసీలు అధిక విద్యుత్తును వినియోగించుకోవడమే దీనికి కారణం. ఇవి ఎంత తక్కువ విద్యుత్తును వినియోగించుకుంటే, అంతటి మెరుగైన రేటింగ్ (గరిష్ఠంగా 5స్టార్)ను బీఈఈ ఇస్తుంటుంది. ఇందుకోసం పాటించాల్సిన నిబంధనలను బీఈఈ సవరిస్తుంటుంది. 2026 జనవరి నుంచి కొత్త నిబంధనల ప్రకారమే కంపెనీలు ఏసీలను తయారు చేయాల్సి ఉంది. అంటే మరింత నాణ్యతమైన ముడిపదార్థాలను ఏసీల తయారీకి వినియోగించాల్సి వస్తుంది. తయారీ పద్ధతుల్లో కూడా కొన్ని మార్పులుంటాయి. ఏసీల తయారీలో వినియోగించే లోహాల ధరలతో పాటు విదేశాల నుంచి దిగుమతి చేసుకునే విడిభాగాల ధరలు కూడా రూపాయి క్షీణత వల్ల అధికమయ్యాయి. ఇందువల్లే ఏసీల ధరలు పెంచక తప్పడం లేదని ఒక అగ్రగామి కంపెనీ ఉన్నతాధికారి 'ఈనాడు'తో చెప్పారు.

ధరల పెంపు ఇలా

విద్యుత్తు వినియోగ సామర్థ్యం కొంత తక్కువగా ఉండే 3 స్టార్ ఏసీల ధరలు 3-4% పెరిగే అవకాశం ఉంది. విద్యుత్తును తక్కువగా వినియోగించుకునే 5 స్టార్ ఏసీల ధరలు మాత్రం 8-12% పెంచాలని కంపెనీలు అంతర్గతంగా నిర్ణయించుకున్నాయి. అంటే, జీఎస్టీ రేట్ల తగ్గింపు నేపథ్యంలో, వినియోగదారులకు ఏసీ ధరల రూపేణ లభించిన ప్రయోజనానికి సమానంగా ఇప్పుడు ధరల పెంపు ఉండనుంది.

పాత సరకు విక్రయాలు కొనసాగుతాయ్

ఈ ఏడాది దేశవ్యాప్తంగా విస్తృత వర్షపాతం నమోదవ్వడంతో, ఏసీల విక్రయాలు బాగా తగ్గాయి. సాధారణంగా కంపెనీల వద్ద ఏటా జులై-ఆగస్టు కల్లా, ఏసీల తయారీకి అవసరమైన ముడిపదార్థాలు పూర్తవుతాయి. తదుపరి కొత్తగా ముడిపదార్థాలు సమీకరిస్తారు. ఈ ఏడాది వర్షాల నేపథ్యంలో, ఈసారి కొన్ని ప్రధాన కంపెనీల వద్ద పాత ముడిపదార్థాలు మిగిలే ఉన్నాయని సమాచారం. డీలర్ల వద్ద ఏసీల నిల్వలు అధికంగానే ఉన్నాయి. బీఈఈ ప్రకటించే కొత్త ప్రమాణాలకు అనుగుణంగానే కంపెనీలు, నూతన ఉత్పత్తులను నిర్దేశిత తేదీ నుంచి తయారు చేయాల్సి ఉంటుంది. డీలర్లు, విక్రయశాలల్లో ఉన్న పాత సరకును మాత్రం అవి పూర్తయ్యేవరకు విక్రయించొచ్చు.

- ఈనాడు వాణిజ్య విభాగం

కోఫోర్జ్ చేతికి ఏఐ సంస్థ ఎంకోరా!

లావాదేవీ విలువ రూ.21,333 కోట్లు



దిల్లీ: అమెరికాకు చెందిన ఏఐ (కృత్రిమ మేధ) సంస్థ ఎంకోరాలో 100% వాటాను 2.35 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.21,333 కోట్ల) ఎంటర్‌ప్రైజ్ విలువకు కొనుగోలు చేయనున్నట్లు ఐటీ సేవల కంపెనీ కోఫోర్జ్ తెలిపింది. మొత్తం షేర్ల లావాదేవీ ద్వారా జరిగే ఈ కొనుగోలులో ప్రస్తుత ఎంకోరా వాటాదార్లకు 1.89 బి. డాలర్ల విలువైన ప్రిఫరెన్షియల్ షేర్లను కోఫోర్జ్ జారీ చేస్తుంది. లావాదేవీ పూర్తయ్యాక, విక్రేతలకు కోఫోర్జ్‌లో 20% వాటా ఉంటుంది. 'అడ్వెంట్ ఇంటర్నేషనల్, వార్‌బర్గ్ పింకస్, ఇతర మైనారిటీ వాటాదార్ల నుంచి ఎంకోరాలో 100% షేర్ల కొనుగోలు నిమిత్తం ఒప్పందంపై సంతకాలు చేసిన'ట్లు ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో కోఫోర్జ్ తెలిపింది.

సంతూర్ రూ.2,850 కోట్ల విక్రయాలు

హైదరాబాద్: దేశంలోనే అతిపెద్ద సబ్బుల బ్రాండ్‌గా సంతూర్ నిలిచినట్లు విప్రో కన్జ్యూమర్ కేర్ అండ్ లైటింగ్ ప్రకటించింది. నాలుగు దశాబ్దాల కంపెనీ ప్రయాణంలో ఇది గొప్ప మైలురాయి అని తెలిపింది. గత 12 నెలల్లో కంపెనీ ఇన్‌వాయిస్డ్ విక్రయాల (ఐఎన్‌డీఏఎస్) విలువ రూ.2,850 కోట్లు అని.. ఇంత భారీ అమ్మకాలతో దేశీయంగా అతిపెద్ద సబ్బుల బ్రాండ్‌గా అవతరించినట్లు వివరించింది. భారత మహిళలకు 'యవ్వనంగా కనిపించే చర్మం' హామీతో, 'సంతూర్ మామ్' ప్రకటనల ద్వారా నమ్మకమైన బ్రాండ్‌గా ఎదిగిన సంతూర్, దేశంలోనే అతిపెద్ద సబ్బుల బ్రాండ్‌గా నిలవడం తమకు గర్వకారణమని విప్రో కన్జ్యూమర్ సీఈఓ వినీత్ అగర్వాల్ పేర్కొన్నారు. 1985లో బెంగళూరులో సంతూర్ సబ్బులను కంపెనీ ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టి, 1986లో దేశవ్యాప్తంగా విడుదల చేసింది. 2012లో రూ.1000 కోట్లు, 2018లో రూ.2000 కోట్ల విక్రయాలను సంతూర్ నమోదు చేసింది.

పీజియన్ ప్రత్యేక విక్రయాలు

హైదరాబాద్: పీజియన్ బ్రాండ్ కింద వంట సామగ్రి, గృహోపకరణాలు విక్రయించే స్టవ్‌క్రాఫ్ట్ లిమిటెడ్, 'ఇండియాస్ ఛాయిస్ సేల్ 2026' పేరిట ప్రత్యేక విక్రయాలను ప్రకటించింది. ప్రత్యేకమైన కాంబో ఆఫర్లు, తగ్గింపు ధరలు ఉంటాయని తెలిపింది. వినియోగదారుల కోసం ప్రెజర్ కుకర్+ ఇండక్షన్ కుక్‌టాప్ కాంబో, బ్రేక్‌ఫాస్ట్ కాంబో (కెటిల్, వాటర్ బాటిల్, పాప్ అప్ టోస్టర్), ఎల్‌పీజీ గ్యాస్ స్టవ్+ కుక్‌వేర్ కాంబోలను రూపొందించినట్లు వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఉన్న 1,25,000 రిటెయిల్ స్టోర్లతో పాటు పీజియన్ ప్రత్యేక స్టోర్లలో కూడా ఈ ఆఫర్లు లభిస్తాయి. వినియోగదారులు అందుబాటు ధరలకే, నాణ్యత కలిగిన ఉత్పత్తులను పొందొచ్చని స్టవ్ క్రాఫ్ట్ ఎండీ రాజేంద్ర గాంధీ తెలిపారు.

వెండి ధగధగలు ఆగవా?



కిలో రూ.2.44 లక్షలకు

చరిత్రలో ఎన్నడూ లేనంతగా వెండి ధర ఒక్కరోజులోనే కిలోకు రూ.19,000 పెరిగి రూ.2,44,000కు మించింది. హైదరాబాద్ బులియన్ విపణిలో మంగళవారం కిలో ధర రూ.2,19,000 కాగా.. బుధవారం రూ.2,25,000 మించింది. క్రిస్మస్ సందర్భంగా గురువారం కమొడిటీ మార్కెట్లకూ సెలవే. శుక్రవారం హైదరాబాద్ బులియన్ విపణిలో రాత్రి 11.55 గంటల సమయానికి కిలో వెండి ధర రూ.2,44,500 వద్ద ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల మేలిమి (999 స్వచ్ఛత) బంగారం ధర రూ.1,42,700 వద్ద ఉంది.

అంతర్జాతీయ పరిస్థితుల వల్లే

అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) వెండి ధర తొలిసారిగా 75 డాలర్లను అధిగమించి, 76.46 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఔన్సు బంగారం ధర 4523 డాలర్ల వద్ద ఉంది. అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాల కంటే తగ్గిన నేపథ్యంలో, తదుపరి సమీక్షలోనూ ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లలో కోత విధిస్తుందనే అంచనాలు పెరిగాయి. ఆర్థిక అనిశ్చితులు తొలగకపోవడంతో, సుస్థిరమనే భావనతో విలువైన బంగారం, వెండిపైకి పెట్టుబడులు తరలి వస్తూనే ఉన్నాయి. గిరాకీకి తగ్గట్లు వెండి సరఫరా లేదని, అందువల్ల ధరలు పెరుగుతాయనే అంచనాలను దృష్టిలో పెట్టుకుని అధికులు వెండిపై పెట్టుబడులు పెడుతున్నారని విశ్లేషకులు చెబుతున్నారు.

- లోహాల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లో కూడా కిలో వెండి 2026 మార్చి కాంట్రాక్టు ధర రూ.2,24,374 వద్ద ప్రారంభమై రూ.2,40,935 వద్ద నిలిచింది.

– ఈనాడు వాణిజ్య విభాగం

క్యాస్ట్రోల్ ఇండియా ఓపెన్ ఆఫర్

క్యాస్ట్రోల్ ఇండియా విభాగంలో 26% వరకు వాటా కొనుగోలు చేసేందుకు ఓపెన్ ఆఫర్‌ను కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్, అమెరికా ప్రైవేట్ ఈక్విటీ సంస్థ స్టోన్‌పీక్ తీసుకొచ్చాయి. ఓపెన్ ఆఫర్‌లో భాగంగా 25.71 కోట్ల షేర్లను కొనుగోలు చేయనున్నాయి. శుక్రవారం బీఎస్ఈలో క్యాస్ట్రోల్ ఇండియా షేరు ముగింపు ధర రూ.191.40తో పోలిస్తే, 2.5% ప్రీమియంతో ఒక్కో షేరుకు రూ.194.04 చొప్పున ఆఫర్ చేస్తున్నారు. ఇందుకోసం మొత్తం రూ.4,990 కోట్ల వరకు అవుతుంది.

- క్యాస్ట్రోల్ ఇండియా మాతృసంస్థ క్యాస్ట్రోల్‌లో 65% వాటాను కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్, అమెరికా ప్రైవేట్ ఈక్విటీ సంస్థ స్టోన్‌పీక్‌కు విక్రయించేందుకు బ్రిటన్ ఇంధన సంస్థ బీపీ ఒప్పందం చేసుకోవడం ఇందుకు నేపథ్యం. క్యాస్ట్రోల్ ఇండియాలో క్యాస్ట్రోల్‌కు 51% వాటా ఉంది.

కోల్ ఇండియా సీఈఓగా సాయిరాం



ప్రభుత్వ రంగ కోల్ ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా ఉన్న బి.సాయిరాంను సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా నియమించడానికి కంపెనీ బోర్డు శుక్రవారం ఆమోదం తెలిపింది. దేశీయంగా ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో 80% వాటా కలిగిన కోల్ ఇండియా, పాలనా నిర్వహణ సజావుగా సాగేందుకు ఈ నియామకం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

అడ్రాయిట్ ఇన్ఫోటెక్ అనుబంధ సంస్థ నుంచి 2 కొత్త ఉత్పత్తులు

ఈనాడు, హైదరాబాద్: స్థానిక ఐటీ సేవల కంపెనీ, అడ్రాయిట్ ఇన్ఫోటెక్‌కు అనుబంధ సంస్థ అయిన వెర్సోఅల్టిమా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రెండు కొత్త ఉత్పత్తులు విడుదల చేసింది. ఇందులో ఒకటి వీఏఐ360 యూనిఫైడ్ సీఆర్ఎం కాగా, మరొకటి ఇంటెల్‌హబ్-ఎక్స్. టెలికామ్, కేబుల్, బ్రాడ్‌బ్యాండ్ రంగాల్లోని వ్యాపార సంస్థలకు వీఏఐ360 యూనిఫైడ్ సీఆర్ఎం ఎంతో మేలు చేస్తుందని అడ్రాయిట్ ఇన్ఫోటెక్ వివరించింది. బిల్లింగ్, సీఆర్ఎం సాఫ్ట్‌వేర్ సంస్థలను కేబుల్, బ్రాడ్‌బ్యాండ్ ఆపరేటర్లతో అనుసంధానం చేయడానికి ఇంటెల్‌హబ్-ఎక్స్, ఒక ఎంటర్‌ప్రైజ్ గేట్‌వే అప్లికేషన్ మాదిరిగా పనిచేస్తుంది. వ్యాపార సంస్థల డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కు ఈ రెండు ఉత్పత్తులు దోహదపడతాయని అడ్రాయిట్ ఇన్ఫోటెక్ పేర్కొంది.

బొగ్గు, లిగ్నైట్ గనులు తెరిచేందుకు అనుమతుల ప్రక్రియ సరళీకరణ



దిల్లీ: బొగ్గు, లిగ్నైట్ గనులను తెరిచేందుకు అనుమతుల ప్రక్రియను సరళీకరిస్తూ నిబంధనలను ప్రభుత్వం సవరించింది. నియంత్రణపరమైన పర్యవేక్షణ కొనసాగిస్తూనే, గనుల కార్యకలాపాల వేగవంతానికి ఎదురవుతున్న అవరోధాల తొలగింపునకు ఈ మార్పులు దోహదం చేయనున్నాయి. ఇంతకుముందు ఉన్న నిబంధనల ప్రకారం.. ఒక గనిని తెరవాలంటే కోల్ కంట్రోలర్స్ ఆర్గనైజేషన్ (సీసీఓ) నుంచి బొగ్గు లేదా లిగ్నైట్ గనుల యజమానులు ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. 180 రోజులు లేదా అంతకుమించి గనులను మూసివేస్తే, కార్యకలాపాల పునఃప్రారంభానికి కూడా సీసీఓ అనుమతులు తప్పనిసరి. అయితే సీసీఓ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాల్సిన అవసరాన్ని తప్పిస్తూ తాజాగా నిబంధనలను సవరించినట్లు బొగ్గు మంత్రిత్వ శాఖ తెలిపింది. గనులను తెరవడానికి సంబంధించిన అనుమతులను సదరు బొగ్గు కంపెనీ బోర్డుకే అప్పగించినట్లు పేర్కొంది.

ప్రయోగశాలలో అభివృద్ధి చేసే వజ్రాల వ్యాపారంలోకి టైటన్



ప్రయోగశాలలో అభివృద్ధి చేసే వజ్రాల వ్యాపార విభాగంలోకి టైటన్ కంపెనీ అడుగు పెట్టింది. 'బియోన్' బ్రాండుతో ఈ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. సహజ వజ్రాలతో పోలిస్తే, ధర తక్కువగా ఉండే ఈ తరహా వజ్రాలతో తయారైన ఆభరణాలకు గిరాకీ పెరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 29న ముంబయిలో బియోన్ బ్రాండుపై ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు' స్టాక్ ఎక్స్ఛేంజీలకు టైటన్ తెలిపింది. ప్రయోగశాలల్లో అభివృద్ధి చేసిన వజ్రాలతో తయారైన పలు డిజైన్ల ఆభరణాలు ఈ విక్రయ కేంద్రంలో లభ్యమవుతాయని పేర్కొంది. మున్ముందు ముంబయి, దిల్లీల్లో మరిన్ని ఈ తరహా విక్రయ కేంద్రాలను ప్రారంభిస్తామని టైటన్ వివరించింది.

ఇండిగోపై దర్యాప్తు నివేదిక సమర్పణ

దిల్లీ: ఈనెల మొదటివారంలో ఇండిగో విమాన సేవల్లో కలిగిన భారీ అంతరాయంపై నలుగురు సభ్యుల కమిటీ ఒకటి, విమాన నియంత్రణాధికార సంస్థ డీజీసీఏకు తన నివేదికను సమర్పించింది. ఇండిగో అంశంపై విస్తృతస్థాయి సమీక్ష, తీవ్ర ఇబ్బందులకు దారి తీసిన పరిస్థితులను మదింపు చేసేందుకు డీజీసీఏ జాయింట్ డైరెక్టర్ జనరల్ సంజయ్ కె బ్రహ్మనె ఆధ్వర్యంలోని ఈ దర్యాప్తు కమిటీని డిసెంబరు 5న ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం ఈ కమిటీ తన నివేదిక సమర్పించింది. నివేదిక నకళ్లను పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు, పౌర విమాన శాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హాలకూ పంపినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. నివేదిక వివరాలు బయటకు రాలేదు.

ఈశాన్య పర్యాటకానికి ఓటీటీల సహకారం

- వెబ్ సిరీస్‌ల్లో చూసిన ప్రదేశాలకు పర్యాటకులు
- విమాన ప్రయాణ బుకింగ్‌ల్లో గణనీయ వృద్ధి: ఇక్సిగో



దేశంలో పర్యాటకానికి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లూ ఉపకరిస్తున్నాయి. ఎలాగంటారా.. ఇప్పుడు ఓటీటీల్లో వేర్వేరు భాషల వెబ్‌సిరీస్‌లను డబ్బింగ్ వెర్షన్ లేదా.. సబ్‌టైటిల్స్ సాయంతో అన్ని భాషల వారూ చూస్తున్నారు. వాటిల్లోని అందమైన క్షేత్రాలు, ఆకట్టుకున్న ప్రదేశాలకు వెళ్లి రావాలనే కోరిక పర్యటనలపై ఆసక్తి ఉన్నవారికి కలుగుతోంది. ప్రేక్షకాదరణ పొందిన వెబ్‌సిరీస్‌లలోని ప్రదేశాలను చూసి వచ్చేందుకు యువత ఉత్సుకత చూపుతోంది. ఈశాన్య రాష్ట్రాల్లో పర్యాటక రంగ వృద్ధికి, అక్కడి సహజ సౌందర్యంతో పాటు ఓటీటీల చిత్రీకరణలూ కారణమవుతున్నాయని, టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌లు వెల్లడిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు ఎందుకు మక్కువ చూపుతున్నారనే అంశాన్ని టికెట్ బుకింగ్ సమయంలో లేదా రివ్యూల నుంచి సేకరించి, ఈ నివేదికను బుకింగ్ ప్లాట్‌ఫామ్ ఇక్సిగో రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం..

ఈ వెబ్‌సిరీస్‌లన్నీ

దేశ ఈశాన్య ప్రాంతాల్లోని పరిస్థితులను కథావస్తువుగా చేసుకుని ద ఫ్యామిలీ మ్యాన్ (సీజన్ 3), పాతాళ్ లోక్ (సీజన్ 2), దిల్లీ క్రైమ్ (సీజన్ 3) వెబ్ సిరీస్‌లను రూపొందించారు. వీటిల్లో ఈశాన్య ప్రాంతంలోని రమ్యమైన ప్రకృతి దృశ్యాలు, వినూత్న నివాస సముదాయాలు, సంస్కృతులను చూపించడంతో.. అక్కడ పర్యటించాలనే కుతూహలం పర్యాటకుల్లో పెరిగిందని నివేదిక తెలిపింది. ఈ రాష్ట్రాల్లోని కీలక నగరాలైన దిమాపూర్, అగర్తలా, గువాహటి, ఇంఫాల్, ఇటానగర్‌కు ఈ ఏడాది విమాన టికెట్ల బుకింగ్‌లు దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి గణనీయంగా పెరిగాయని పేర్కొంది. ఇప్పటివరకు ఎక్కువ మంది పర్యటించని ప్రాంతాలు కావడం వల్లా, వీటికి గిరాకీని పెంచిందని తెలిపింది.

ఆధ్యాత్మిక పర్యటనలకూ గిరాకీ

దేశంలో ఆధ్యాత్మిక పర్యటనలూ బాగానే పెరిగాయని.. ముఖ్యంగా మహా కుంభమేళాతో అన్ని రవాణా మార్గాల్లోనూ ప్రయాగ్‌రాజ్‌కు బుకింగ్‌లు గణనీయంగా నమోదయ్యాయని పేర్కొంది. అంతర్జాతీయ గమ్యస్థానాల్లో జపాన్, దక్షిణ కొరియాకు ఎక్కువ బుకింగ్‌లు వచ్చినట్లు తెలిపింది. ఒమన్, కెన్యా, యూఏఈ, ఉజ్బెకిస్తాన్, ఖతార్ లాంటి ప్రాంతాలకు దేశీయ పర్యాటకుల నుంచి అధిక గిరాకీ ఉందని పేర్కొంది. దేశీయంగా, అంతర్జాతీయంగా కొత్త ప్రదేశాలకు వెళ్లిరావాలనే ఆసక్తి భారతీయుల్లో పెరుగుతోందనడానికి ఇది సంకేతమని నివేదిక వివరించింది.

అగరబత్తీలకు కొత్త నాణ్యతా ప్రమాణాలు



ప్రపంచంలోనే అత్యధికంగా అగరబత్తీలను తయారు చేస్తూ, ఎగుమతి చేస్తున్న మనదేశంలో, వీటి నాణ్యతా ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం నూతన నిబంధనలు జారీ చేసింది. ఇందుకోసం భారత ప్రమాణాల మండలి (బీఐఎస్) మార్గదర్శకాలు విడుదల చేసింది. అగరబత్తీల తయారీలో కీటకనాశన రసాయనాల వాడకాన్ని నియంత్రించడం ద్వారా, వినియోగదార్ల ఆరోగ్యాన్ని కాపాడటం దీని వెనక ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం దేశీయ అగరబత్తీల వ్యాపార పరిమాణం సుమారు రూ.8,000 కోట్లుగా ఉంది. వినియోగదారు ఆరోగ్య భద్రత, అగరుబత్తీలు వెలిగించే గదిలో వాయు నాణ్యత, పర్యావరణ పరిరక్షణ, నియంత్రణ నిబంధనలు, కొన్ని రకాల సువాసన ఉత్పత్తులు, రసాయనాలపై అంతర్జాతీయంగా ఉన్న ఆంక్షలు తదితరాలను పరిగణనలోకి తీసుకుని.. అగరబత్తీల కోసం ప్రత్యేకంగా 'ఐఎస్ 19412: 2025' ప్రమాణాలను రూపొందించారు. కొత్త ప్రమాణాలతో తీసుకొచ్చే అగరబత్తీలపై బీఐఎస్ ప్రమాణాల ముద్ర ఉంటుందని.. వీటి కొనుగోలు సమయంలో వినియోగదార్లు నాణ్యమైనవి ఎంపిక చేసుకునేందుకు ఇది ఉపకరిస్తుందని వినియోగదారు వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. అగరబత్తీల తయారీలో వినియోగించకుండా కొన్ని నిషేధిత ఉత్పత్తుల జాబితాను బీఐఎస్ రూపొందించింది. ఇందులో అలెథ్రిన్, పెర్మెథ్రిన్, సైపర్‌మెథ్రిన్, డెల్టామెథ్రిన్, ఫిప్రోనిల్ లాంటి వాటితో పాటు బెంజైల్ సయనైడ్, ఇథైల్ అక్రిలేట్, డైఫినైల్‌అమైన్ ఉన్నాయి. మానవ ఆరోగ్యం, గాలి నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో వీటిల్లో చాలా వాటిపై అంతర్జాతీయంగానూ నిషేధం ఉంది.

చిన్న వ్యాపార సంస్థలకు రూ.46 లక్షల కోట్ల రుణాలు

సెప్టెంబరు 30 వరకు మంజూరైనవి: నివేదిక



దిల్లీ: దేశంలోని చిన్న వ్యాపార సంస్థలకు సెప్టెంబరు 30 వరకు మంజూరైన రుణాల మొత్తం విలువ రూ.46 లక్షల కోట్లకు చేరింది. క్రియాశీలక రుణ ఖాతాల సంఖ్య 7.3 కోట్లుగా నమోదైనట్లు క్రిఫ్ హై మార్క్-సిడ్బీ నివేదిక తెలిపింది. ప్రభుత్వ విధాన నిర్ణయాలు, ఎంఎస్ఎమ్ఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల) కోసం ప్రభుత్వం ప్రకటించిన పలు రుణ పథకాలు ఇందుకు తోడ్పడ్డాయని పేర్కొంది. వివిధ విభాగాల్లో రుణ ఆస్తుల నాణ్యత కూడా మెరుగయ్యిందని వివరించింది. 91 నుంచి 180 రోజుల వరకు ఓవర్‌డ్యూ ఉన్న రుణ బకాయిల నిష్పత్తి 2023 సెప్టెంబరులో 1.7% కాగా.. 2025 సెప్టెంబరుకు 1.4 శాతానికి తగ్గింది. చిన్న వ్యాపార సంస్థలకు ఇచ్చిన మొత్తం రుణాల్లో ఏకవ్యక్తి యాజమాన్య సంస్థలు 80% అయితే, మొత్తం రుణ గ్రహీతల్లో 90% మంది వీళ్లేనని నివేదిక పేర్కొంది. 2025 సెప్టెంబరు చివరకు నమోదైన మొత్తం రుణ గ్రహీతల్లో, 23.3% మంది కొత్తగా రుణాలు తీసుకున్న వాళ్లు కాగా.. వ్యాపారం కోసం తొలిసారి రుణాలు తీసుకున్న వాళ్ల వాటా 12 శాతమని వివరించింది. వ్యాపార సంస్థలు తీసుకునే రుణాల్లో, నిర్వహణ మూలధన కోసం తీసుకున్నవే అధికమని.. మొత్తం రుణాల్లో ఇవి 57% ఉంటాయని నివేదిక తెలిపింది.

మూడో రోజూ సూచీలు డీలా

సెన్సెక్స్ ▼ 367 85041 | **నిఫ్టీ ▼ 100 26042**

- ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.318 కోట్లు
- డీఐఐ కొనుగోళ్లు: రూ.1773 కోట్లు



వరుసగా మూడో రోజూ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. దేశీయంగా కీలక సంకేతాలు కొరవడటంతో పాటు విదేశీ మదుపర్ల అమ్మకాలు ప్రతికూల ప్రభావం చూపాయి. ఐటీ, స్థిరాస్తి, ఇంధన షేర్లలో లాభాల స్వీకరణ కనిపించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 19 పైసలు తగ్గి 89.90 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.31% లాభంతో 62.43 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో కొరియా, జపాన్, షాంఘై లాభాల్లో ముగియగా, హాంకాంగ్, ఐరోపా సూచీలు పనిచేయలేదు.

- బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.1.03 లక్షల కోట్లు తగ్గి రూ.473.97 లక్షల కోట్లు (5.28 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.
- సెన్సెక్స్ ఉదయం 183 పాయింట్ల (క్రితం ముగింపు 85,408.70) నష్టంతో 85,225.28 వద్ద ప్రారంభమైంది. అమ్మకాల ఒత్తిడితో రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ, ఒకదశలో 84,937.82 పాయింట్లకు పడింది. చివరకు 367.25 పాయింట్ల నష్టంతో 85,041.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 99.80 పాయింట్లు కోల్పోయి 26,042.30 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 26,008.60- 26,144.20 పాయింట్ల మధ్య కదలాడింది.

52 వారాల గరిష్ఠానికి వేదాంతా షేరు: చమురు, ఉక్కు రంగ దిగ్గజ సంస్థ వేదాంతా షేరు 52 వారాల గరిష్ఠానికి చేరింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 35% రాణించిన ఈ షేరు, శుక్రవారం ఇంట్రాడేలో రూ.607.85 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని నమోదుచేసింది. గతవారం కంపెనీని అయిదు వేర్వేరు నమోదిత సంస్థలుగా విభజించేందుకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం ఇచ్చిన విషయం తెలిసిందే. మరో గ్రూప్ సంస్థ హిందుస్థాన్ జింక్ షేరు కూడా రూ.646 వద్ద 52 వారాల గరిష్ఠానికి చేరింది. ఈ షేరు ఈ ఏడాదిలో 43.50% దూసుకెళ్లింది.

- సెన్సెక్స్ 30 షేర్లలో 24 కుదేలయ్యాయి. బజాజ్ ఫైనాన్స్ 1.48%, ఏషియన్ పెయింట్స్ 1.41%, టీసీఎస్ 1.22%, ఎటర్నల్ 1.12%, టెక్ మహీంద్రా 1.10%, సన్‌ఫార్మా 1.05%, పవర్‌గ్రిడ్ 0.99% డీలాపడ్డాయి. టైటన్ 2.13%, ఎన్‌టీపీసీ 0.45%, అల్ట్రాటెక్ 0.29% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. ఫోకస్డ్ ఐటీ 1.04%, ఐటీ 0.89%, టెలికాం 0.59%, యంత్ర పరికరాలు 0.54%, వాహన 0.54% తగ్గాయి. కమొడిటీస్, లోహ రాణించాయి. బీఎస్ఈలో 2540 షేర్లు నష్టపోయగా, 1690 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 157 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

4.36 బి.డాలర్లు పెరిగిన ఫారెక్స్ నిల్వలు

మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు డిసెంబరు 19తో ముగిసిన వారానికి 4.368 బి.డాలర్లు (దాదాపు రూ.39,300 కోట్లు) పెరిగి 693.318 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.62.39 లక్షల కోట్ల)కు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 1.689 బి.డాలర్లు అధికమై 688.949 బి.డాలర్లుగా నమోదయ్యాయి. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 1.641 బి.డాలర్లు వృద్ధి చెంది 559.428 బి.డాలర్లుగా నమోదయ్యాయి.

- రైల్వే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ఈ2ఈ ట్రాన్స్‌పోర్టేషన్ రూ.84.22 కోట్ల ఎస్ఎంఈ ఐపీఓ ఈ నెల 26న (శుక్రవారం) ప్రారంభమైంది. 30న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిగా రూ.164- 174 నిర్ణయించారు.
- దేశవ్యాప్తంగా గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో బీమా ఉత్పత్తుల పంపిణీ కోసం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ)తో సహజ్ ఇన్సూరెన్స్ సర్వీసెస్ భాగస్వామ్యం కుదుర్చుకుంది.
- జీఎస్టీ అంశంలో రూ.13.28 లక్షల జరిమానా నోటీసును విమానయాన సంస్థ ఇండిగోకు అధికారులు జారీ చేశారు. దీనిపై అప్పీలు చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది.
- హెచ్‌సీఎల్ టెక్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ విభాగం హెచ్‌సీఎల్ సాఫ్ట్‌వేర్, బెల్జియం కేంద్రంగా పనిచేస్తున్న ఏఐ డేటా అనలిస్ట్ అంకురం 'వోబీ'ని కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రక్రియ ఫిబ్రవరి నాటికి పూర్తవుతుందని వెల్లడించింది.

ఈతరం

youthpage@eenadu.in



బిడ్ వేద్దాం

చిన్నప్పుడు స్కూల్ నుంచి రాగానే అమ్మ.. 'ఇవాళ ఏం చేశావ్?' అని అడిగేది గుర్తుందా? ఎప్పుడైనా ఊరికెళ్తే బంధువులు 'ప్రయాణం బాగా జరిగిందా?' అని ప్రశ్నించేవారు. ఇవన్నీ ఆత్మీయ పలకరింపులు అనుకుంటాం మనం. కానీ వీటిలో గొప్ప కమ్యూనికేషన్ పాఠం ఉంది అంటారు సైకాలజిస్ట్ అయిజాన్ గాట్మాన్. ఈ ప్రశ్నలను ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ కోసం బిడ్‌గా వాడాలి అంటున్నారు. ఫ్యామిలీతో మంచి సంబంధాలు కలిగి ఉండటంలో.. సరైన సంభాషణలు జరపడం చాలా ముఖ్యం. కానీ ప్రస్తుతం టైమ్‌తో పరిగెడుతూ అనేక రకాల ఒత్తిళ్ల మధ్య ఇలా కూర్చుని మాట్లాడే పరిస్థితి యువతకు ఉండటం లేదు. కానీ మనకు ముఖ్యమైన మనుషులతో మాత్రం మాటల బిడ్ వేయాలి. ఇలా అనుబంధాల కోసం వేసే ప్రశ్నలను 'బిడ్ ఫర్ కనెక్షన్' అంటున్నారు.

'ఈరోజు ఎలా గడిచింది, నువ్వు బాగానే ఉన్నావా, ఆ సన్‌సెట్ చూడు ఎంత బాగుందో, ఓ కాఫీ తాగుదామా..' ఇలాంటి ప్రశ్నలు మన బంధాలను మరింత వికసింపజేస్తాయి. కుటుంబంతో సత్సంబంధాలను కలిగి ఉండటంలో ఇబ్బంది పడే జెన్‌జీ యువతకు ఇదో సులభమైన థియరీగా కనిపించడంతో ప్రస్తుతం ఇది ట్రెండింగ్‌లో ఉంది. సంభాషణలు నెరపడంలో ప్రతిభ కలిగి ఉండటం ఇంట్లోనే కాదు, ఆఫీసులోనూ మనకు అవసరం. అందుకే ప్రాక్టీస్ చేసేద్దాం.

నీవల్ల అవుతుంది..!



కానిదేదీ లేదు
నువ్వనుకుంటే..
కొండలైనా పిండి
కష్టపడితే..
ఆత్మవిశ్వాసంతో
అవకాశాలు
అందుకో మిత్రమా..
నమ్మకపు దారిలో
నీకు నీవే తోడు

పంచుకుందాం

– జి.ఆదిత్య, హైదరాబాద్

నిరుపేద కుటుంబ నేపథ్యం
తల్లిదండ్రుల నిరక్షరాస్యత
ఇవేవీ అతని కలకు అడ్డురాలేదు
సామాన్య రైతు కుటుంబం నుంచి..
ఐఈఎస్‌కు ఎంపిక కావడం వరకు తను ఆగిందే లేదు!

యూపీఎస్సీ పరీక్షల్లో రాణించడమంటే మాటలు కాదు. ఓ లక్ష్యంతో తపస్సులా కష్టపడాలి. ఎంత చెమటోడ్చినా ఒక్కోసారి ఫలితం వస్తుందన్న ఆశ లేదు. కానీ కృషి, పట్టుదల, ఏకాగ్రతతో శ్రమిస్తే నేపథ్యంతో సంబంధం లేకుండా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని నిరూపించాడు ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన నోముల సాయికిరణ్.

సాయికిరణ్, ఐఈఎస్

ఇటీవల విడుదలైన ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్ (ఐఈఎస్) పరీక్ష ఫలితాల్లో ఆలిండియా 82వ ర్యాంకు సాధించాడు.



నిజానికి సాయికిరణ్‌కు అంత అనుకూలమైన పరిస్థితులేం లేవు. తల్లిదండ్రులు నోముల అనసూయ, గంగన్నలు సామాన్య రైతులు, నిరక్షరాస్యులు. చేనులో పని చేయడం తప్పితే చదువులు, డిగ్రీల గురించి ఏమీ తెలియదు. ఇద్దరు సంతానంలో అమ్మాయి సంధ్యారాణి డిగ్రీ వరకూ చదివింది. అబ్బాయి సాయికిరణ్‌కు చిన్నప్పటి నుంచి గణితమంటే మహా ఇష్టం. ఏడో తరగతి వరకు తెలుగుమీడియంలో చదివాడు. పది, ఇంటర్, బీటెక్ ఇంగ్లిష్ మీడియంలో పూర్తిచేశాడు. మొదటి నుంచి అన్నింట్లో ఫస్ట్‌క్లాస్ స్టూడెంటే. సెలవుల్లో అమ్మానాన్నతో కలిసి చేను పనికి వెళ్లేవాడు.

బస్సులో ఆలోచన

సాయికిరణ్ బీటెక్ చదువుతున్న రోజుల్లో ఓసారి ఇంటికొచ్చాడు. తిరిగి బస్సులో కళాశాలకు బయలుదేరాడు. వెళ్తూవెళ్తూ కొనుగోలు చేసిన 'ఈనాడు' దినపత్రికలో ఐఈఎస్‌కు ఎలా సన్నద్ధం కావాలనే అంశంపై ప్రచురితమైన కథనాన్ని చూశాడు. అప్పుడే తానెందుకు దీనికి ప్రయత్నించకూడదు అనే ఆలోచన కలిగిందని చెబుతున్నాడు సాయికిరణ్. మరోసారి.. వారి కళాశాలలో ఇంజినీర్స్‌డేకి ముఖ్యఅతిథిగా వచ్చిన చింతల రమేష్ కూడా విశ్రాంత ఐఈఎస్ అధికారి అని తెలిసి ఆ కోరిక తనలో మరింత పెరిగింది. చదువుపై బాగా శ్రద్ధ పెట్టి తన లక్ష్యం దిశగా పయనించాడు. తొలిసారి 2023 ఫిబ్రవరిలో ప్రిలిమ్స్, జూన్‌లో మెయిన్స్ రాశాడు. మెయిన్స్ క్లియర్ కాలేదు. మళ్లీ 2024లో రాస్తే ఇంటర్వ్యూ వరకు వెళ్లాడు. రిజర్వ్ జాబితాలో స్థానం సంపాదించాడు. ఇంకా వాటి ఫలితాలు వెల్లడికాలేదు. ఈ ఏడాది మరోసారి ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ పూర్తి చేశాడు.

తాజాగా డిసెంబర్ 17న యూపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో అనుకున్నది సాధించాడు. తమ ఊరి అబ్బాయి ఇంత విజయం సొంతం చేసుకోవడంతో గ్రామస్థులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు అమ్మానాన్నలు, అక్కాబావలు సంధ్యారాణి, ప్రమోద్ ప్రోత్సాహం మరువలేనిదని సాయికిరణ్ చెబుతుంటే.. 'ఎన్ని పుస్తకాలు చదివావో బిడ్డ' అంటూ అనసూయ, గంగన్నలు ఆనందంతో కంట తడి పెడుతున్నారు. తను మరింతగా రాణించాలని మనసారా కోరుకుందాం.

– ఎం.మణికేశ్వర్, ఈటీవీ, ఆదిలాబాద్



ఫిట్‌నెస్ డేటా

ఓ రోజు వాకింగ్, మరో రోజు జిమ్.. అంటూ పరుగులు పెట్టే రోజులు మారుతున్నాయి. సోషల్‌మీడియాలో ఎవరో పెట్టిన రీల్‌కి, ముక్కూమొహం తెలియని వారు చేసే పోస్టులకు రియాక్ట్ అయ్యి.. 'అచ్చం వారిలా మారిపోదాం' అనుకోవడం తగ్గించేస్తున్నారు మన యూత్. మరి ఇంకేం చేస్తున్నారు? అంటారా.. ఆఫీస్‌లో డేటాను ఎలా యూజ్ చేస్తున్నారో, ఆరోగ్యం విషయంలోనూ అలాగే చేస్తున్నారు.

ఇందుకోసం జెన్‌జీలు వివిధ గ్యాడ్జెట్లు వాడటం ఎక్కువైందని తాజా అధ్యయనాల్లో తేలింది. వేరబుల్ టెక్నాలజీ ఈ వరసలో ముందంజలో ఉంది. నిద్రపోయే సమయం, గుండె కొట్టుకునే వేగం, యాక్టివిటీ, కదలిక.. ఇలా అన్నింటినీ లెక్కించుకుని మరీ పౌష్టికాహారం తీసుకుంటూ తగిన వ్యాయామం చేస్తున్నారు. తమ శరీరం ఎలా స్పందిస్తుందో డేటా లేకుండా.. వెయిట్‌లాస్, స్ట్రెంత్ ట్రైనింగ్ వంటి వాటిని ఎంచుకోవడం లేదు. అందుకే డేటా డ్రివెన్ ఫిట్‌నెస్ తాజాగా ట్రెండింగ్‌లో ఉంది. మరి ఈ మంచి అప్‌డేట్‌ను మీరు కూడా ఫాలో అయిపోతారా!

నేరేడు పండ్లు



నేను, మా అత్తయ్య కొడుకు మణికంఠ ఇంచుమించు ఒకే వయసువాళ్లం. ఒకటే స్కూల్‌లో చదువుతుండేవాళ్లం. ఐదోతరగతిలో ఉన్నప్పుడు అనుకుంటా.. ఆరోజు ఆగస్టు 15. జెండా వందనం కోసమని నెల రోజుల ముందు నుంచి తెగ హడావుడి. అమ్మానాన్నలతో పోరుపెట్టి మరీ, ఆరోజు కోసమని ఇద్దరం కొత్త యూనిఫాం కొనుక్కున్నాం (అదే.. తెల్లచొక్కా, నీలం నిక్కరు).

ఇక స్వాతంత్ర్య దినోత్సవం రోజున మా పోజులు చూడాలి. పొద్దున్నే లేచి తలస్నానం చేసేసి కొత్త యూనిఫాం వేసుకుని మొహం నిండా పౌడరు పూసుకుని.. స్కూల్‌కి బయల్దేరాం. అక్కడ హెడ్‌మాస్టారు జెండా ఎగరేయగానే.. మిక్చర్ పొట్లాం, రెండేసి బిస్కెట్లు తినుకుంటూ ఇంటికి బయల్దేరాం. కానీ దారిలో మా బీఎస్ఏ ఎస్ఎల్ఆర్ సైకిల్ ఒకచోట ఆగిపోయింది. ఎందుకంటే ఎదురుగా నిండా పండ్లతో నేరేడు చెట్టు!



ఇక ఆగిందే లేదు. సైకిల్ స్టాండ్ వేసి.. పండ్లు చకచకా దులిపేసి.. బ్యాగులో ఉన్న చిన్న సంచిలోకి మొత్తం ఆ పండ్లన్నీ నింపేశాం. సాయంత్రం దాకా వాటిని తినుకుంటూ ఎంజాయ్ చేద్దాం అనుకుని, మళ్లీ సైకిల్ ఎక్కి... వీధిమలుపులోకి తిరిగామో లేదో, స్పీడు కంట్రోల్ చేయలేక ఇద్దరం కింద పడిపోయాం.

పడితే పడ్డాం కానీ.. పండ్లకేం కాలేదు కదా అనుకుని చూస్తే ఇంకేం ఉంది, మాకింద పడి అవెప్పుడో పచ్చడైపోయాయి. మా తెల్లచొక్కాలు మొత్తం మరకలైపోయాయి! అది చాలదు అన్నట్టు కాళ్లు, చేతులకు దెబ్బలు. నెమ్మదిగా లేచి విరిగిన సైకిల్, మరకల చొక్కాలతో భయపడుతూనే ఇంటికెళ్లాం. మీకు అప్పటి అమ్మల యూనివర్సల్ రూల్ తెలిసిందేగా! దెబ్బలు తగిలించుకుంటే.. మరో రెండు తగిలించేవారు. ఆ ఆనవాయితీ ప్రకారం అమ్మ నాలుగు దబదబా వేసింది. అంత జరిగినా మిగిలిన పండ్లు తినేసి.. ఆ ఏడాది జెండాపండుగను ఆనందంగా జరిపేసుకున్నాం!

– వై.వి.వి.నగేష్


స్నేహితులతో కలిసి చేసిన కోతిపనులు, అమ్మానాన్నలకు పిచ్చిపిచ్చిగా కోపం తెప్పించిన సందర్భాలు.. గొప్పగా నేర్చుకున్న ఓ గుణపాఠం.. ఏదైనా కానివ్వండి. మీ చిన్నతనం అనగానే గుర్తొచ్చే ఆ సంఘటనను మాకు రాసి పంపండి. బాగున్న వాటిని మీ పేరుతో ప్రచురిస్తాం.

మా మెయిల్ అడ్రస్.. youthpage@eenadu.in

వేసుకున్న దుస్తులు కాస్త వదులుగా ఉంటే చాలు.. 'రేయ్ లూజ్ లాల్చీ ఇలా రా' అంటూ ఆటపట్టించేయడం మనకు అలవాటు. కానీ ఈ ఏడాదంతా రిలాక్స్‌డ్ టైలరింగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. 2026లోనూ ఇది యువత ఎంపికలో ఉంటుందని ఫ్యాషన్‌గురూల అంచనా. ఎందుకంటే కంఫర్ట్‌కు మనమిచ్చే ప్రాధాన్యం పెరిగింది కాబట్టి!

వదులైతే వదలం





ఒంటికి అతుక్కుపోయేలా ఉంటూ, గాలి కూడా సరిగ్గా ఆడకుండా, కదలికలను నిరోధించే దుస్తులకు ప్రత్యామ్నాయంగా వచ్చిందే ఈ కొత్త పద్ధతి. నిజానికి శరీరాన్ని పట్టి ఉంచుతూ ఆకృతి తెలిసేలా చేసేవే అందమైన దుస్తులని అనుకుంటూ వచ్చాం ఇన్నాళ్లూ. కానీ కాస్త వదులుగా ఉంటూ కూడా సరైన కట్స్‌తో ఉండేవి మరింత అందంగా ఉంటాయని నిరూపించింది రిలాక్స్‌డ్ టైలరింగ్. ఈ పద్ధతిలో డ్రెస్‌లు కాస్త లూజుగా అనిపిస్తాయి. అదే సమయంలో స్టైలిష్‌గానూ కనిపిస్తాయి. ఓవర్‌సైజ్డ్ బ్లేజర్స్, వైడ్‌లెగ్ - స్ట్రైట్‌ఫిట్ ట్రౌజర్స్, లూజ్ షర్ట్స్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. లెనిన్, కాటన్, వూల్ బ్లెండెడ్ మెటీరియల్స్‌తో ధరించడానికి సౌకర్యంగా ఉంటాయి. వర్క్, కాజువల్, ఏ సందర్భానికైనా సరిపోయే ఈ దుస్తులు లేయరింగ్‌లోనూ పర్ఫెక్ట్‌గా కలిసిపోతాయి. మరి ఈ రిలాక్స్‌డ్ ఫిట్‌ను ఇప్పటి వరకూ ట్రై చేయకపోతే వెంటనే చేసేయండి!

కొంటె కొటేషన్



1. గాలిలో తేలిన బాడీ
గాడితప్పితే డెడ్‌బాడీ
– ఎస్.శివ సంతోష్, శ్రీకాకుళం


2. ఫీట్ చేస్తున్న పిల్లగాడు
పట్టు తప్పితే పడతాడు
– లియో విజయ్, మలకపల్లి

3. ఏమిటా ఫీట్లు..
జారాయో బూట్లు..
తప్పవు పాట్లు..
– మమత, హన్మకొండ

4. గాల్లో ఆసనం దేనికి
పడితే ఉండదు ఉనికి
– అశోక్ కుమార్, హైదరాబాద్

5. నిలబడి కిందకి
చూస్తారు జనం..
అడ్డంగా పడుకుని
చూస్తాం మనం
– చిలగాని శివ, సుల్తానాబాద్

6. పట్టు
గట్టిగా పట్టు..
జారితే
పళ్లకు కట్టు..
– కౌండిన్య చిట్యాల, నల్గొండ



ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.



వీడుకోలు

ఎన్ని మార్పులు!
ఎన్నో ఇచ్చావ్..
ఇంకెన్నో నేర్పించావ్
కొత్త అనుభూతులు
సరికొత్త ఆనందాలు
పాతబడని జ్ఞాపకాలు
వెంటాడే క్షణాలు..
నన్ను నాకు చూపించావ్
నిన్ను నాలో నింపేశావ్
వెళ్లిరా మిత్రమా..
తిరిగిరాని నేస్తమా..

– రామ్ సత్య శంకర్

నలుగురు కుర్రాళ్లు..
చెన్నై మెరీనా బీచ్ తీరంలో
కూర్చున్నారు
వారి మాటల్లో కెరియర్ కష్టాలు లేవు
ప్రేమ ముచ్చట్లు లేవు
వాతావరణ కాలుష్యం ఉంది
పేరుకుపోతున్న వ్యర్థాలు ఉన్నాయి
తలలు తెగిపడుతున్న చెట్లున్నాయి
ఆ పరిస్థితి మారాలనుకున్నారు.. అందరూ కాలుష్యం లేని స్వచ్ఛమైన గాలిని పీల్చాలి అనుకున్నారు. 'తువక్కం' ప్రారంభించారు.

అడవులను సృష్టించే కుర్రాళ్లు

చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో చదువుకునే సమయంలో కృష్ణకుమార్ సురేష్, సాద్విక్, హరికిరణ్, కార్తిక్ శివ కలిసి ఈ స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. తువక్కం అంటే తమిళంలో ఆరంభం అని అర్థం. ఈ సంస్థ ద్వారా ఎవరైనా తమ పుట్టిన రోజులు, పెళ్లిరోజులు, ఇతర వేడుకల సమయంలో వీరికి కాల్ చేసి 'మేం మొక్కలు నాటాలనుకుంటున్నాం' అని చెప్తే వారి పేరిట మొక్కలు నాటుతుందీ సంస్థ. అవి ఎలా ఉన్నాయనేది తెలుసుకోవడం కోసం, వాటిని సంరక్షించడం కోసం స్థానికంగా ఓ వ్యక్తిని కూడా నియమిస్తున్నారు. ఆ ప్రదేశాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా వీరు మినీ అడవులు తయారుచేస్తున్నారు. ప్రస్తుతం మరింత మంది వీరితో భాగస్వాములయ్యారు.

మియావాకి టెక్నిక్‌తో..

1970ల్లో జపనీస్ వృక్షశాస్త్రజ్ఞుడు అకిరా మియావాకి అభివృద్ధి చేసిన మియావాకి టెక్నిక్‌ను వీరు ఉపయోగిస్తున్నారు. ఇందులో మొక్కలు, చిన్న చిన్న గడ్డిపొదలను దగ్గరగా నాటడం ద్వారా దట్టమైన, స్వయం సమృద్ధిగల అడవులను సృష్టించడం సాధ్యమవుతుంది. సహజ అటవీ పరిస్థితులను అనుకరిస్తూ, చెట్లు సాధారణం కంటే పది రెట్లు వేగంగా పెరగడానికి ఈ పద్ధతి సహాయపడుతుంది. సరైన నేల తయారీ, సంరక్షణతో ఈ పచ్చని ప్రాంతాలు త్వరలో వాటంతట అవే వృద్ధి చెందుతాయనేది ఈ టెక్నిక్ సారాంశం. ఇప్పటివరకూ ఈ సంస్థలో సభ్యులైన వారంతా కలిసి సుమారు 40కిపైగా చిన్న చిన్న అడవులను సృష్టించారు. అలాగే దేశవ్యాప్తంగా స్థానిక జాతులకు చెందిన మూడు లక్షలకు పైగా మొక్కలు నాటారు. నగరంలో బంజరు భూములను అభయారణ్యాలుగా మార్చారు. అలాగే కేరళలోని వయనాడ్ 2018లో వచ్చిన తుపాను సమయంలో, 2024లో కొండచరియలు విరిగి పడిన ఘటనలోనూ.. బాధితుల కోసం విరాళాలు సేకరించి రూ.35 లక్షలు, రూ.40 లక్షల వరకూ ప్రభుత్వానికి అందించారు.

రైతుల కోసం..

గ్రామాల్లో ఉండే కాలువల ద్వారా పంట పొలాలకు నీరు వెళ్తుంది. కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా నీటి కొరత ఉన్న ప్రదేశాల్లో నీటి పారుదల సౌకర్యాన్ని కల్పించడానికి చెరువులు, కాలువలు తీయడానికి ఈ సంస్థ సభ్యులు కృషి చేస్తున్నారు. తమిళనాడులోని విల్లుపురం జిల్లాలోని ఓలక్కూర్ మండలంలో సుమారు 10 గ్రామాల్లో తేనెటీగల పెంపకం చేపట్టారు.

పిల్లల్లో మార్పు కోసం..

ప్రస్తుతం పిల్లలు ఫోన్లతో గడిపే సమయం పెరుగుతోంది. ఇలా కాకూడదనే ఉద్దేశంతో ప్రతి ఆదివారం కొన్ని ప్రాంతాల్లోని పార్కుల్లో కథల పుస్తకాలను ఏర్పాటు చేస్తున్నారు. నడకకి వచ్చిన తల్లిదండ్రులకు ఆ పుస్తకాలను ఇచ్చి చదవడంపై పిల్లలకు ఆసక్తి కలిగేలా చేస్తున్నారు. పాఠశాలల్లో విద్యా సంబంధిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో 40కు పైగా పాఠశాలలకు కొత్త రంగులు వేసి వాటి పరిస్థితిని మార్చారు.



సామాజిక బాధ్యతతో..

అది.. నిత్యం వేల మంది ప్రయాణించే కూడలి.. పక్కనే ఉన్న గోడలపై ఏవేవో పిచ్చి రాతలు.. ఘోరమైన పరిస్థితులు. ఇలాంటి వాటికి అడ్డుకట్టగా గోడలపై వినూత్నమైన చిత్రాలు గీస్తున్నారు. ఒక్కోచోట విద్యార్థులు, పలు కార్పొరేట్ సంస్థల ఉద్యోగులు కూడా ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనడం విశేషం. ఇలా హైదరాబాద్‌లో కూడా సుమారు 60కి పైగా కార్యక్రమాలు నిర్వహించారు. మరి వీరు ఇంకా మరెన్నో మంచి పనులు చేయాలని ఆల్ ది బెస్ట్ చెప్పేద్దామా..!

– చింతలపాటి రామాంజనేయులు, హైదరాబాద్

ఏడాది చివరికి వచ్చేశాం.. రకరకాలైన షిప్పుల్లో ప్రయాణించే మన యూత్.. ఈసారి కొత్త కొత్త రిలేషన్‌షిప్ ట్రెండ్స్ ఫాలో అయ్యారు. అయితే వీటిలో తాత్కాలికమైన బంధాలకు ప్రాధాన్యం తగ్గింది.. బలమైన మానసిక బంధాలకే ఓటేశారు. ఆధునిక అనుబంధాల్లో ఒడిదొడుకులకు.. సరికొత్త సమాధానాలు వెతుకుతున్నారు!

మా స్టైల్ మారిందే..

జెన్‌జీ మీద ఉన్న అతిపెద్ద అపవాదు.. వారు మెటీరియలిస్టిక్ మనుషులని! దేన్నయినా చాలా ఈజీగా తీసుకోవడంతోపాటు అనుబంధాలను తేలిగ్గా చూస్తారని. కానీ 2025 ఈ అభిప్రాయాలను బద్దలు కొట్టింది. ఎందుకంటే నేటి యువత పైపైన కాలక్షేపాల కోసం చూడటం తగ్గించేశారు. లోతైన, స్థిరమైన బంధాల కోసం వెతుకుతున్నారు. ఇంతేకాదు, ఇంకా చాలా కొత్త విషయాలతో ఈ ఏడాది డేటింగ్ ట్రెండ్స్ కొత్తగా మారాయి. అవేంటో మనమూ చూద్దామా..



1 6, 7 రూల్

అవతలి వ్యక్తిలో మనకు కావాల్సిన అన్ని లక్షణాలూ ఉంటూ పదికి పది మార్కులు కావాలని ఇప్పుడు కోరుకోవడం లేదు. కనీసం ఆరేడు విషయాలు కలుస్తూ.. కాస్త ట్రై చేస్తే రిలేషన్‌షిప్ సెట్ అవుతుంది అనేలాంటి వారిని కోరుకుంటున్నారు. రోలర్‌కోస్టర్ రైడ్‌లాంటి మెచ్యూరిటీ లేని బంధాలు మనవల్ల కాదు అంటున్నారు. ఇప్పటికే అనేక ఒత్తిళ్ల మధ్య కొట్టుమిట్టాడుతున్న జీవితం. అనుబంధంలో అయినా మానసిక ప్రశాంతత కోరుకుంటున్నారు. అప్పటికప్పుడు కలిగే ఎగ్జైట్‌మెంట్ల కంటే కూడా ఏ విషయాన్ని అయినా కూర్చుని మాట్లాడుకోగలిగే పరిస్థితులు, నమ్మదగిన మనుషులనే సీరియస్‌గా తీసుకుంటున్నారు.

2 నానోషిప్

కమిట్‌మెంట్ ఇచ్చేంత సీరియస్‌నెస్ లేదు.. వదిలేసి ఊరుకోవడానికి మనసూ రాదు. ఇలాంటి సమయాల్లో ఈ నానోషిప్ ఎక్కేశారు మన కుర్రకారు. ఓ లోతైన సంభాషణ, ఒక చిన్న ప్రయాణంలో జరిగే పరిచయం.. ఇలాంటి వాటిని అప్పటికప్పుడు మనసుకు సాంత్వన చేకూర్చేందుకు కల్పించుకుంటున్నారు. వీటిలో భవిష్యత్తు ప్రణాళికలు వంటివి ఏం ఉండవు, అసలు దీన్ని బంధం అని కూడా చెప్పలేం. కొంత కాలం లేదా కొన్నిగంటలు కొనసాగే ఓ చిన్నపాటి స్నేహం అంతే.

3 మైక్రోమాన్స్

చిన్నచిన్న పనుల్లో కూడా రొమాన్స్ ఉండేలా చూసుకోవడం, అవతలి వ్యక్తితో లోతైన అనుబంధాన్ని కలిగి ఉండటానికి ప్రయత్నించడాన్ని మైక్రోమాన్స్ అంటున్నారు. ఆలోచన నిండిన, ఆనందాన్ని కలిగించే చర్యల ద్వారా బంధాన్ని సుస్థిరం చేసుకోవాలని అనుకుంటున్నారు. సరదాగా ఓ రీల్ షేర్ చేయడం, రాగానే మంచి కాఫీ పెట్టివ్వడం, ఇలాంటివన్నీ మైక్రోమాన్స్‌లోకి వస్తున్నాయి. రొమాన్స్‌కి పారిస్ ట్రిప్పులే కావాలా? నచ్చిన వారితో పానీపూరి తినడానికి వెళ్లినా బాగుంటుందిగా! అనే ఆలోచన పెరిగింది.

4 రివర్స్ కాట్‌ఫిషింగ్

ఈ ఏడాది పాపులర్ అయిన మరో పద్ధతి ఇది. కాట్‌ఫిషింగ్ అంటే మనకు తెలుసు.. సోషల్ మీడియాలో ఉన్నదీ లేనిదీ మంచి మంచి ఫొటోలు పెట్టి ఎక్కువ మందిని ఆకర్షించడం. కానీ రివర్స్ కాట్‌ఫిషింగ్‌లో యూత్.. తమలోని లోపాలు కనిపించేలా, 'ఇదే నేను' అని తెలిసేలా ఫొటోలు షేర్ చేస్తున్నారు. వారిని ఉన్నది ఉన్నట్టు యాక్సెప్ట్ చేసే వారి కోసమే వెతుకుతున్నారు. బలమైన అనుబంధాల్లో తాత్కాలిక ఆకర్షణలకంటే వాస్తవాలకే ప్రాధాన్యం ఉంటుందని నమ్ముతున్నారు.


5 ఫ్యూచర్ ప్రూఫింగ్

భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా రిలేషన్స్‌ను ఫ్యూచర్ ప్రూఫింగ్ చేసుకుంటున్నారు. ఇందులో ముఖ్యంగా అమ్మాయిల సంఖ్య ఎక్కువని బంబుల్ చెబుతోంది. ప్రతి పది మందిలో ఆరుగురు అమ్మాయిలు రిలేషన్‌లో స్థిరత్వం కోరుకుంటున్నారట. మానసికంగా పరిపక్వతతో ఉండటం, నమ్మదగిన వ్యక్తి అనిపించుకోవడం, చక్కని భవిష్యత్తుకు బాటలు వేయడం తెలిసిన అబ్బాయిలనే కోరుకుంటున్నారట.



ఈనాడు సినిమా

రాజుగారి పెళ్లిరో.. ఊరువాడ లొల్లిరో


నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి

'అనగనగా ఒక రాజు' చిత్రంతో సంక్రాంతి బరిలో వినోదాలు పంచేందుకు సిద్ధమవుతున్నారు నవీన్ పొలిశెట్టి. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాని మారి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మీనాక్షి చౌదరి కథానాయిక. ఈ చిత్రం జనవరి 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వంలో భాగంగా శుక్రవారం ఈ చిత్ర రెండో గీతాన్ని విడుదల చేశారు. "రాజు గారి పెళ్లిరో.. ఊరువాడ లొల్లిరో.. రాదు మళ్లీరో.. ఎంజాయ్ ఫుల్లీరో" అంటూ హుషారుగా సాగిన ఈ పాటకు మిక్కీ జే మేయర్ స్వరాలు సమకూర్చగా.. చంద్రబోస్ సాహిత్యమందించారు. అనురాగ్ కులకర్ణి, సమీర భరద్వాజ్ ఆలపించారు. శేఖర్ మాస్టర్ నృత్య రీతులు అందించారు. ఈ పాటలో నవీన్, మీనాక్షి కెమిస్ట్రీ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమా ఈ సంక్రాంతికి ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేశాయి.

మాస్ పాట.. మెగా విక్టరీ ఆట!


చిరంజీవి, వెంకటేశ్

అగ్ర కథానాయకులు చిరంజీవి, వెంకటేశ్ కలిసి స్టెప్పేస్తే. థియేటర్లలో ప్రేక్షకుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడా అపురూప ఘట్టాన్ని 'మన శంకరవర ప్రసాద్ గారు' చిత్రంతో తెరపై చూపించనున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఆయన దర్శకత్వంలో చిరంజీవి - నయనతార జంటగా నటించిన ఈ సినిమాని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించారు. వెంకటేశ్ ప్రత్యేక పాత్ర పోషించారు. ఇందులో చిరు - వెంకీ కలయికలో ఓ పాట తెరకెక్కించినట్లు ఇప్పటికే తెలిపారు. ఇప్పుడా 'మెగా విక్టరీ మాస్ గీతం'ను ఈనెల 30న బయటకు వదలనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. అందులో చిరంజీవి, వెంకటేశ్ స్టైలిష్ లుక్స్‌లో.. హుషారుగా స్టెప్పేస్తూ కనిపించారు. ఈ వినోదాత్మక కుటుంబ కథా చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 12న థియేటర్లలోకి రానుంది. దీనికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.

'ఛాంపియన్' అందరిది


ప్రదీప్, స్వప్న దత్, అనస్వర, రోషన్, మిక్కీ జే మేయర్, జెమినీ కిరణ్

"కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా 'ఛాంపియన్'" అన్నారు హీరో రోషన్. ఆయన. . అనస్వర రాజన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ప్రదీప్ అద్వైతం తెరకెక్కించారు. స్వప్న దత్, జీకే మోహన్, జెమినీ కిరణ్ నిర్మించారు. నందమూరి కల్యాణ్ చక్రవర్తి ముఖ్య పాత్ర పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. 'ఛాంపియన్' నాకెంతో ప్రత్యేకమైన సినిమా అన్నారు హీరో రోషన్. "ఇది పిల్లలతో కలిసి చూడాల్సిన చిత్రం. ఇది ప్రతి ఒక్కరికీ నచ్చింది" అన్నారు దర్శకుడు ప్రదీప్ అద్వైతం. ఈ కార్యక్రమంలో నందమూరి కల్యాణ్ చక్రవర్తి, స్వప్న దత్, జెమినీ కిరణ్, జీకే మోహన్, అనస్వర రాజన్, మిక్కీ జే మేయర్, రచ్చ రవి, సంజయ్ బలగం, యశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది నుంచి ఎఫ్‌ఎన్‌సీసీ సినీ పురస్కారాలు

పరిమిత వ్యయంతో రూపొందుతున్న మంచి సినిమాల్ని... వాటిలో భాగమైన ప్రతిభావంతుల్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ఏడాది నుంచి ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్.ఎన్.సి.సి) ఆధ్వర్యంలో పురస్కారాల్ని ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు ప్రముఖ నిర్మాత, ఎఫ్.ఎన్.సి.సి అధ్యక్షుడు కె.ఎస్. రామారావు. డిసెంబరు 31న నిర్వహిస్తున్న ప్రత్యేక వేడుకలో సినిమాతోపాటు, టెలివిజన్ పురస్కారాల్ని అందజేస్తామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కె.ఎస్.రామారావు మాట్లాడుతూ "తెలుగులో రూ.వందల కోట్లతో రూపొందిన పాన్ ఇండియా సినిమాలు 2025లో ఒక్కటి కూడా విజయవంతం కాలేదు. చిన్న సినిమాలు మాత్రం సంచలన విజయాన్ని అందుకున్నాయి. ఈటీవీ విన్ కొత్త ప్రతిభని ప్రోత్సహిస్తూ రూ.1.50 కోట్లు నుంచి రూ.5 కోట్లలోపు వ్యయంతో అద్భుతమైన సినిమాల్ని రూపొందిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. రూ.10 కోట్లలోపు వ్యయంతో రూపొందిన మంచి ప్రయత్నాల్ని ప్రోత్సహించడం ఎంతో అవసరం అనిపించింది. అందుకే ఈ ఏడాదికిగానూ ఉత్తమ చిత్రంగా 'కోర్ట్'కు, 'రాజు వెడ్స్ రాంబాయి'తో పరిచయమైన సాయిలు కంపాటికి ఉత్తమ దర్శకుడుగా, అదే సినిమాలో నటించిన అఖిల్‌రాజ్, తేజస్వీ రావులకు ఉత్తమ కథానాయకుడు, ఉత్తమ కథానాయిక పురస్కారాల్ని ప్రదానం చేస్తున్నాం. ఇదే వేదికపైనే విష్ణు బొప్పన ఆధ్వర్యంలో టెలివిజన్ పురస్కారాల్నీ ప్రదానం చేయడంతోపాటు, చిత్ర పరిశ్రమలో నిర్మాతలుగా యాభయ్యేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న ప్రముఖ నిర్మాతలు సి.అశ్వనీదత్, అల్లు అరవింద్‌లను, ఎఫ్.ఎన్.సి.సి అభివృద్ధి కోసం కృషిచేసిన కాజా సూర్యనారాయణలను సన్మానించనున్నాం" అన్నారు.

ఉత్కంఠభరిత హారర్ థ్రిల్లర్


'అమరావతికి ఆహ్వానం'

"ప్రేక్షకుల్ని సీటు అంచున కూర్చోబెట్టేలా థ్రిల్ పంచే సినిమా 'అమరావతికి ఆహ్వానం'" అన్నారు శివ కంఠమనేని. ఆయన హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని జీవీకే తెరకెక్కించారు. ముప్పా వెంకయ్య చౌదరి నిర్మిస్తున్నారు. ధన్య బాలకృష్ణ, ఎస్తర్, సుప్రిత ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఈ చిత్ర గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు జీవీకే మాట్లాడుతూ.. "ఓ విభిన్నమైన హారర్ థ్రిల్లర్ కథతో రూపొందిన చిత్రమిది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది" అన్నారు. "అన్ని పాత్రలకు ప్రాధాన్యత ఉండేలా మంచి కథతో ఈ సినిమాని సిద్ధం చేశాం. ప్రస్తుతం గ్రాఫిక్స్ పనులు జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం" అన్నారు హీరో శివ కంఠమనేని.

నమ్మకం నిజమైంది


పాయల్, ఫణి ప్రదీప్, అనూప్ రూబెన్స్, రోషిణి

"అమ్మాయిల కోసం తీసిన చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. నిడివి పరంగా ఇది చిన్న సినిమా అయినప్పటికీ కథా బలం విషయంలో చాలా పెద్దది" అన్నారు దర్శకుడు ఫణి ప్రదీప్ ధూళిపూడి. ఆయన దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రేణు దేశాయ్, అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఫణి ప్రదీప్ మాట్లాడుతూ.. "ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతం, చంద్రబోస్ సాహిత్యం ప్రధాన బలం. ఆ రెండు కారణాలతో ఈ సినిమాని అందరూ చూడొచ్చు. మేము ఎంత పోటీలో వచ్చినా కచ్చితంగా హిట్టు కొడతామని నిర్మాతలు నమ్మారు. ఆ నమ్మకమే నిజమైంది" అన్నారు. 'మంచి సినిమాకి ప్రేక్షకులు అండగా నిలిచారు. ప్రస్తుతం అందరి నుంచి వస్తున్న డిమాండ్ మేరకు షోలు పెంచుతున్నాం" అన్నారు నిర్మాతలు శశిధర్, రాంబాబు. ఈ కార్యక్రమంలో రోషన్ సూర్య, పాయల్, రోషిణి, అనూప్ రూబెన్స్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఇమేజ్‌కు పరిమితం కావాలనుకోవట్లేదు!


రష్మిక

"ఒక నటిగా ఎలాంటి పాత్రలోనైనా నటించగలదు అని ప్రేక్షకులు అనుకోవాలని కోరుకుంటున్నా"ని అంటోంది కథానాయిక రష్మిక. 'ఛావా', 'కుబేర', 'ది గర్ల్‌ఫ్రెండ్' లాంటి బ్లాక్‌బస్టర్ హిట్లను తన ఖాతాలో వేసుకొని ఈ ఏడాదికి గుడ్‌బై చెప్పేసిందామె. వరుస చిత్రాలతో జోరుమీదున్న ఈ తార.. త్వరలో 'మైసా' అనే నాయికా ప్రాధాన్య చిత్రంతో తెరపైకి రావడానికి సన్నద్ధమవుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రష్మిక.. ఈ ఏడాదికి ముగింపు పలకడం, రాబోయే పలు భాషల్లో నటించడం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

ప్రతిదీ అనుభవంతోనే నేర్చుకున్నా

"నటిగా ఇప్పటి వరకు నా ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూస్తే సంతోషంగా ఉంది. కొన్ని అలవాట్లు, నమ్మకాల మధ్య పెరిగాను. నా ప్రదర్శనల ద్వారా, జీవితంలోని నా అనుభవాల ద్వారా చాలా నేర్చుకున్నా. అవన్నీ ఎలా ఉండాలనుకున్నానో అలాంటి మహిళగా నన్ను మార్చాయి. బాల్యం నుంచి ఆందోళన, అభద్రత లాంటి ఎన్నో అంతర్గత పోరాటాలను ఎదుర్కొన్నా. వాటిని అధిగమిస్తూ.. నెమ్మదిగా, స్థిరంగా పనిచేయడం వల్ల ఈరోజు నేను ఎవర్నినో చెప్పుకోగలుగుతున్నా. తరచూ నన్ను నేను నిశ్శబ్దంగా భుజం తట్టుకుంటా. ఇలాంటి మార్పులు ఇతరులకు చిన్నవిగా అనిపించినా.. నేను వాటిని అద్భుతంగా చూస్తాను".

"ఈ ఏడాది గురించి చెప్పాలంటే.. చాలా గర్వపడుతున్నా. ప్రతి సంవత్సరం ఇలాగే ఉంటుందని కాదు.. కానీ 2025 విజయవంతంగా గడిచింది. బహుశా భవిష్యత్తులో పరిస్థితులు ఇంకా మెరుగుపడవచ్చు. లేదంటే అలాగే ఉండొచ్చు. కానీ నేను చేసిన అన్ని పనులకు.. నా స్నేహితులు, కుటుంబం సంతోషంగా ఉండటం చూశాను. ఆ ఆనందం నాపై ప్రభావితం చూపిస్తుంది. 2025లో నేను అందుకున్న ప్రతిదానికీ గర్వంగా, సంతృప్తిగా ప్రేక్షకుల నుంచి అపారమైన ప్రేమను పొందాను".

అందుకే దర్శకులకు లొంగిపోతా

"నేను ఒక నటిని.. ఎంటర్‌టైనర్‌ని అనే విషయం నాకు బాగా తెలుసు. నేను ప్రేక్షకులను అలరించాలనుకుంటున్నా. ఒకే ఇమేజ్‌కు పరిమితం కాకుండా.. నాలోని విభిన్న వ్యక్తిత్వాలను, కోణాలను అన్వేషించాలనుకుంటున్నా. నన్ను కేవలం మంచి అమ్మాయిగా, అమాయకపు అమ్మాయిగా, సరదా, పెద్ద స్త్రీగా మాత్రమే చూడకూడదని కోరుకుంటున్నా. నటిగా నా వ్యక్తిత్వానికి, నిజ జీవితంలో నేను ఎలా ఉంటానో అనే దానికి చాలా తేడా ఉంది. నన్ను నేను నిరంతరం మెరుగుపరుచుకుంటూ ఎదుగుతూ ఉండే వ్యక్తిగా ప్రేక్షకులు గుర్తించాలని ఆశిస్తున్నా. అందుకే దర్శకులకు, రచయితలకు పూర్తిగా లొంగిపోతా. వారు రాసిన కథ నాకు నచ్చితే.. నమ్మకంగా అనిపిస్తే.. ఆ చిత్రానికి నన్ను పూర్తిగా అంకితం చేస్తాను".

ఏ పరిశ్రమను తేలికగా తీసుకోను

"భాషతో సంబంధం లేకుండా పనిచేస్తున్నందుకు సంతోషంగా ఉంది. కన్నడ, తెలుగు, తమిళ, హిందీ ఇలా ఏ పరిశ్రమను కూడా తేలికగా తీసుకోను. నన్ను నిజంగా అదృష్టవంతురాలిగా భావిస్తా. ఒక సినిమాని అంగీకరించినప్పుడు వందశాతం పని చేస్తా. తెలుగు చిత్రంలో పనిచేస్తున్నప్పుడు.. పూర్తిగా అక్కడే ఉంటా. తమిళ, హిందీ, కన్నడ విషయంలో కూడా అంతే. ఈ ప్రయాణంలో దర్శకులు, నిర్మాతల నుంచి ప్రతి విభాగం వరకు అద్భుతమైన బృందాలతో పని చేయడం గొప్ప విషయం. వారి సహాయంతోనే నేను ముందుకు సాగుతున్నా".

నా వ్యక్తిగత విషయాల వైపు వెళ్లకుండా దండోరాని ఆదరించండి

\- శివాజీ


శివాజీ, మురళీకాంత్, నవదీప్, రవీంద్ర బెనర్జీ

"ప్రతి ఆర్టిస్టు ప్రాణం పెట్టి చేసిన సినిమా 'దండోరా'" అన్నారు నటుడు శివాజీ. తన వ్యక్తిగత విషయాల వైపు వెళ్లకుండా ఈ చిత్రానికి ప్రచారం అందించాలని, ఆదరించాలని.. లేదంటే ఆ నింద తాను మోయాల్సి వస్తుందని తెలిపారు. తనకు సంబంధించిన మిగిలిన విషయాల గురించి విడిగా చూసుకుంటానన్నారు. ఆయన.. నవదీప్, నందు, రవి కృష్ణ, బిందు మాధవి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని మురళీకాంత్ తెరకెక్కించారు. రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించారు. మౌనికా రెడ్డి, రాధ్య, అదితి భావరాజు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నటుడు శివాజీ మాట్లాడుతూ.. "దర్శకుడు నీలకంఠ ఈ చిత్రం చూసి 'కొన్ని తరాలకు ఒకసారి ఇలాంటి సినిమా వస్తుంద'న్నారు. దీనికి రెండు రోజుల ముందు ప్రీమియర్స్ పడి ఉంటే ఈ చిత్ర స్థాయి వేరేలా ఉండేది. కచ్చితంగా ఈ సినిమా గురించి 2026 మొత్తం కూడా మాట్లాడుకుంటారు. విదేశాల్లోనూ దీనికి మంచి ఆదరణ లభిస్తోంది. షోలు అంతకంతకూ పెరుగుతున్నాయి. మురళీకాంత్‌ను తమిళ దర్శకుడు మారి సెల్వరాజ్‌తో పోలుస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ జరిగినన్ని రోజులు నేను నిద్రపోయింది కేవలం రెండు గంటలే. ముఖం ఉబ్బుగా కనిపించాలని నిద్ర మానుకున్నా. దయచేసి నా వ్యక్తిగత విషయాల్ని పక్కకు పెట్టి కేవలం ఈ సినిమా గురించి మాత్రమే మాట్లాడండి. కావాలంటే నేను థియేటర్‌కు వస్తాను. ఏం మాట్లాడాలన్నా నేను థియేటర్లో మాట్లాడతాను" అన్నారు. "ఇటీవల వేడుకల్లో దొర్లిన రెండు మూడు మాటల ఆధారంగా ఈ చిత్రాన్ని జడ్జ్ చేయకండి. ఈ సినిమా కోసం మూడేళ్లు కష్టపడ్డా. ఆ శ్రమకు ఫలితం తెరపై కనిపించింది. కథపై నమ్మకంతోనే పోటీకి భయపడకుండా సినిమా విడుదల చేశాం" అన్నారు దర్శకుడు మురళీకాంత్. ఈ కార్యక్రమంలో నవదీప్, రవీంద్ర బెనర్జీ, బిందు మాధవి, మౌనిక, రవికృష్ణ, కె.నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారి స్వార్థంతోనే పరిశ్రమ అదుపుతప్పింది!


రవిచంద్, చదలవాడ శ్రీనివాసరావు, సి.కల్యాణ్, టి.ప్రసన్నకుమార్

పదేళ్లుగా చిత్ర పరిశ్రమ అదుపు తప్పిందని, గిల్డ్ పేరుతో కొంతమంది నిర్మాతలు ఒక్కటై స్వార్థ పూరితంగా వ్యవహరించడమే అందుకు ప్రధాన కారణమని ఆరోపించారు సీనియర్ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు. వచ్చే ఆదివారం జరగనున్న తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ఎన్నికల్ని పురస్కరించుకుని మన ప్యానెల్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ ప్యానెల్ నుంచి పోటీ చేస్తున్న చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ "గిల్డ్ సభ్యుల కారణంగానే ఈ ఏడాది చిత్రీకరణలు ఆగిపోయాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యాయి. చలన చిత్ర వాణిజ్య మండలి పరిష్కరించాల్సిన సమస్య ముఖ్యమంత్రి వరకూ వెళ్లింది. చిన్న నిర్మాతలు, కార్మికుల సంక్షేమాన్ని కోరుకునే మన ప్యానెల్ నాలుగు సెక్టార్లలోనూ పోటీ చేస్తోంది. గెలిపిస్తే అందరికీ, అర్ధరాత్రి కూడా అందుబాటులో ఉంటాం" అన్నారు. తాము చిన్న నిర్మాతలకి ఎప్పుడూ అందుబాటులో ఉంటామని, వాళ్లంతా మన ప్యానెల్‌వైపే అన్నారు నిర్మాత సి.కల్యాణ్. ఈ కార్యక్రమంలో టి.ప్రసన్నకుమార్, రవిచంద్ యలమంచిలి, నట్టికుమార్‌తోపాటు మన ప్యానెల్ నుంచి పోటీ చేస్తున్న పలువురు నిర్మాతలు పాల్గొన్నారు.

'మారెమ్మ'.. చిత్రీకరణ పూర్తి

రవితేజ సోదరుడైన నటుడు రఘు కుమారుడు మాధవ్ 'మారెమ్మ' చిత్రంతో హీరోగా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. ఆయన.. దీపా బాలు జంటగా నటిస్తున్న ఈ సినిమాని మంచాల నాగరాజ్ తెరకెక్కిస్తున్నారు. మయూర్ రెడ్డి బండారు నిర్మాత. వినోద్ కుమార్, వికాస్ వశిష్ఠ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఈమేరకు ఓ కొత్త లుక్‌ను నెట్టింట పంచుకున్నారు. మాధవ్ అందులో కాళీదేవి విగ్రహం ముందు ఓ దున్నను పట్టుకుని నడిచొస్తూ కనిపించారు. "ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే రా రస్టిక్ చిత్రంగా ఉంటుంది. యాక్షన్‌కు ఎంతో ప్రాధాన్యముంది. నిర్మాణానంతర పనులు పూర్తి చేసి త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: ప్రశాంత్ ఆర్ విహారి, ఛాయాగ్రహణం: ప్రశాంత్ అంకిరెడ్డి.

అవన్నీ దృష్టిలో పెట్టుకునే 'శంబాల'ని రాసుకున్నా


యుగంధర్ ముని

"ఓ దర్శకుడిగా నేను చెప్పే కథని చాలా మంది చూస్తారు. ఎంతో నేర్చుకుంటారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే 'శంబాల' కథని ఎంతో బాధ్యతగా రాసుకున్నా" అన్నారు దర్శకుడు యుగంధర్ ముని. ఆయన దర్శకత్వంలో ఆది సాయికుమార్ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మించారు. ఇది ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు యుగంధర్ ముని మాట్లాడుతూ.. "ఎవరి మనోభావాల్ని దెబ్బ తీయకుండా సైన్స్, శాస్త్రాన్ని బ్యాలెన్స్ చేస్తూ ఈ కథ చెప్పాలని నేను ముందే అనుకున్నా. ఈ చిత్రం కోసం ఉల్క పడిన ప్రాంతం ఎలా ఉంటుందనే విషయంపై చాలా పరిశోధన చేశా. బ్రెజిల్‌లో జరిగిన ఘటనలపై కొంత వర్క్ చేశా. ఈ కథ అనుకున్నప్పుడే దీనికి ఆదిని హీరోగా అనుకున్నాం. ఆయన ఇలాంటి విజయం కోసం చాలా కష్టపడ్డారు. సెట్‌లో ఎన్ని గాయాలైనా ఎక్కడా వెనకడుగు వేయకుండా శ్రమించారు. ఇప్పుడీ చిత్ర విజయం పట్ల తను చాలా ఆనందంగా ఉన్నారు. నాకు సూపర్ నేచురల్, థ్రిల్లర్ జానర్‌లంటే చాలా ఇష్టం. ప్రస్తుతం నేను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌లోనే మరో సినిమా చేయనున్నా. త్వరలో ఆ వివరాల్ని ప్రకటిస్తా" అన్నారు.

ఆంగ్లేయుల పాలిట వరంగా.. అస్థిరత.. వారసత్వ పోరు!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

భారతదేశ చరిత్ర

ఈస్ట్ ఇండియా కంపెనీ అధికార స్థాపన

బ్రిటిష్ వారి సామ్రాజ్యవాద దాహానికి భారతదేశంలోని స్వదేశీ సంస్థానాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఆంగ్లేయుల చట్టాలు, సైన్యసహకార పద్ధతి, అనైతిక విధానాల కారణంగా బెంగాల్, మైసూర్, నిజాం, మరాఠా రాజ్యాలు కంపెనీ ఛత్రం కిందికి వచ్చాయి. పంతొమ్మిదో శతాబ్దం ప్రథమార్ధం చివరి నాటికి దేశంలో మిగిలిన ఒకే ఒక స్వతంత్ర రాజ్యం సిక్కు రాజ్యం. రంజిత్ సింగ్ మరణంతో అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని, అంతర్యుద్ధాలు, వారసత్వ రాజకీయలను రెచ్చగొట్టి సిక్కు రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నారు.

పంజాబ్ ఆక్రమణ

మొగల్ సామ్రాజ్యం బలహీనపడిన తర్వాత 18వ శతాబ్దంలో పంజాబ్‌లో 12 చిన్న సిక్కు రాజ్యాలు ఏర్పడ్డాయి. ఈ రాజ్యాలను 'మిజిల్' అని, వీటి పాలకులను మిజిల్‌దార్‌లు అనేవారు.

✦ ఈ సిక్కు రాజ్యాల్లో 'సుకర్ చెకియ మిజిల్' అత్యంత ముఖ్యమైంది. 1792లో ఈ రాజ్యానికి రంజిత్ సింగ్ పాలకుడయ్యాడు. ఇతడి సుదీర్ఘ పాలనలో సుకర్ చెకియ బలమైన రాజ్యంగా అవతరించింది. అనేక మిజిల్‌లను జయించి, లాహోర్ రాజధానిగా బలమైన సిక్కు రాజ్యాన్ని నిర్మించాడు. భారతదేశంలో ఇది ఆంగ్లేయుల తర్వాత అత్యంత బలమైన రాజ్యంగా అవతరించింది.

రంజిత్ సింగ్

1780లో జన్మించాడు. తండ్రి పేరు మహాన్‌సింగ్. ఇతడు సిక్కు సమాఖ్య సుకర్ చెకియ మిజిల్ నాయకుడు.

- తండ్రి మరణంతో రంజిత్ సింగ్ పన్నెండేళ్ల వయసులోనే సమాఖ్య అధిపతిగా బాధ్యతలు చేపట్టాడు.
- చిన్న వయసులోనే వ్యాధికి గురై ఒక కంటిని కోల్పోయాడు.
- 1799లో లాహోర్‌ను స్వాధీనం పరచుకుని, రాజధానిగా చేసుకున్నాడు. 12 చిన్న సిక్కు రాజ్యాలను (సమాఖ్యలు), ఇతర చిన్న రాజ్యాలను జయించి 1801లో మహారాజు అయ్యాడు.
- కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రతిభావంతులకు ఉద్యోగాలిచ్చాడు.
- ఆఫ్ఘన్ దండయాత్రలను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. ఇతడికి షేర్ - ఇ - పంజాబ్ (పంజాబ్ సింహం) అనే బిరుదు ఉంది.
- గురునానక్, గురుగోబింద్ సింగ్‌ల చిత్రాలను తన నాణేలపై ముద్రించాడు.
- ఇతడు సైనికులు, ఉద్యోగులు/అధికారులకు నెలవారీ జీతాలు చెల్లించే పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీన్ని మహాదారీ పద్ధతి అని పిలుస్తారు.
- రంజిత్ సింగ్ అమృత్‌సర్‌లోని హర మందిర్ సాహిబాకు బంగారు తాపడం చేయించడంతో స్వర్ణ దేవాలయంగా పేరుగాంచింది.
- సుదీర్ఘ పాలనలో ఎన్నడూ ఆంగ్లేయులతో ఘర్షణ పడకుండా సత్సంబంధాలు నెలకొల్పాడు. 1809లో ఆంగ్లేయులతో అమృత్‌సర్ సంధి కుదుర్చుకుని, సట్లెజ్ నదిని రాజ్యానికి సరిహద్దుగా చేసుకున్నాడు.
- ఆఫ్ఘన్ యువరాజు షాసుజాకు (అహ్మద్‌షా అబ్దాలీ మనవడు) ఆశ్రయం కల్పించి, అతడి నుంచి కోహినూర్ వజ్రం పొందాడు. కోహినూర్ వజ్రం మొగలుల నుంచి నాదిర్షాకు, నాదిర్షా నుంచి అహ్మద్‌షా అబ్దాలీకి, చివరిగా అబ్దాలీ కుమారుడు షాసుజాకు చేరింది)
- రంజిత్ సింగ్ 1839 జూన్‌లో అనారోగ్యానికి గురై మరణించాడు.

సింధ్ ఆక్రమణ (1843)

1839లో సింధ్ పాలకుడు షేర్ మహమ్మద్ ఆంగ్లేయులతో సైన్య సహకార ఒప్పందం కుదుర్చుకుని రక్షణ బాధ్యతలు ఆంగ్లేయులకు అప్పజెప్పాడు. సైన్య సహకార పద్ధతికి ఒప్పుకున్న ఆంగ్లేయులు సింధ్‌ను రక్షించడం విస్మరించి, ఆ రాజ్యాన్ని ఆక్రమించడంలో వారి సామ్రాజ్య విధానం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 1843లో గవర్నర్ జనరల్ లార్డ్ ఎల్లెన్‌బరో ఆదేశాలతో సింధ్ రాజ్యానికి రెసిడెంట్‌గా పనిచేస్తున్న సర్ ఛార్లెస్ నేపియర్ సింధ్‌ను జయించాడు. సింధ్‌ను జయించిన నేపియర్ కూడా ఇది అనైతికమని వ్యాఖ్యానించాడు.



రచయిత

డాక్టర్ ఎం. రవి కుమార్

విషయ నిపుణులు

మొదటి ఆంగ్లో-సిక్కు యుద్ధం (1845-46)



ఈ యుద్ధం హార్డింజ్ - I గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియాగా ఉన్న కాలంలో జరిగింది. రంజిత్ సింగ్ మరణించిన (1839) తర్వాత అతడి వారసులు సింహాసనం కోసం కలహానికి దిగారు. దీంతో రాజ్యంలో అస్థిరత ఏర్పడింది.

- రంజిత్ సింగ్ తర్వాత సింహాసనాన్ని అధిష్ఠించిన ఖరక్ సింగ్, నౌనిహాల్ ఇద్దరూ అసమర్థులు, బలహీనులు. వీరి తర్వాత రంజిత్ సింగ్ కుమారుడు, మైనర్ బాలుడైన దిలీప్ సింగ్ సింహాసనం అధిష్ఠించాడు. ఇతడికి తన తల్లి జిందాన్ సంరక్షకురాలిగా ఉంటూ పరిపాలన కొనసాగించింది.
- రంజిత్ సింగ్ తన కాలంలో సైనిక ప్రభుత్వాన్ని స్థాపించాడు. తర్వాతి కాలంలోని రాజకీయ నేపథ్యంతో ఈ సైన్యమే అల్లర్లకు కారణమైంది, తద్వారా పంజాబ్‌లో అశాంతి ఎక్కువైంది. తిరుగుబాట్లు అధికమయ్యాయి.
- ఈ సమయంలోనే ఆంగ్లేయులు తమ సైనిక సంపత్తిని మరింత పెంచుకోవడంతో సిక్కు సైనికుల్లో అనుమానాలు ఎక్కువయ్యాయి. బ్రిటిష్ వారి సైనిక కదలికలతో సిక్కులు తమ భూభాగాన్ని ఆంగ్లేయులు ఆక్రమించనున్నారని అనుమానించారు.
- ఈ పరిమాణాలను గమనిస్తున్న మహారాణి జిందాన్ అమృత్‌సర్ సంధిని ఉల్లంఘించి, సట్లెజ్ నదిని దాటి ఆంగ్లేయులను ఎదుర్కోవాల్సిందిగా తమ సైనికులను ఆదేశించింది.
- మొదటి ఆంగ్లో - సిక్కు యుద్ధం పలు ప్రాంతాల్లో జరిగింది. వాటిలో ముఖ్యమైనవి.. ముడికి, ఫిరోజ్‌పూర్, బుద్దేవాల్, సోబ్రాన్.
- ఆంగ్లేయుల ఆధునిక ఆయుధ సంపత్తి ముందు సిక్కు సైన్యం నిలవలేకపోయింది. చివరికి సిక్కులు ఓడిపోయారు.
- ఈ యుద్ధం 1846లో లాహోర్ సంధితో ముగిసింది. సంధి ప్రకారం జలంధర్ అంతర్వేదిని ఆంగ్లేయులు ఆక్రమించారు.
- ఈ సంధి నిబంధనల మేరకు సిక్కులు ఆంగ్లేయులకు కోటిన్నర రూపాయలు చెల్లించాలి. అయితే సిక్కుల వద్ద అంత సొమ్ము లేకపోవడంతో వారు కశ్మీర్‌ను ఆంగ్లేయులకు ఇచ్చేశారు. తర్వాత బ్రిటిష్ వారు కశ్మీర్‌ను గులాబ్ సింగ్‌కు అమ్మారు.
- పంజాబ్ మీదుగా ఆంగ్లేయుల సైనికులను వెళ్లనివ్వాలనేది కూడా సంధి ఒప్పందం.
- 1846లోనే బైరవోల్ అనే మరో సంధిని కూడా కుదుర్చుకున్నారు. దీని ప్రకారం రాజు యుక్తవయసుకు వచ్చే వరకు ఆంగ్ల సైన్యం లాహోర్‌లో రక్షణార్థం ఉంటుంది. దీనికి అయ్యే ఖర్చు సిక్కులే భరించాలి. పాలనా వ్యవహారాల కోసం హెన్రీ లారెన్స్‌ను ఆంగ్ల రెసిడెంట్ అధికారిగా నియమించారు. దీంతో దిలీప్ సింగ్ నామమాత్రపు రాజుగా మిగిలిపోయాడు.

రెండో ఆంగ్లో - సిక్కు యుద్ధం (1848 - 49)



గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియాగా లార్డ్ డల్హౌసీ ఉన్న కాలంలో ఈ యుద్ధం జరిగింది.

- డల్హౌసీకి సామ్రాజ్య కాంక్ష అధికం. యుద్ధాలతో పాటు అనేక విధానాలు అవలంబించి భారతదేశంలోని పలు రాజ్యాలను బ్రిటిష్ వారి అధీనంలోకి తెచ్చాడు.
- ఇతడు తన పాలనా కాలంలో రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. దీని ప్రకారం స్వదేశీ రాజులు పుత్రులు లేకుండా మరణిస్తే వారి రాజ్యాన్ని కంపెనీ పాలన కిందికి తేవడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఈ సిద్ధాంతం ప్రకారం దత్తతను నిరాకరించారు.
- ఈ క్రమంలోనే డల్హౌసీ చూపు పంజాబ్ రాజ్యంపై పడింది. సంపన్న రాజ్యమైన పంజాబ్‌ను కంపెనీ పాలన కిందికి తేవాలని అనుకున్నాడు.
- సిక్కులపై అణచివేత, పరిపాలనా విధానంలో ఆంగ్లేయుల జోక్యం అధికమవడంతో మహారాణి జిందాన్ విసుగు చెందింది.
- ఇదే రెండో ఆంగ్లో - సిక్కు యుద్ధానికి ప్రధాన కారణంగా నిలిచింది. అంతేకాకుండా ముల్తాన్ దివాన్ మూలరాజు సైతం బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేశాడు. ఇతడు షేర్‌సింగ్ నాయకత్వంలో ఆంగ్లేయులపైకి సేనలను పంపాడు.
- సర్ హ్యూగా నాయకత్వంలో బ్రిటిష్ సేనలు రాంనగర్ యుద్ధం (1848), చిలియన్ వాలా యుద్ధం, గుజరాత్ యుద్ధంలో (1849) సిక్కులను పూర్తిగా ఓడించాయి. దీంతో డల్హౌసీ పంజాబ్‌ను బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనం చేశాడు.
- మహారాజా దిలీప్ సింగ్ పదవిని రద్దు చేసి, అతడిని తల్లి జిందాన్‌తో పాటు ఇంగ్లండ్‌కు పెన్షనర్లుగా పంపాడు. వీరు విక్టోరియా మహారాణిని కలిసి కోహినూర్ వజ్రాన్ని కానుకగా అందజేశారు. ఆనాటి నుంచి కోహినూర్ వజ్రం శాశ్వతంగా బ్రిటిష్ రాజవంశం అధీనంలోనే ఉంది. 1853లో జాన్‌లారెన్స్‌ను పంజాబ్ తొలి కమిషనర్‌గా నియమించారు.
- యుద్ధాల ద్వారా ఆంగ్లేయులు జయించిన చివరి రాజ్యం పంజాబ్. పంజాబ్ ఆక్రమణ తర్వాత ఆంగ్లేయులతో పోరాడే సామర్థ్యం ఉన్న రాజ్యాలు భారతదేశంలో అంతరించిపోయాయి.
- రాజ్యాలన్నీ ఆంగ్లేయులతో సైన్య సహకార ఒప్పందం చేసుకుని వారికి దాసోహమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారత భూభాగాలను ఆక్రమించుకోవడానికి ఆంగ్లేయులు అనేక రకాల ఇతర వ్యూహాలను రచించారు.

Word of the Day 873

Offensive

Telugu meaning: దూకుడు, దాడి చేయగల

English meaning: The word offensive (అఫెన్సివ్) is an adjective that describes something that causes anger, displeasure, or insult to people.


Synonyms: Abusive, Objectionable

Antonyms: Polite, Respectful

Usage: **1.** His offensive remarks during the meeting offended several senior officials.

2. The advertisement was removed after viewers complained that its content was offensive.

కరెంట్ అఫైర్స్



సుప్రీంకోర్టులో భారత ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్‌గా తెదేపా మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ 2025, డిసెంబరు 23న నియమితులయ్యారు. ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మూడేళ్లపాటు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకూ ఈ పదవిలో కొనసాగుతారు. రవీంద్రకుమార్ 1983లో ఆంధ్రప్రదేశ్ బార్‌కౌన్సిల్‌లో నమోదై న్యాయవాద వృత్తి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం, ఏపీఎస్ఆర్టీసీ, ఏపీ విద్యుత్తు బోర్డు, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ డిస్కంల స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేశారు.



దేశ చరిత్రలో తొలిసారిగా 6,100 కిలోల బరువైన బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ఇస్రో ప్రవేశపెట్టింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్-షార్ నుంచి 2025, డిసెంబరు 24న ఉపగ్రహాన్ని తీసుకుని అత్యంత శక్తిమంతమైన బాహుబలి రాకెట్ ఎల్‌వీఎం3-ఎం6 నింగిలోకి దూసుకెళ్లింది. దేశ తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'లో ఎల్‌వీఎం3 రాకెట్‌నే ఉపయోగించనున్నారు.

✦ అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ రూపొందించిన అత్యంత బరువైన బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని ఇస్రో 518.5 కి.మీ. ఎత్తులో కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.



దిల్లీ ఐఐటీ శాస్త్రవేత్తలు డెన్మార్క్, జర్మనీలకు చెందిన శాస్త్రవేత్తలతో కలిసి 'ఆర్టిఫిషియల్లీ ఇంటెలిజెంట్ ల్యాబ్ అసిస్టెంట్' (అయిలా) అనే సరికొత్త కృత్రిమ మేధ పరికరాన్ని రూపొందించారు. శాస్త్రవేత్తల మాదిరిగానే వైజ్ఞానిక ప్రయోగాలను నిర్వహించే సామర్థ్యం వీటికి ఉంటుంది.

✦ అతి సూక్ష్మస్థాయిలో పదార్థాలను విశ్లేషించే అటామిక్ ఫోర్స్ మైక్రోస్కోప్‌పై అయిలా సాయంతో పరిశోధన నిర్వహించారు. అయిలా అత్యంత సంక్లిష్టమైన ఈ పరికరాన్ని సమర్థంగా ఉపయోగించగలుగుతోంది.

దిత్వా తుపాను కారణంగా అతలాకుతలమైన శ్రీలంకకు భారత్ 45 కోట్ల డాలర్ల ఆర్థిక సాయం ప్రకటించింది. శ్రీలంక పునర్నిర్మాణానికి భారత్ స్థిరమైన నిబద్ధతతో ఉందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. భారత ప్రధానమంత్రి మోదీ తరఫున ప్రత్యేక రాయబారిగా ఆయన శ్రీలంకకు వెళ్లారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అంతర్జాతీయ అంటువ్యాధుల సంసిద్ధత దినోత్సవం

డిసెంబరు 27

చరిత్రలో ఈనాడు

అంటువ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా డిసెంబరు 27న 'అంతర్జాతీయ అంటువ్యాధుల సంసిద్ధత దినోత్సవం'గా (International Day Of Epidemic Preparedness) నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా అంటువ్యాధుల నివారణ, సంసిద్ధత, సహకారాలను పెంపొందించే కార్యక్రమాలు చేపట్టడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

అంటువ్యాధి అంటే?

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రకారం, ఒక సమాజంలో లేదా ప్రాంతంలో అనారోగ్య సంఘటనలు సాధారణం కంటే ఎక్కువగా నమోదు కావడాన్ని అంటువ్యాధిగా పేర్కొంటారు. ఇవి ఒక నిర్దిష్ట కాలపరిమితిలో సంభవిస్తాయి. రుగ్మత కారకం, దీనికి గురైన జనాభా పరిమాణం, రకం, గతంలో ఆ వ్యాధికి గురికావడం, ప్రదేశం లాంటి అనేక కారకాలు అంటువ్యాధుల ఉనికిని సూచించే కేసుల సంఖ్యను ప్రభావితం చేస్తాయి.

✦ జలుబు, వైరల్ ఫీవర్ లాంటి వాటి నుంచి కరోనా వైరస్ వరకు అన్నీ అంటువ్యాధులే. సూక్ష్మజీవులతోపాటు హెల్మింథిస్ వర్గానికి చెందిన పరాన్న జీవులు, ఈగలు, దోమలు లాంటి కీటకాల ద్వారా కూడా ఈ వ్యాధులు విస్తరిస్తున్నాయి.

చారిత్రక నేపథ్యం


అంటువ్యాధులకు సంసిద్ధత, నివారణ, వాటికి వ్యతిరేకంగా ప్రజలు - ప్రభుత్వాలు - దేశాల భాగస్వామ్యానికి ఉన్న ప్రాముఖ్యతను ఐక్యరాజ్యసమితి గుర్తించింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రతికూల పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రతిస్పందించడానికి, అంటువ్యాధుల నిర్వహణపై అవగాహన కోసం ఒక రోజును ఏర్పాటు చేయాలని భావించింది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఏటా డిసెంబరు 27న 'అంతర్జాతీయ అంటువ్యాధుల సంసిద్ధత దినోత్సవం'గా జరుపుకోవాలని 2020లో తీర్మానించింది. నాటి నుంచి ఏటా దీన్ని నిర్వహిస్తున్నారు.



అంటువ్యాధులు వ్యాపించే తీరు, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

కేంద్రక రసాయనశాస్త్రం



పరమాణు సంఖ్య

పరమాణువులోని ప్రోటాన్‌ల సంఖ్యను పరమాణు సంఖ్య అంటారు.

- దీన్ని Z అనే అక్షరంతో సూచిస్తారు.
- ఒక తటస్థ పరమాణువులోని ఎలక్ట్రాన్‌ల సంఖ్య పరమాణు సంఖ్యకు సమానం.

పరమాణు ద్రవ్యరాశి సంఖ్య

పరమాణువులోని ప్రోటాన్, న్యూట్రాన్ల సంఖ్యల మొత్తాన్ని పరమాణు ద్రవ్యరాశి సంఖ్య అంటారు.

- ద్రవ్యరాశి సంఖ్యను A అనే అక్షరంతో సూచిస్తారు.
- ఒకే పరమాణు సంఖ్య, వేర్వేరు ద్రవ్యరాశి సంఖ్యలను కలిగిన పరమాణువులను 'ఐసోటోప్'లు అంటారు.

సహజ రేడియోధార్మికత

పరమాణు సంఖ్య 82 కంటే ఎక్కువ ఉన్న కొన్ని పరమాణువుల కేంద్రకాలు అస్థిరత్వాన్ని కలిగి ఉంటాయి. అవి స్థిరత్వాన్ని పొందడానికి వాటంతటవే α, β, γ కిరణాలతో విఘటనం చెందే దృగ్విషయాన్ని 'సహజ రేడియోధార్మికత' అంటారు.

కేంద్రక సంలీనం

రెండు తేలికైన పరమాణు కేంద్రకాలు కలిసి ఒక భారమైన కేంద్రకంగా మారే ప్రక్రియే కేంద్రక సంలీనం. ఈ ప్రక్రియలో అధిక శక్తి విడుదలవుతుంది.

అర్ధజీవితకాలం

ఒక రేడియోధార్మిక పదార్థం విఘటనం చెంది, తన అసలు ద్రవ్యరాశి సగం ద్రవ్యరాశిగా మార్పు చెందేందుకు పట్టే కాలాన్ని 'అర్ధజీవితకాలం' అంటారు.

α - కణాలు, β - కణాలు, γ - కణాలు, సహజ రేడియోధార్మికత ప్రమాణాలు మొదలైన అంశాలతో పాటు, మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

ఫ్యాకల్టీ ఉద్యోగాలు

భోపాల్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) రెగ్యులర్ ప్రాతిపదికన పలు విభాగాల్లో ఫ్యాకల్టీ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 77. దరఖాస్తు చివరి తేదీ 1 జనవరి 2026.

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో పోస్టులు

కేరళలోని భారత ప్రభుత్వ మినీరత్న షెడ్యూల్ సంస్థ అయిన కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ వర్క్‌మెన్ కేటగిరీలో వివిధ టెక్నికల్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం పోస్టుల సంఖ్య 132. దరఖాస్తు రుసుము రూ.700. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ 12 జనవరి 2026.

ఐసీఎస్ఐఎల్‌లో సైన్స్ గ్రాడ్యుయేట్ పోస్టులు

న్యూదిల్లీలోని ఇంటెలిజెంట్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన సైన్స్ గ్రాడ్యుయేట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 8. దరఖాస్తు రుసుము రూ.590. ఇంటర్వ్యూకు హాజరవ్వాల్సిన తేదీ 2 జనవరి 2025.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (డిసెంబరు 27) చివరి తేదీ

- ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్‌లో సీనియర్ కన్సల్టెంట్ పోస్టులు. బీఈ/బీటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- రంగరాయ మెడికల్ కాలేజీ కాకినాడలో 34 పోస్టులు. డిగ్రీ, బీఎస్సీ, డిప్లొమా, ఇంటర్, టెన్త్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Time Speed Distance

1. A train moves 4 times as fast as a car. If the car covers 72 km in 90 minutes, how much distance (in km) will the train cover in 30 minutes?

A) 72 km B) 80 km
C) 96 km D) 108 km

2. How much time (in minutes) will Rahul take to cover 750 m, if he runs at a speed of 18 km/h?

A) 2 minutes B) 2.5 minutes
C) 3 minutes D) 3.5 minutes

3. Anita walks at a speed of 6 km/h and crosses a bridge in 20 minutes. What is the length of the bridge (in metres)?

A) 1800 m B) 2000 m
C) 2200 m D) 2400 m

4. Two trains of lengths 120 m and 90 m are moving in the same direction at speeds of 15 m/s and 9 m/s, respectively. How much time (in seconds) will the faster train take to completely cross the slower train?

A) 28 seconds B) 30 seconds
C) 35 seconds D) 40 seconds

5. A police officer is 240 metres behind a burglar. The police officer runs 36 metres per minute, while the burglar runs 24 metres per minute. In how much time will the police officer catch the burglar?

A) 15 minutes B) 18 minutes
C) 20 minutes D) 24 minutes

6. P and Q are two stations 300 km apart. A train starts from P towards Q at a speed of 75 km/h. After 1 hour, another train starts from Q towards P at a speed of 25 km/h. After how many hours from the start of the first train will the two trains meet?

A) 3 hours B) 3.25 hours
C) 4 hours D) 4.5 hours

7. A thief steals a bag and runs at a speed of 12 km/h. A policeman reaches the spot 5 minutes later and immediately starts chasing him. After 15 minutes of chasing, the distance between them is still 250 m.

At what distance (from the spot of crime) will the policeman catch the thief and what is the speed of the policeman?

A) 2 km and 14 km/h
B) 5 km and 15 km/h
C) 3 km and 16 km/h
D) 3.5 km and 18 km/h

8. A person covers 50% of the distance from X to Y at 10 km/h, 30% of the remaining distance at 15 km/h, and the rest at 20 km/h. What is his average speed (in km/h) for the entire journey?

A) 12.9 km/h B) 13.5 km/h
C) 14 km/h D) 15 km/h

Railway Exams

Mathematics

9. Rohit completed a journey by car. He covered 30% of the total distance at 60 km/h, 50% of the distance at 90 km/h, and the remaining distance at 45 km/h. What is his average speed (in km/h) for the entire journey?

A) 60 km/h B) 64 km/h
C) 66.67 km/h D) 70 km/h

10. The speed of a vehicle increases by 3 km/h after every one hour. If the distance travelled in the first hour is 40 km, what is the total distance travelled in 10 hours?

A) 670 km B) 700 km
C) 535 km D) 730 km

11. Ravi travels a certain distance by bike. He covers 20% of the distance at 30 km/h, 50% of the distance at 60 km/h, and the remaining distance at 20 km/h. Find his average speed (in km/h) for the entire journey.

A) 33.3 km/h B) 36 km/h
C) 40 km/h D) 42 km/h

12. A car moves at one-fifth of its usual speed, due to which it takes 32 minutes extra to reach its destination. What is the usual time (in minutes) taken by the car to cover the same distance?

A) 6 minutes B) 8 minutes
C) 10 minutes D) 12 minutes

13. Two trains of equal length are running on parallel tracks in the same direction at speeds of 45 km/h and 63 km/h, respectively. The faster train completely passes the slower train in 40 seconds. What is the length of each train (in metres)?

A) 80 m B) 90 m
C) 100 m D) 120 m

14. A woman runs across a 1500 m long road in 5 minutes. Calculate her speed (in m/sec).

A) 4 m/sec B) 5 m/sec
C) 6 m/sec D) 7 m/sec

15. Rohan travelled for 5 hours at a speed of 70 miles per hour and for 5 hours at a speed of 50 miles per hour. What was his average speed (in miles per hour) for the entire journey?

A) 55 mph B) 58 mph
C) 60 mph D) 65 mph

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

మున్సిపల్ ఎన్నికల పుణ్యమా అని..
ట్రాఫిక్ చలాన్ల చెల్లింపునకు క్యూ



ఈటీవీ భారత్: మహారాష్ట్రలో వాహనాలపై పేరుకుపోయిన ట్రాఫిక్ జరిమానాలను పట్టించుకోని కొందరు రాజకీయ నేతలు మున్సిపల్ ఎన్నికల ముందు హడావుడిగా చెల్లిస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం.. అభ్యర్థుల నుంచి ప్రభుత్వానికి సంబంధించి ఎలాంటి బకాయిలు ఉండకూడదు. ఉంటే నామినేషను తిరస్కరణకు గురవుతుంది. పుణెలో ఓ ఆశావహ అభ్యర్థి తన వాహనంపై ఉన్న రూ.1.5 లక్షల ట్రాఫిక్ జరిమానాలను ఇటీవల చెల్లించారు. ఆయన పేరును అధికారులు వెల్లడించలేదు. పుణె పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు మున్సిపాలిటీల ఎన్నికలు త్వరలో జరగనుండటంతో ఎన్నికల బరిలోకి దిగాలని అనుకుంటున్నవారు పెండింగ్ చలాన్ల చెల్లింపునకు పరుగులు పెడుతున్నారు. దీంతో పుణె ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశారు. ఈ-చలాన్ల చెల్లింపునకు ప్రత్యేక కౌంటరు ఏర్పాటుతోపాటు ఆన్‌లైన్ పేమెంటు సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తెచ్చినట్లు డీసీపీ పంకజ్ శిరసాట్ తెలిపారు.

కాలిఫోర్నియాలో లైసెన్సుల రద్దు..
కోర్టులో భారతీయ డ్రైవర్ల సవాల్



ఇంటర్నెట్ డెస్క్: ప్రవాస డ్రైవర్లకు ఇచ్చిన వాణిజ్య లైసెన్సులను అమెరికాలోని కాలిఫోర్నియా ప్రభుత్వం రద్దు చేయడంతో భారతీయ డ్రైవర్లు అక్కడి కోర్టులో సవాలు చేశారు. ప్రభుత్వ చర్య తమ జీవనాధారాన్ని ప్రమాదంలో పడేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. లైసెన్సు గడువు తేదీల్లో సమస్యలున్నట్లు కాలిఫోర్నియా రవాణా ఏజెన్సీ గుర్తించడంతో రద్దు నిర్ణయం తీసుకున్నారు. దీంతో దాదాపు 20 వేలమంది కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్సులపై ఈ ప్రభావం పడింది. రవాణా ఏజెన్సీ తప్పులే లైసెన్సుల రద్దుకు కారణమని డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. తప్పులను సరిదిద్ది, లైసెన్సులను పునరుద్ధరించాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.



రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మర్యాదపూర్వకంగా భేటీ అయిన ప్రధాని నరేంద్ర మోదీ

రేపు జలాంతర్గామిలో రాష్ట్రపతి ప్రయాణం

దిల్లీ: రాష్ట్రపతి, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపది ముర్ము (67) జలాంతర్గామిలో ప్రయాణించనున్నారు. ఈ నెల 28న కర్ణాటకలోని కార్వార్ హార్బర్ నుంచి ఆమె జలాంతర్గామిలో ప్రయాణించనున్నట్లు శుక్రవారం రాష్ట్రపతి భవన్ ప్రకటన చేసింది. దీంతో జలాంతర్గామిలో ప్రయాణించనున్న రెండో రాష్ట్రపతిగా ముర్ము నిలవనున్నారు. అంతకుముందు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 2006 ఫిబ్రవరి 13న విశాఖపట్నం నుంచి జలాంతర్గామిలో ప్రయాణించారు. శనివారం నుంచి నాలుగు రోజుల పాటు రాష్ట్రపతి ముర్ము గోవా, ఝార్ఖండ్, కర్ణాటకల్లో పర్యటించనున్నారు. మరోవైపు సంతాల్ భాషలో రాజ్యాంగాన్ని విడుదల చేయడం ప్రశంసనీయ ప్రయత్నమని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు.

ఏపీహెచ్‌సీ ఛైర్మన్ హోదా తొలగించిన మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్

శ్రీనగర్: మితవాద వేర్పాటువాద నాయకుడు, కశ్మీర్‌లోని ముస్లిం మత గురువు అయిన మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్ 'ఎక్స్‌'లోని తన అధికారిక ఖాతా వివరాల్లో నుంచి 'ఆల్ పార్టీస్ హురియత్ కాన్ఫరెన్స్ (ఏపీహెచ్‌సీ) ఛైర్మన్' అనే హోదాను తొలగించారు. దీనిపై ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. "నా నేతృత్వంలోని అవామీ యాక్షన్ కమిటీతో పాటు ఏపీహెచ్‌సీ అనుబంధ సంస్థలపై నిషేధం ఉన్న నేపథ్యంలో ఛైర్మన్ హోదాను తొలగించుకోవాలని అధికారులు ఒత్తిడి తెచ్చారు. ప్రస్తుతం ప్రజలతో మాట్లాడడానికి నాకున్న మార్గాల్లో 'ఎక్స్' వేదిక ఒకటే. దాంతో ప్రత్యామ్నాయం లేని పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకుంటున్నాను" అని పేర్కొన్నారు. దీనిపై నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తన్వీర్ సాదిక్ మాట్లాడుతూ.. అధికారులు ఒత్తిడి తెచ్చారని మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్ పేర్కొనడం సరికాదన్నారు.

యూపీ ఇస్లాం మతబోధకుడిపై హవాలా కేసు

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఇస్లాం మతబోధకుడు శంసుల్ హుదా ఖాన్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. పాకిస్థాన్‌కు చెందిన ఓ ఉగ్ర సంస్థతో సహా తీవ్రవాద ముఠాలతో సంబంధాలున్నాయనే అభియోగాలతో ఈ చర్యలు తీసుకున్నట్లు ఈడీ అధికారులు శుక్రవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఓ మదర్సాలో శంసుల్ 1984లో సహాయ ఉపాధ్యాయుడిగా చేరాడు. 2013లో బ్రిటిష్ పౌరసత్వం తీసుకున్నాడు. దీంతో బ్రిటన్‌కు వెళ్లిన అతడు.. మదర్సాలో విధులు నిర్వర్తించకపోయినా 2013-17 మధ్య జీతం తీసుకున్నాడు. గత 20ఏళ్లలో అనేక దేశాల్లో పర్యటించిన శంసుల్.. భారత్‌లోని పలు బ్యాంకుల్లో ఖాతాలు కొనసాగించాడని, వాటిని ఉపయోగించే నిధులు అందుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. అతడు దాదాపు రూ.30 కోట్ల విలువైన స్థిరాస్తులను కూడబెట్టినట్లు గుర్తించారు.

గుజరాత్‌లో 4.6 తీవ్రతతో భూకంపం

అహ్మదాబాద్: గుజరాత్‌లోని కచ్ జిల్లాలో శుక్రవారం ఉదయం 4.6 తీవ్రత కలిగిన భూకంపం సంభవించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. అయితే ఈ భూకంపం కారణంగా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టాలు నమోదు కాలేదని అధికారులు తెలిపారు. కచ్ జిల్లాలోని రాపార్ కేంద్రంగా సంభవించిన భూకంపం తెల్లవారుజామున 4.30 ప్రాంతంలో నమోదైంది.

అవినీతి కేసులో దోషిగా తేలిన మలేసియా మాజీ ప్రధాని

పుత్రజయ: అవినీతి కేసులో జైల్లో ఉన్న మలేసియా మాజీ ప్రధాని నజీబ్ రజాక్‌ను ఆ దేశ అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం దోషిగా తేల్చింది. మలేసియా అభివృద్ధికి ఉద్దేశించిన 1 మలేసియా డెవలప్‌మెంట్ బెర్హాత్(1 ఎండీబీ) నిధి నుంచి ఏకంగా 700 మిలియన్ డాలర్లను నజీబ్ రజాక్ వ్యక్తిగత ఖాతాలోకి తరలించినట్లు న్యాయస్థానం గుర్తించింది. 15 ఏళ్ల జైలు శిక్ష, 2.8 బిలియన్ డాలర్ల జరిమానా విధించింది. జరిమానాను చెల్లించకపోతే మరో పదేళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొంది. ఇదే కేసులో ఆయనకు హైకోర్టు గతంలో 12 ఏళ్ల కారాగార శిక్ష విధించడంతో ప్రస్తుతం ఆయన జైల్లోనే ఉన్నారు.

డాలస్‌లో భారతీయ అమెరికన్ విద్యార్థి అరెస్టు


హ్యూస్టన్: డాలస్‌లో మనోజ్ సాయి లేళ్ల(22) అనే భారతీయ అమెరికన్ విద్యార్థిని కొల్లిన్ కౌంటీ పోలీసులు అరెస్టు చేశారు. ఓ ప్రార్థనా స్థలంలో ఉద్దేశపూర్వకంగా అగ్నిప్రమాదానికి పాల్పడటం, ఉగ్ర బెదిరింపులకు దిగడంతో ఈ చర్య చేపట్టారు. నిందితుడు యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో చదువుతున్నాడు. అతడికి మానసిక స్థితి సరిగా లేదని కుటుంబ సభ్యులు చెప్పారు.

ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉన్న వారిలో ఎక్కువ మంది డెమోక్రాట్లే: డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: సంచలనం రేపిన ఎప్‌స్టీన్ సెక్స్ స్కాంకు చెందిన పత్రాలను అమెరికా న్యాయశాఖ విడుదల చేస్తున్న నేపథ్యంలో అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డెమోక్రాట్లపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎప్‌స్టీన్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని మరోసారి స్పష్టం చేసిన ట్రంప్, అందరూ దూరం పెట్టే ముందే తానే అతడితో సంబంధాలు తెంచుకున్నానని వ్యాఖ్యానించారు. ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేసిన క్రిస్మస్ సందేశంలో ట్రంప్ డెమోక్రాట్లను స్లీజ్‌బ్యాగ్స్ అంటూ తీవ్ర పదజాలంతో విమర్శించారు. ఒకప్పుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌ను గొప్ప వ్యక్తిగా పొగిడిన వారు, అతడి పార్టీలకు హాజరైన వారు, అతడి దీవికి వెళ్లిన వారు, వివాదాలు మొదలైన తర్వాత మాత్రం అతడిని కుక్కలా వదిలేశారంటూ మండిపడ్డారు. ఇప్పుడు తమకు ఎప్‌స్టీన్‌తో ఎలాంటి పరిచయం లేదని అబద్ధాలు చెబుతూ చివరకు తనపై నిందలు వేస్తున్నారని ట్రంప్ ఆరోపించారు. ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉన్న వారిలో ఎక్కువ మంది డెమోక్రాట్లేనని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఒక్క రిపబ్లికన్ మాత్రమే ఉన్నారని తెలిపారు.

తప్పుడు కథనాలు ప్రచారం చేస్తోంది: మీడియాపైనా ట్రంప్ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా న్యూయార్క్ టైమ్స్‌ను లక్ష్యంగా చేసుకుని ఫెయిలింగ్ న్యూయార్క్ టైమ్స్ అంటూ విమర్శించారు. గతంలో రష్యా కుట్ర ఆరోపణల విషయంలో తప్పుదోవ పట్టించే కథనాలు ప్రచురించిందని, ఆ కారణంగా ఆ పత్రిక క్షమాపణ చెప్పాల్సి వచ్చిందని, అనేక మంది సభ్యులను కూడా కోల్పోయిందని ట్రంప్ ఆరోపించారు. ఇప్పుడు కూడా అదే తీరులో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తోందని ఆయన అన్నారు.

పుట్టగొడుగుల సాగుతో
పారిశ్రామికవేత్తగా..



హరియాణాకు చెందిన ఓ రైతు ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా ఎదిగారు. మోర్నిలోని బదియాల్‌కు చెందిన వీరేంద్ర బజ్వాన్.. గనోడెర్మా అనే రకం పుట్టగొడుగుల సాగుద్వారా భారీగా ఆదాయం గడిస్తున్నారు. గనోడెర్మా పుట్టగొడుగులను శతాబ్దాలుగా ఔషధాల్లో వాడుతున్నారు. అవి పాడైపోయిన కలపలో పెరుగుతాయి. అందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్-డి, ప్రొటీన్ వంటి అనేక పోషకాలుంటాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని సోలన్‌లో ఉన్న పుట్టగొడుగుల పరిశోధన డైరెక్టరేట్‌లో బజ్వాన్ శిక్షణ పొంది గనోడెర్మా పుట్టగొడుగల సాగు ప్రారంభించారు. అనతి కాలంలోనే ఆదాయంతోపాటు జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని గడించారు. ఆయన 'వీఎండబ్ల్యూ న్యూట్రాస్యూటికల్స్' అనే కంపెనీని స్థాపించి సరికొత్త సాంకేతికతలను వినియోగిస్తున్నారు. గనోడెర్మా పుట్టగొడుగుల నుంచి హెర్బల్ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. -ఈటీవీ భారత్

త్రీడీ విధానంలో గర్భాశయాంతస్తర సృష్టి

దిల్లీ: గర్భాశయాంతస్తరానికి (ఎండోమెట్రియానికి) పిండం సరిగా అతుక్కోకపోవడం.. తొలినాళ్లలోనే గర్భవిచ్ఛిత్తి జరగడానికి ప్రధాన కారణాల్లో ఒకటి. అయితే ఎండోమెట్రియానికి అది నాటుకునే ప్రక్రియను శాస్త్రవేత్తలు ఇప్పటివరకూ పూర్తిస్థాయిలో అర్థం చేసుకోలేకపోయారు. ఆ సవాలును అధిగమించేలా బ్రిటన్‌లోని బాబ్రహం ఇన్‌స్టిట్యూట్, అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు తాజాగా గర్భాశయ లోపలి పొర ప్రతిరూపాన్ని.. దాతల నుంచి సేకరించిన ఎపిథీలియల్ కణాలు, స్ట్రోమల్ కణాలను ఉపయోగిస్తూ త్రీడీ విధానంలో సృష్టించారు. సాధారణంగా శుక్రకణం, అండం కలిసిన (ఫలదీకరణ) వారం రోజుల తర్వాత.. గర్భాశయాంతస్తర కణజాలానికి ఆ పిండం అతుక్కుంటుంది. ఆ ప్రక్రియను క్షుణ్నంగా విశ్లేషించడానికి త్రీడీ ప్రతిరూపం ఉపయోగపడనుంది. నమూనా ఎండోమెట్రియంపై అధ్యయనం ద్వారా గుర్తించిన అంశాలతో.. ఐవీఎఫ్ విధానాన్ని మరింత విజయవంతంగా మార్చొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

తిరువనంతపురం మేయర్ పీఠం భాజపాదే

తిరువనంతపురం: కేరళలో తొలిసారిగా మేయర్ పీఠాన్ని దక్కించుకొని భాజపా చరిత్ర సృష్టించింది. తిరువనంతపురం మేయర్‌గా కమలం పార్టీకి చెందిన వి.వి.రాజేశ్ ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈ కార్పొరేషన్‌లోని మొత్తం 101 వార్డులకుగాను 50 స్థానాల్లో భాజపా కౌన్సిలర్లు గెలిచిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం మేయర్ పదవికి ఎన్నిక నిర్వహించగా, ఓ స్వతంత్ర కౌన్సిలర్ మద్దతుతో రాజేశ్ విజేతగా నిలిచారు. దీంతో సుమారు నాలుగు దశాబ్దాలుగా మేయర్ పదవిలో కొనసాగుతున్న ఎల్డీఎఫ్ కూటమికి ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నిక అనంతరం రాజేశ్ మేయర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి సురేశ్ గోపి, కేరళ భాజపా అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ హాజరయ్యారు.

మూడు దశాబ్దాల తర్వాత గుజరాత్‌లో పులి దర్శనం

అహ్మదాబాద్: దాదాపు మూడు దశాబ్దాల అనంతరం గుజరాత్‌లో పులి దర్శనమిచ్చిందని నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ నిర్ధారించింది. దీంతో పులి సంచరిస్తున్న రాష్ట్రాల జాబితాలో గుజరాత్ తిరిగి చేరిందని ఉపముఖ్యమంత్రి హర్ష్ సంఘవి శుక్రవారం ప్రకటించారు. పిల్లి జాతికి చెందిన మూడు ముఖ్య వన్యప్రాణులైన సింహం, పులి, చిరుతపులులు కలిగివున్న రాష్ట్రంగా గుజరాత్ నిలిచిందని ఆయన అన్నారు. అటవీశాఖ రికార్డుల ప్రకారం గుజరాత్‌లో పులులు 36 సంవత్సరాల క్రితం 1989లోనే అంతరించిపోయాయి. అడవుల్లో సంచరిస్తున్న ఒక పులి దాహోడ్‌లోని రతన్‌మహల్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో దర్శనమిచ్చిందని, ఇప్పుడు ఆ ప్రాంతాన్ని పులి తన నివాస ప్రాంతంగా మార్చుకుందని అటవీశాఖ అధికారులు వెల్లడించారు.

'టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ విలేజ్'



బిహార్‌లోని గయా జిల్లా జమాల్‌పుర్‌లో వందకు పైగా గడపలు ఉండగా.. టెలికం శాఖలో పనిచేస్తున్న, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఈ గ్రామంలో దాదాపు 80 మంది ఉన్నారు. వీరంతా లైన్ మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, టెక్నీషియన్లు.. ఇలా వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. అందుకే ఈ గ్రామాన్ని 'టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ విలేజ్' అని పిలుస్తారు. 1950లో జమాల్‌పుర్‌కు చెందిన భోలా పాసవాన్ టెలిఫోన్ డిపార్ట్‌మెంటు ఉద్యోగంలో మొదట చేరారు. గ్రామంలో నిరుద్యోగాన్ని తగ్గించేందుకు పూనుకొన్న ఆయన తమ శాఖలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక యువతను ప్రోత్సహించారు. ప్రభుత్వ ఉద్యోగాలతో ఓ గ్రామం మొత్తానికి జీవనాధారం చూపిన భోలా పాసవాన్ నేడు భౌతికంగా లేకున్నా, జమాల్‌పుర్ గ్రామస్థులు ఆయన్ను ఎప్పటికీ మర్చిపోరు. -ఈటీవీ భారత్

పాన్‌మసాలా ప్రకటన కేసులో సల్మాన్‌కు కోర్టు సమన్లు

కోటా: తప్పుదోవ పట్టించేలా చిత్రీకరించిన ఒక పాన్‌మసాలా వాణిజ్య ప్రకటన కేసుకు సంబంధించి రాజస్థాన్‌లోని కోటాకు చెందిన వినియోగదారుల కోర్టు బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ తన సమక్షంలో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది. ఈ అంశంపై తదుపరి విచారణను వచ్చే నెల 20కి వాయిదా వేసింది. పాన్ మసాలా వాణిజ్య ప్రకటన ద్వారా రాజశ్రీ పాన్ మసాలా, సల్మాన్‌ఖాన్‌లు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు భాజపానేత, న్యాయవాది ఇంద్రా మోహన్‌సింగ్ హనీ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కోటా వినియోగదారుల కోర్టు సల్మాన్‌ఖాన్ వ్యక్తిగత హాజరీకి ఆదేశాలు జారీ చేసింది.

కోర్టులు బహుముఖ వివాద పరిష్కార కేంద్రాలు కావాలి: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



పణజీ: న్యాయస్థానం అంటే కేవలం విచారణ జరిగే స్థలంగా కాక వివాదాల సమగ్ర పరిష్కారానికి అనేక ద్వారాలు తెరచివున్న కేంద్ర స్థానంగా మారాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ శుక్రవారం ఆకాంక్షించారు. దక్షిణ గోవాలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మధ్యవర్తిత్వంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లా స్థాయి నుంచి సుప్రీంకోర్టు వరకూ అన్ని దశల్లో మధ్యవర్తిత్వం నిర్వర్తించే వారి సంఖ్య పెరగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. దీని వల్ల పెండింగ్ కేసుల సంఖ్య తగ్గుతుందని పేర్కొన్నారు. చట్టం బలహీనమైందనడానికి నిదర్శనంగా మధ్యవర్తిత్వాన్ని చూడకూడదని, చట్టం అత్యున్నత స్థాయికి పరిణామం చెందిందనడానికిది సూచిక అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. "వ్యాజ్యం అంటే మృత శరీరానికి శవపరీక్ష చేయడం లాంటిది. ఎందుకు మరణం సంభవించిందన్నది విచారించడమే దాని పని. మధ్యవర్తిత్వం రోగ పరిష్కారం కోసం చేసే శస్త్రచికిత్స లాంటిది. అది అనుబంధాలను సజీవంగా ఉంచుతుంది" అని సీజేఐ అన్నారు.

అది యావద్దేశానికీ విషాదం

గోవాలో ఇటీవల ఒక నైట్‌క్లబ్బు అగ్ని ప్రమాదానికి గురై 25 మంది ప్రాణాలు కోల్పోవడం యావద్దేశానికి పెను విషాదం అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల దురుపయోగంపై జరుగుతున్న 30 రోజుల ప్రచారంలో భాగంగా బాంబే హైకోర్టు గోవా బెంచిలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ ప్రధాన న్యాయమూర్తి ఈ మాటలన్నారు.

భయపడం.. సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం

- ఉన్నావ్ అత్యాచార బాధితురాలు

దిల్లీ: ఉన్నావ్ అత్యాచార ఘటన కేసులో దోషిగా తేలి, జీవిత ఖైదు అనుభవిస్తోన్న భాజపా మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగర్ శిక్ష నిలిపివేయడంతో తాను భయపడటం లేదని బాధితురాలు తెలిపారు. సుప్రీంకోర్టుపై తనకు అపారమైన విశ్వాసం ఉందని ఆమె పేర్కొన్నారు. అయితే దోషికి బెయిల్ ఇవ్వడంతో తన కుటుంబ భద్రత ప్రమాదంలో పడిందని, తన భర్త ఉద్యోగం కోల్పోయాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'సుప్రీంకోర్టుకు వెళతాం. గతంలో సర్వోన్నత న్యాయస్థానం నాకు న్యాయం చేసింది. మళ్లీ చేస్తుందన్న విశ్వాసం ఉంది'' అని ఆమె పేర్కొన్నారు. దోషి సెంగర్‌కు శిక్ష నిలిపివేయడాన్ని తప్పుబడుతూ దిల్లీ హైకోర్టు ముందు శుక్రవారం కొందరు ఆందోళనకు దిగారు. 'అత్యాచారం చేసిన వారికి రక్షణ కల్పించడం మానేయాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. నినాదాలు చేశారు. ఈ నిరసనల్లో అత్యాచార బాధితురాలు, ఆమె తల్లి, సామాజిక కార్యకర్త యోగితా భయానాతోపాటు ఐద్వాకు చెందిన మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

✦ దోషి సెంగర్‌కు ట్రయల్ కోర్టు విధించిన యావజ్జీవ ఖైదును నిలిపివేస్తూ దిల్లీ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను శుక్రవారం సీబీఐ.. సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ మేరకు స్పెషల్ లీవ్ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఇందులో సెంగర్‌కు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులపైనా అభ్యంతరం వ్యక్తంచేసింది.

కుమారుడు క్రూరుడైనా తల్లికి మారాజే

- పంజాబ్ హరియాణా హైకోర్టు వ్యాఖ్య


చండీగఢ్: ఒక ఐదేళ్ల బాలికపై అత్యాచారం జరిపి హత్య చేసిన కేసులో నిందితునికి మరణశిక్ష విధిస్తూ కిందిస్థాయి కోర్టు వెలువరించిన తీర్పును పంజాబ్ హరియాణా హైకోర్టు.. యావజ్జీవ కఠిన కారాగార శిక్షగా మార్చింది. నిందితుణ్ని రక్షించడానికి ప్రయత్నించిన అతని తల్లిని నిర్దోషిగా ప్రకటించింది. తన కుమారుణ్ని కాపాడుకోవడానికి ప్రయత్నించిన తల్లిని శిక్షించే సెక్షన్ ఏదీ ఐపీసీలో లేదని జస్టిస్ అనూప్ చిత్కర, జస్టిస్ సుఖ్విందర్ కౌర్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. నిందితుడు ఎంతటి క్రూరుడైనా తన తల్లికి రాజా బేటా (మారాజు)యేనని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. "జరిగిన నేరాన్ని పోలీసులకు తెలియజేయకుండా ఆమె కుమారుణ్ని రక్షించడానికే ప్రాధాన్యతనిచ్చారు. దారుణమైన ఈ సామాజిక ప్రవృత్తి కొత్తదేమీ కాదు. మగపిల్లలకు ప్రాధాన్యతనిచ్చే పితృస్వామ్య భావజాలం కలిగివున్న ఈ ప్రాంతపు సంస్కృతిలో ఇది భాగం" అని న్యాయమూర్తులు అన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో దాడికి కుట్ర

- తుర్కియేలో ఐఎస్ సభ్యుడి అరెస్టు

ఇస్తాంబుల్: నూతన సంవత్సర వేడుకల్లో దాడికి కుట్ర పన్నిన ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) సభ్యుడిని అదుపులోకి తీసుకున్నట్లు తుర్కియే అధికారులు వెల్లడించారు. ఆగ్నేయ నగరం మలత్యాలో పోలీసులు, జాతీయ నిఘా సంస్థ నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో ఇబ్రహీం బుర్తాకుసిన్ అనే వ్యక్తి పట్టుబడినట్లు తెలిపారు. తుర్కియేలోని ఐఎస్ సానుభూతిపరులతో పాటు విదేశీయులతో బుర్తాకుసిన్‌కు సంబంధాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

శ్మశానవాటిక నుంచి చితాభస్మం చోరీ!




ఈటీవీ భారత్: హిమాచల్ ప్రదేశ్‌లోని జిల్లా కేంద్రం సోలన్‌లో గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని చిత్రమైన చోరీ జరిగింది. పట్టణానికి చెందిన ఓ మహిళ పది రోజుల క్రితం మృతిచెందారు. కర్మకాండల అనంతరం హరిద్వార్‌కు వెళ్లి ఆమె చితాభస్మాన్ని గంగలో కలిపేందుకు స్థానిక చంబాఘాట్ శ్మశానవాటికలో కుటుంబసభ్యులు భద్రపరిచారు. గుర్తుతెలియని వ్యక్తులు లాకర్ పగులగొట్టి చితాభస్మాన్ని మాయం చేశారు. మృతురాలి కుమారుడు కమల్‌పాల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. గురువారం చితాభస్మం కోసం వెళ్లి చూసి షాక్‌కు గురయ్యామని, ఈ ఘటన తమ కుటుంబాన్ని తీవ్ర మనోవేదనకు గురిచేసిదని కమల్‌పాల్ తెలిపారు. శ్మశానవాటిక పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు సోలన్ ఎస్పీ గౌరవ్‌సింగ్ వెల్లడించారు.

జపాన్‌లో కత్తి, రసాయన దాడి..

- 15 మందికి గాయాలు

టోక్యో: జపాన్‌లోని మిషిమా నగరంలో ఓ వ్యక్తి కలకలం సృష్టించాడు. ఓ రబ్బరు పరిశ్రమలో 8 మందిని కత్తితో పొడిచి గాయపరిచాడు. ఈ క్రమంలోనే అతడు రసాయనం చల్లడంతో మరో ఏడుగురికి గాయాలయ్యాయి. కత్తి దాడికి గురైన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. నిందితుడిని 38 ఏళ్ల వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. దాడికి కారణాలను వెల్లడించలేదు.

త్వరలో వ్యవస్థీకృత నేరాల పనిపడతాం: షా



దిల్లీ: వ్యవస్థీకృత నేరాలకు సంబంధించిన వివరాల సంకలనంతోపాటు దోపిడీకి గురైన, పోగొట్టుకున్న, తిరిగి లభ్యమైన ఆయుధాల డేటాబేస్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం విడుదల చేశారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) నిర్వహించిన ఒక కార్యక్రమంలో విడుదల చేసిన ఈ వివరాలు దేశంలోని పోలీసు బలగాలకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. రానున్న రోజుల్లో వ్యవస్థీకృత నేరాలపై సంపూర్ణ దాడి చేపట్టబోతున్నామని అమిత్ షా అన్నారు. ఎన్ఐఏ ఏర్పాటు చేసిన ఉగ్రవాద వ్యతిరేక సదస్సు-2025లో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నేర విచారణ మాన్యువల్‌ను కూడా విడుదల చేశారు. వ్యవస్థీకృత నేరగాళ్లకు ఉగ్రవాదులకు మధ్య సంబంధం ఉందని షా నొక్కిచెప్పారు. దేశ వ్యాప్తంగా ఏకరూప ఉగ్రవాద వ్యతిరేక స్క్వాడ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని స్థాయుల్లో ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు సత్వరం స్పందించే బలమైన ఉగ్రవాద వ్యతిరేక గ్రిడ్ ఏర్పాటు కావాలని ఆయన అన్నారు. దిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో 40 కిలల పేలుడు పదార్థాలు వాడినట్లు అమిత్ షా వెల్లడించారు. ఈ కేసులో జమ్మూ కశ్మీర్ పోలీసుల అద్భుతమైన దర్యాప్తు జరిపారని, పేలుడుకు ముందే మూడు టన్నుల పదార్థాలను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. దిల్లీ ఘటనకు ముందే కుట్రలో పాల్గొన్న వారందర్నీ అరెస్టు చేశారన్నారు.

ఫ్లోరిడాలో రేపు ట్రంప్, జెలెన్‌స్కీ భేటీ

కీవ్: దాదాపు నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించేందుకు తీవ్రస్థాయిలో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఫ్లోరిడాలో ఆదివారం భేటీ కానున్నారు. ఈ విషయాన్ని జెలెన్‌స్కీ శుక్రవారం వెల్లడించారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్‌కు కల్పించాల్సిన భద్రతా హామీల అంశాన్ని లేవనెత్తుతానని చెప్పారు. ముఖ్యంగా 20-సూత్రాల ప్రణాళికపై చర్చిస్తామని, ఇది దాదాపు 90 శాతం సిద్ధమైందని తెలిపారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్, అమెరికా మాత్రమే కాకుండా ఐరోపా దేశాలూ పాలుపంచుకోవాలని తాను భావిస్తున్నట్లు చెప్పారు. కానీ ఇంత తక్కువ వ్యవధిలో అది సాధ్యం కాకపోవచ్చని చెప్పారు. మరోవైపు అమెరికా ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై ఆ దేశ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు కుష్నర్‌లతో భేటీ ఆశాజనకంగా జరిగిందని జెలెన్‌స్కీ చెప్పారు. వీరితో చర్చల అనంతరం ఎక్స్ వేదికగా మాట్లాడిన జెలెన్‌స్కీ, ఉక్రెయిన్‌లో శాశ్వత శాంతికి దారి తీసే కీలక అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఉక్రెయిన్ భద్రత, పునర్నిర్మాణం, శాశ్వత శాంతి ఇవే ఉక్రెయిన్, అమెరికా, యూరప్ సహా మిత్రదేశాలు సాధించాల్సిన లక్ష్యాలన్నారు. శాంతి ఒప్పందానికి సంబంధించిన కొన్ని పత్రాలు పూర్తిగా సిద్ధమయ్యాయని, మరికొన్ని తుది దశకు చేరుకున్నాయన్నారు. ఇంకా కొన్ని అత్యంత సున్నితమైన అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు.

ప్రపంచంలోకెల్లా అతిసూక్ష్మ, స్వతంత్ర రోబోల సృష్టి!



ఈటీవీ భారత్: బుల్లి రోబోల తయారీలో అమెరికాలోని పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం, మిషిగన్ యూనివర్సిటీల పరిశోధకులు తాజాగా చరిత్ర సృష్టించారు! ప్రపంచంలోకెల్లా అత్యంత సూక్ష్మ పరిమాణంలోని స్వతంత్ర రోబోలను వారు సృష్టించారు. ఇవి 200×300×50 మైక్రోమీటర్ల పరిమాణంలో ఉంటాయి. కాంతి ద్వారా శక్తిని పొందే ఈ చిట్టి రోబోలు స్థానిక ఉష్ణోగ్రతలను పసిగట్టి ముందుకు కదులుతాయి. కణాల ఆరోగ్యాన్ని పర్యవేక్షించే సామర్థ్యం వీటి సొంతం. అతిచిన్న సాధనాలను రూపొందించడంలో ఇవి కీలకంగా మారనున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. న్యూటన్ మూడో గమన నియమం ఆధారంగా.. ఈ రోబోలు తమ చుట్టుపక్కల ఉండే ద్రావణంలో విద్యుత్ క్షేత్రాన్ని సృష్టిస్తాయి. తద్వారా నీటి అణువులను నెట్టి ముందుకు కదులుతాయి. ఎల్ఈడీ కాంతితోనూ ఇవి ఛార్జింగ్ అయ్యే వీలుంది. వీటిలో ఎలక్ట్రానిక్ సెన్సర్లు ఉంటాయి. తక్కువ ఓల్టేజీ వద్ద పనిచేసే ఈ రోబోల తయారీకి అయ్యే ఖర్చు కూడా తక్కువేనని పరిశోధకులు తెలిపారు.



మాఘమేళా పురస్కరించుకొని ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో గంగా నది ఒడ్డున ఏర్పాటు చేసిన తాత్కాలిక గుడారాలు

కంబోడియా గ్రామంపై థాయ్‌లాండ్ బాంబుదాడి

బ్యాంకాక్: థాయ్‌లాండ్, కంబోడియా దేశాల మధ్య సరిహద్దు వెంబడి శుక్రవారం సాయుధ పోరాటం కొనసాగింది. మరోవైపు ఈనెల ప్రారంభంలో ఇరుదేశాల మధ్య మొదలైన కాల్పుల్ని విరమించేందుకు చర్చలు కూడా కొనసాగాయి. థాయ్‌లాండ్ తమ దేశంలోని బంటియె మియంచే రాష్ట్రంలో ఉన్న ఒక గ్రామంపై ఎఫ్-16 యుద్ధవిమానాల సాయంతో 40 బాంబులు వేసిందని కంబోడియా రక్షణ శాఖ ఆరోపించింది. ఈ దాడి వల్ల కలిగిన ఆస్తి, ప్రాణ నష్టాలపై ఎలాంటి సమాచారం వెంటనే తెలియలేదు. తాము ఈ దాడికి పాల్పడిన విషయం వాస్తవమేనని థాయ్‌లాండ్ ధ్రువీకరించింది. సాకేవో రాష్ట్ర రక్షణ కోసం ఈ దాడి చేయక తప్పలేదని థాయ్‌లాండ్ సైన్యం పేర్కొంది. చిరకాలంగా ఇరుదేశాల నెలకొన్న సరిహద్దు వివాదం గత జులైలో బహిరంగ యుద్ధానికి దారితీసింది. ఇరుదేశాల మధ్య రాజీకై మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం మధ్యవర్తిత్వం నడిపారు. తదనంతర పరిణామాల నేపథ్యంలో కాల్పుల విమరణ కుదిరినా తాజాగా పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

స్త్రీశక్తి బస్సుల్లో కండక్టర్లకు పవర్ బ్యాంకులు

- ఈ బస్సుల జీపీఎస్ ట్రాకింగ్‌కు అవకాశం

ఈనాడు, అమరావతి: స్త్రీశక్తి బస్సుల్లో విధులకు వెళ్లే కండక్టర్ల ఈపోస్ యంత్రాలతోపాటు, అదనంగా పవర్ బ్యాంకులు ఇవ్వనున్నారు. ఈ మేరకు యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న ఈపోస్ యంత్రాల బ్యాటరీ సామర్థ్యం 3,300 ఎంఏహెచ్ గా ఉంది. స్త్రీశక్తి పథకం అమలు చేస్తున్న ఐదు రకాల బస్సుల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటోంది. దీనివల్ల టికెట్ల జారీకే బ్యాటరీ సామర్థ్యం సరిపోతోంది. రియల్‌టైమ్ జీపీఎస్ ట్రాకింగ్ చేయలేకపోతున్నారు. ఈ రెండింటికీ కలిపి వినియోగిస్తే. .బ్యాటరీ ఛార్జింగ్ త్వరగా అయిపోతోంది. దీంతో జీపీఎస్ ట్రాకింగ్ కూడా ఉండేలా చూసేందుకు 20 వేల ఎంఏహెచ్ సామర్థ్యంతో ఉన్న 17,880 పవర్ బ్యాంక్స్ కొని, కండక్టర్లకు అందజేయాలని నిర్ణయించారు. గుంటూరు-1 డిపోలో వీటిని ప్రయోగాత్మకంగా అమలు చేయగా, ఆ బ్యాటరీ బ్యాకప్ బాగున్నట్లు గుర్తించారు. దీంతో అన్ని డిపోల్లోని స్త్రీశక్తి పథకం అమలవుతున్న బస్సుల్లో కండక్టర్లకు ఈ పవర్ బ్యాంకులు ఇవ్వనున్నారు.

11 పురపాలికల్లో ప్రత్యేక అధికారుల పాలన పొడిగింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వివిధ కారణాలతో ఎన్నికలు నిర్వహించని పదకొండు పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో కందుకూరు, ఆమదాలవలస, నరసరావుపేట, పొన్నూరు, కావలి, శ్రీకాళహస్తి, చింతలపూడి, వైఎస్ఆర్ తాడిగడప, పొదిలి, అల్లూరు, బి.కొత్తకోట పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు ఉన్నాయి. ఆయాచోట్ల ప్రత్యేక అధికారుల పదవీకాలం ముగియడంతో మరోసారి పొడిగించారు.

ఈ నెల 30న రూ.4,000 కోట్ల రుణ సమీకరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రూ.4,000 కోట్ల రుణం సమీకరించనుంది. ఈ నెల 30న రిజర్వుబ్యాంకు నిర్వహించే సెక్యూరిటీల వేలంలో పాల్గొని ఈ మొత్తం రుణంగా స్వీకరించనుంది. వేర్వేరుగా రూ.1,000 కోట్ల చొప్పున 9, 10, 12, 17 ఏళ్ల కాలపరిమితితో తిరిగి తీర్చేలా ఈ అప్పు తీసుకుంటున్నారు. ఎంత వడ్డీకి ఈ రుణం లభిస్తుందనేది డిసెంబర్ 30న ఖరారవుతుంది.

అందరికీ పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలి

- ఆర్టీసీ ఎండీకి ఎన్ఎంయూఏ వినతి

ఈనాడు, అమరావతి: సంస్థ పరంగా, ప్రభుత్వ పరంగా ఆర్టీసీ ఉద్యోగులకు ఉన్న సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) కోరింది. క్రమశిక్షణ చర్యల నుంచి మినహాయింపు ఇచ్చి, అన్ని కేటగిరీల ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలని, ఎస్ఆర్‌బీఎస్‌ను పునరుద్ధరించాలని, ఆర్టీసీలో గతంలో ఉన్న వైద్య విధానం అమలు చేయాలని, ప్రత్యేక బదిలీల పాలసీ తీసుకురావాలని పేర్కొంది. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం పొందిన ఆర్టీసీ సంఘాలతో ఉద్యోగుల సమస్యలపై డిపో, జిల్లా, జోన్, రాష్ట్రస్థాయిల్లో సంయుక్త సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరింది. ఇటీవల జరిగిన యూనియన్ మహాసభలో చేసిన తీర్మానాల ప్రతిని ఆర్టీసీ ఎండీకి శుక్రవారం అందజేసినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.శ్రీనివాసరావు, పీవీ రమణారెడ్డి తెలిపారు.

ఆలయాలపై వైకాపా విషప్రచారం

- తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్‌సూర్య

ఈనాడు, అమరావతి: ఆలయాలపై వైకాపా నాయకులు రోజుకో విషప్రచారం చేస్తున్నారని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్‌సూర్య మండిపడ్డారు. ఆలయాల్లో రద్దీని కూటమి ప్రభుత్వం సమర్థంగా నిర్వహిస్తుంటే తట్టుకోలేక...సొంత పత్రిక ద్వారా తొక్కిసలాటలు, ప్రభుత్వ నిర్లక్ష్యం అని వైకాపా నేతలు తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

పేదల గొంతుకగా నిలిచిన గొప్ప నాయకుడు వంగవీటి రంగా: జగన్

ఈనాడు, అమరావతి: పేద ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, వారి గొంతుకగా నిలిచిన గొప్ప నాయకుడు వంగవీటి మోహనరంగా అని మాజీ ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. రంగా వర్ధంతి సందర్భంగా ఆయన 'ఎక్స్'లో నివాళులు అర్పించారు.



వీర్‌బాల్ దివస్ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఇతర ప్రతినిధులు

భాజపా కార్యాలయంలో 'వీర్ బాల్ దివస్'

ఈనాడు, అమరావతి: సిక్కుల పదో గురువు గురు గోవింద్ సింగ్ కుమారులు ఫతేసింగ్, జోరావర్ సింగ్‌ల బలిదానం దేశం, ధర్మంపై వారికి ఉన్న గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం వీర్ బాల్ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఎఫ్‌బీఎస్ స్కూల్ డైరెక్టర్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విపత్తులకు రాజకీయ నిర్ణయాలూ కారణమే

- శిలాజ ఇంధన వినియోగం తగ్గించాలి
- 2025లో భారత్‌లో 2,277 వరదలు, ఆకస్మిక వర్షాల ఘటనలు
- 'కౌంటింగ్ ది కాస్ట్' నివేదికలో వెల్లడి



ఈనాడు, హైదరాబాద్: ఆకస్మిక వాతావరణ మార్పులు, ప్రకృతి విపత్తులకు రాజకీయ నిర్ణయాలూ కారణమవుతున్నాయని క్రిస్టియన్ ఎయిడ్ సంస్థ అభిప్రాయపడింది. మానవ తప్పిదాలతో పాటు శిలాజ ఇంధన వినియోగాన్ని పెంచడంపై తీసుకుంటున్న రాజకీయ నిర్ణయాలు ముఖ్యకారణమవుతున్నాయని ఆ సంస్థ విడుదల చేసిన 'కౌంటింగ్ ది కాస్ట్-2025' నివేదిక స్పష్టం చేసింది. 2025 ఏడాదికి టాప్-10 ప్రకృతి విపత్తులతో దాదాపు 120 బిలియన్ డాలర్ల నష్టం జరిగిందని, వేల మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు నిరాశ్రయులయ్యారంది. వాస్తవిక గణాంకాలు తీసుకుంటే తీవ్రత ఇంకా ఎక్కువగా ఉంటుందని వెల్లడించింది. వాతావరణ మార్పులతో భూతాపం ఒక్క డిగ్రీ పెరిగితే రుతుపవనాల వర్షాలు 5 శాతం పెరిగి ఆకస్మిక వరదలతో ఆర్థిక, ప్రాణ నష్టం సంభవిస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. శిలాజ ఇంధన వనరులైన బొగ్గు, చమురు, సహజ వాయువు వినియోగాన్ని తగ్గించి, పునరుత్పాద ఇంధన వనరుల వాడకం పెంచాలని చెప్పింది. వాతావరణ మార్పులపై ప్రపంచ నాయకత్వం తక్షణమే స్పందించి.. విపత్తులను తగ్గించేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించింది.

దేశంలో 8% ఎక్కువ వర్షపాతం

ఈ ఏడాది జూన్-సెప్టెంబరు వరకు దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. హిమనీ నదాలు వేగంగా కరగడంతో నదులు ఉప్పొంగాయి. పంట పొలాలు, పట్టణాలు నీట మునిగాయి. కొన్నిచోట్ల గ్రామాలు చెల్లాచెదురయ్యాయి. 860 మంది వరకు చనిపోయినట్లు అంచనా. రుతుపవనాల సీజన్ ఈ ఏడాది మే నుంచి ప్రారంభమైంది. సెప్టెంబరు నాటికి దేశవ్యాప్తంగా సగటు కన్నా 8 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో 2,277 వరదలు, ఆకస్మిక వర్షాల ఘటనలు నమోదయ్యాయి. అధిక వర్షాలు వ్యవసాయం, మౌలిక సదుపాయాలపై తీవ్ర ప్రభావం చూపించాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో 18 శాతం ఉన్న వ్యవసాయ ఉత్పాదకత ఈ సీజన్‌లో తగ్గిపోయింది. మానవ తప్పిదాలతో జరుగుతున్న వాతావరణ మార్పులతో ఈ విపత్తులు జరుగుతున్నాయని వాతావరణ నిపుణులు నివేదికలో వెల్లడించారు.

ఇవీ టాప్-3 ఘటనలు..

- అమెరికా కాలిఫోర్నియాలో పాలిసేడ్స్, ఈటన్ అడవుల కార్చిచ్చుతో 60 బిలియన్ల నష్టంతో పాటు 400 మంది ప్రాణాలు కోల్పోయారు.
- నవంబరులో ఆగ్నేయాసియాలో సంభవించిన వరదలతో థాయ్‌లాండ్, ఇండోనేషియా, శ్రీలంక, వియత్నాం, మలేసియాలో 1,750 మంది ప్రాణాలు కోల్పోయారు. నష్టం విలువ 25 బిలియన్ డాలర్లు.
- ఈ ఏడాది చైనాలో సంభవించిన ఆకస్మిక వరదలతో వేల మంది నిరాశ్రయులయ్యారు. 11.7 బిలియన్ డాలర్ల నష్టం జరిగింది. దాదాపు 30 మంది చనిపోయారు.

సచివాలయాల్లో ఉండాల్సిందే!

- రోజూ హాజరు తప్పనిసరి
- సిబ్బంది గైర్హాజరుపై దృష్టి
- ప్రభుత్వ ఆదేశాలతో చర్యలు ప్రారంభించిన సచివాలయాలశాఖ

ఈనాడు, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఇక తప్పనిసరిగా విధులకు హాజరు కావలసిందే. అధికారులు చెప్పారని అనధికార డిప్యుటేషన్లపై ఇతర కార్యాలయాల్లో పని చేయడం, క్షేత్రస్థాయి పరిశీలన, పనుల పర్యవేక్షణ పేరుతో బయటకు వెళ్లడం ఇక కుదరదు. నిర్దేశించిన సమయంలోగా యాప్‌లో రోజూ హాజరు వేయాల్సిందే. రీ సర్వేలో పాల్గొంటున్న కొందరు సర్వేయర్లకు మినహా మిగిలిన వారెవరికీ మినహాయింపు లేదు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడం తప్పనిసరి అనుకుంటే అధికారుల అనుమతి తప్పనిసరి. రాష్ట్ర సచివాలయాలశాఖ ఈ మేరకు చర్యలు చేపట్టింది. ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో గ్రామ, వార్డు సచివాలయాల పని తీరుపై జరిగిన చర్చలో సిబ్బంది తీరుపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న సమాచారంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని తీవ్రంగా పరిగణించాలన్న సీఎం ఆదేశాలతో అధికారులు చర్యలు చేపట్టారు.

అనధికార డిప్యుటేషన్లు రద్దు

- గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో అనధికార డిప్యుటేషన్లపై ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్నారు. వీటిని గుర్తించి సచివాలయాలశాఖ రద్దు చేసింది.
- రీసర్వేలో పాల్గొంటున్న సర్వేయర్లు తప్పితే మిగిలిన సిబ్బంది విధిగా సచివాలయాలల్లో పని చేయాల్సిందే. సర్వేయర్లలోనూ అందరికీ మినహాయింపు లేదు. జాయింట్ కలెక్టర్ సూచించిన వారికే వెసులుబాటు ఉంది. వీరు కూడా తాము రీసర్వే చేస్తున్న ప్రాంతంలో యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలి.



పర్యవేక్షణకు అధికారులు

- సచివాలయాలపై మూడు దశల పర్యవేక్షణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. త్వరలో పూర్తిస్థాయి అధికారులు రానున్నారు.
- జిల్లా స్థాయిలో పర్యవేక్షణకు జిల్లాకో అధికారిని నియమిస్తున్నారు. ఉమ్మడి 13 జిల్లాల్లో ప్రస్తుతం అధికారులు ఉన్నారు. మరో 13 మంది త్వరలో రానున్నారు.
- పుర, నగరపాలక, నగర పంచాయతీలకు ఒక్కో అధికారి చొప్పున 123 మందిని కేటాయిస్తారు.
- మండలానికో అధికారి చొప్పున 660 మంది రానున్నారు. ప్రస్తుతం 600 మంది ఎంపిక పూర్తయింది. మిగిలిన మండలాలకు వచ్చే నెల మొదటి వారంలో అధికారులు రానున్నారు.

స్వర్ణ గ్రామం, వార్డుపై త్వరలో ఉత్తర్వులు

- గ్రామ, వార్డు సచివాలయాల పేరును స్వర్ణ గ్రామం, వార్డుగా మార్చనున్నారు. ఇందుకు సంబంధించి త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి. పేరు మార్చుతున్నట్లు కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వ ఆమోదం కోసం పంపారు.

అడ్వాన్స్ సీనరేజ్ ఫీజు తీసుకోకుండా రైల్వే పనులకు పర్మిట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రైల్వే పనులు చేసే గుత్తేదార్లు గ్రావెల్, రోడ్ మెటల్ తదితరాలకు ముందుగా సీనరేజ్ ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేకుండానే గనులశాఖ పర్మిట్లు (ఫ్రీ పాస్‌లు) పొందేలా నిబంధనలు సవరిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వు జారీచేసింది. గుత్తేదార్లకు రైల్వేశాఖ బిల్లులు చెల్లించేటప్పుడు ఎంత గ్రావెల్, రోడ్ మెటల్ వినియోగించారో చూసి ఆ మేరకు సీనరేజ్ ఫీజును బిల్లు నుంచి మినహాయించుకొని, ఆ మొత్తాన్ని గనుల శాఖకు జమ చేస్తుంది. ప్రస్తుతం ఈ విధానం రాష్ట్రంలోని జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ పనులు చేస్తున్న గుత్తేదార్లకు అమలవుతోంది. దీనిని తమ గుత్తేదార్లకూ అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు నిబంధనలు సవరిస్తూ గనులశాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వు జారీచేశారు.



మధుమేహం, బీపీ బారినపడకూడదంటే..

కొన్ని నియమాలు పాటించడం ద్వారా జీవనశైలి వ్యాధులైన మధుమేహం, బీపీ, గుండెజబ్బులు, కొవ్వు కాలేయం (ఫ్యాటీ లివర్) బారినపడకుండా తప్పించుకోవచ్చు. ఇందుకోసం మొదటగా

- రోజుకు రెండుసార్లు మాత్రమే భోజనం చేయాలి. వాటి మధ్య 8 నుంచి 10 గంటలు విరామం ఉండేలా చూసుకోవాలి.
- జీవక్రియ వ్యాధులకు మూలమైన చక్కెర, జంక్‌ఫుడ్‌ను దూరం పెట్టాలి.
- భోజనం చేశాక గంటపాటు కూర్చోకుండా ఉండాలి.

– రిషికుమార్ నికం, హోమియోపతి వైద్యుడు

రేటింగ్ పెరిగితే.. ఏటా రూ.100 కోట్లు ఆదా!

- వడ్డీ భారాన్ని తగ్గించుకునేందుకు జెన్‌కో యత్నం
- ఇప్పటికే వడ్డీ రేటు 8.7 శాతానికి తగ్గించిన బ్యాంకర్లు
- పీఎఫ్‌సీ, ఆర్ఈసీలతోనూ సంప్రదింపులు
- దెబ్బతిన్న రేటింగ్ పెంచుకునేలా చర్యలు

ఈనాడు, అమరావతి: ఆర్థిక సమస్యలతో తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించని కారణంగా దెబ్బతిన్న రేటింగ్‌ను పెంచుకునేందుకు ఏపీ జెన్‌కో ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం 'సి' రేటింగ్‌లో ఉన్న సంస్థను వచ్చే ఆర్థిక సంవత్సరంలో 'బి' కి పెంచుకోవడం ద్వారా రేటింగ్‌ను మెరుగుపరచుకునేందుకు చర్యలు చేపట్టింది. రేటింగ్ ఆధారంగా ఆర్థిక సంస్థలు రుణాలపై వడ్డీ రేటును నిర్ణయిస్తున్నాయి. జెన్‌కోకు ఉన్న రేటింగ్ పూర్తిగా దెబ్బతినడంతో అధిక వడ్డీకి రుణాలు తీసుకోవాల్సి వస్తోంది. దీనివల్ల సంస్థపై ఏటా రూ.100 కోట్ల వరకు అధికంగా భారం పడుతోంది. అందువల్ల వడ్డీ భారాన్ని తగ్గించుకునేలా సంస్థ దిద్దుబాటు చర్యలు మొదలుపెట్టింది. వడ్డీ రేటు సవరించడంపై పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), ఆర్ఈసీ (రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్) సహా వివిధ బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతోంది.

వడ్డీ రేటు తగ్గింపు

మూలధనం, నిర్వహణ వ్యయం కోసం ఏపీ జెన్‌కో సుమారు రూ.22 వేల కోట్లు (ఏపీ విద్యుత్ అభివృద్ధి సంస్థ రుణాలు కాకుండా) రుణంగా తీసుకుంది. రేటింగ్ దెబ్బతినడం వల్ల 10.5 శాతం వడ్డీ రేటుకు కొన్ని రుణాలు తీసుకుంది. అలా అధిక వడ్డీకి తీసుకున్న రుణాలు సుమారు రూ.10 వేల కోట్ల వరకు ఉంటాయని జెన్‌కో తేల్చింది. సంస్థ తీసుకున్న రుణాలపై వడ్డీ రేటు సగటున 9 శాతం లోపు ఉండేలా ఇప్పుడు చర్యలు చేపట్టింది.


- ఎస్‌బీఐతో పాటు వివిధ బ్యాంకుల నుంచి నిర్వహణ సుమారు రూ.3 వేల కోట్లు జెన్‌కో రుణంగా తీసుకుంది. దీనిపై వడ్డీ రేటు 10.5 శాతం వరకు ఉంది. సంప్రదింపుల తర్వాత 8.7 శాతానికి తగ్గించేందుకు బ్యాంక్ అంగీకరించింది. ఈ మేరకు ఎస్‌బీఐ ఇటీవల ఒప్పంద పత్రాన్ని ఇచ్చింది. దీనివల్ల ఏటా రూ.48 కోట్లు మిగులుతుంది.

రేటింగ్ పెంచుకుంటే.. వడ్డీ రేటు తగ్గిస్తాం

అధిక వడ్డీ రేటు తగ్గింపుపై పీఎఫ్‌సీ, ఆర్ఈసీలతోనూ జెన్‌కో సంప్రదింపులు జరుపుతోంది. సంస్థ రేటింగ్ మెరుగుపడితే వడ్డీ రేటు తగ్గించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయా సంస్థలు సూచించాయి. తక్కువ రేటుకు తీసుకున్న రుణాలను మినహాయించి.. అధిక వడ్డీ రేటు ఉన్న వాటిని 9.5 శాతానికి తగ్గించేందుకు సూత్రప్రాయంగా ఆ సంస్థలు అంగీకరించాయని అధికారులు తెలిపారు. దీనివల్ల ఏటా మరో రూ.50 కోట్లు ఆదా అవుతుందని అంచనా. ఈ దృష్ట్యా రేటింగ్ పెంచుకునేందుకు రెండు సంస్థలకు చెల్లించాల్సిన రుణాన్ని నిర్దేశిత వ్యవధిలో జెన్‌కో చెల్లించింది. దీనివల్ల ఆరు నెలల తర్వాత సంస్థ రేటింగ్ మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు.

ఐఐటీల్లోనూ కోర్ బ్రాంచీల సీట్లకు కోత

- విద్యార్థుల ప్రవేశాల్లేక నిర్ణయం
- వాటి స్థానంలో డిమాండున్న కొత్త కోర్సులు



ఈనాడు, హైదరాబాద్: ఉద్యోగావకాశాలు తక్కువని.. వచ్చినా భారీ వేతన ప్యాకేజీలు ఉండవని.. టాప్ ఐఐటీల్లో సీట్లొచ్చినా కొన్ని బ్రాంచీల్లో విద్యార్థులు చేరడం లేదు. మరోవైపు కొత్తగా ఏర్పాటు చేసిన ఐఐటీ అయినా.. ఎన్ఐటీ అయినా డిమాండున్న కోర్సుల్లో సీటు దొరికితే చేరిపోతున్నారు. అందుకే మొదటితరం ఐఐటీలు దిల్లీ, బాంబే, ఖరగ్‌పూర్, రూర్కీ, కాన్పుర్ లాంటివి సైతం డిమాండు లేని కోర్ బ్రాంచీల సీట్లకు కోతపెడుతున్నాయి. కొన్ని కోర్సులను పూర్తిగా ఎత్తేస్తున్నాయి. 2020-25 మధ్య ఐఐటీల్లోని కెమికల్, టెక్స్‌టైల్, మైనింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్ తదితర కోర్ బ్రాంచీల్లో సీట్లు బాగా తగ్గిపోయాయి. ఏటా ఐఐటీలు, ఎన్ఐటీల్లో సీట్ల భర్తీకి జోసా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రవేశాలు ముగిసిన తర్వాత జాయింట్ ఇంప్లిమెంటేషన్ కమిటీ(జేఐసీ) సమగ్ర నివేదిక విడుదల చేస్తుంది. దాన్ని పరిశీలించినప్పుడు కోర్ బ్రాంచీల్లో సీట్ల కోత స్పష్టమైంది.

ఎందుకీ పరిస్థితి?

- ఐఐటీలు, ఎన్ఐటీల్లో 2014-16 మధ్య కొన్ని కోర్ బ్రాంచీల్లో సీట్లు నిండలేదు. దాన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం ఆనాటి ఐఐటీ ఖరగ్‌పుర్ డైరెక్టర్ నేతృత్వంలో కమిటీని నియమించింది. ఆ కమిటీ డిమాండు లేని కోర్సులను నిలిపివేయాలని సిఫారసు చేసింది.
- వాటి స్థానంలో కంప్యూటర్ సైన్స్ ఇతర డిమాండ్ ఉన్న టెక్నాలజీ కోర్సుల్లో సీట్లు పెంచుతూ వచ్చారు.
- దానికితోడు ఈడబ్ల్యూఎస్ కోటా కింద 10% సూపర్ న్యూమరీ సీట్లు రావడంతో 23 ఐఐటీల్లో సీట్లు భారీగా పెరిగాయి. 2015లో మొత్తం 10,006 అండర్ గ్రాడ్యుయేట్ సీట్లుండగా.. 2025 నాటికి ఆ సంఖ్య 18,160కి పెరిగింది.
- ఐటీ రంగంలో పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు ఉండటంతోపాటు ప్రారంభ వేతనమూ అధికంగా ఉంటోంది. అందుకే విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ వైపు మొగ్గు చూపుతున్నారు.
- 2020 తర్వాత టెక్నాలజీకి మరింత డిమాండ్ పెరిగింది. ఐఐటీలు సైతం కృత్రిమమేధ, డేటాసైన్స్ లాంటి కోర్సులను ప్రవేశపెట్టాయి. బీటెక్‌లో ఏఐ కోర్సుకు ఐఐటీ హైదరాబాద్‌లోనే శ్రీకారం చుట్టారు.
- సీట్లు ఖాళీగా ఉంటే విద్యాసంస్థ జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్ తగ్గుతుంది. అందుకే విద్యార్థులు ఆసక్తి చూపని వాటిల్లో సీట్లు తగ్గిస్తున్నారు.

ఐదేళ్లలో కొన్ని కోర్సుల్లో సీట్ల తగ్గింపు ఇలా...

ఐఐటీ	బ్రాంచీ	సీట్లు (2020)	సీట్లు (2025)
బాంబే	ఏరోస్పేస్	89	72
"	కెమికల్	167	124
"	మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్	123	105
దిల్లీ	కెమికల్	82	75
"	ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్	89	83
"	టెక్స్‌టైల్ టెక్నాలజీ	116	85
మద్రాస్	కెమికల్	117	111
"	మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్	68	54
రూర్కీ	మెటలర్జికల్-మెటీరియల్స్	112	82
"	పాలిమర్ సైన్స్	40	0
వారణాసి	మైనింగ్	131	120
"	ఫార్మాస్యూటికల్	80	75

ఏటా 2.5 లక్షల మంది గర్భిణులకు 'కిల్కారి' సేవలు

- ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఆరోగ్య సంరక్షణ సూచనలు

ఈనాడు, అమరావతి: మాతాశిశు మరణాలు తగ్గించేందుకు వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ 'కిల్కారి' కార్యక్రమం చేపడుతోంది. సెల్‌ఫోన్ సందేశాలతో గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు సలహాలు, సూచనలు అందిస్తోంది. తెలుగుతోపాటు 13 భాషల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా అందిస్తున్న ఆరోగ్య సంరక్షణ సూచనలపై క్షేత్రస్థాయిలో మరింత అవగాహన కల్పించేందుకు డీఎంహెచ్‌వోలు, వైద్య బృందాలు చర్యలు చేపట్టాలని వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ ఆదేశించారు. రాష్ట్రంలో ఏటా ఐవీఆర్ఎస్ ద్వారా సగటున 2.50 లక్షల మంది గర్భిణులు, బాలింతలు, వారి కుటుంబాలకు ఆరోగ్యకరమైన అలవాట్లపై 'కిల్కారి' ద్వారా అవగాహన కల్పిస్తున్నామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఏఎన్ఎంలు ఆర్సీహెచ్ పోర్టల్‌లో గర్భిణుల వివరాలు, సెల్‌ఫోన్ నంబర్లు నమోదు చేసిన తర్వాత నుంచి పుట్టిన బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు ప్రతి నెలా ఆడియో కాల్స్ వెళ్తాయి. ఇందులో తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ, పోషణ, టీకాల ప్రాముఖ్యత, కుటుంబ నియంత్రణ, మాతాశిశు మరణాలకు ఆస్కారం లేకుండా 1600403660 నంబరు ద్వారా ఆరోగ్య సంరక్షణ సూచనలు అందిస్తారు. ఒకవేళ కాల్ వచ్చినప్పుడు స్వీకరించకపోతే రీడయల్ 14423/ 18005321255 ద్వారా ఆ సమాచారం వినే వెసులుబాటు కల్పించాం' అని వెల్లడించారు.

ఎంబీబీఎస్, బీడీఎస్ మేనేజ్‌మెంట్ కోటా.. స్ట్రే రౌండ్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి ప్రత్యేక స్ట్రే రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహణకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించింది. 2025-26 విద్యాసంవత్సరానికి ఎంబీబీఎస్ కోర్సుల్లో కేటగిరీ-సీ(ఎన్ఆర్ఐ సీట్లు), బీడీఎస్ కోర్సుల్లో కేటగిరీ-బి, సీ(ఎన్ఆర్ఐ) సీట్లకు అర్హులైన అభ్యర్థుల నుంచి డిసెంబరు 26, 27వ తేదీల్లో దరఖాస్తుల స్వీకరణకు అవకాశం ఇస్తూ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంబీబీఎస్ సీట్లకు వెబ్ ఆప్షన్లు డిసెంబరు 27న సాయంత్రం 7 గంటల నుంచి 29వ తేదీ ఉదయం 11.30 గంటల వరకు అవకాశం ఇచ్చారు. 29న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. బీడీఎస్ వెబ్ ఆప్షన్ల షెడ్యూల్ ప్రత్యేకంగా విడుదల చేస్తామని తెలిపారు. మూడు కళాశాలల్లో 13 ఎంబీబీఎస్ సీట్లు, ఏడు కళాశాలల్లో 31 బీడీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నట్లు ఎన్టీఆర్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి వెల్లడించారు.

వైద్యవిద్య పీజీ ఇన్‌సర్వీసు రెండోదశ కౌన్సెలింగ్ ఫలితాల విడుదల

ఈనాడు, అమరావతి: వైద్యవిద్య పీజీ డిగ్రీ/డిప్లొమా కోర్సుల ఇన్‌సర్వీసు ఫేజ్-2 కాంపిటెంట్ అథారిటీ కోటా కౌన్సెలింగ్‌కు సంబంధించిన తాత్కాలిక ఫలితాలను ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ శుక్రవారం విడుదల చేసింది. ఫలితాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటల్లోగా ఆన్‌లైన్ అప్లికేషన్ లాగిన్ ద్వారా సెలక్షన్ కమిటీకి తెలియజేయాలని పేర్కొంది.

డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీల పదవీకాలం పొడిగింపు

ఈనాడు, అమరావతి: డీసీఎంఎస్(జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలు) పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీల పదవీకాలాన్ని ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నెల 27వ తేదీ నుంచి ఆరు నెలలు లేదా ఎన్నికలు నిర్వహించి కొత్త కమిటీలు బాధ్యతలు స్వీకరించే దాకా లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఈ కమిటీలు పదవీలో ఉంటాయని వ్యవసాయశాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

2026 జనవరి నుంచి డిజిటల్ ఎం బుక్ తప్పనిసరి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వశాఖలు, కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలు, యూనివర్సిటీలు చేపడుతున్న అన్ని ఇంజినీరింగ్ పనులకు సంబంధించి ఇక డిజిటల్ ఎం బుక్ తప్పనిసరి. 2026 జనవరి ఒకటి నుంచి ఈ ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయం అమలు చేయకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు ఈ ఉత్తర్వులు వర్తించవు. ఇంతవరకు జలవనరులశాఖ, రోడ్లు, భవనాలశాఖ మాత్రమే డిజిటల్ ఎం బుక్‌లను ఇంజినీరింగ్ పనుల్లో వినియోగిస్తున్నాయి. 2025 మే నెలలోనే ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసినా అమలు కాలేదని ప్రస్తావించారు.

'నాన్నా.. ఈ నొప్పి భరించలేకపోతున్నా...'

- కెనడాలో వైద్యుల నిర్లక్ష్యానికి భారత సంతతి వ్యక్తి బలి

టొరంటో: కెనడాలో వైద్యుల నిర్లక్ష్యానికి భారత సంతతికి చెందిన ఓ వ్యక్తి బలయ్యాడు. ప్రశాంత్ శ్రీకుమార్(44) అనే వ్యక్తి ఛాతీలో నొప్పి రావడంతో ఈనెల 22న కెనడాలోని ది గ్రే నన్స్ ఆస్పత్రికి వచ్చాడు. పరీక్షించిన వైద్యులు ఈసీజీ తీసి, అది గుండెపోటు కాదని తేల్చారు. అత్యవసరం ఏదీ లేదని, వెయిటింగ్ రూమ్‌లో ఉండాలని సూచించారు. నాన్నా.. ఈ నొప్పిని భరించలేకపోతున్నా అంటూ తనతోపాటు వచ్చిన తండ్రి వద్ద శ్రీకుమార్ విలవిలలాడిపోయాడు. అలా 8 గంటలకు పైగా నిరీక్షించిన అతడికి ఒక్కసారిగా నొప్పి ఎక్కువైంది. దీంతో ఛాతీ పట్టుకుని అక్కడే కుప్పకూలిపోయాడు. అప్పుడు రక్తపోటు 210కి చేరింది. చికిత్స కోసం తరలించినా.. ఫలితం లేకపోయింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ప్రశాంత్ చనిపోయాడంటూ అతడి భార్య, తండ్రి ఆరోపించారు.

11 మంది పుర కమిషనర్ల బదిలీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 11 మంది పురపాలక కమిషనర్లను బదిలీ చేయడంతోపాటు పలు చోట్ల నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయని, ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలకశాఖ కమిషనర్‌ని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఆదేశించారు.

- పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా డి.పావనిని నియమించారు. అనంతపురం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా ఆమె ప్రస్తుతం పని చేస్తున్నారు. పార్వతీపురం కమిషనర్ కిశోర్‌కుమార్ పురపాలకశాఖ కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నారు.
- నరసాపురం కమిషనర్ ఎం.అంజయ్యను బదిలీ చేసి అనంతపురం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు.
- పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆర్.వెంకట్రామిరెడ్డిని నరసాపురం మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు.
- టిడ్కో జనరల్ మేనేజర్ యు.శారదాదేవిని తిరుపతి నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా నియమించారు.
- ప్రొద్దుటూరు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డి.కొండయ్యను పెడన కమిషనర్‌గా నియమించారు.
- పోస్టింగ్ కోసం వేచి ఉన్న ఎం.మంజునాథ్ గౌడ్‌ను ప్రొద్దుటూరు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు.
- పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న డేనియల్ జోసెఫ్‌ని చీరాల మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. అక్కడి కమిషనర్ అబ్దుల్ రషీద్ పురపాలకశాఖ డైరెక్టర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నారు.
- కడప నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణను రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. అక్కడి కమిషనర్ జి.శ్రీనివాసులును కర్నూలు నగరపాలక సంస్థకు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా తిరిగి వెనక్కి పంపారు.
- మహా విశాఖ నగరపాలక సంస్థ జోన్-1(భీమిలి) కమిషనర్ నాయుడ్ని జోన్-2(మధురవాడ)కి బదిలీ చేశారు.
- వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డిని నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అక్కడి కమిషనర్ బేబి పురపాలకశాఖ కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నారు.
- పోస్టింగ్ కోసం వేచి ఉన్న పి.శ్రీధర్‌ను కనిగిరి మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. అక్కడి కమిషనర్ పి.కృష్ణమోహన్‌రెడ్డిని తన మాతృసంస్థ రాష్ట్ర సచివాలయంలోనిజీఏడీలో రిపోర్ట్‌చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.